

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 360

గురువారం 22-3-2018

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



33 వేల పైకి సెన్సెక్స్

30 పాయింట్లు పెరిగి 10,155కు నిఫ్టీ. ఫెడ్ రేట్లపై ఆసక్తి

-బిజినెస్‌లో



ఈ ‘పంచ్’కు పదునెక్కువ!

అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న హుసాముద్దీన్

– స్పోర్ట్స్‌లో



గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం.. ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

మళ్లీ మోసమా?

పూటకో మాటతో హోదాపై ఎందుకీ హైడ్రామా? .. ఈ నాలుగేళ్లలో ఏం చేశావు?

చిలకలూరిపేట సభలో చంద్రబాబుపై నిప్పులు చెరిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

- అరుణ్‌జైట్లీ అప్పుడన్నదే ఇప్పుడూ అన్నారు
- నాడు పొగిడిన మీరు.. నేడు పోరాటం చేస్తామంటున్నారు..
- నాలుగేళ్లు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు మాయ మాటలా?
- ఈయన గారి అవినీతి ఎల్లో మీడియాకు కనిపించదా?
- ఈ పెద్దమనిషి తాన అంటే తందాన అనడమేనా?

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

‘ప్రత్యేక హోదాపై ఎన్నికలప్పుడు చంద్రబాబు అన్న మాటలేంటి? ఇప్పుడు ఆయన చేస్తున్నదేంటి? హోదా ఇస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఫైల్ ప్లానింగ్ కమిషన్ వద్ద ఏడు నెలలు పెండింగ్‌లో ఉన్నప్పుడు చంద్రబాబు ఏం చేశాడు? పూటకో మాట మాట్లాడాడు. ఏడాదిలో ఎన్నికలొస్తున్నాయని మళ్లీ హైడ్రామాకు తెర లేపారు’ అని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. పూటకో మాట చెబుతున్న చంద్రబాబుకు తాన తందాన అంటూ పచ్చ మీడియా వంత పాడుతోందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 117వ రోజు బుధవారం గుంటూరు జిల్లా చిలకలూరిపేట బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో మనలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా.. అని ప్రశ్నించారు. ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని

మిగతా 6వ పేజీలో ▶

> “ నాలుగేళ్లుగా చంద్రబాబు అన్ని రకాల మోసాలు, అన్యాయాలు చేశాడు. సీఎం హోదాలో ఆయన కేంద్రాన్ని గట్టిగా అడిగి ఉంటే హోదా మనకు వచ్చి ఉండేది. పార్లమెంట్ సాక్షిగా మనకు ఇచ్చిన హక్కును దగ్గరుండి నీరుగార్చాడు.
>
> 2016 సెప్టెంబర్ 8న అరుణ్ జైట్లీ.. హోదాకు బదులుగా ప్యాకేజీ ఇస్తున్నామని అర్ధరాత్రి చెబితే మనందరికీ రక్తం మరిగిపోయింది. అదే రోజు అర్ధరాత్రి చంద్రబాబు నిద్రమేల్కొని ఆయనకు కృతజ్ఞతలు చెప్పాడు. ఢిల్లీ వెళ్లి శాలువా కప్పాడు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఏం చేశావు? ప్యాకేజీ గొప్పగా ఉందని ప్రజలను నమ్మించలేదా? హోదా ఇచ్చిన రాష్ట్రాలు ఏం బాగుపడ్డాయని ప్రశ్నించలేదా? కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అనలేదా బాబూ?

పార్లమెంట్ ‘సీను’ మారలేదు

సభ సజావుగా లేదంటూ అవిశ్వాస తీర్మానానికి స్పీకర్ నిరాకరణ

- వెల్‌లో కొనసాగిన టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే ఎంపీల ఆందోళన
- బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలంటూ పప్పూయాదవ్ ప్లకార్డులు
- కేంద్రంపై అవిశ్వాసానికి మద్దతుగా నిలుచున్న పలువురు విపక్ష ఎంపీలు
- మరోసారి నోటీసులు ఇచ్చిన వైఎస్సార్ సీపీ, టీడీపీ

2లో



పార్లమెంట్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఎంపీల నిరసన. చిత్రంలో ఆ పార్టీ నేత బొత్స



నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

ప్రత్యేక హోదా ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష

మద్దతు తెలిపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలు, సంఘాలు

సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తోపాటు ఇతర పార్టీలు, సంఘాలు నిర్వహిస్తున్న పోరు ఉధృత రూపం దాల్చింది. ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా కోసం నేడు (గురువారం) రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధించనున్నారు. ఈ దిగ్బంధానికి ఇప్పటికే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. పార్లమెంట్‌లోనూ కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి పలుమార్లు నోటీసులు కూడా ఇచ్చింది. కాగా, రహదారుల దిగ్బంధానికి ఇతర పార్టీలు, 45 ప్రజా సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి.

ఉభయ కమ్యూనిస్టు పార్టీల మద్దతు

నేడు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. నాలుగేళ్లుగా హోదా ఉద్యమం చేసిన వారిపై కేసులు పెట్టించిన సీఎం చంద్రబాబు గురువారం జాతీయ రహదారుల దిగ్బంధాన్ని

మిగతా 2వ పేజీలో ▶

‘ఫేస్‌బుక్’ వార్!

డేటా దుర్వినియోగం వార్తలపై బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం

11లో

- కాంగ్రెస్, ‘కేంబ్రిడ్జ్ అనలిటికా’ కలిసి పనిచేస్తున్నాయి: రవిశంకర్ ప్రసాద్
- బిహార్, గుజరాత్ ఎన్నికల్లో బీజేపీకి ఆ సంస్థ సేవలు: కాంగ్రెస్
- యూఎస్, యూకే, యూరోపియన్ దేశాల్లో ‘సీఏ’ ప్రభావం

నీరవ్ మోదీ 2.0!!

రూ.825కోట్ల మేర మోసం చేసిన కనిష్క్ గోల్డ్..

- 14లో

పట్టిసీమలో రూ.372 కోట్లు దోచేశారు

హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ చేయాలి

- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు డిమాండ్
- అక్రమాలను ‘కాగ్’ ఆధారాలతో సహా బహిర్గతం చేసింది
- అంతా సవ్యమైతే విచారణ ఎదుర్కొనేందుకు చంద్రబాబుకు భయమెందుకని ప్రశ్న
- అసెంబ్లీలో బీజేపీ టీడీపీ మధ్య వాగ్యుద్ధం



సాక్షి, అమరావతి: పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని, దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణకు ఆదేశించాలని బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు. అక్రమాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక ఆధారాలతో సహా వెల్లడించిందని తెలిపారు. కాగ్ ఆధారాలను

మిగతా 2వ పేజీలో ▶



మాటలుమార్చే.. నీ వెంట నడవాలా?

చంద్రబాబుపై సినీ నటుడు, దర్శకుడు పోసాని కృష్ణమురళి ధ్వజం

- స్వార్థం కోసం ఎన్నిసార్లు మాట మార్చారో లెక్కేలేదు
- హోదా అని నినదించిన ప్రజలను పోలీసులతో కొట్టించలేదా?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనడం చంద్రబాబు నీతా?
- ఆయన రాజకీయ వ్యభిచారి

18లో



15 రోజుల నుంచే హోదా గుర్తొచ్చిందా?

టీడీపీపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మండిపాటు

- పదవుల కోసం నాలుగేళ్లు బానిసలు, తొత్తులుగా జీవించారు
- నాలుగేళ్లుగా హోదా అక్కరలేదన్నది మీరే కదా?
- ప్రత్యేక హోదా ఉద్యమంలో జగన్‌కు మైలేజ్ వస్తోందని భయపడుతున్నారు

ఇదండీ సంగతి



ఇక్కడే సెటిలయి పోయార్సార్! వీళ్లను ఇలానే ఉంచి మనమే వేరే పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసుకుందాం పదండి సార్!!

‘ప్రైవేట్’ వ్యవసాయం

శాసనసభలో సీఎం ప్రకటన

- ప్రైవేట్ భాగస్వామ్యంలోకి పది లక్షల మంది రైతులు
- రెయిన్‌గన్స్, పట్టిసీమతో కరువును జయించేశా
- డ్రోన్ల ద్వారా పంట తెగుళ్లు కనిపెట్టి.. మందు కొట్టిస్తాం
- నాలుగేళ్లలో 248 మంది రైతుల ఆత్మహత్యలు
- కేంద్ర ప్రభుత్వ విధానాలు మారాలి



12లో

అసెంబ్లీలో ఆర్థిక మండలి బిల్లు

12లో



అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా టీడీపీ ఎంపీలు ఆందోళన చేస్తున్నారంటూ జాతీయ మీడియా ప్రసారాల్లో ఓ దృశ్యం

అవిశ్వాసం అంటూ వెల్‌లో ఆందోళనా?

టీడీపీ నాటకాలను ఎండగట్టిన జాతీయ మీడియా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చామంటూనే వెల్‌లోకి వెళ్లి తెలుగుదేశం పార్టీ ఆందోళన చేసింది. ఇలా ఎందుకు నాటకం ఆడుతోందని ఎండగడుతూ ఓ జాతీయ ఛానల్ మంగళవారం కథనాలు ప్రసారం చేసింది. అవిశ్వాస తీర్మానం ఇచ్చినప్పుడు దాన్ని ప్రవేశపెట్టేందుకు వీలుగా సభాపతి సభ్యుల బలాన్ని లెక్కించాల్సి ఉంటుంది. సభ సజావుగా లేనప్పుడు ఈ సంఖ్య లెక్కించడం సాధ్యం కాదని, ఈ సంగతి తెలిసే టీడీపీ ఎంపీలు వెల్‌లోకి ఎందుకు వెళ్లారంటూ రోజంతా చర్చ నిర్వహించింది. చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ రెండేళ్ల క్రితమే ప్యాకేజీకి అంగీకరించి ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మళ్లీ ప్రత్యేక హోదా అంటూ ఆందోళన చేస్తోందని విశ్లేషించింది. అవిశ్వాసానికి నోటీసులివ్వడం, మళ్లీ అది చేపట్టకుండా వెల్‌లోకి వెళ్లడం టీడీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొంది.

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

▶ మొదటి పేజీ తరువాయి

విభిన్నంగా చేసేందుకు ముందస్తు అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన సీపీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లుతో కలిసి విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పటికైనా టీడీపీ హోదా పోరులో కలిసిరావాలని కోరారు. విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, వామపక్షాలతో సహా అందరూ ఢిల్లీలో అనేక రూపాల్లో నిరసనలు చేపట్టారని గుర్తు చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ఢిల్లీలో ఆందోళన చేపట్టాలన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ రహదారుల దిగ్బంధంలో వైఎస్సార్ సీపీతోపాటు 16 పార్టీలు, 45 ప్రజా సంఘాలు పాల్గొంటున్నాయని చెప్పారు. విజయవాడ కనకదుర్గ వారధి వద్ద జాతీయ రహదారిపై నిరసనలో రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారుల దిగ్బంధాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం జాతీయ రహదారులపై నిరసన కార్యక్రమాలకు టీడీపీ సంఘీభావం తెలుపుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు ప్రకటించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. జాతీయ రహదారుల దిగ్బంధానికి ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. జేఏసీ పిలుపు మేరకు 2 గంటల పాటు లారీలను ఎక్కడి కక్కడ నిలిపివేయనున్నట్లు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు పేర్కొన్నారు. కాగా, 2018–2020కి అసోసియేషన్ ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులుగా పి.గోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా వై.వి.ఈశ్వరరావు, కోశాధికారిగా ఎన్.కృష్ణ ఎంపికయ్యారు.

పార్లమెంట్ 'సీను' మారలేదు

సభ సజావుగా లేదంటూ అవిశ్వాస తీర్మానానికి స్పీకర్ నిరాకరణ

- వెల్‌లో కొనసాగిన టీఆర్‌ఎస్, ఏఐఏడీఎంకే ఎంపీల ఆందోళన
- బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలంటూ పప్పుయాదవ్ ప్లకార్డులు
- కేంద్రంపై అవిశ్వాసానికి మద్దతుగా నిలుచున్న పలువురు విపక్ష ఎంపీలు
- మరోసారి నోటీసులు ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహం

సాక్షి, న్యూఢిల్లీ

పార్లమెంట్‌లో మరోసారి అదే దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పట్టుదలగా పోరాడుతున్నా సభ సజావుగా లేదంటూ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభాపతి సుమిత్రా మహాజన్ అనుమతించలేదు. వెల్‌లో ఆందోళన నిర్వహిస్తున్న అన్నాడీఎంకే, టీఆర్‌ఎస్‌లకు మరో పార్టీ జతకలవటంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్జేడీ నుంచి గెలిచి జన్ అధికార్ పేరుతో వేరుకుంపటి పెట్టుకున్న పప్పూయాదవ్ బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో సభ సజావుగా లేదంటూ వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ నాలుగోసారి అనుమతించలేదు. అవిశ్వాస తీర్మానాన్ని బుధవారం నాటి సభాకార్యక్రమాల జాబితాలో చేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం మంగళవారం సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

తీర్మానానికి మద్దతుగా నిలుచున్న ఎంపీలు

కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రస్తావన రాగానే వైఎస్సార్ సీపీ, టీడీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఎన్సీపీ, జేఎంఎం, ఎంఐఎం, ఆమ్ ఆద్మీ తదితర విపక్షాలకు చెందిన సభ్యులంతా మద్దతుగా నిలుచున్నారు. అయితే సభ సజావుగా లేనందున అవిశ్వాస తీర్మానాలను సభ ముందుకు తీసుకురాలేకపోతున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ వైఎస్సార్ సీపీ ఆందోళన

హోదాపై చర్చకు పట్టుబడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి బుధవారం రాజ్యసభలో ఆందోళన నిర్వహించారు. హోదా ప్లకార్డు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. అయితే రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కొద్ది క్షణాల్లోనే సభను గురువారానికి వాయిదా వేశారు.

ఐదోసారి అవిశ్వాసం నోటీసులు

కేంద్రంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, టీడీపీ ఎంపీ తోట నరసింహం బుధవారం మధ్యాహ్నం లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు ఐదోసారి నోటీసులను అందజేశారు.

పార్లమెంట్ వద్ద ధర్నా

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ సీపీ ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వెలగపల్లి వరప్రసాదరావు, వైఎస్ అవినాష్‌రెడ్డి, పి.వి.మిథున్‌రెడ్డి ధర్నాలో పాల్గొన్నారు. టీడీపీ ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. టీడీపీ ఎంపీ ఎన్.శివప్రసాద్ సత్యహరిశ్చంద్రుడి వేషంలో ధర్నాలో పాల్గొన్నారు.

సభ ప్రారంభం కాగానే వెల్‌లో ఆందోళనలు

లోక్‌సభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే అన్నాడీఎంకే, టీఆర్‌ఎస్ పక్షాలు వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేయడంతో అప్పటికే ప్రశ్నోత్తరాలను ప్రారంభించిన స్పీకర్ కొద్ది క్షణాల్లోనే సభను వాయిదా వేశారు. తిరిగి 12 గంటలకు సభ ప్రారంభం కాగానే వివిధ శాఖలకు సంబంధించిన పత్రాలను పలువురు మంత్రులు పార్లమెంట్‌కు సమర్పించారు. సభ్యులంతా తమ స్థానాల్లోకి వెళ్లాలని, అవిశ్వాస తీర్మానం సహా అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంపై సభలోనే కాకుండా దేశవ్యాప్తంగా విశ్వాసం ఉందన్నారు. ఈ సమయంలో బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలంటూ పప్పూయాదవ్ ప్లకార్డులు ప్రదర్శించారు. 12.05 గంటలకు సభాపతి తనకు అందిన అవిశ్వాస తీర్మాన నోటీసులను ప్రస్తావించారు. కేంద్ర మంత్రిమండలిపై అవిశ్వాసం తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైవీ సుబ్బారెడ్డి, తోట నరసింహంనుంచి నోటీసులు అందాయని చెప్పారు. 'వీటిని సభ ముందుంచడం నా బాధ్యత. ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన 50 మంది సభ్యులు వారి స్థానాల్లో లేచి నిలుచుంటే లెక్కించేందుకు వీలుగా సభ సజావుగా నడవాలి. వారిని లెక్కించాక తీర్మానం ప్రవేశపెట్టటంపై నిర్ణయించగలను. సభ్యులంతా తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలి..' అని సూచించారు.

ద్రోహివి నువ్వే చంద్రబాబూ...

- వైఎస్సార్‌సీపీ ఎంపీల ధ్వజం
- రాష్ట్రానికి అన్యాయం చేసిన వారిలో బాబే మొదటి వ్యక్తి
- నాలుగేళ్లు హోదా అడగకుండా.. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ఆరాటం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు, విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి ద్రోహం చేసిన వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు ఆయనకే వర్తిస్తాయని వైఎస్సార్‌సీపీ ఎంపీలు పేర్కొన్నారు. నాలుగేళ్లపాటు ప్రత్యేక హోదా అడగకుండా, హోదా అవసరం లేదని మంత్రివర్గంలో నిర్ణయించిన చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం చేసినవారిలో మొదటి వ్యక్తని మండిపడ్డారు. బుధవారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం వైఎస్సార్ సీపీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వి.విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలని వ్యాఖ్యానించిన చంద్రబాబుకే ప్రజలు ముందు బుద్ధి చెబుతారన్నారు. ఇన్నేళ్లుగా ప్రత్యేక హోదా గురించి మాట్లాడని చంద్రబాబు ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ఆరాటపడుతున్నారని చెప్పారు. రాష్ట్రానికి ఎవరు ద్రోహం చేశారో ప్రజలకు బాగా తెలుసన్నారు.

చంద్రబాబును చూసి ఎవరు మద్దతిస్తారు?

ప్రత్యేక హోదా విషయంలో నాలుగేళ్లుగా మాటలు మార్చిన చంద్రబాబును చూసి ఏ పార్టీలు ఆయనకు మద్దతిస్తాయని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తనను చూసి మద్దతు ఇచ్చేందుకు ముందుకొచ్చాయని చెబుతున్న చంద్రబాబు తీరుకు నిరసనగా అవే పార్టీలు రాష్ట్రంలో ఉద్యమాలు చేస్తున్నాయని గుర్తు చేశారు. హోదా కోసం ముందునుంచి పోరాడుతోంది ఒక్క వైఎస్సార్‌సీపీనే అని స్పష్టం చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని అందరికంటే ముందు ప్రవేశపెట్టి అన్ని పార్టీల మద్దతు కూడగట్టగలిగామన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా ఇదే విషయాన్ని నిర్ధారిస్తూ ముందు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన వైఎస్సార్‌సీపీకే మద్దతిస్తామని చెప్పారన్నారు. అవిశ్వాసం విషయంలో తాము రాజకీయాలు చేయదల్చుకోలేదని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడమే తమ లక్ష్యమని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

మనస్సాక్షి ఉంటే అప్పుడే హోదా అడిగే వాడివి

చంద్రబాబుకు నిజంగా మనస్సాక్షి ఉంటే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమని 2016లో కేంద్రం చెప్పినప్పుడే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి ప్రత్యేక హోదా అడిగేవారని ఎంపీ వరప్రసాదరావు చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పే చంద్రబాబు నాలుగేళ్లు హోదా అడగకుండా ఇప్పుడు హడావుడి చేయటం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. చంద్రబాబు రాష్ట్రాన్ని ఎన్ని విధాలుగా నష్టపరిచారో ప్రజలకు తెలుసని చెప్పారు.

చంద్రబాబు అబద్ధాల కోరు

చంద్రబాబుకు ప్రత్యేక హోదా విషయంలో నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదు, ప్యాకేజీ చాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నప్పుడే వ్యతిరేకించేవారని ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నాలుగేళ్లు కేంద్ర క్యాబినెట్‌లో భాగస్వామిగా కొనసాగి ప్యాకేజీ నిర్ణయాన్ని ఆమోదించి ఇప్పుడు అవిశ్వాసం నోటీసులు ఇవ్వటంలో నైతికతను ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు అవసరానికి అనుగుణంగా మాటలు మార్చే అబద్ధాల కోరని మండిపడ్డారు. తాను ప్రధానిని కలిసిన ప్రతిసారి రాష్ట్ర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లటమే కాకుండా చంద్రబాబు చేస్తున్న అవినీతి గురించి వివరించానని చెప్పారు. విభజన నాటికి రాష్ట్రం రూ. 97 వేల కోట్ల అప్పుల్లో ఉంటే గత నాలుగేళ్లలో అదనంగా రూ. 1.20 లక్షల కోట్లు అప్పు చేశారని ఈ నిధులన్ని ఏం చేశారని ప్రశ్నించారు. కేంద్ర నిధులు, రాష్ట్రంలో పన్నుల రూపేణా వచ్చే రాబడిని మొత్తం జేబులో వేసుకున్న చంద్రబాబు విదేశాలకు ఎలా తరలించారో ప్రధానికి వివరించానన్నారు. దీనిపై విచారణ జరిపే వరకు పోరాడుతానన్నారు.

అవిశ్వాసం నోటీసులు ఇస్తూనే ఉంటాం

చంద్రబాబు ఇప్పటికైనా చేసిన తప్పును ఒప్పుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మేకపాటి డిమాండ్ చేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే అన్నారు. ఏపీకి జరుగుతున్న అన్యాయంపై చర్చించి న్యాయం చేయాలన్న ఆలోచన కేంద్రానికి ఉన్నట్టు ఎక్కడా కనిపించడం లేదన్నారు. గత నాలుగు రోజులుగా అవిశ్వాసంపై చర్చ జరపకుండా స్పీకర్ వాయిదా వేస్తున్నారని, అసలు ఈ విషయంపై చర్చ జరిపే ఉద్దేశం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. సభ జరిగినన్ని రోజులూ అవిశ్వాసంపై నోటీసులు ఇస్తూనే ఉంటామని ప్రకటించారు.

పట్టిసీమలో రూ.372 కోట్లు దోచేశారు

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలిస్తే పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో కచ్చితంగా అక్రమాలు జరిగినట్లు స్పష్టమవుతోందని, నిబంధనలు ఉల్లంఘించి రూ.372 కోట్లు కాజేశారని చెప్పారు. పట్టిసీమ ఎత్తిపోతల్లో అక్రమాలపై బీజేపీ, టీడీపీ మధ్య మాటల యుద్ధంతో శాసన సభ బుధవారం దద్దరిల్లింది. మధ్యాహ్నం వివిధ శాఖల పద్దులపై నిర్వహించిన చర్చలో విష్ణుకుమార్‌రాజు, మాజీ మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ అక్రమాలపై ప్రశ్నిస్తే ప్రజాద్రోహులం అవుతామా? అని ప్రశ్నించారు.

టెండర్లలోనే అక్రమాలు

పట్టిసీమ ఎత్తిపోతల టెండర్ల నుంచే అక్రమాలు మొదలయ్యాయని విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల అంతర్గత అంచనా విలువ (ఐబీఎం)ను రూ.1,170.25 కోట్లుగా నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఈపీసీ(ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో 2015 ఫిబ్రవరి 1న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. షెడ్యూలు దాఖలు గడువు 2015 ఫిబ్రవరి 7తో ముగియగా 10వ తేదీన టెండర్లు తెరిచారని చెప్పారు. జీవో 94 ప్రకారం ఐదు శాతం కన్నా ఎక్కువ ధరకు కోట్ చేస్తూ దాఖలు చేసిన షెడ్యూళ్లను తిరస్కరించాలని నిబంధన ఉన్నా పట్టిసీమ టెండర్లకు ఇది వర్తించదని మెలిక పెట్టారన్నారు. 21.999 శాతం అధిక ధరలకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని, ఇందులో ఐదు శాతం అదనపు ధర కాగా మిగిలిన 16.999 శాతం ఏడాదిలోపు పని పూర్తి చేస్తే కాంట్రాక్టర్‌కు బోనస్‌గా ఇస్తామనటం టెండర్ నిబంధనలకు విరుద్ధమని కాగ్ తేల్చిందన్నారు. దీని వల్ల రూ.199 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని కాగ్ స్పష్టం చేసిందని విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు.

అడ్డుకున్న మంత్రులు

విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతుండగా ఆయన ప్రసంగాన్ని మంత్రి దేవినేని ఉమా అడ్డుకున్నారు. పీఏసీ చైర్మన్ బుగ్గన రాసిచ్చిన స్క్రిప్టును విష్ణుకుమార్‌రాజు చదువుతున్నారని విమర్శించారు. దీనిపై మండిపడ్డ విష్ణుకుమార్‌రాజు ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును తాను చదవటం లేదని, కాగ్ అందరికీ అందుబాటులో ఉంచిన నివేదికనే ప్రస్తావిస్తున్నానని బదులిచ్చారు. పట్టిసీమ ఎత్తిపోతలలో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.14.22 కోట్లను లేబర్ సెస్సు రూపంలో కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు కాగ్ ఆధారాలతో బయటపెట్టిందన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్‌కు అదనంగా రూ.106.17 కోట్లు చెల్లించినట్లు కాగ్ స్పష్టం చేసిందన్నారు. స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్ ప్రకారం క్యూబిక్ మీటర్ మట్టి తవ్వకానికి రూ.96.2 చెల్లిస్తుండగా డయాఫ్రమ్‌వాల్ విధానంలో ఏకంగా రూ.21,353 చెల్లించారని చెప్పారు.

ప్రధాని స్క్రిప్టు మేరకే ఆరోపణలన్న టీడీపీ

పట్టిసీమ ఎత్తిపోతలలో అక్రమాలను బహిర్గతం చేసిన విష్ణుకుమార్‌రాజుకు మంత్రులు దేవినేని ఉమా, అచ్చెన్నాయుడు, కాలవ శ్రీనివాసులు తదితరులు అడ్డుతగిలారు. మూడున్నరేళ్లుగా మాట్లాడకుండా ప్రధాని మోదీ స్క్రిప్టు మేరకు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాగ్ అభ్యంతరాలకు అధికారులు వివరణ ఇచ్చారని చెప్పారు. గతంలో పట్టిసీమ ఎత్తిపోతలను ప్రశంసిస్తూ మాట్లాడిన విష్ణుకుమార్‌రాజు ఇప్పుడు అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్నారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ప్రజల దృష్టిలో బీజేపీ నేతలు ఇప్పటికే చులకనయ్యారని, రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లితే ప్రజాద్రోహులుగా మిగిలిపోతారని మంత్రి కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యానించటాన్ని మాజీ మంత్రి పి.మాణిక్యాలరావు తీవ్రంగా తప్పుబట్టారు. అనంతరం స్పీకర్ కోడెల జోక్యం చేసుకుంటూ కాగ్ నివేదికపై శాసనసభలో చర్చించే సాంప్రదాయం లేదన్నారు. తాను నివేదికపై చర్చించడం లేదని, సర్కారు వివరణ కోరే బాధ్యత తనపై ఉందని విష్ణుకుమార్‌రాజు స్పష్టం చేశారు. సాగునీటి పథకాలకు సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ నుంచి మినహాయింపు ఉన్నా కాంట్రాక్టర్‌కు రూ.32.01 కోట్లు చెల్లించడాన్ని కాగ్ తప్పుబట్టిందన్నారు. పంపులు అమర్చటంలోనూ రూ.20.62 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని తేల్చిందన్నారు. మొత్తమ్మీద పట్టిసీమ ఎత్తిపోతల్లో రూ.372 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, ఇది ఎవరు తిన్నారని నిలదీశారు.

ఆధారాలు లేకుండా మాట్లాడను..

పట్టిసీమ ఎత్తిపోతల్లో రూ.372 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కావటంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితోగానీ సీబీఐతోగానీ విచారణ జరిపి నిగ్గు తేల్చాలని విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేయడంతో శాసనసభలో కలకలం రేగింది. తాను టీడీపీ మాదిరిగా ఆధారాలు లేకుండా మాట్లాడనని విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. 'అప్పట్లో నా వద్ద ఆధారాలేవు. ఇప్పుడు ఆధారాలున్నాయి కాబట్టే అక్రమాలపై మాట్లాడుతున్నాం. పట్టిసీమలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని కచ్చితంగా చెప్పగలను. అక్రమాలు జరగలేదనే నమ్మకం ఉంటే విచారణ ఎదుర్కొనేందుకు చంద్రబాబుకు, దేవినేని ఉమాకు భయమెందుకు?' అని ప్రశ్నించారు. పోలవరం పనులు సజావుగా సాగేందుకు మంగళవారం కేంద్రం మరో రూ.1,400 కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు.


నేడు తెనాలిలో 'ఏపీ మా' ఆవిర్భావ సభ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ మా) ఆవిర్భావ సభ గురువారం స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ మా వ్యవస్థాపకుడు, కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యుడు దిలీప్‌రాజా వెల్లడించారు. బుధవార మిక్కడ ఆయన మాట్లాడారు. ఏపీమాకు రాష్ట్రప్రభుత్వం అధికారిక గుర్తింపునిచ్చిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభలో, రాష్ట్రంలో 13 జిల్లాల్లో సంస్థ కార్యకలాపాలను విస్తరింపజేసేందుకు తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఈ సభకు సీనియర్ సినీనటులు గీతాంజలి, రమాప్రభ, కవిత, అన్నపూర్ణ, శ్రీలక్ష్మి, నరసింహరాజు, బాలాజీ తదితరులు హాజరవుతారన్నారు. తొలి టాకీ 'భక్త ప్రహ్లాద' నుంచి నేటివరకు సినిమా పరిణామ క్రమాన్ని విశ్లేషిస్తూ రూపొందించిన ప్రత్యేక చిత్రప్రదర్శన ఉంటుందన్నారు.

117వ రోజు

21–03–2018, బుధవారం

పోలిరెడ్డిపాలెం శివారు, గుంటూరు జిల్లా



పేదవాడి నోటికాడ ముద్దను సైతం దోచేస్తున్న ఈ రాబందులను ఏమనాలి?

ఈ రోజు ఉదయం మానుకొండువారిపాలెంలో ఆ గ్రామ సర్పంచ్ దయమ్మ, ఉప సర్పంచ్ శీనన్న ఘన స్వాగతం పలికారు. మండుటెండలో సైతం జనాభిమానం ఉప్పొంగింది. దయమ్మక్క నాతో మాట్లాడుతూ 'అన్నా.. వేలిముద్రలు పడటం లేదంటూ, అదంటూ.. ఇదంటూ.. ఏదో ఒక సాకు పెట్టి రేషన్ బియ్యం ఎగ్గొడుతున్నారు. బియ్యం కూడా ఇవ్వకపోతే పేదలు బతికేదెట్టా' అంది. పక్కనే ఉన్న శీనన్న 'అన్నా.. రాష్ట్రంలో ఏ మూల రేషన్ బియ్యం లారీ పట్టుబడ్డా.. మూలాలు మాత్రం చిలకలూరిపేటవే' అన్నాడు. ఓ వైపు పైస్థాయిలో ప్రభుత్వ పెద్దల బినామీలే పేదల బియ్యాన్ని లారీలకు లారీలు అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు దోచేస్తా ఉంటే.. కింద స్థాయిలో వారి అనుచరులు రేషన్ షాపుల్లో అందినకాడికి ఆరగించేస్తున్నారు. ఒక్క పూట తిండికి కూడా ఇబ్బందిపడే పేదవాడి నోటికాడ ముద్దను సైతం దోచేస్తున్న ఈ రాబందులను ఏమనాలి? వేలిముద్రలు పడటం లేదంటూ పేదల బియ్యాన్ని కత్తిరించే చంద్రబాబు టెక్నాలజీ.. ఆయన బినామీలు చేసే ఈ అక్రమ దందాను మాత్రం గుర్తించలేకపోతోందా? లేకపోతే తెలిసే భాగస్వాములుగా ఉన్నారా? అంతేకాదట.. నకిలీ పురుగుమందులు, ఎరువులు, నకిలీ విత్తనాల అక్రమ వ్యాపారానికి ప్రధాన కేంద్రం ఇదేనన్నాడు శీనన్న. ఆ నకిలీల దెబ్బకు వ్యవసాయం కుదేలై, నష్టాల ఊబిలో కూరుకుపోయి రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉంటే.. ఆ సమాధులపై తమ అవినీతి పునాదులను నిర్మించుకుంటున్న ఈ మానవత్వం లేని పాలకులను ఏమనాలి?

ఏ ప్రభుత్వ పథకమైనా పేదవాడికి అంతో ఇంతో మేలు చేసేలా ఉండాలి. కానీ పేదల పొట్టకొట్టి, పచ్చ చొక్కాలకు దోచిపెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఏ పథకాన్నయినా తీసుకొస్తోందా.. అనిపిస్తోంది. నీరు–చెట్టు పథకమే దానికి ఉదాహరణ. పట్టాదారు పాస్ పుస్తకాలతో సహా అన్ని రికార్డులూ ఉండి, దశాబ్దాలుగా సాగులో ఉన్న తన భూమిని నీరు–చెట్టు పథకమంటూ అక్రమంగా తవ్వేసి సొమ్ము చేసుకున్నారని వాపోయాడు చుండి తిరుపతయ్య అనే పెద్దాయన. తూబాడు, గొరిజవోలు గ్రామాల ప్రజలదీ ఇదే ఆవేదన. ఆ గ్రామాల్లోని దళితులు, మైనార్టీల భూములను నీరు–చెట్టు పథకం మింగేసింది. వాళ్ల పొలాలన్నీ పచ్చబాబుల దోపిడీపర్వానికి హారతి కర్పూరమయ్యాయి. అయిదు దశాబ్దాల కిందటే పట్టాలు పొంది.. సాగు చేసుకుంటున్న ఆ నిరుపేదల భూముల్ని అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించి, అక్రమంగా తవ్వేసి కోట్లాది రూపాయలు గడించారట. ఆ భూములన్నీ నిరుపయోగమయ్యాయి. ఆ నిరుపేదల బతుకులు రోడ్డునపడ్డాయి. నీరు–చెట్టు పథకం కింద ఏమాత్రం పనులుచేసే అవకాశంలేని గ్రామాల్లో సైతం పనులు మంజూరు చేయించుకుని నిరుపేదల, నిస్సహాయుల భూముల్ని లక్ష్యంగా ఎంచుకుంటున్నారంటే.. ఈ పథకం ఉద్దేశమేంటో అవగతమవుతోంది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. రాష్ట్రానికి దశ దిశ చూపించే పవిత్ర పత్రమంటూ మీరు గొప్పగా చెప్పుకొన్న మీ మేనిఫెస్టోలో.. ప్రజా పంపిణీలో అవినీతిని అరికడతాం.. బ్లాక్ మార్కెట్‌కు నిత్యావసర వస్తువుల తరలింపును నిరోధిస్తామని గొప్పగా హామీలిచ్చారు. మీ బినామీలే వాటికి తూట్లు పొడుస్తుంటే.. ఆ హామీలకు విలువేమైనా ఉందా? అవన్నీ కేవలం ఎన్నికలప్పుడు ప్రజలను మోసపుచ్చడానికే కాదా?

వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర — మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

● అన్నాడీఎంకే మాజీ ప్రధాన కార్యదర్శి శశికళ భర్త నటరాజన్ అంత్యక్రియలను తమిళనాడులోని తంజావూరు విలాల్ గ్రామంలో నిర్వహించారు. అంతకుముందు ఆయన మృతదేహాన్ని తంజావూరు విలార్‌లోని స్వగృహానికి తరలించారు. పెరోల్‌పై బయటకొచ్చిన శశికళ మంగళవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. భర్త మృతదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. బుధవారంసాయంత్రం ద్రవిడ సంప్రదాయం ప్రకారం ముల్‌లైవాయికాల్ స్మారక స్తూపం వద్ద నటరాజన్ మృతదేహాన్ని ఖననం చేశారు.

ఏపీ ఎంసెట్‌కు 29 వరకు గడువు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఎంసెట్–2018కు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 29 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని కన్వీనర్ సీహెచ్ సాయిబాబు బుధవారం విలేకరులకు తెలిపారు. అగ్రికల్చరల్, ఇంజినీరింగ్ విభాగాలకు కలిపి ఇప్పటి వరకూ లక్షా 63వేల 561 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 6 వరకు, రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఏప్రిల్ 11 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 16 వరకు, రూ.10వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఎంటర్ చేసిన సెల్ నెంబర్‌కు సమాచారం వస్తుందని, స్క్రైబ్‌కు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత ధ్రువపత్రాలతో కాకినాడ జేఎన్‌టీయూకే ఎంసెట్ కార్యాలయానికి వచ్చి అనుమతి పొందాలని సూచించారు. హాల్ టిక్కెట్లు ఏప్రిల్ 18వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, పరీక్ష ఏప్రిల్ 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఏప్రిల్ 25, 26 తేదీల్లో అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఉర్దూ అనువాదం కావాలనుకునే అభ్యర్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఒక్క కర్నూల్‌లో మాత్రమే కేంద్రం ఏర్పాటు చేశామని, ఎంసెట్ దరఖాస్తులో తప్పుల సవరణకు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ సరి చేసుకునేందుకు అనుమతి ఇచ్చామన్నారు. ఇతర వివరాలకు హెల్ప్‌లైన్ సెంటర్ 0884–2340535 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

సాక్షి
గురువారం, మార్చి, 22


బందీల మరణరహస్యం

ఇరాక్‌లోని మోసుల్‌లో నాలుగేళ్లక్రితం ఐఎస్ ఉగ్రవాదులకు బందీలుగా చిక్కి ఆచూకీ లేకుండాపోయిన 39 మంది భారత పౌరులు ఆ ఉన్మాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ఎట్టకేలకు పార్లమెంటులో ప్రకటించారు. వీరంతా పంజాబ్, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌కు చెందినవారు. పుట్టిన గడ్డపై పొట్ట నిండక బతుకు తెరువు కోసం ఎంత దూరమైనా పోవడానికి సిద్ధపడుతున్న వలస కార్మికులు ఎన్నో కడగండ్లు పడుతున్నారు. అటు ఉగ్రవాద మూకల దాడులు, ఇటు అమెరికా సేనలు సాగించే డ్రోన్ దాడులతో ఇరాక్ వంటి దేశాలు వల్లకాటిగా మారాయి. అటువంటి చోటకు సైతం వెళ్లడానికి సాహసించారంటేనే ఆ కార్మికుల కుటుంబాలు ఎంత దీనస్థితిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మోసుల్ ఉదంతంలో చిక్కుకుని ఐఎస్ ఉగ్రవాదుల కన్నుగప్పి తప్పించుకొచ్చిన హర్జిత్ మాసి అప్పట్లోనే తనతోపాటున్న 39 మందినీ వారు కాల్చి చంపారని చెప్పాడు. కానీ కేంద్ర ప్రభుత్వం దాన్ని కొట్టిపారేసింది. వారంతా ఇంకా సజీవంగానే ఉన్నారని తమకు సమాచారం అందిందని, ఆ బందీల విడుదల కోసం సకలవిధాలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చింది. ఆ తర్వాత సైతం బందీల కుటుంబాలవారికి సుష్మా అలాగే చెబుతూ వచ్చారు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఉన్నట్టుండి ఆ బందీలను ఉగ్రవాదులు కాల్చిచంపారని చెబితే ఆ కుటుంబాలు ఏమైపోవాలి?

కేంద్రం కేవలం హర్జిత్ మాసి చెప్పిన కథనాన్ని కొట్టిపారేసి ఊరుకోలేదు. పోలీసులు అతన్ని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఉగ్రవాదుల నుంచి అతన్ని సంరక్షించే ఉద్దేశంతోనే ఈ పని చేశామని చెప్పారు. స్వేచ్ఛగా వదిలిన కొన్నాళ్ల తర్వాత మళ్లీ వేరే కారణంతో అతను జైలుకు పోవాల్సివచ్చింది. ఏం చేసినా అతను తొలుత చెప్పిన మాట మీదే ఉన్నాడు. భవన నిర్మాణ పనిలో ఉండగా వచ్చిన ఉగ్రవాదులు అందరినీ అపహరించారని, ఆ తర్వాత తమలో ఉన్న బంగ్లాదేశ్ పౌరులను విడిచిపెట్టారని చెప్పాడు. ఆ మర్నాడు ఒక కొండపైకి తీసుకెళ్లి బందీలందరినీ వరసబెట్టి కాల్చేసినప్పుడు తనకు అదృష్టవశాత్తూ కాలిలో తూటా దూసుకు పోయిందని, చచ్చినట్టు నటించి వాళ్లు నిష్క్రమించాక సురక్షిత ప్రాంతానికి చేరుకుని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించానని చెప్పాడు. హర్జిత్ చెప్పిన కథనాన్ని ఆ ఉదంతంలో బయటపడ్డ బంగ్లా పౌరులు కూడా మరికొన్నాళ్లకు ధ్రువీకరించారు. ఒక ఆంగ్ల దినపత్రిక రెండేళ్లక్రితం కుర్దుల ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఉటంకిస్తూ భారత పౌరుల్ని ఉగ్రవాదులు హతమార్చారని వెల్లడించింది. అప్పుడు కూడా కేంద్రం ఆ కథనాన్ని ఖండించింది. చివరకు మోసుల్ నుంచి ఐఎస్‌ను తరిమి కొట్టిన ఏడెనిమిది నెలల తర్వాతగానీ బందీల మరణంపై ప్రకటన చేయలేదు.

నిజమే... ఒక మతిమాలిన గుంపు చెరలో ఉన్న వ్యక్తిని విడిపించడం అంత సులభమేమీ కాదు. పైగా రాజ్యం నియంత్రణలేని ప్రాంతంలో... ఎవరి హిత వచనాలూ, వేడుకోళ్లూ తలకెక్కనిచోట వేరే దేశం బలప్రయోగం చేయడం లేదా వారితో ఓపిగ్గా చర్చించడం అసాధ్యం. కానీ అలాంటిచోట సైతం బందీల చెర నుంచి విజయవంతంగా విడిపించిన చరిత్ర మన ప్రభుత్వానికుంది. ఇరాక్‌లోనే తిక్రిత్ ప్రాంతంలో ఇదే ఐఎస్ ఉగ్రవాదుల చెరలో మన దేశానికి చెందిన 46మంది నర్సులు చిక్కుకున్నప్పుడు మన అధికారులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. మధ్యవర్తులను గుర్తించి వారి ద్వారా ఉగ్రవాదులతో సంప్రదింపులు జరిపారు. ఒక దశలో ఆ సంప్రదింపులు విఫలమయ్యాయని, నర్సులందరినీ ఎక్కడికో తరలించాలని ఉగ్రవాదులు సంకల్పించారని వార్తలొచ్చాయి. అలాంటి సమయంలో కూడా అధికారులు జాగ్రత్తగా అడుగులేశారు. ఎలా చేశారో, ఏం చెప్పి ఒప్పించారో ఇప్పటికీ వెల్లడికాలేదు. కానీ 'సంప్రదాయేతర విధానాల' ద్వారా బందీలకు విముక్తి కలిగించామని మాత్రం చెప్పారు. ఒకప్పుడు సద్దాం హుస్సేన్ హయాంలో పనిచేసిన బాత్ పార్టీ ముఖ్యులు, సైన్యంలో కీలకపాత్ర పోషించినవారు ఐఎస్‌లో చురుగ్గా ఉన్నారు. ఐఎస్ చేజిక్కించుకున్న నగరాలకు వారు 'మేయర్లు'గా వ్యవహరించారు. అలాంటివారి ద్వారా ఆ నర్సులను విడుదల చేయించగలిగారు. మరి ఆ పనే ఇక్కడెందుకు చేయలేకపోయారు? స్వయంగా ఆ ఉదంతంలో చిక్కుకుని బయటపడ్డ వ్యక్తిని నోర్మూయించే ప్రయత్నం ఎందుకు చేశారు? ఆ తర్వాత బందీల విషయంలో ఆ వ్యక్తి చెప్పింది నిజమేనని వేరే వ్యక్తులు ధ్రువీకరించినప్పుడు సైతం అది నిజం కాదని అంత గట్టిగా ఎలా చెప్పగలిగారు? ఎందుకని ఇన్నేళ్లుగా బాధిత కుటుంబాలకు ఆశలు కల్పించారు? అయిదారు వర్గాల సమాచారం ఆధారంగా బందీలు క్షేమంగా ఉన్నారని ధ్రువీకరించుకున్నామని ఎందుకు నమ్మబలికారు?

మోసుల్‌లో బందీలైనవారంతా నిరుపేదలు. పూటకు గతిలేని కుటుంబాలవారు. అందువల్లే తమవారి గురించి పట్టించుకోలేదని, ఎలాంటి ప్రయత్నాలూ చేయకపోయినా, ధ్రువీకరించుకోదగ్గ సమాచారమంటూ లేకపోయినా నాలుగేళ్లుగా కట్టుకథలు వినిపించారని ఆ కుటుంబాలు ఆక్రోశిస్తున్నాయి. నిరుడు అక్టోబర్‌లో తమ నుంచి డీఎన్ఏ నమూనాలు సేకరించినప్పుడే అనుమానాలొచ్చాయని కొందరంటున్నారు. కుటుంబ పెద్దగా ఉంటున్నవారు, ఆత్మీయులు ఉన్నట్టుండి కనుమరుగయ్యారంటే ఎలాంటివారైనా వేదనపడతారు. ఆచూకీ లేకుండా మాయమైతే, ఏళ్లు గడుస్తున్నా ఏ సమాచారమూ లేకపోతే ఆ బాధ మరింతగా పెరుగుతుంది. నరరూప రాక్షసుల చెరలో మగ్గుతున్నారని తెలిస్తే వారికి ఏ క్షణంలో ఏమవుతుందో, ఎలాంటి చిత్రహింసలు చవిచూస్తున్నారో అనుకుంటూ అనుక్షణమూ కుమిలిపోతారు. పాలకులు దృఢంగా వ్యవహరిస్తున్నామని మాత్రమే అనుకుంటే సరిపోదు. ఇలాంటి విషయాల్లో సున్నితంగా కూడా ఆలోచించాలి. తమ నిర్వ్యాపకత్వాన్నో, నిస్సహాయతనో వెనువెంటనే నిజాయితీగా వెల్లడించి ఉంటే ఇన్నేళ్ల క్షోభ వారికి తప్పేది. ఈపాటికి కాస్తయినా కోలుకునేవారు. కనీసం ఇప్పుడైనా ప్రభుత్వం ఆ బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలి. వారికి జీవనోపాధి కల్పించాలి.




బతికి ఉంటారనుకున్న మనుషులు మృతులుగా మిగలడం కంటే మించిన బాధ ప్రపంచంలో ఏ కుటుంబానికీ ఉండదు.

– సారా డెస్సెన్
అమెరికన్ రచయిత్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్రమాసం, తిథి శు.పంచమి ప.2.08 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం కృత్తిక సా.6.24 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం ఉ.6.55 నుంచి 8.24 వరకు దుర్ముహూర్తం ఉ.10.06 నుంచి 10.55 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.44 వరకు, అమృతఘడియలు సా.4.05 నుంచి 5.36 వరకు.

సూర్యోదయం : 6.07
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	5.07	మగ్రీబ్	6.27
జొహార్	12.23	ఇషా	7.40
అసర్	4.45		

శల్యసారథ్యం రాష్ట్రానికి శాపం

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

టీడీపీ మంత్రుల రాజీనామాలను, కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టడాన్ని రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకొన్న నిర్ణయంగా కాక.. 2019 ఎన్నికల వ్యూహంలో భాగమేనని జాతీయ మీడియా కథనాలు పేర్కొనడం టీడీపీకి ఊహించని దెబ్బ. నాలుగేళ్లుగా ఏ దశలో కూడా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తేలేకపోవడం.. చివరకు అనివార్యంగా మంత్రులతో రాజీనామా చేయించడం తెలుగుదేశం బలహీనత, తప్పిదంగానే యావత్ దేశం పరిగణిస్తోంది.

విసిరిన పాచికలు అన్నిసార్లూ అనుకొన్నట్టు పారవు ఎవరికైనా! ప్రతి అడుగును రాజకీయంగా ఆచితూచి వేసే ఏపీ సీఎం చంద్రబాబు అందుకు మినహాయింపు కాదు. కేంద్రంలో తమ ఇద్దరు మంత్రులు అశోక గజపతిరాజు, సుజనాచౌదరిలతో రాజీనామా చేయించగానే.. రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా మారతాయని ఊహించిన టీడీపీకి జరుగుతున్న పరిణామాలు, వస్తున్న విమర్శలు మింగుడుపడటం లేదు. అయితే, మంత్రులతో రాజీనామా చేయించాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని ప్రధాని మోదీ గానీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా గానీ సీరియస్‌గా తీసుకోలేదు. తెలుగుదేశం తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తేలిగ్గా తిప్పికొట్టవచ్చునన్న భావన బీజేపీ అగ్రనాయకత్వంలో కనిపిస్తున్నది. బాబు ప్రభుత్వం చేసిన తప్పుల చిట్టా కేంద్రం వద్ద ఉండి ఉండొచ్చు. ఇప్పటికే తెలంగాణలో టీడీపీతో పొత్తును తెగదెంపులు చేసుకున్న బీజేపీ.. ఏపీలో కూడా తెలుగుదేశాన్ని వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే ఉన్నట్లు కన్పిస్తోంది. టీడీపీ మంత్రుల రాజీనామాల వ్యవహారాన్ని రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ఆగ్రహాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకొన్న నిర్ణయంగా కాక.. 2019 ఎన్నికల వ్యూహంలో భాగమేనని జాతీయ మీడియా కథనాలు పేర్కొనడం తెలుగుదేశం పార్టీకి ఊహించని దెబ్బ. నాలుగేళ్లుగా ఏ దశలో కూడా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి కేంద్రంపై గట్టిగా ఒత్తిడి తేలేకపోవడం.. చివరకు అనివార్యంగా మంత్రులతో రాజీనామా చేయించడం టీడీపీ బలహీనత, తప్పిదంగానే యావత్ దేశం పరిగణిస్తోంది.



ప్రజల ఆకాంక్షల్ని నాలుగేళ్లుగా గుర్తించలేదా?

ప్రజల ఆకాంక్షల మేరకు మోదీ మంత్రి వర్గం నుండి తమ ఇరువురు నేతలు తప్పుకొన్నారని, ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించే ఈ నిర్ణయం తీసుకొన్నామని తెలుగుదేశం నేతలు ప్రచారం చేస్తున్నారు. తద్వారా తప్పంతా బీజేపీ మీదకు నెట్టి... కడిగిన ముత్యంలా బయటపడటం టీడీపీ వ్యూహం! కానీ.. ఏం చెప్పినా నమ్మడానికి ప్రజలు అమాయకులు కాదు కదా? గత 4 ఏళ్లుగా ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ పరిపాలిస్తోందా? నిర్ణయాలు తీసుకొంటున్నదా? 'రాష్ట్రానికి ప్రత్యేకహోదా' అన్నది రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదిగా ప్రజలందరూ పరిగణిస్తే.. తెలుగుదేశం దానిని రాజకీయాంశంగానే పరిగణించిందని ప్రజా బాహుళ్యానికి పూర్తి అవగాహన ఉన్నది కదా! రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తాత్సారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ నిరసిస్తూనే ఉంది. వైఎస్సార్‌సీపీ ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా చేసినప్పుడు, రాష్ట్ర బంద్ చేసినపుడు.. గుంటూరులో అమరణ నిరాహార దీక్ష చేసినప్పుడు, ప్రతి జిల్లాలో యువగర్జన సదస్సులు జరిపినప్పుడు, పాదయాత్రలో పదేపదే ప్రత్యేకహోదా విషయం ప్రస్తావిస్తున్నప్పుడు... ఇంకా అనేక సందర్భాలలో ఈ అంశంపై పలు రకాలుగా ఉద్యమాలు చేసిన సందర్భాలలో అధికారంలో ఉన్న టీడీపీ ఎదురుదాడికి దిగింది. అక్రమ కేసులు బనాయించింది. ఏ రాజకీయ పార్టీకీ చెందని విద్యార్థులు ఆందోళనకు దిగితే.. వారిపై పి.డి. యాక్ట్ కింద కేసులు పెడతామని, జైళ్లకు పంపిస్తామని, భవిష్యత్తు నాశనం అవుతుందని బెదిరించింది టి.డి.పి. ప్రభుత్వం. విద్యార్థుల తల్లిదండ్రులను హెచ్చరించింది.

రాష్ట్రాన్ని కాంగ్రెస్‌పార్టీ అడ్డగోలుగా విభజించిందన్న వాదనను ప్రజల్లోకి బీజేపీ, టీడీపీలు బలంగా తీసుకువెళ్లడం, ఆనాడు దేశవ్యాప్తంగా మోదీకి లభించిన ఆదరణ తదితర అంశాలు తోడు కాగా స్వల్ప ఓట్ల తేడాతోనే చంద్రబాబు ఏపీకి సీఎం కాగలిగారు. అయితే, విభజన కారణంగా రాష్ట్రానికి సంక్రమించిన కష్టాలను పరిష్కరించవలసిన ప్రభుత్వం.. దానికి బదులుగా కొత్త కష్టాలను ప్రజలపై మోపింది. రుణమాఫీ హామీ ఇచ్చి.. దానిని సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల రైతాంగం అప్పుల్లో కూరుకు పోయింది. డ్వాక్రా రుణాలమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి అమలు వంటి ప్రధాన ఎన్నికల హామీల్ని నెరవేర్చలేదు. దశల వారీ మద్యపాన నిషేధం కాస్తా.. దశదిశల మద్యపానంగా మారింది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. హక్కుగా లభించవలసిన విభజన చట్టంలోని ప్రధాన హామీల్ని కేంద్రం నుంచి సాధించుకోవడంలో ప్రభుత్వం ఎటువంటి చొరవ చూపలేక పోయింది.

చివరి వరకు ప్యాకేజీనే ముద్దు అన్నారు

రెవెన్యూలోటును రాష్ట్ర ప్రభుత్వం రూ.16,078 కోట్లుగా చూపితే, కేంద్రం ఇచ్చింది రూ.4,117 కోట్లు మాత్రమే! రాష్ట్ర ప్రభుత్వం చూపిన రెవెన్యూ లోటు లెక్కల్లో తేడాలున్నాయని కేంద్రం ఎన్నోసార్లు స్పష్టం చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధ్యులైన ఆర్థికశాఖమంత్రి, ఇతర ఉన్నతాధికారులు ఢిల్లీ వెళ్లి ఆ లెక్కల్ని సరిచేసే ప్రయత్నం చేయలేదు. రాజధాని నిర్మాణానికి తొలుత 5 లక్షల కోట్ల రూపాయిలు కావాలని అడిగి, రూ.43,000 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, అందులో కేంద్రం ఇచ్చింది. రూ.2,500 కోట్లు. కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వేజోన్, దుగ్గరాజపట్నంలో భారీ ఓడరేవు నిర్మాణం మొదలైన ఆ ప్రాంత ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడిన అంశాలను.. కేంద్రాన్ని ఒప్పించి పరిష్కరించుకునే చొరవ సీఎంగానీ, టీడీపీ ఎంపీలుగానీ చేయలేదు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, జిల్లాలకు కోరాపుట్, బుందేల్ ఖండ్ ప్యాకేజీ వంటిది అందిస్తామని విభజనచట్టంలో ఉండగా, ఆ పద్దు కింద 4 ఏళ్లలో జిల్లాకు రూ.5 కోట్లు చొప్పున 7 జిల్లాలకు కేవలం రూ.105 కోట్లుతో కేంద్రం సరిపుచ్చగా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు సరికదా.. ఆ నిధుల్ని కూడా పూర్తిగా ఆయా జిల్లాలకు ఖర్చు చేయకుండా దారి మళ్లించింది. ఇక కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడులు అర్ధరాత్రి విలేకర్ల సమావేశం పెట్టి..విభజన చట్టంలోని హామీల్నీ చదివేసి వాటిని రీప్యాకేజీ చేస్తే.. అందులో ఏమున్నదో కూడా చూడకుండానే సీఎం బాబు హర్షం వ్యక్తం చేశారు. వెంకయ్యని ఓపెన్ జీపులో గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఓపెన్‌టాప్ జీపులో ఎక్కించుకొని విజయవాడ నగరంలో తిప్పారు.

ప్రత్యేకహోదా నిరాకరించడానికి కేంద్రం సాకులు చూపుతున్నా, ప్రత్యేక హోదా లభించకుంటే ఎన్నికల్లో తాను చేసిన హామీలు నెరవేర్చడం సాధ్యం కాదని తెలిసినా.. చంద్రబాబు మహా మౌనిలా వ్యవహరించారు. ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబుకు రాష్ట్రానికి ప్రత్యేకహోదా లభిస్తే చేకూరే ప్రయోజనాలకు, ప్రత్యేక ప్యాకేజీ వల్ల పరిమితంగా కలిగే చిరు లాభానికి తేడా తెలియదని అనుకోవాలా? రాష్ట్రానికి నష్టం జరిగిందని, దానికి కాంగ్రెస్ పార్టీయే కారణమంటూ పదేపదే జరిగిపోయిన వాటిపై ఆక్రోశించిన చంద్రబాబు.. పార్లమెంట్ ఆమోదించిన పునర్విభజన బిల్లులో పేర్కొన్న అంశాలు, బీజేపీ నేతలు ఇచ్చిన హామీల అమలుపై కంటితుడుపుగా విజ్ఞాపన పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప ఏనాడూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన సందర్భం లేదు. కేవలం కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడినట్లుగా వ్యవహరించింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రత్యేకహోదా కోసం ప్రతిపక్ష పార్టీలు ఉద్యమిస్తే.. కేసులు బనాయించారు, హేళన చేశారు. ప్రత్యేకహోదా వల్ల ఫలితంలేదని, అది సంజీవని కాదని, ప్యాకేజీయే మేలని.. ఇలా రకరకాల వాదనల్ని విన్పించారు. కేంద్రం 2017–18 బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత.. రాష్ట్రానికి అన్నీ వచ్చేశాయని సి.ఎం. చంద్రబాబు మీడియా సమావేశంలో వెల్లడించారు. ''ఇంతకుమించి అడగలేం'' అని కూడా తేల్చేశారు. కేంద్రమంత్రి సుజనా చౌదరి కూడా మీడియా సమావేశంలో ''అన్ని రాష్ట్రాల కంటే మనమే ఎక్కువ సాధించాం.. ప్రత్యేక హోదాతో సమానమైనవన్నీ వచ్చాయి'' అని సాధికారంగా చెప్పారు. ఏపీ బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా సిద్ధార్థనాథ్ సింగ్ చంద్రబాబు తమను ఏనాడు ప్రత్యేకహోదా కావాలని అడగనేలేదని, ప్రత్యేక ప్యాకేజికే మొగ్గుచూపారని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా సాధించవలసిన వారే శల్య సారథ్యం వహించారు.

పోరాడింది వైఎస్సార్‌సీపీ, వామపక్షాలే

ప్రత్యేకహోదా అంశాన్ని మరుగుపర్చడానికి అధికార తెలుగుదేశం ఎంతగా ప్రయత్నించినా.. ఎప్పటికప్పుడు నిర్విరామంగా ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ దానిని ఓ ఆశాదీపంగా నిలిపింది వైఎస్సార్ సీపీయే! వైసీపీ అధ్యక్షులు వై.యస్.జగన్ ''ప్రత్యేకహోదా'' కల్పించాలంటూ ఢిల్లీలో ధర్నాచేశారు. అసెంబ్లీలో సమర్థవంతంగా తన వాదనల్ని విన్పించారు. ప్రజల ఆకాంక్షలను తెలియజెప్పారు. కాంగ్రెస్, వామపక్షాలు కూడా ఉద్యమాలు చేశాయి. అయితే, కేంద్రంలో ఐదవ బడ్జెట్ ప్రతిపాదించిన తర్వాత.. పార్లమెంట్ వెలుపల, లోపల తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు మొక్కుబడిగా సాగించిన నిరసనను సీఎం చంద్రబాబు 'పోరాటం'గా అభివర్ణిస్తున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన పార్లమెంట్ సమావేశాలకు ఇచ్చిన విరామంలో.. టీడీపీ ఏ ఒక్క కార్యక్రమమైనా చేయగలిగిందా? ఫిబ్రవరి 8న వామపక్షాలు ప్రతిపాదించగా వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిన రాష్ట్ర బంద్‌ను విఫలం చేయాలని శతవిధాలా ప్రయత్నించింది రాష్ట్ర ప్రభుత్వం. చివరకు విధిలేక బంద్‌లో తామూ పాల్గొన్నట్లు ప్రచారం చేసుకున్నారు.

'ఓటుకు కోట్లు' కేసు నుంచి బయటపడటానికి మోదీకి సాగిలపడిపోయిన ఫలితంగానే.. టీడీపీ రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా ప్రతిష్ట పోగొట్టుకొందని ప్రజాబాహుళ్యం చెవులు కొరుక్కోవడం, చర్చించుకోవటం, నిరసనలు తెలపడం ప్రభుత్వానికి వినపడటం లేదా, లేక కనపడటం లేదా! కేంద్రం నుంచి హక్కుగా రావాల్సిన ప్రత్యేకహోదా రాకుండా ఎవరు అడ్డపడ్డారు? విభజన బిల్లు అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలు, ప్రతిపక్ష నేతగా వెంకయ్య ప్రత్యేకహోదా కోసం గర్జించిన విధానం, తిరుపతి పుణ్యక్షేత్రంలో జరిగిన ఎన్నికల సభలో ఆనాడు మోదీ, వెంకయ్య, బాబు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఆవశ్యకతను గురించి చేసిన భీకర ప్రసంగాలు ఏమైపోయాయి? పాలకులు మర్చిపోయినా ప్రజలు మాత్రం మర్చిపోలేదు. టీడీపీ దోబూచులాటలను ఇకనైనా కట్టిపెట్టి రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు సమాయత్తం కావటం విజ్ఞత అనిపించుకొంటుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు 184వ నిబంధన క్రింద పార్లమెంటుకు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంలో భాగస్వాములు కావడం ద్వారా రాష్ట్ర ప్రయోజనాల పట్ల టీడీపీ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన పరీక్షా సమయమని గుర్తించుకోవాలి. వైఎస్సార్ సీపీ తీర్మానానికి పోటీగా అవిశ్వాస తీర్మానం చేసిన టీడీపీ కనీసం దాన్నయినా నిజాయితీగా ముందుకు తీసుకుపోతుందా అనేది సందేహాస్పదమే. రాష్ట్రానికి ప్రస్తుత తరుణంలో కావాల్సింది శల్య సారథ్యం కాదు... చిత్తశుద్ధితో కూడిన సారథ్యం.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నాయకులు
మొబైల్ : 99890 24579

హమ్మయ్య.. పీడ విరగడైంది

కేవలం అసెంబ్లీ నియోజకవర్గాల సీట్లు పెంచలేదన్నదే బీజేపీకి బాబు కటీఫ్ చెప్పడానికి వెనుక ఉన్న వ్యూహమని ఇప్పుడందరికీ తెలిసిపోయింది. కానీ ఈ పరిణామాలు బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని కలిగించాయి.

సందర్భం



పురిఘళ్ల రఘురాం



బీజేపీ శ్రేణుల్లో ఉగాది ముందుగా వచ్చింది. కేంద్రం నుంచి టీడీపీ మంత్రులను ఉపసంహరించుకోవడం, ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోవడం.. బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని కలిగించాయి. బీజేపీ శ్రేణులు రెండు దశాబ్దాల తర్వాత ఆనందంతో ఉప్పొంగాయ్. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు రెండుసార్లు గెలవడం బీజేపీ వల్లనేనని అందరికీ తెలిసిన విషయమే. కేవలం అధికార దాహంతో చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. 1999, 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకొని విజయం సాధించారు. బాబు గతంలో కూడా అటల్జీతో చెలిమి చేశారు. అటల్జీ చరిష్మాను ఉపయోగించుకొని సీఎం అయ్యారు. మరోసారి మోదీ వల్లే సీఎం అయ్యారు.

బాబు రెండుసార్లు బీజేపీని మధ్యలో వదిలేసి వెళ్లిపోవడం రాజకీయ ప్రయోజనాల కోసమన్నది తెలిసిన విషయమే. అయితే లేనిది ఉన్నట్టుగా... ఉన్నది లేనట్టుగా ప్రచారం చేస్తూ బీజేపీని దెబ్బతీయాలని బాబు కుట్రపన్నారు. ఏపీకి బీజేపీ నాలుగేళ్ల నుంచి రాష్ట్రానికి నిధులిస్తోంది. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక నాలుగు ఎయిర్ పోర్టులు మంజూరు చేసింది. కేంద్ర సంస్థలను ఇస్తోంది. ఇచ్చిన సంస్థలకు నిధులను దఫదఫాలుగా అందిస్తోంది.

ఉమ్మడి రాజధానిని వదిలేయడానికి ప్రధాన కారణం ఓటుకు కోట్లు కేసే. సరే అమరావతి వచ్చారు. ఇక్కడన్నా ఏదైనా చేశారంటే అదీ లేదు. దేశంలోని ఏ సీఎం తిరగనంతగా... 28 దేశాలు తిరిగి వచ్చారు. 18 సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు. బాబు పర్యటనలతో ఏపీకి నిధులు వస్తాయని, కంపెనీల రాకతో నిరుద్యోగం తగ్గుతుందని భావించి కేంద్రం ముందుండి సహకరించింది. 28 దేశాలు తిరిగి వచ్చి.. బాబు ఏం సాధించారు. విదేశీ పర్యటనలన్నింటికీ ప్రత్యేక చార్టెడ్ ఫ్లయిట్‌లో వెళ్లారు. ఇతర సీఎంలు ప్యాసింజర్ విమానాల్లో వెళ్తే... బాబు ఢిల్లీ పర్యటనలకు కూడా ప్రత్యేక విమానాలనే వాడారు. నిధులను పెద్ద ఎత్తున దుర్వినియోగపర్చారు.

బాబులో మార్పు రావడానికి ప్రధాన కారణం ఏపీ ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగేళ్లుగా జగన్ ప్రత్యేక హోదా గురించే మాట్లాడుతున్నారు. కాలేజీల్లో విద్యార్థులతో మాట్లాడటం దగ్గర్నుంచి, ఢిల్లీ వేదికగా ఆందోళనలు, జిల్లాల్లో ధర్నాలన్నీ కూడా ప్రత్యేక హోదా చుట్టూ తిరిగాయ్. అప్పుడు బాబు హోదా గురించి ఒక్క మాట మాట్లాడలేదు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది ప్రత్యేక హోదా అన్నారు. ఆ తర్వాత హోదా వద్దులే... ప్యాకేజీ చాలన్నారు. కేంద్రం, దేశంలో ఏ రాష్ట్రానికి చేయని విధంగా సాయం చేసిందన్న బాబు... అనూహ్యంగా ప్లేటు ఫిరాయించారు. ఏపీలో తన పాలనపై వ్యతిరేకత రావడం, ప్రతిపక్ష నేత జగన్‌కి ఆదరణ పెరుగుతోందన్న రాష్ట్ర, కేంద్ర ఇంటెలిజెన్స్ నివేదికలతో హోదా పల్లవి అందుకున్నారు. జగన్‌ది రాజకీయంగా పైచేయి అవుతున్న తరుణంలో రంగంలోకి దిగి... మొన్నటి వరకు కేంద్రంపై ప్రేమ ఒలకబోసిన బాబు గారు ఇప్పుడు మోదీ సర్కారుపై విమర్శలు గుప్పిస్తున్నారు. మొత్తంగా బాబు రాజకీయంగా తనకు మేలు జరిగేది చేయాలని భావిస్తున్నారు తప్పించి... ఏపీకి మేలు జరిగే ఎలాంటి అంశాన్నీ టేకప్ చేయలేదు.

ఏపీకి సాయం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్... ఎస్పీవీ ద్వారా రాష్ట్రానికి నిధులు అందించేందుకు కేంద్రం సిద్ధమైతే అందుకు సహకరించకపోగా, కేంద్రం నిధులివ్వడం లేదంటూ విమర్శలు గుప్పిస్తారు. విజయవాడ కనక దుర్గమ్మ ఫ్లైఓవర్ కోసం మూడు వందలకోట్ల రూపాయలు కేటాయిస్తే అది ఇప్పటికీ ప్రారంభం కాలేదంటే వైఫల్యం ఎవరిదో ఇంకా చెప్పాలా? పోలవరం ప్రాజెక్టు కోసం వంద శాతం నిధులిస్తామని కేంద్రం ముందుకు వచ్చినా, నిధులివ్వడం లేదంటూ కబుర్లు చెప్తారు. డబ్బుల కోసం, కమిషన్ల కోసమే ప్రాజెక్టును కేంద్రం నుంచి తీసుకొని తాత్సారం చేస్తూ వచ్చారు. బీజేపీని అల్లరి చేసి, రాజకీయ లబ్ధి పొందాలనే కుట్ర కోణాన్ని తెరపైకి తెచ్చారు. తాజాగా తనపై అన్ని పార్టీలూ పగబట్టాయంటున్నారు. అయితే ప్రజలే ఆయనపై ద్వేషంతో ఉన్నారనేది సుస్పష్టం. ఉదయం ఒక మాట, మధ్యాహ్నం మరో మాట మాట్లాడతారు. రాత్రి ఇంకో మాట మాట్లాడుతూ తనదే పైచేయి అంటారు. ఓవైపు జనసేన అధినేత పవన్... రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని ఎండగడ్తున్నారు. సాక్షాత్తూ సీఎం తనయుడి అవినీతిని ప్రశ్నించారు. గతంలో బాబు పాలన బాగా చేస్తారని చెప్పిన పవన్... ఇప్పుడు మంత్రులంతా అవినీతితో పొంగిపొర్లుతున్న విషయం తెలుగు ప్రజలకు అసలు తెలియంది కాదు. లోకేశ్ అవినీతిపై సీబీఐ విచారణ చేయాలని కోరుతున్నారంటే బాబు పాలన తీరును అర్థం చేసుకోవచ్చు. కేవలం అసెంబ్లీ నియోజకవర్గాల సీట్లు పెంచలేదన్నదే బీజేపీకి బాబు కటీఫ్ చెప్పడానికి వెనుక ఉన్న వ్యూహమన్నది ఇప్పుడు అందరికీ తెలిసిపోయింది. ప్రతిపక్షం నుంచి ఫిరాయించిన 20 మంది ఎమ్మెల్యేలకు సీట్ల పెంపు కోసం ఢిల్లీ పర్యటనల్లో మాట్లాడారు తప్పించి... ఒక్కసారి కూడా ఏపీ సమస్యల విషయాన్ని ప్రస్తావించలేదన్నది వంద శాతం నిజం. బాబు దుష్ప్రచారాన్ని ప్రజలు ఎంత నమ్ముతారో కాలమే నిర్ణయిస్తుంది. అభివృద్ధికి పట్టం కడ్తారో... అబద్ధాలు చెప్పే చంద్రబాబుకు ఓటేస్తారో కాలమే చెప్తుంది.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త, ఢిల్లీ
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

మృత్యువు

కారుణ్య మరణాన్ని అంగీకరించడం ద్వారా మనం నైతిక, చట్టపరమైన 'మానవీయత'కు మరింత మెరుగయిన స్థానాన్ని ఇస్తున్నాం. ఇది మానవాళి కర్తవ్యంగా తలవంచి, 'జీవా'న్ని సృష్టించిన శక్తికి క్షమాపణ చెప్పుకుంటున్నాం.



గొల్లపూడి మారుతీరావు

జీవన కాలమ్



1981 ప్రాంతంలో హాలీవుడ్‌లో ఓ విభిన్నమయిన చిత్రం వచ్చింది. 'హూజ్ లైఫ్ ఈజ్ ఇట్ ఎనీవే?' గొప్ప చిత్రం. ఆలోచింపజేసే చిత్రం. ఓ గొప్ప పెయింటరు లారీ యాక్సిడెంటులో దెబ్బ తింటాడు. మెడ దగ్గర్నుంచి కాలి వరకు స్పర్శ పోయింది. ఇది భయంకరమైన శాపం. మెదడు ఆలోచించగల అన్ని ఆలోచనలూ స్పష్టంగా చేయగల అమూల్యమైన సాధనం యథాతథంగా పోయింది. కాలిమీద వాలిన ఈగని తోలుకునే ఆస్కారం లేదు. మనిషి సంపూర్ణంగా జీవించడానికి ఏది గుర్తు? మంచి బతుక్కి ఆలోచనా మంచి ఆచరణా?

అతను కేవలం ఒక అప్రయోజనమైన జీవితాన్ని గడుపుతున్నానని, తనకి స్వచ్ఛందంగా చచ్చిపోయే హక్కుని ప్రసాదించాలని న్యాయవాదుల బృందం ముందు వాదిస్తాడు. చివరికి వారు అతని కోరికని అంగీకరించక తప్పలేదు. డాక్టరు నిస్సహాయంగా అతని ప్రాణాన్ని నిలిపే ద్రావకాన్ని ఆపేస్తూ ''మూడు నిమిషాలలో నీ కోరిక తీరుతుంది. ఈ లోగా నీ మనసు మార్చుకుంటే నేను సహకరించగలను'' అంటాడు. సజావుగా జీవించలేని వ్యక్తి తన నిస్సహాయతను సహేతుకంగా నిరూపించి చచ్చిపోయే హక్కు ఉన్నదని రుజువుచేసి, మృత్యువుని ఆహ్వానించే కథ ఇది. ఇది ఎథునేసియా (కారుణ్య మరణం). దీనిని ఎవరు అంగీకరించాలి? న్యాయస్థానం.

మృత్యువు వ్యక్తికున్న పవిత్రమైన హక్కు. మనం ప్రతీ రోజూ హత్యలూ, మారణహోమాలూ వింటుంటాం కానీ, నీతిపరంగా, న్యాయపరంగా మరొకరి ప్రాణం తీసే హక్కు, ధైర్యం ఎవరికుంది? కొన్ని వందల దేశాలు, కొన్ని వందలసార్లు ఈ 'పవిత్రమైన' చెలియకట్టను దాటే ధైర్యం చేయలేక మథనపడి మథనపడి ఆ పనిని మానుకున్నాయి.

ఒక రోగి, సంవత్సరాలుగా మంచం పట్టాడు. బాగుపడే ఆస్కారం ఏ మాత్రం లేదని వైద్య రంగం చెయ్యి ఎత్తేసింది. అతని ప్రాణాన్ని నిలపాలంటే ఆ కుటుంబానికి ఖర్చు. వారికి రోగి బాగుపడడన్న ముగింపు తెలుసు. ఇప్పుడతనికి చచ్చిపోయే హక్కు ఉందా? న్యాయస్థానం 'మృత్యువు'కి అంగీకరిస్తుందా? నిర్ణయం తీసుకోవడానికి న్యాయవ్యవస్థ వణికిపోయింది. తను ఇవ్వలేని ప్రాణాన్ని ఏ కారణంగానయినా తుంచేసే హక్కు తనకేం ఉన్నది? 20 సంవత్సరాల తర్వాత మళ్లీ ఆ రోగి ఊపిరి సజావుగా పీల్చగలిగితే?

మానవతా విలువలు అతి క్రూరమైనవి. 'రేపు' మానవతా విలువలకి అందని అమూల్యమైనది. మనమెవరం మనిషి ప్రాణాన్ని హఠాత్తుగా తుంచెయ్యడానికి? నువ్వు ప్రాణాన్ని పోయగలవా? మరో క్షణం పొడిగించగలవా? ఒక్క క్షణం ఆపగలవా? నైతిక, మానవీయ, చట్టపరమైన పరిధుల్లో ఎన్నో సంవత్సరాలు న్యాయమూర్తులు ఈ ఆలోచనకే వణికిపోయారు. నిజంగా 'స్వచ్ఛంద మరణం' ఇచ్చే అర్హతలున్న ఎన్నో కేసులు చూసి. అర్థం చేసుకునే న్యాయమూర్తులు మూగగా ఉండిపోయారు.

పాసివ్ ఎథునేసియా అంటే స్థూలంగా వైద్య సహాయానికి లొంగక, లొంగదని నిర్ధారణ అయ్యాక, ఎన్నాళ్లయినా రోగి పరిస్థితి ఇంతేనని తేల్చిన వారు తెలిసి తెలిసీ హుందాగా మరణాన్ని ఆహ్వానించడం. మానవీయ విలువలను దృష్టిలో పెట్టుకుని, వాస్తవాన్ని ఎరిగి, నైతిక బాధ్యతని వహించి న్యాయస్థానం అట్లాంటి వ్యక్తులు క్రమంగా ప్రాణాన్ని కోల్పోవడానికి అనుమతిని ఇస్తుంది. ఏ విధంగానూ జీవించే అవకాశం లేని రోగిని నానాటికీ పురోగమిస్తున్న వైద్య విధానాల దృష్ట్యా జీవితాన్ని ఒక విధంగా ఆ రోగి హుందాగా మరణించే అవకాశాన్ని దోచుకోవడం అవుతుందనే నిర్ణయానికి వచ్చింది. ఇదంతా రోగికి వైద్యం చేసే డాక్టర్లు రోగి మానసిక స్థితి, ఆరోగ్య స్థితి, రోగం స్థితి ఇన్నిటిని నిర్ణయించి– ముఖ్యంగా రోగి ఇష్టాయిష్టాలను ఎరిగి అప్పుడు రికమెండు చేస్తుంది.

ఈ చర్యని చట్టాన్ని చెయ్యడంలో ఎక్కడ 'మరణ యాతన' చచ్చిపోయే వ్యక్తి డిగ్నిటీని దోచుకొంటోందో వివరించింది.

ప్రధాన న్యాయమూర్తి ఒక మాట అన్నారు. పాసివ్ ఇథునేసియాని అంగీకరించడం ద్వారా మనం మన చేతులోలేని, నిస్సహాయమైన, నిస్సందేహంగా పరిష్కారాన్ని– నైతిక, చట్టపరమైన 'మానవీయత'కు మరింత మెరుగయిన స్థానాన్ని ఇస్తున్నాం. అంతే. అదీ వణుకుతూనే.

ఇది మానవాళి కర్తవ్యంగా తలవంచి భగవంతునికి– పోనీ ఆయన లేకపోతే 'జీవా'న్ని సృష్టించిన శక్తికి సవినయంగా క్షమాపణని చెప్పుకుంటున్నాం.

ఈ వ్యక్తికి బకుకుతాడన్న ఆశలేదు. చచ్చిపోతాడన్న రూఢి లేదు. ఎంతకాలం బతుకుతాడో, ఎలా బతుకుతాడో, అసలు బతుకుతాడో బతకడో చెప్పే మార్గం లేదు– వైద్యం చేతులెత్తేసింది కనుక. తరాలు, దశాబ్దాల తరబడి మేధావులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, న్యాయనిపుణులు చర్చించి తనకి శక్తి లేని, సృష్టించడానికి శక్తి చాలని– ఆ నిస్సహాయుడికి బతికే క్రూరత్వం కంటే కన్నుమూసిన సౌలభ్యం ఒక 'విముక్తి' అనే భావనకి వచ్చారు. అదీ పాసివ్ ఇథునేసియా (కారుణ్య మరణం).

దివిసీమలో చమురు నిక్షేపాల వెలికితీత

- పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు లభ్యం
- ఈ నెల 26 నుంచి పనులకు శ్రీకారం?



డ్రిల్లింగ్ కోసం వెళుతున్న భారీ వాహనం



ఎన్ఎల్కె 1జెడ్ బావి

అవనిగడ్డ: కృష్ణా జిల్లా నాగాయలంకలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో మూడుచోట్ల చమురు నిక్షేపాలను వెలికితీసేందుకు మార్గం సుగమమైంది. ఏడాదిన్నర నుంచి ఎదురు చూస్తున్న పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు బుధవారం లభించాయి. ఈ నెల 26వ తేదీ నుంచి ఇక్కడ చమురు నిక్షేపాల వెలికితీత పనులు చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

31 బావుల్లో నిక్షేపాలు: నాగాయలంక మండలంలోని నంగే గడ్డ రెవెన్యూ పరిధిలో ఆయిల్ నిక్షేపాలను గుర్తించేందుకు తొలిసారిగా 2011లో పనులు ప్రారంభించారు. 2015 నాటికి ఈ ప్రాంతంలో మొత్తం 31 బావుల్లో చమురు నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో నాగాయలంక 1జెడ్ ఏరియాలో మూడు బావుల్లో చమురు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నట్టు తేలింది. ఈ మూడు బావుల్లో 400 బ్యారెల్స్ చమురు నిక్షేపాలు ఉన్నట్టు అప్పట్లో ఉన్నతాధికారులు ప్రకటించారు. వీటిని వెలికితీసేందుకు అనుమతులు పొందడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు అనుమతులు లభించాయి.

దివిసీమకు మహర్దశ: ఎన్ఎల్కె (నాగాయలంక) 1జెడ్ బావులు ఉన్న ప్రాంతంలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో రహదారుల అభివృద్ధి, డ్రిల్లింగ్కు అవసరమైన ఫ్లాట్ఫాం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న మూడు బావుల్లో రోజుకు 100 క్యూబిక్ మీటర్ల (1 క్యూబిక్ మీటర్ 1,000 లీటర్లకు సమానం) చమురు వెలికితీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడతలో మొత్తం 400 బ్యారెళ్ల ఆయిల్ నిక్షేపాలను వెలికితీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. రెండో దశలో వచ్చే మూడేళ్లలో మరో 20 బావుల్లో చమురు నిక్షేపాలు వెలికితీసేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది. ఓఎన్జీసీ ఆధ్వర్యంలో చమురు నిక్షేపాల వెలికితీతకు చర్యలు చేపడుతుండడంతో దివిసీమకు మహర్దశ పట్టినట్లేనని నిపుణులు చెబుతున్నారు.

ఏయూకు స్వయంప్రతిపత్తి హోదా

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి గేటెడ్ స్వయంప్రతిపత్తి)(అటానమీ) హోదా లభించినట్లు వర్సిటీ వైస్ చాన్స్లర్ జి.నాగేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా 60 విద్యా సంస్థలకు యూజీసీ ఈ హోదా ప్రకటించిందన్నారు. న్యాక్లో 3.51 కంటే ఎక్కువ మార్కులు కలిగి ఉండటంతో యూజీసీ కేటగిరి–1లో స్థానం పొందిందని, భవిష్యత్తులో నూతన కోర్సులు నిర్వహణ, విభాగాలు, కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటివి వర్సిటీ స్వేచ్ఛగా చేయవచ్చన్నారు.

రేపు కేఎల్ డీమ్డ్ వర్సిటీ స్నాతకోత్సవం

2,500 మందికి డిగ్రీలు ప్రదానం

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 7వ స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి తెలిపారు. వర్సిటీ కార్యనిర్వాహక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సింగపూర్కు చెందిన నన్యాంగ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్నాతకోపన్యాసం చేస్తారన్నారు. టీసీఎస్ సంస్థ సలహాదారు హేమగోపాల్, ఇస్కాన్ అధ్యక్షుడు, అక్షయపాత్ర ఫౌండేషన్ ఛైర్మన్ మధు పండిట్ దాసా గౌరవ అతిథులుగా పాల్గొంటారన్నారు. వర్సిటీ తరపున వారికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. కేఎల్ వర్సిటీ రిజిస్ట్రార్ టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. 2016– 17 విద్యాసంవత్సరానికి సంబంధించి పీహెచ్డీ, ఎంటెక్, ఎంబీఏ, బీటెక్, బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సులు పూర్తి చేసిన 2,500 మందికి డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనులు చేపట్టి వలసలు నివారించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వ్యవసాయ కార్మిక సంఘాలు

గాంధీనగర్ (విజయవాడ): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టి కూలీల వలసలు నివారించాలని సీపీఐ, సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు జల్లి విల్సన్, వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని కోరుతూ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం బుధవారం జరిగింది. విజయవాడ అలంకార్ సెంటర్లోని ధర్నాచౌక్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం సభలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులను అధికార పార్టీ నాయకులు పందికొక్కుల్లా మెక్కుతున్నారన్నారు. వేసవి ప్రారంభమైనందున ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించి, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక సంఘం ప్రతినిధులతో గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం చర్చలు జరిపారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

హిల్ కంపెనీకి టీపీఎం- ఏ కేటగిరి అవార్డు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐడీఏలోని హిల్ (చార్మినార్ రేకులు) కంపెనీకి ప్రతిష్టాత్మకమైన టీపీఎం క్యాటగిరి–ఏ అవార్డు లభించినట్లు కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్కి చెందిన జేఐపీఎం సంస్థ నిర్వహించిన టీపీఎం (టోటల్ ప్రొడక్టివ్ మెయింటెనెన్స్) ఆడిట్లో విజయం సాధించి భారత్లోని రేకుల తయారీ కంపెనీల్లో 'హిల్' తొలిసారిగా క్యాటగిరి–ఏ అవార్డు దక్కించుకుంది. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును హిల్ సంస్థ జనరల్ మేనేజర్ కె.శ్రీధర్, సంస్థ ప్రతినిధులు గురురాజ్, శ్రావణ్కుమార్, కేవీ.రావు జపాన్లో అందుకున్నారు.

రాష్ట్రానికి 16 కొత్త ఫైర్ ఇంజన్లు

మంగళగిరి రూరల్: రాష్ట్రంలో కొత్తగా 16 ఫైర్ ఇంజన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు సదరన్ రీజనల్ ఫైర్ అధికారి మురళీమోహన్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఫైర్ స్టేషన్లో ఉంచిన 8 నూతన ఫైర్ ఇంజన్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ.. హర్యానా, ఢిల్లీ నుంచి ఈ ఫైర్ ఇంజన్లను తీసుకొచ్చినట్టు తెలిపారు. భద్రతా ప్రమాణాలు, వాహన విభాగాలను పరిశీలించిన తర్వాత వీటిని వివిధ జిల్లాలకు కేటాయించనున్నట్టు వెల్లడించారు.

'ఎక్సైజ్'లో టీడీపీ నేతల పెత్తనం!

సాక్షి, అమరావతి: మద్యం సిండికేట్లతో కుమ్మక్కై, బెల్టు షాపులు, లూజు విక్రయాలు, ఎమ్మార్పీ ఉల్లంఘనలను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖలోని అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే విషయం వివాదాస్పదంగా మారుతోంది. రాష్ట్రంలో పలువురు ఎక్సైజ్ అధికారుల అండతోనే బార్లు, మద్యం షాపుల్లో సిండికేట్లు యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నాయి. దీంతో అవినీతి అధికారులపై ఎన్ఫోర్స్మెంట్ విభాగం విచారణ జరిపి కమిషనర్కు నివేదిక సమర్పించింది. దీంతో ఓ డిప్యూటీ కమిషనర్, ఇద్దరు సీఐలపై చర్యలకు రంగం సిద్ధంచేసినట్లు సమాచారం. వేటు వేస్తే తప్ప అవినీతి అధికారులు దారిలోకి వచ్చే పరిస్థితి కనబడటంలేదని నివేదికలో పేర్కొన్నారంటే.. అధికారుల అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కాగా, ఎక్సైజ్ మంత్రి జవహర్ సొంత జిల్లాలోనే ఎక్సైజ్ అధికారులు చెలరేగిపోతున్నారు. భీమవరంలో పని చేసే ఓ అధికారి అయితే సెలవు పెట్టి మరీ గుంటూరులో మద్యం వ్యాపారుల వద్ద మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడలో ఇద్దరు సీఐలపై సస్పెన్షన్కు సిఫారసు చేశారు. అలాగే, రాజధాని ప్రాంతానికి పొరుగునున్న జిల్లాలో పనిచేసే డిప్యూటీ కమిషనర్పైనా ఫిర్యాదులు వెల్లువెత్తగా, రహస్యంగా విచారణ చేసి కమిషనర్కు నివేదిక సమర్పించారు. ఇది ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీ నరసింహం వద్దకు చేరిందనే విషయం లీక్ కావడంతో విజయవాడలో పనిచేసే ఓ మహిళా సీఐ సర్కారు పెద్దల ద్వారా తీవ్ర ఒత్తిళ్లు పెంచినట్లు సమాచారం. దీంతో ఆమెపై చర్యలు వద్దంటూ అధికారులకు సీఎం పేషీ ఆదేశాలిచ్చింది.

సర్కారు పెద్దల అల్టిమేటం

ఇదిలా ఉంటే.. తమకు బాగా కావాల్సిన వారు కావడంతో అవినీతి అధికారులపై చర్యలు వద్దని, చూసీచూడనట్లు వదిలేయాలని కృష్ణా జిల్లాకు చెందిన పార్టీ ఉన్నత పదవిలో ఉన్న ఓ ఎమ్మెల్సీ, ఓ ఎమ్మెల్యే ఎక్సైజ్ ఉన్నతాధికారులకు అల్టిమేటం జారీచేసినట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఆరోపణలపై విచారణ నిర్వహించి సస్పెన్షన్లు చేసిన కమిషనర్ లక్ష్మీ నరసింహం.. డిప్యూటీ కమిషనర్, ఇరువురు సీఐలపై మాత్రం చర్యలు తీసుకునేందుకు వెనకాడుతున్నారు.

మున్సిపల్ స్కూళ్లపై 'నారాయణ' పెత్తనం

అనధికారికంగా అప్పగింత • ఫౌండేషన్ కోర్సుల నిర్వహణ పేరిట పరాధీనం

సాక్షి, అమరావతి: మున్సిపల్ పాఠశాలలపై నారాయణ విద్యా సంస్థల ఉద్యోగుల పెత్తనం పెరుగుతోంది. హెడ్మాస్టర్లు, సబ్జెక్టు టీచర్లు, పురపాలక సంఘాల కమిషనర్లు, ఇతర అధికారులకు వారే నేరుగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. మున్సిపల్ శాఖ పరిధిలోని స్కూళ్లను ప్రభుత్వం అనధికారికంగా నారాయణ విద్యాసంస్థల సిబ్బందికి అప్పగించిందని సిబ్బంది చెబుతున్నారు. 2016–17 విద్యా సంవత్సరంలో మున్సిపల్ హైస్కూళ్లలో పదో తరగతి వరకు ఫౌండేషన్ కోర్సుల పేరిట ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఈ నిధులు కేటాయించింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సుల స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. వారికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, జువాలజీ, బయాలజీ, ఇంగ్లీషు వంటి సబ్జెక్టుల్లో ప్రత్యేక బోధన చేయించాలి. వారానికోసారి ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలి. ఈ బాధ్యతలను నారాయణ విద్యాసంస్థల సిబ్బందికి అప్పగించారు. తొలుత రూ.50 కోట్లతోపాటు అదనంగా మరో రూ.29 కోట్లను మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ విడుదల చేయించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాల కొనుగోళ్లకు అధికారులతో కమిటీలు నియమిస్తూ మున్సిపల్ శాఖ జీవోలు జారీ చేసినప్పటికీ అంతిమంగా ఈ కొనుగోళ్లు నారాయణ విద్యాసంస్థల ప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి.

స్కూళ్లకు విముక్తి కల్పించాలి

మున్సిపల్ పాఠశాలల వ్యవహారాలన్నీ నారాయణ విద్యా సంస్థల సిబ్బంది చేతుల్లోకి వెళ్లిపోయాయని టీచర్లు, అధికారులు వాపోతున్నారు. నారాయణ విద్యా సంస్థలకు చెందిన డి.వెంకటేశ్వరరావు, చిట్టిబాబుల ఆధ్వర్యంలో కొన్ని బృందాలు ఈ వ్యవహారాలు చూస్తున్నాయని, వారికి ప్రభుత్వం నుంచి డబ్బులు చెల్లిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. మున్సిపల్ స్కూళ్లపై ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం పెరిగిపోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని మున్సిపల్ టీచర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ చెప్పారు.


చిలకలూరిపేట సభలో జగన్ ప్రశ్నలకు చేతులు పైకెత్తి సమాధానం చెబుతున్న జనం

జనమే జనం..

ఎటు చూసినా జనం.. ఇసుకేస్తే రాలనంత జనం.. జై జగన్ అంటూ నినాదాల హోరు మధ్య వృద్ధులు, పిల్లలు, మహిళలు, యువత.. జననేత అడుగులో అడుగేశారు. చిలకలూరిపేట బహిరంగ సభలో దాదాపు గంటకుపైగా జనం కట్టుకదలకుండా జగన్ ప్రసంగం విన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఏ వైపు ఎవరూ అడుగు తీసి అడుగు వేయలేని విధంగా జనం పోటెత్తారు. జగన్ పిట్టకథ జనాన్ని విశేషంగా ఆకట్టుకుంది. ఆయన వేసిన ప్రతీ ప్రశ్నకు ఆత్మీయంగా స్పందించారు. చంద్రబాబు మోసాలు, దగా మీద జగన్ మాట్లాడుతున్నప్పుడు కరతాళ ధ్వనులు చేశారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో మిద్దెలు, మేడలు, గోడలు, చెట్లపై నుంచి జననేతను వీక్షిస్తూ.. ప్రసంగంలో లీనమయ్యారు. స్థానిక సమస్యలు ప్రస్తావించినప్పుడు యువత కేరింతలు కొట్టారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబు వైఖరి తూర్పారబడుతున్నప్పుడు సభా ప్రాంగణం ప్రజా గర్జనతో హోరెత్తింది. ప్రసంగం ముగిశాక పట్టణం దాటేందుకు జగన్‌కు దాదాపు గంటకుపైగా పట్టింది. వేలాది మంది రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. జగన్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. మహిళలు, వృద్ధులు సైతం ఆయన అడుగులో అడుగు వేశారు.

> దళారులు మొదలు.. మంత్రుల వరకు అంతా భాగస్వాములై పత్తి రైతులకు ఏ రీతిలో అన్యాయం చేశారో అందరం చూశాం. మొత్తం రూ.650 కోట్ల స్కామ్. ఈ స్కామ్ ఈ జిల్లా నుంచే ఇక్కడి నుంచే మొదలైందని చెప్పడానికి నిజంగా పాలకులు సిగ్గు పడాలి. నకిలీ విత్తనాలకు, నకిలీ పురుగు మందులకు గుంటూరు జిల్లా అడ్డాగా మారిందనేది వాస్తవం కాదా? ఈ వ్యవహారాన్ని దగ్గరుండి నడిపిస్తున్న ఈ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుల్ని ఏం అనాలి? చిలకలూరిపేట నియోజకవర్గంలో బియ్యం విచ్చలవిడిగా అక్రమంగా తరలిస్తున్నారని ఆంధ్రప్రభ విలేకరి శంకర్ కథనాలు రాస్తే.. ఆ విలేకరిని పిలిపించుకుని కొట్టి, చంపేశారు. దీనికి బాధ్యత వహించాల్సింది మంత్రి, పాలకులు కాదా?

మళ్లీ మోసమా?

▶ మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఏ రాష్ట్రానికీ ఇంత సాయం చేయలేదన్నారు..

ఈ పెద్దమనిషి నాలుగేళ్ల క్రితం ప్రత్యేక హోదా సంజీవని అన్నాడు. పదేళ్లు సరిపోదు.. పరిశ్రమలు కట్టడానికే నాలుగేళ్లు పడుతుందన్నాడు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా 15 ఏళ్ల పాటు తెస్తానని చెప్పాడు. కేంద్రంలో 2014 మార్చి 2న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విడగొట్టి, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కేబినెట్‌లో తీర్మానం చేసింది. ఆ మేరకు ప్లానింగ్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. అదే ఏడాది జూన్ 14న చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఏడు నెలల పాటు ప్రత్యేక హోదా ఫైల్ ప్లానింగ్ కమిషన్ వద్దే ఉండింది. ఆ ఏడు నెలలు చంద్రబాబు ఏం చేశారు? ప్లానింగ్ కమిషన్‌ను 2015 జనవరిలో రద్దు చేసి, నీతి అయోగ్ తీసుకొచ్చారు. అయినా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నామని అరుణ్ జైట్లీ నాడు చేసిన ప్రకటనకు, మొన్న ఇచ్చిన అదే ప్రకటనకు ఏమైనా తేడా ఉందా? జైట్లీ ప్రకటనతో మంత్రులను రాజీనామా చేయించామని గొప్పగా చెప్పే చంద్రబాబు.. ఈ పని అప్పుడే చేసి ఉంటే ప్రత్యేక హోదా ఇప్పటికే వచ్చి ఉండేది కదా?


జగన్‌ను చూడటానికి పరుగెత్తుకొస్తున్న అక్కచెల్లెమ్మలు

రైతులను కదిలిస్తే కన్నీరే..

అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, పేదలపై కక్షసాధింపులు, రైతన్నల కన్నీరు.. దేంట్లో చూసినా చిలకలూరిపేట నియోజకవర్గం మొదటి స్థానంలో కనిపిస్తోంది. ఇక్కడ చోటుచేసుకున్న అక్రమాల గురించి దారిపొడవునా ప్రజలు విన్నవించారు. నాలుగేళ్లుగా ఏ పంటకూ గిట్టుబాటు ధరలు లేవన్నా అంటూ రైతన్నలు బాధపడ్డారు. మిర్చి ఉత్పత్తికయ్యే వ్యయం రూ.7 వేల నుంచి రూ.8 వేలు. మిర్చి రైతుల పరిస్థితిపై ప్రతిపక్ష నేతగా నేనొచ్చి మిర్చి యార్డు వద్ద కూర్చొని ధర్నాలు, నిరాహార దీక్షలు చేస్తే తప్ప ప్రభుత్వంలో స్పందన రాని పరిస్థితి. వరి ఉత్పత్తి ఖర్చు క్వింటాల్‌కు రూ.1,900. కనీస మద్దతు ధర రూ.1,550 కాగా, రూ.1,400 కూడా రాని పరిస్థితి. పత్తి ఉత్పత్తి ఖర్చు రూ. 5,200. కనీస మద్దతు ధర రూ. 4,320. మార్కెట్‌కు వెళ్తే ఈమేరకు కూడా రావడం లేదు. మినుములు కనీస మద్దతు ధర రూ. 5,400 అయితే రూ.4 వేలు రాని పరిస్థితి. పెసలు కనీస మద్దతు ధర రూ.5,575 అయితే, కనీసం రూ.4 వేలు కూడా రాని పరిస్థితి. మొక్కజొన్న కనీస మద్దతు ధర రూ.1,425 అయితే కనీసం రూ.1150 దక్కని పరిస్థితుల్లో రైతన్న ఉన్నాడు. శనగ కనీస మద్దతు ధర రూ.4,400 అయితే కనీసం రూ.3 వేలు కూడా అందని పరిస్థితి. కంది కనీస మద్దతు ధర రూ.5,450 ఉంటే రూ.4 వేలు కూడా దొరకని పరిస్థితుల్లో రైతు ఉన్నాడు. నియోజకవర్గంలో సాగు నీటి పరిస్థితి కూడా బాగోలేదు. తుర్లపాడు కాలువను గణపవరం నుంచి తుర్లపాడు వరకు, పసుమర్రు మేజరు కాలువను ప్రకాశం జిల్లా ఉప్పుమాగులూరు నుంచి పసుమర్రు వరకు పొడిగిస్తే 20 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని రైతన్నలు చెబుతున్నారు. ఈ దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వం ఆలోచించడం లేదు. దివంగత నేత, ప్రియతమ నాయకుడు రాజశేఖరరెడ్డి పాలన గురించి రైతన్నలు గొప్పగా చెప్పారు. 'ఆ రోజుల్లో నాయన్ను మేము నీళ్లు కావాలని అడిగితే మూడు మండలాలకు 21 లిఫ్టులు పెట్టి వెంటనే మంజూరు చేశారు' అని రైతన్నలు చెబుతున్నారు.


మిట్టపాలెంలో దివ్యాంగునితో మాట్లాడుతున్న జగన్


మానుకొండువారిపాలెం వద్ద జగన్‌తో కలిసి నడుస్తున్న గీత కార్మికుడు

బాబు లంచాల కోసం పేదలు అప్పులపాలు

నాన్నగారి హయాంలో ఈ ప్రాంతంలో దాదాపుగా 1,200 మందికి 52 ఎకరాలు సేకరించి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇవాళ చంద్రబాబు గారి కళ్లు ఆ భూమిపై పడగానే 52 ఎకరాలు లాక్కొన్నారు. అక్కడి పేదలకు ఫ్లాట్లు కట్టిస్తామని కొత్త నాటకం మొదలు పెట్టారు. 300 అడుగుల ఫ్లాట్లు కట్టడానికి అడుగుకు ఎంత అవుతుందని విచారిస్తే రూ.వెయ్యి నుంచి రూ.1100 అని చెబుతున్నారు. ఈ లెక్కన ఈ ఫ్లాటు రూ.3 లక్షలకు వచ్చే పరిస్థితి. లిఫ్ట్, గ్రానైట్, మార్బుల్ ఫ్లోర్‌లు కూడా లేని ఈ ఫ్లాట్లకు చంద్రబాబు అడుగుకు రూ.2 వేలు చొప్పున రూ.6 లక్షలకు పేదవాడికి అమ్ముతారట. రూ.6 లక్షల్లో రూ.3 లక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తాయట. మిగిలిన రూ.3 లక్షలను ఆ పేదవాడు నెలకు రూ.3 వేలు చొప్పున 20 ఏళ్ల పాటు కట్టాలట.

అడుగడుగునా దౌర్జన్యం.. అవినీతే

'యడవల్లిలో 416 ఎకరాలకు 1975లోనే మాకు పట్టాలు ఇచ్చారన్నా.. ఆ భూములను సాగు చేసుకునేందుకు సొసైటీ ఏర్పాటు చేశామన్నా.. ఒక్కొక్కరం అర ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు సాగు చేసుకుంటున్నామన్నా.. ఆ దివంగత నేత లిఫ్ట్ కూడా మంజూరు చేశారన్నా.. చక్కగా వ్యవసాయం చేసుకుని బతుకుతున్న మాపై టీడీపీ నేతల కన్ను పడిందన్నా.. వారు చంద్రబాబుకు చెప్పడంతో మా పట్టాలు రద్దు అయ్యాయన్నా' అని దళితులు నా వద్ద వాపోయారు. ఈ భూముల్లో ఖనిజం ఉందట.. ఆ మైనింగ్ లీజుపై మంత్రి గారి కన్ను పడిందట. కన్నుపడగానే దళితుల పట్టాలన్నీ ప్రభుత్వం రద్దు చేసిన పరిస్థితి చూశాం. మంత్రికి ఇంతట. చంద్రబాబు నాయుడు గారి కొడుక్కు ఇంతట. తూబాడులో 18 ఎకరాలు, గొరిజవోలులో 142 ఎకరాల భూములను బలవంతంగా ఆక్రమించేసి, ఆ ఆక్రమించిన భూముల్లో నీరు–చెట్టు అనే కార్యక్రమం జరిపి, విచ్చలవిడిగా ఆ భూముల్లోని మట్టి అమ్ముకుంటున్న పరిస్థితి ఈ నియోజకవర్గంలో చూస్తున్నాం. కోట్ల రూపాయల విలువైన మట్టిని వీరు రియల్ ఎస్టేట్ కోసం అమ్ముకుంటున్నారు. ఎస్సీలు మాత్రం భూములు కోల్పోయి అల్లాడుతున్నారు.

> కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి చేసినంత సాయం ఏ రాష్ట్రానికి చేసిందో చెప్పమని 2017 జనవరి 27న సవాల్ విసిరాడు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని, ప్రజల్లోకి వెళ్లాల్సి వస్తుందని, ప్రజలు క్షమించరని తెలిసి.. చేసిన తప్పును ఇంకొకరిపై నెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతటి దారుణంగా పరిస్థితి ఉన్నా ఏ పేపర్, ఏ టీవీ ఆయన్ను ప్రశ్నించదు. ఆయన ఆస్కార్ నటుడి కంటే గొప్పగా నటిస్తున్నారని ఏ మీడియా చెప్పదు.

అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు ఇవ్వరట

అగ్రిగోల్డ్ భూములన్నీ చాలా తక్కువ రేటుకు సాక్షాత్తు చంద్రబాబు గారి బినామీలు కాజేశారు. ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే చంద్రబాబు గారి బినామీల్లో ఒకరు. దగ్గరుండి తక్కువ రేటుకు ఆ భూములు కాజేస్తారు. చంద్రబాబు నాయుడుగారి కొడుక్కు భాగమట.. మంత్రికి ఇంత భాగమట.. అగ్రిగోల్డ్ బాధితులకు మాత్రం నెత్తిన టోపీ పెడుతున్నారు. నేషనల్ హైవే–16 కోసం భూములు సేకరించి ఇదివరకే పనులు మొదలు పెట్టారు. రూ.150 కోట్లతో పనులు అయిపోయేవి. డబ్బు కోసం లంచాల కోసం రూట్ మార్చారు. వాళ్ల మనుషుల కోసం, వాళ్ల బినామీలకు మేలు చేయడం కోసం ఇవాళ రూటు మార్చడంతో అక్షరాల రూ.1500 కోట్లు అవుతుందట.

ఇలాంటి నాయకుడు అవసరమా?

నాలుగేళ్లుగా చంద్రబాబు గారి పాలన చూశారు. ఏడాదిలో ఎన్నికలు జరగబోతున్నాయని చెబుతున్నారు కాబట్టి ఇలాంటి నాయకుడు అవసరమా? ఆలోచించండి. రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు బేషరతుగా మాఫీ చేస్తానన్నాడు. మాట నిలుపుకోలేదు. రుణమాఫీ కింద ఇచ్చే సొమ్ము రైతుల అప్పులకు వడ్డీకి కూడా సరిపోలేదు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రాలేదు కానీ.. వేలం వేస్తామన్న నోటీసులు మాత్రం వస్తున్నాయి. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల రుణాలు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. నిరుద్యోగులనూ మోసం చేశారు. నెలకు రూ.2 వేలు చొప్పున 47 నెలలకు రూ. 94 వేలు ఇంటింటికీ బాకీ పడ్డారు. చంద్రబాబు హైటెక్ పాలనలో ఫోన్ కొడితే ఇంటికి మందు బాటిల్ తీసుకొస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనట్లు పెట్రోలు, డీజిల్ ధరలు మన రాష్ట్రంలో లీటరుకు ఆరు, ఏడు రూపాయలు ఎక్కువగా బాదేస్తున్నారు. రేషన్ షాపుల్లో బియ్యం తప్ప మరేమీ ఇవ్వడం లేదు. కరెంట్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. ఇంత దారుణంగా చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చాలంటే ఒక్క జగన్ వల్లే సాధ్యం కాదు. జగన్‌కు మీ అందరి తోడు, దీవెనలు కావాలి. చంద్రబాబును పొరపాటున క్షమిస్తే.. రేపు ప్రతి ఇంటికి కేజీ బంగారం, బెంజి కారు ఇస్తానంటాడు. మీరు నమ్మరని, తన మనుషులను పంపించి రూ.3 వేలు చేతిలో పెడతాడు. ఐదు వేలు గుంజండి. ఆ డబ్బు మనదే. మన జేబులో నుంచి దోచేసిన సొమ్మే. కానీ మీ మనస్సాక్షి ప్రకారం ఓటు వేయండి, అబద్ధాలు చెప్పేవారిని, మోసం చేసే వారిని బంగాళాఖాతంలో కలపాలి'' అని జగన్ అన్నారు.

అనగనగా ఓ రాజు..

అనగనగా ఒక అన్యాయమైన రాజు ఉండేవాడట. ఎప్పుడూ అబద్ధాలు చెప్పేవాడట. మోసం చేసేవాడట. ఆయనకు దేవతా వస్త్రాలు కావాలని మనసులో పడిందట. వెంటనే ఆర్డర్ ఇచ్చారట. అప్పటికే ఈ రాజుతో విసుగు చెందిన ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారట. మన రాష్ట్రంలో ఉన్నట్టే మంచి వాళ్లయిన చేనేతలు ఆ రాజుగారికి బుద్ధి చెప్పేందుకు బయలుదేరారట. రాజును కలిసి.. మూడు నెలల్లో దేవతా వస్త్రాలు తయారు చేసిస్తామని గడువు తీసుకున్నారట. మూడు నెలల తర్వాత పెద్ద పెద్ద పెట్టెలు తెచ్చారట. అయ్యా రాజుగారు.. ఈ పెట్టెల్లో దేవతా వస్త్రాలున్నాయి. మేం తెచ్చిన ఈ దేవతా వస్త్రాలు మూర్ఖులకు కనిపించవు. మంచి వారికి మాత్రమే కనిపిస్తాయి అని చెప్పారు. పక్క గదిలోకి తీసుకెళ్లి రాజు బట్టలు విప్పారట. ఆయనకు దేవతా వస్త్రాలు వేస్తున్నట్లు నటిస్తూ.. రాజు గారూ.. ఈ బ్లూ కలర్ బాగుంది అన్నారట. రాజుకు అది కనపడకపోయినా, బ్రహ్మాండంగా ఉందని మెచ్చుకున్నారట. రాజుగారూ ఇక్కడ బంగారం ఆభరణాలు బ్రహ్మాండంగా ఉన్నాయి కదా.. అన్నారట. అబ్బబ్బ బ్రహ్మాండంగా ఉన్నాయని రాజుగారు చెప్పారట. రాజు గారు సభలోకి వచ్చే సరికి బట్టలు లేవు. కానీ సభలో ఉన్న రాజుగారికి సంబంధించిన వంధిమాగదులు ఉన్నారు కదా? అంటే మన చంద్రబాబు నాయుడుకు సంబంధించిన టీవీలు, పేపర్లు ఉన్నట్టు. వాళ్లందరూ రాజు గారూ.. బ్రహ్మాండంగా ఉన్నాయి మీ వస్త్రాలు అని పొగడ్తలతో ముంచెత్తారట. రాజు గారు ఆ బట్టలు వేసుకొని ఏనుగు మీద ఊరేగడానికి బయలుదేరారట. అప్పుడు ఊర్లో నుంచి ఒక చిన్నపిల్లాడు వచ్చి రాజు గారికి బట్టల్లేవు.. షేమ్.. షేమ్.. అన్నాడట.

ఈ కథంతా మీకు తెలిసిందే. ఆ అన్యాయపు రాజు ఈ జన్మలో మన చంద్రబాబులా పుట్టారు. నాడు ఆ రాజుకు తాన తందానా అన్న వాళ్లు ఈ జన్మలో ఎల్లో పేపర్లు, ఎల్లో టీవీ చానళ్లు. ఇవి చంద్రబాబు ఏమంటే దానికి తందానా అంటాయి. చంద్రబాబు హోదా వద్దు.. అన్యాయపు ప్యాకేజీ ముద్దు అంటే ఆ పేపర్లు అబ్బబ్బ అంటూ కథనాలు రాస్తాయి. హోదా కోసం పోరాడతానని చంద్రబాబు యూ టర్న్ తీసుకుంటే కూడా ఆహా ఓహో అంటూ మోసేస్తున్నాయి. చంద్రబాబు.. హోదా సంజీవని అంటే పొద్దునే ఈ పేపర్లన్నీ కూడా సంజీవని అంటాయి. మధ్యాహ్నం చంద్రబాబు హోదా వల్ల ఈశాన్య రాష్ట్రాలు ఏం బాగుపడ్డాయని అంటే.. అవును ఏం బాగుపడ్డాయి అని ప్రశ్నిస్తాయి.

రాత్రికి చంద్రబాబు మాట మార్చి... హోదాకు వ్యతిరేకంగా నేను ఏనాడూ మాట్లాడలేదంటే... ఏం రాస్తాయో తెలుసా? చంద్రబాబు అరవీర భయంకరుడు. విక్రమార్కుడు, నాలుగేళ్లు చెమట కార్చి.. కార్చి.. హోదా కోసం పోరాటం చేశాడని రాస్తాయి. చంద్రబాబు ఎందుకు ఇన్నిసార్లు మాట మార్చారని అడగవు.

చంద్రబాబు పందిని చూపించి నంది అంటే వీళ్లంతా కూడా నంది నంది అంటారు. వీళ్లు ఎవరికీ కూడా రాజీనామా చేయకుండా మంత్రి పదవులు తీసుకోవడం తప్పుగా అనిపించదు. కోట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినా తప్పుగా కనిపించదు. మట్టి, ఇసుక, బొగ్గు, కరెంటు కొనుగోలు, రాజధాని భూములు, గుడి భూములు దోచేస్తున్నా కనిపించదు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టినా ఎల్లో మీడియాకు అస్సలు కన్పించదు.

చంద్రబాబు ఎన్డీఏకు జై అంటే.. వీళ్లూ జై అంటారు. చంద్రబాబు కాంగ్రెస్‌కు జై అంటే వీళ్లూ జై అంటారు. ఎల్లో మీడియా పత్రికలు, టీవీలు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై ప్రతీ గ్రామంలో, పట్టణంలోనూ చర్చ జరగాలి. వీళ్ల వెనుక ఎవరు ఉన్నారనేది ప్రతీ చోట చర్చ జరగాల్సిందే. అప్పుడే ఈ వ్యవస్థ బాగుపడుతుంది.

ప్రజాసంకల్ప యాత్ర 117వ రోజు

117వ రోజు నడిచిన దూరం 12.9 కిలోమీటర్లు

ప్రారంభం: ఉ.7.30 గంటలకు ఉప్పలపాడు

ముగింపు: రా.7.01 గంటలకు పోలిరెడ్డిపాలెం శివారు

ముఖ్యాంశాలు

- ఉప్పలపాడు, జరుగులవారిపాలెం, మిట్టపాలెం, దండమూడి, మానుకొండువారిపాలెం, చిలకలూరిపేట, పోలిరెడ్డిపాలెంలో జనంతో మమేకం.
- చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ

ఇప్పటి వరకూ నడిచిన దూరం 1,565.4 కి.మీ


జరుగులవారిపాలెంలో అవ్వను ఆత్మీయంగా పలుకరిస్తున్న జగన్

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ.7.00 గంటలకు పోలిరెడ్డిపాలెం శివారు

ముఖ్యాంశాలు

- పోలిరెడ్డిపాలెం శివారు, లింగంగుంట్ల, అప్పాపురం క్రాస్, కావూరులో జనంతో మమేకం

నోటు చిరిగితే.. జేబుకు చిల్లే!



- రూ.2000, రూ.500, రూ.200 కరెన్సీ నోట్లు చిరిగితే చిక్కులే
- నోట్ల మార్పిడికి బ్యాంకుల నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: కొత్త నోటు.. కొత్త కొత్తగా బాగున్న నోటు.. కానీ కొంచెం చిరిగిందా.. అంతే సంగతులు. ఆ నోటును బ్యాంకులు తీసుకోవు.. రిజర్వు బ్యాంకుకు వెళ్లినా లాభం లేదు. పాత పెద్ద నోట్లను రద్దు చేసి, కొత్త నోట్లను చలామణీలోకి తెచ్చి 16 నెలలవుతున్నా.. చిరిగిన/దెబ్బతిన్న కొత్త నోట్ల మార్పిడికి మార్గదర్శకాలు రాకపోవడమే దీనికి కారణం. చిరిగిన మేరకు కొత్త నోట్లకు జరిగిన నష్టాన్ని లెక్కించాల్సి ఉంటుందని.. ఆ మేరకు మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని తీసుకోవడం లేదని బ్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. అయితే బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకున్నప్పుడు, ఏటీఎంలలో మాత్రం చిరిగిన కొత్త నోట్లు వస్తుండటం గమనార్హం.

'కొత్త' సమస్యలు..

దాదాపు 16 నెలల కింద కేంద్ర ప్రభుత్వం పాత పెద్ద నోట్లను రద్దు చేసి.. రూ.2 వేలు, రూ.500, రూ.200 విలువ చేసే కొత్త నోట్లను చలామణీలోకి తెచ్చిన విషయం తెలిసిందే. పాత నోట్ల రద్దుతోనే నానా అవస్థలు పడిన జనం.. ఇప్పుడు కొత్త నోట్లతో కొత్త సమస్య ఎదుర్కొంటున్నారు. పొరపాటున చిరిగిపోయిన, దెబ్బతిన్న కొత్త నోట్లను మార్పిడి చేయడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయి. అలా కొత్త నోట్ల మార్పిడి కోసం వస్తున్నవారిని రిజర్వుబ్యాంకు ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సిందిగా సూచిస్తున్నాయి.

ఎక్కడికెళ్లినా అదే సమాధానం..

చిరిగిన కొత్త నోట్ల మార్పిడి కోసం హైదరాబాద్‌లోని రిజర్వు బ్యాంకు ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లినా నిరాశే ఎదురవుతోంది. రిజర్వు బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి కొత్త నోట్ల మార్పిడికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదని.. ఆ మార్గదర్శకాలు వచ్చిన తర్వాతే చిరిగిన నోట్లను మార్పిడి చేస్తామని అక్కడి అధికారులు స్పష్టం చేస్తున్నారు. తాము ఆదేశాలు ఇచ్చేవరకు చిరిగిన/ దెబ్బతిన్న కొత్త నోట్ల మార్పిడి చేయవద్దని రిజర్వు బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు ఉన్నట్లు బ్యాంకులు పేర్కొంటున్నాయి.

నోటు నష్టాన్ని మినహాయించుకుని..

సాధారణంగా నోట్ల మార్పిడికి రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం.. కరెన్సీ నోటుకు జరిగిన నష్టాన్ని లెక్కించేందుకు నోటుపై చిరిగిన/దెబ్బతిన్న/పాడైపోయిన భాగాలను కొలతలు తీస్తారు. ఆ నోటు పరిమాణానికి సరిపడా ఉండే గ్రిడ్ (గ్రాఫ్ పేపర్ మాదిరిగా ఉండే కొలమానం)పై చిరిగిన నోటును పెట్టి.. దెబ్బతిన్న భాగం నష్టాన్ని లెక్కిస్తారు. నోటు విలువ నుంచి ఈ నష్టాన్ని మినహాయించుకుని మిగతా విలువను చెల్లిస్తారు. వేర్వేరు విలువ గల కరెన్సీ నోట్ల పరిమాణం వేర్వేరుగా ఉండడంతో ఆయా నోట్ల నష్టాన్ని లెక్కించేందుకు బ్యాంకులు వేర్వేరు గ్రిడ్‌లను వినియోగిస్తాయి. పాత పెద్ద నోట్లు రద్దయి కొత్తగా రూ.2 వేలు, రూ.500, రూ.200 విలువైన నోట్లు చలామణీలోకి వచ్చాక నోట్ల మార్పిడికి సంబంధించి రిజర్వు బ్యాంకు మార్గదర్శకాలేవీ జారీ కాలేదు. పాత రూ. 500 నోట్లతో పోలిస్తే కొత్త నోట్ల పరిమాణంలో తేడా ఉంది. ఇక రూ.2 వేలు, రూ.200 నోట్లు పూర్తిగా కొత్త విలువతో కూడినవి. దీంతో పాత నోట్లకు సంబంధించిన గ్రిడ్‌లను కొత్త నోట్లకు వినియోగించుకోలేని పరిస్థితి ఉందని బ్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. ఈ అంశంపై అధికారికంగా స్పందించేందుకు బ్యాంకులు, ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయ అధికారులు నిరాకరిస్తుండడం గమనార్హం.


చిరిగిన నోట్లతో కమీషన్ల దందా

చిరిగిన కొత్త నోట్ల మార్పిడికి బ్యాంకులు నిరాకరిస్తుండటం.. చిరిగిన నోట్ల మార్పిడి చేసే వ్యాపారస్తులకు వరంగా మారింది. భారీగా కమీషన్ల దందాకు తెరలేచింది. రూ.2 వేల చిరిగిన నోటు మార్పిడికి రూ.500 వరకు.. రూ.500 చిరిగిన నోటు మార్పిడికి రూ.200 వరకు కమీషన్‌గా తీసుకుంటుండటం గమనార్హం. దీంతో చాలా మంది అడ్డగోలు కమీషన్ కింద చిరిగిన నోట్లను మార్పించుకోవాల్సి వస్తోంది. కొందరు అంత కమీషన్ ఇవ్వలేక బ్యాంకుల్లో ఎప్పుడు మార్పిడి చేస్తారోనంటూ ఎదురుచూస్తున్నారు.

26న శ్రీరామ నవమి

సాక్షి, అమరావతి: శ్రీరామ నవమి పండుగను 25వ తేదీ కాకుండా 26న నిర్వహించాలని దేవదాయ శాఖ ప్రభుత్వానికి బుధవారం ప్రతిపాదించింది. 25వ తేదీ నవమితో పాటు అష్టమి కలిసి వచ్చిందని, ఆగమ శాస్త్రాల ప్రకారం ఆ రోజు శ్రీరాముని కళ్యాణం నిర్వహించడం శుభం కాదని పలువురు పండితులు దేవదాయ శాఖ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ సూర్యోదయం తరువాత కూడా నవమి కొనసాగుతుండటంతో ఆ రోజే పండుగను నిర్వహించాలని దేవదాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పండుగను నిర్వహించే విజయనగరం జిల్లా రామతీర్థంలో 26వ తేదీనే కళ్యాణం జరుపుతామని దేవదాయ శాఖ తమ నివేదికలో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం 26వ తేదీనే సెలవుదినంగా ప్రకటిస్తూ గురువారం అధికారిక ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని దేవాదాయశాఖ వర్గాలు చెప్తున్నాయి.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం, 22-3-2018


భర్త ఆండ్రీ కోశ్చీవ్‌తో శ్రియ

మనం వర్కవుట్ కావడం లేదు.
దేనికండీ వర్కవుట్ కాంది?!
ఏడడుగులకు. మరి హీరోయిన్‌లకు ఏం కావాలట?
సెవెన్‌స్టెప్స్ వెయ్యాలంటే
సెవెన్ 'సీ'స్ అవతలికి వెళ్లాల్సిందేనట!
తెలుక్కి ఫారిన్ అయిన ముంబై, ఢిల్లీ..
చండీఘర్, గోవా, కేరళ.. ఇలా..
అన్ని ప్రదేశాల నుంచీ మనం... హీరోయిన్‌లను తెచ్చుకుంటే..
వేరే దేశాల వాళ్లను వీళ్లు భర్తలుగా తెచ్చుకుంటున్నారు!
అబ్బీలు వద్దు.. హబ్బీలు కావాలంటున్నారు.
ఇదండీ.. ఫారిన్ మొగుళ్ల కథ.

అబ్బీయా? హబ్బీయా?

పిజ్జాకీ పరాటాకీ ఫ్రెండ్‌షిప్ కుదిరింది
సూట్‌కీ పట్టుచీరకీ లెక్క కుదిరింది
వాటమ్మా వాటీస్ దిస్సమ్మా అనుకుంటున్నారా?
అవును మరి.. నువ్వా దరి నేనీ దరి..
గుండె చెదిరి.. దేశీ గాళ్స్ విదేశీ బాయ్స్‌తో లవ్‌లో పడుతున్నారు.
ఇప్పుడు పిజ్జా మనదైపోయింది.. పరాటా వాళ్లదైపోయింది
ఇక్కడి వంటకాలు వాళ్లకూ వాళ్ల వంటకాలు మనకూ..
ఇక్కడి ఆచారాలు వాళ్లకూ.. అక్కడ ఆచారాలూ మనకూ అలవాటైపోతున్నాయ్
హద్దులు చెరిగిపోతున్నాయ్..
అంతా ప్రే'మాయ'ణం చేసిన మేజిక్.
మొన్న విదేశీ అబ్బాయ్ ఆండ్రీ కోశ్చీవ్‌ని శ్రియ పెళ్లాడిన విషయం తెలిసిందే. ఇంకా విదేశీయులతో లవ్‌లో మన తారలు, ఆల్రెడీ పెళ్లాడిన జంటల గురించి సరదాగా చెప్పుకుందాం.


ఆండ్రూ నీబోన్‌తో ఇలియానా


మథియాస్ బోతో తాప్సీ


సిరిల్ ఆక్సెన్‌ఫ్యాన్స్‌తో మల్లికా శెరావత్


మైఖేల్ కోర్సలేతో శ్రుతీహాసన్

మన ఇల్లూ (ఇలియానా) బేబీ పుట్టింది గోవా. పెరిగింది ముంబైలో. స్టార్ అయింది తెలుగులో. ఇక్కణ్ణుంచి హిందీకి వెళ్లి అక్కడా హీరోయిన్‌గా రన్ మొదలుపెట్టింది. నార్త్ టు సౌత్ ఈ బ్యూటీ జర్నీ జోరుగానే ఉంది. అంతేనా? ఈ జర్నీ ఇప్పుడు ఫారిన్ వరకూ వెళ్లింది. ఇది ఏడడుగుల జర్నీ. ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్‌తో ఇలియానా లవ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. 'ఆండ్రూ నాకు వెరీ స్పెషల్' అని పలు సందర్భాల్లో పేర్కొన్న ఇలియానా ఆ మధ్య 'హబ్బీ..' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. అంటే.. భర్త అన్నమాట. మూడు ముళ్లు పడిన సంగతి మాత్రం బయటపెట్టడంలేదు. ఏమైనా.. ఈ ఇద్దరూ ప్రస్తుతం రిలేషన్‌లో ఉన్నారు.

ఇలియానా తర్వాత ఆ రేంజ్‌లో లవ్ న్యూస్‌లో ఉన్న మరో బ్యూటీ తాప్సీ. అదేంటో కానీ.. ఈ ముద్దుగుమ్మ లైఫ్ రెండు మూడేళ్లుగా స్పోర్ట్స్ చుట్టూ తిరుగుతోంది. 'వన్ లవ్' అంటోంది. అవును మరి.. తాప్సీ లవ్‌లో పడింది డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో కదా. పైగా తాప్సీ 'సూర్మ' అనే సినిమాలో హాకీ ప్లేయర్‌గా నటిస్తున్నారు. స్పోర్ట్స్‌తో అలా లంకె కుదిరింది. 'మథియాస్ బో నాకు చాలా కావల్సినవాడు' అని కొన్ని సందర్భాల్లో పేర్కొన్నారు తాప్సీ. ఈ ఇద్దరి మధ్య స్ట్రాంగ్ రిలేషన్‌షిప్ ఉందని టాక్. ఇలా విదేశీ స్పోర్ట్స్‌మేన్‌తో లవ్‌లో పడితే పాపం.. మనవాళ్లు ఏం కాను? అనుకోవడానికి కాలేదు. దేశీ భామ అనుష్క శర్మ ప్రేమించింది దేశీ స్పోర్ట్స్‌మేన్ విరాట్ కోహ్లీనే కదా.

తాప్సీ, ఇలియానా,.. ఈ ఇద్దరి తర్వాత ఈ మధ్య ఫ్రెష్‌గా విదేశీ లవ్ క్లబ్‌లో చేరిన భామ శ్రుతీహాసన్. పాప పట్టుచీర బ్యాచ్. లవ్‌లో పడింది సూట్ బ్యాచ్‌తో. లండన్‌కి చెందిన థియేటర్ ఆర్టిస్ట్ మైఖేల్ కోర్సలేతో లవ్‌లో ఉన్నారు శ్రుతీహాసన్. 'అవును లవ్‌లో ఉన్నా' అని ఆమె చెప్పకపోయినా ఆ మధ్య ఓ పెళ్లికి మైఖేల్‌తో కలిసి శ్రుతివెళ్లడం, సూట్ వేసుకోవాల్సిన మైఖేల్ అచ్చ తమిళ పంచె కట్టుతో హాజరు కావడం, పింక్ కలర్ పట్టుచీరలో శ్రుతీహాన్ అతని పక్కనే మెరవడం.. నో డౌట్ సూట్‌కీ పట్టుచీరకీ జోడీ కుదిరిందని పించాయి. తండ్రి కమల్‌హాసన్‌కీ, తల్లి సారికకూ మైఖేల్‌ని పరిచయం చేశారు కూడా. మైఖేల్, శ్రుతి, సారిక కొన్ని ఫొటోల్లో కనిపించగా, పెళ్లి వేడుకలో కమల్, శ్రుతి, మైఖేల్ ఒకే వరసలో పక్కపక్కన కూర్చుని ఉండటం గమనార్హం. అలాగే శ్రుతీ రీసెంట్ బర్త్‌డేని బాయ్ ఫ్రెండ్‌తో కలిసి జరుపుకోవటం కోసం లండన్ వరకూ వెళ్లింది.

ఆయన 'నా భర్త కాదు'... సిరిల్ ఆక్సెన్‌ఫ్యాన్స్ గురించి హాట్ గాళ్ మల్లికా శెరావత్ కొన్నాళ్ల క్రితం ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇది. ఫ్రెంచ్ టైకూన్ సిరిల్‌తో తన ప్రేమను, పెళ్లిని మల్లిక ఓపెన్‌గా ఒప్పుకోవడానికి ఇష్టపడటంలేదు. అయితే ఈ ఇద్దరి తీరు మాత్రం 'సమ్‌థింగ్' ఉందనే ఫీలింగ్ చాలామందికి కలిగించింది. ఏమీ లేకపోతే మల్లికాతో కలసి సిరిల్ ముంబై ఎందుకొస్తాడు? ప్యారిస్‌లో ఈ ఇద్దరూ ఒకే అపార్ట్‌మెంట్‌లో ఎందుకు ఉంటారు? పైగా ఈ జంట ఉంటున్న అపార్ట్‌మెంట్ అద్దె (60 లక్షలు) సరిగ్గా కట్టకపోతే యజమాని కోర్టుకు ఈడ్చాడు కూడా. అప్పుడు మాత్రం అసలు ఆ అపార్ట్‌మెంట్ గురించి నాకేం తెలియదని మల్లికా అంది కానీ సిరిల్ 'మంచి ఫ్రెండ్' అంది. మరి.. ఆల్రెడీ ఈ జంట పెళ్లి చేసుకుందా? అనే క్వొశ్చన్‌కి ప్రస్తుతానికి నో ఆన్సర్. మరి.. శ్రియ పెళ్లాడినట్లు.. ఇలియానా, తాప్సీ, శ్రుతీహాసన్ కూడా తమ బాయ్‌ఫ్రెండ్‌తో మూడు ముళ్లు వేయించుకుంటారా? వెయిట్ అండ్ సీ.

– సినిమా డెస్క్


భర్త జీన్ గుడ్ ఎనఫ్‌తో ప్రీతి జింతా

జీన్‌తో జింతా

ప్రేమంటే ఇదేరా అంటూ ప్రేమించిన వ్యక్తినే పెళ్లాడారు ప్రీతీ జింతా. ఈ నార్త్ బ్యూటీ తెలుగులో చేసిన ఫస్ట్ మూవీ 'ప్రేమంటే ఇదేరా' గుర్తుండే ఉంటుంది. 'నైజామ్ బాబులు.. నాటు బాంబులు..' అంటూ జోరుగా ఆడిపాడారు జింతా. ఈ సొట్టబుగ్గల సుందరి శ్రీమతి అయి రెండేళ్లయింది. అమెరికన్ బిజినెస్‌మేన్ జీన్ గుడ్ ఎనఫ్‌ను 2016లో ఆమె పెళ్లాడారు. అమెరికాలో బంధువుల ద్వారా జీన్‌తో జింతాకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారి, ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.


భర్త పీటర్ హ్యాగ్‌తో సెలీనా జైట్లీ

సెలీనా జైట్లీ

ఆ ఇద్దరు... వాళ్లకు నలుగురు. అవును.. సెలీనా జైట్లీ–పీటర్ హ్యాగ్‌లకు నలుగురు బిడ్డలు. రెండుసార్లు కవలలకు జన్మనిచ్చారామె. మన దేశీ తార సెలీనాకి ఏడేళ్ల క్రితం పీటర్‌తో దుబాయ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం చివరికి వారి మధ్య బంధంగా మారింది. హోటల్ బిజినెస్ చేస్తుంటారు పీటర్. ఇండియా వచ్చి, సెలీనా పేరెంట్స్‌ని కలిసి, పెళ్లికి ఒప్పించారు. ఎంగేజ్‌మెంట్ జరిగే సమయానికి సెలీనా ప్రెగ్నెంట్. 2011లో పెళ్లయింది. 2012 మార్చిలో సెలీనా ఇద్దరు మగపిల్లలకు జన్మనిచ్చారు. 2017లో మరో ఇద్దరు మగబిడ్డలకు జన్మనిచ్చారామె. భర్తతో కలసి సింగపూర్‌లో ఉంటున్నారామె.

చెట్టు నీడ

దులుపుకుంటే పోతుంది

ఒక ఊళ్లో ఒకాయనకు గాడిదే సర్వస్వం. దాని మీద మోసుకొచ్చే సరుకులతోనే అతడి జీవితం గడిచిపోయేది. అట్లానే ఒక పనిమీద ఆయన గాడిదను తోలుకొని పొరుగూరు వెళ్లాడు. దానికోసం ఒక చిట్టడవిని దాటాలి. అలా వెళ్తుండగా, ఒక చోట ప్రమాదవశాత్తూ ఒక పెద్ద గుంతలో పడిపోయిందా గాడిద. దాన్ని బయటికి తీయడానికి రకరకాలుగా ప్రయత్నించాడు యజమాని. చెట్టు కొమ్మలను విరిచేశాడు, దాని ఆసరాగా ఎక్కొస్తుందని. తాడు పేని లాగడానికి యత్నించాడు. ఎన్ని విధాలుగా కూడా గాడిద బయటికి వచ్చే మార్గం కనబడలేదు. ఇక దాన్ని తీయలేక, అలాగని వదిలేయలేక– అలాగే ప్రాణాలతో పూడ్చిపెట్టడానికి సిద్ధమయ్యాడు. మట్టిని గుంతలో నింపడం మొదలుపెట్టాడు.

> ఎన్ని విధాలుగా కూడా గాడిద బయటికి వచ్చే మార్గం కనబడలేదు. ఇక దాన్ని తీయలేక, అలాగని వదిలేయలేక- అలాగే ప్రాణాలతో పూడ్చిపెట్టడానికి సిద్ధమయ్యాడు.

మీద పడిన మట్టిని దులుపుకుంటూ గాడిద కొంచెం పైకి వచ్చింది. ఆయన మరింత మట్టిని పోస్తూనేవున్నాడు. గాడిద దాన్ని దులిపేసుకుంటూ మరికొంత పైకి వస్తూనేవుంది. ఎంత మట్టి పోస్తుంటే అంత పైకి రాసాగింది. సాయంత్రంకల్లా పూర్తిగా బయటకు వచ్చేసి ఆబగా గడ్డిని మేయసాగింది. దాన్నే చూసుకుంటూ కూర్చున్న యజమాని మనసులో అనుకున్నాడు: 'నేను ఎంత పొరపాటుగా ఆలోచించాను! కష్టమొచ్చిందని దాన్ని నేను పాతేయబోయాను. కానీ అదే కష్టాన్ని దులిపేసుకుంటూ అది పైకి వచ్చేసింది. ఈ పాఠాన్ని నేను ఎప్పటికీ మరిచిపోను'. నెమ్మదిగా వెళ్లి, గాడిదను ప్రేమగా నిమరసాగాడు.

ప్రాణం

నీళ్లు.. మహిళలు

నీరు ప్రాణం జలం అయితే, మహిళలు ప్రాణదాతలు. కుటుంబం కోసం నాలుగు రాళ్లు సంపాదించుకురావడం కన్నా కూడా, కుటుంబం కోసం బిందెడు నీళ్లు మోసుకురావడం పెద్ద బాధ్యత అయింది నేటి ప్రపంచంలో! నీళ్లు ఎక్కడబడితే అక్కడ దొరకడం లేదు. మంచినీళ్లు అసలే దొరకడం లేదు. మైళ్లకు మైళ్లు వెళ్లాలి. నీళ్ల కోసం ఈరోజు ఒక చోటుకు వెళితే, మళ్లీ అక్కడికే వెళ్లి తెచ్చుకునే పరిస్థితి లేదు. రాత్రికి రాత్రి నీళ్లు ఇంకిపోతున్నాయి! కొత్త చెలమను, కొత్త బావిని వెతుక్కుంటూ పోవాలి. కారణాలు ఏమైనా గుక్కెడు నీళ్లు దొరకడం గగనమైపోయింది. ఇవాళ్ల 'వరల్డ్ వాటర్ డే'. ఈ సందర్భంగా.. నీళ్ల గురించి, మహిళల గురించి కొన్ని వాస్తవాలు, విశేషాలు.

- ప్రపంచంలో ఎక్కువ భాగం కుటుంబానికి నీళ్లు అందిస్తున్నది మహిళలు, బాలికలే! నీళ్ల కోసం మహిళలు, బాలికలు రోజుకు ప్రయాణిస్తున్న దూరం సగటున 3.7 ఏడు మైళ్లు.
- ప్రపంచవ్యాప్తంగా మహిళలు నీళ్ల కోసం వినియోగిస్తున్నవి రోజుకు 20 కోట్ల పని గంటలు.

బాలికలు నీళ్లు పట్టే సమయాన్ని 15 నిమిషాలు తగ్గిస్తే, వాళ్లు స్కూలుకు హాజరయ్యే శాతం 8 నుంచి 12 వరకు పెరుగుతుందని ఒక సర్వేలో వెల్లడయింది.



- నీళ్ల బిందెలను తలపై మోయడం వల్ల మహిళలు మెడనొప్పి, నడుమునొప్పి, ఇతర శారీరక బాధలకు గురవుతున్నారు. ఆ బరువు ప్రభావం తుంటి ఎముకలపై పడి, ప్రసవ సమస్యలు తలెత్తుతున్నాయి.
- ప్రపంచంలోని అంధులలో 70 శాతం మంది మహిళలే. వీళ్లలో ఎక్కువమంది.. నీటికి అందుబాటులో లేని నివాస ప్రాంతాలలో ఇన్ఫెక్షన్‌ను కలిగించే బ్యాక్టీరియా వల్ల కంటిచూపు పోగొట్టుకున్నవాళ్లే.
- ఇంట్లో మరుగుదొడ్లు, ఇంటికి సమీపంలో మరుగు లేనందువల్ల నీటి సదుపాయం ఉన్నచోటికి వెళ్లేందుకు ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికలు రోజుకు 26 కోట్ల 60 లక్షల గంటలను వెచ్చించవలసి వస్తోంది.
- భారతదేశంలో పురుష కౌన్సిలర్లు ఉన్న ప్రాంతాలతో పోలిస్తే, మహిళలు కౌన్సిలర్లుగా ఉన్న ప్రాంతాలలో తాగునీటి సౌకర్యం 60 శాతానికి పైగా ఉంది.

బిగ్ లైఫ్

నమస్తే.. మేడమ్!


తరతరాలకు మేలు జరిగేలా గిరిజనుల సంక్షేమం కోసం శోభనా రనాడే సేవలందించారు

ఎందరో మహిళలకు ఆమె జీవితం ఒక చక్కని పుస్తకం. ప్రతి పేజీలోనూ ఆమె సంతకం ఉంటుంది. ఆ సంతకం వెనుక గాంధీజీ ఆశయాల స్ఫూర్తి ఉంటుంది. అణగారిన వర్గాల మహిళల ఉన్నతి కోసం పాటుపడిన జీవితం ఉంటుంది. ఆమే.. శోభనా రనాడే. అత్యున్నత పద్మభూషణ్ అందుకున్నారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్‌ను దక్కించుకున్నారు. ఇప్పుడు 'జమ్నాలాల్ బజాజ్ ఫౌండేషన్' కు నామినేట్ అయ్యారు. ఈ 93 ఏళ్ల వయసులోనూ సమాజసేవలో తరించాలని తపించిపోతున్నారు. ప్రధానంగా గిరిజన బాలికలు, మహిళల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు.

గాంధీజీని కలిశారు

శోభనా రనాడే సుమారు 50 ఏళ్లుగా సామాజిక సేవలో ఉన్నారు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని చూసి ఆవిడ మనసు ఆర్ద్రతతో నిండిపోయేది. ఎంతో మంది మహిళలు, బాలలు నిరక్షరాస్యులుగా ఉండటం ఆమెను కలిచివేసేది. వీధిబాలలు తిండి కోసం కుక్కలతో పోట్లాడటం, మహిళలు అత్యాచారాలకు గురికావడం చూసి ఆమె హృదయం ద్రవించిపోయేది. వాళ్లకేదైనా చేయాలని సంకల్పించుకుంది. పుణె అగాఖాన్ గాంధీ మెమోరియల్ సొసైటీలో, నేషనల్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమన్‌లో పని చేసిన అనుభవం ఆమె సంకల్పానికి బలం చేకూర్చింది. మొదట 1942లో తన 18వ ఏట, శోభన పుణెలోని అగాఖాన్ ప్యాలెస్‌లో మహాత్మాగాంధీని స్వయంగా కలిశారు.

వినోభాతో నడిచారు

1955లో శోభన లక్ష్యసాధనకు ఒక మార్గం దొరికింది. అస్సాంలోని ఉత్తర లఖింపూర్‌కి వినోబాభావేతో కలసి పాదయాత్ర చేయడానికి వెళ్లారు. అప్పుడు ఆమె వయసు 31. ఆ పరిసరాలలో నివసిస్తున్న అనాథ బాలలను చూసి, వారి కోసం అక్కడ ఏదైనా ఒకటి ప్రారంభించాలనుకున్నారు. ముప్పై మంది పిల్లలతో శిశునికేతన్ ప్రారంభించారు. వారికి చదువు నేర్పడంతో పాటు, సకల సౌకర్యాలు కల్పించారు. ఆమెలోని సేవా భావం చూసిన కొందరు సంపన్నులు, శిశు నికేతన్ నిర్వహణ కోసం చందాలు ఇచ్చి, ఒక ట్రస్ట్ ఏర్పాటుచేశారు. నేటికీ ఆ సంస్థ ఎంతో చక్కగా నడుస్తోంది. అక్కడ ఉండగానే, డిగ్‌బోయ్ జిల్లాలో మొట్టమొదటి బాలల సంక్షేమ పాఠశాల ప్రారంభించారు శోభన.


● మానవతా సేవలకు 'రియల్ హీరోస్' లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న శోభనా రనాడే (2012)

గిరులలో తిరిగారు

అస్సాంలో కొన్నేళ్లు ఉండి నాగాలాండ్ వెళ్లారు శోభన. అక్కడ కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించారు. 'ఆదిమజాతి సేవా సంఘ్' నెలకొల్పి నాగా గిరిజన మహిళలకు అల్లికలలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కోహిమాలో ఖాదీ భాండార్ ప్రారంభించి, గిరిజన మహిళలు రూపొందించిన వస్తువులను విక్రయించారు. అక్కడ ఉంటూనే, అరుణాచల్ ప్రదేశ్‌లో మహిళా సాధికారత కోసం పాటుపడ్డారు.

ఈశాన్య రాష్ట్రాలలోని వెనుకబాటుతనాన్ని కళ్లారా చూసిన శోభన వారి అభ్యున్నతికి తన వంతుగా కృషి చేశారు. తర్వాత పుణె తిరిగి వచ్చారు.

– రోహిణి

(జమ్నాలాల్ బజాజ్ ఫౌండేషన్ అందించిన వివరాల ఆధారంగా)

నేర్పించారు.. నిలబెట్టారు

శోభన పుణెలోని పురందర్ తాలూకా సస్వాద్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ నేషనల్ ట్రస్ట్‌కి ట్రస్టీగా కూడా వ్యవహరించారు. ఈ ట్రస్ట్ పదకొండు ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అందులో ఆరు ఎకరాలు వ్యవసాయానికి కేటాయించారు శోభన. మిగిలిన ఐదు ఎకరాలలో ఆశ్రమానికి సంబంధించిన రకరకాల కార్యక్రమాలు నిర్వహించేవారు. అందులోనే, బాలగృహలో 40 మంది మహిళలకు ఆవాసం ఏర్పాటు చేసి, భోజన వసతి కల్పించి, ఉపాధి విద్యలు నేర్పించారు. ఆశ్రమంలోనే ఓ మూల కూరలు పండించేలా ఏర్పాట్లు చేశారు. వీటితోపాటు, వృత్తి విద్యలలోనూ, గ్రామీణ పరిశ్రమలలోను అక్కడి మహిళలకు శిక్షణ ఇప్పించారు. టైలరింగ్, పిండి రుబ్బటం, పిండి వంటలు తయారుచేయటం, నగలు తయారుచేయటం నేర్పించారు. వీటి ద్వారా ఈ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారు. వారి కాళ్ల మీద వారు నిలబడ్డారు.

> ప్రస్తుతం శోభనా రనాడే పుణె శివాజీనగర్‌లో ఉన్న హెర్మన్ జమైన్ సోషల్ సెంటర్ తరఫున వీధి బాలలకు చదువు, పోషకాహారం, ఆరోగ్యం, కౌన్సెలింగ్, పునరావాసం కల్పిస్తున్నారు.

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ అన్నయ్యా..! నేను ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. తను కూడా నన్ను ప్రేమిస్తోంది. ఫస్ట్ తను ఒక అబ్బాయిని ప్రేమించిందట. వాళ్లు బ్రేకప్ అయ్యారు. ఆమె వేరే అతణ్ని లవ్ చేసిన విషయం నాకు తెలిసి కూడా ప్రేమించాను. మేము ప్రేమించుకుంటున్న విషయం మా ఇంట్లో తెలిసింది. తనది మా అమ్మమ్మ వాళ్ల ఊరు. మా ఫ్యామిలీ మొత్తం తను మంచిది కాదని, తనను వదిలేయమని చెబుతున్నారు. మా అమ్మమ్మ వాళ్ల పక్కింటి ఆవిడ కూడా చెబుతోంది తన క్యారెక్టర్ బ్యాడ్ అని. కానీ నేను నమ్మలేదు. మళ్లీ ఫోన్ చేయడం మొదలుపెట్టాను. ఆ విషయం మా ఇంట్లో తెలిసి, ఆమెతో మాట్లాడితే చనిపోతామంటున్నారు. తనేమో నా కోసం ఎన్ని రోజులైనా వెయిట్ చేస్తానంటోంది. తనను వదులుకోవడానికి చాలా ట్రై చేస్తున్నాను. ఫోన్ నంబర్ కూడా మార్చేశాను. తనను మర్చిపోలేక, మా వాళ్లకు ఇచ్చిన మాట తప్పలేక సతమతమవుతున్నాను. తన క్యారెక్టర్ మంచిదా కాదా అని ఎలా తెలుసుకోవాలో తెలియడం లేదు. అన్నయ్యా..! మంచి సలహా ఇవ్వండి.

- సాకేత్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

సాకేత్ నువ్వు పక్కా.....

'సార్ మెచ్చుకోబోతున్నారా? తిట్టబోతున్నారా సార్..!?.. అంత ఆవేశంగా అన్నారంటే ఏదో ప్రాబ్లమ్ అని నాకు అనిపించింది సార్. మీరు రీసెంట్‌గా అందర్నీ తిడుతున్నారు సార్. ఏదో సరదాగా ఆన్సర్లు ఇస్తూ మన అరటిపండు మనం సేవిస్తూ ఎంజాయ్ చేయాల్సింది పోయి మీరు కసా..బిసా.. కర్రుమ్.. గిర్రుమ్ అంటూ పళ్లు కొరుక్కుంటూ ఆన్సర్లిస్తే మొదటికే మోసం వస్తుంది సార్. కొంచెం కూల్.. కూల్ సార్..!'

సాకేత్ నువ్వు పక్కా.....

'ఏంటి సార్ ఎంత మొత్తుకున్నా...'

సాకేత్, యు ఆర్ మ్యాడ్. అమ్మాయి క్యారెక్టర్ గురించి మాట్లాడతావా? ఏం.. నువ్వు ఎవరినైనా ప్రేమించి, వర్కౌట్ కాక మళ్లీ ప్రేమలో పడితే నీ క్యారెక్టర్ బ్యాడా??? పక్కింటోళ్లు, ఎదురింటోళ్లు.. నీ బంధువులు అమ్మాయిని బ్యాడ్ చేస్తుంటే నువ్వెలా ఒప్పుకున్నావ్. అయినా నీకు ముందే తెలుసు అమ్మాయి ఓసారి లవ్లో దెబ్బతిన్నదని. నువ్వు ఒళ్లు మరచి అమ్మాయిని ప్రేమించి, ఇప్పుడు బ్యాడ్‌గా మాట్లాడతావా? ఖబర్దార్ అమ్మాయిని అలా అంటే...! నీకిష్టం లేకపోతే మానెయ్యి, వదిలెయ్యి.. సన్యాసం పుచ్చుకో. అయినా బాయిస్‌కి అలవాటే కదా, ఒక చోట వర్కౌట్ కాకపోతే ఇంకోచోట గాలం వెయ్యడం. వేసుకో..! ఎన్నిసార్లు ఫిషింగ్ చేసుకుంటావో చేసుకో..! అంతే కానీ, అమ్మాయి క్యారెక్టర్ గురించి నెవర్ సే ఎనీథింగ్..!!

'సార్... అరటి పండు తినండి. సాకేత్‌కి అర్థమైంది. హి ఈజ్ గుడ్ బాయ్. కూల్ సార్.. కూల్..!!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి:
ఆ... ఆ... ఆ... ఆ...ఆ... ఆ...
శ్రీరామనామాలు శతకోటి
ఒక్కొక్క పేరు బహు తీపి బహు తీపి
శ్రీరామనామాలు శతకోటి

చరణం-1
తండ్రి ఆనతి తలదాల్చు తనయుడు
దశరథ రామయ్య స్తవనీయుడు ॥ తండ్రి॥
కడు మేటి విలువిరిచ కలికిని చేపట్టు
కల్యాణ రామయ్య కమనీయుడు కమనీయుడు
॥శ్రీరామనామాలు॥
సుదతి జానకి తోడ శుభ సరసమాడేటి
సుందర రామయ్య సుకుమారుడు ॥ సుదతి॥
కోతి మూకలతో... ఆ..... కోతిమూకలతో లంకపై దండెత్తు
కోదండ రామయ్య రణధీరుడు రణధీరుడు
॥ శ్రీరామనామాలు॥
పవమాన సుతుడు పాదాలు పట్టగా
పట్టాభి రామయ్య పరంధాముడు
॥ పవమాన సుతుడు॥
అవనిలో సేవించు ఆశ్రితుల పాలించు
అచ్యుతరామయ్య అఖిలాత్ముడు అఖిలాత్ముడు
॥ శ్రీరామనామాలు॥

రచన: ఆరుద్ర ; సంగీతం: రమేశ్‌నాయుడు
గానం: పి. సుశీల ; చిత్రం: మీనా

కట్‌చేయ్...దాచేయ్...

సుడోకు

			8			7		4
4			3			9		5
	3	7			2		6	
	7	9				4	5	3
			6		5			
3	2	5				1	8	
	6		1			5	4	
8		1			7			2
7		3			4			

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	2	6	8	4	5	9	7	1
4	5	8	9	7	1	2	6	3
9	1	7	2	3	6	4	8	5
2	6	1	5	9	7	8	3	4
8	7	9	4	6	3	5	1	2
5	3	4	1	2	8	7	9	6
6	9	2	3	8	4	1	5	7
1	4	3	7	5	9	6	2	8
7	8	5	6	1	2	3	4	9

వృత్తికి గులాం



● గులాం అలీఖాన్

గులాం అలీ ఖాన్ సూదీదారం పట్టుకుని యాభై ఏళ్లవుతోంది. ఇరవై మూడేళ్ల వయసులో మెడలో వేసుకున్న టేప్ ఇప్పటికీ ఉంది. చేతిలో కత్తెర మెత్తగా పని చేసుకుపోతూనే ఉంది. మెషీన్ చక్రం గిర్రున తిరుగుతూనే ఉంది. అది బతుకు చక్రం. జీవితాన్ని మలిచిన చక్రం. వృత్తిలో చక్రం తిప్పాడు గులాం. దుకాణం అంటే అన్నం పెట్టిన అమ్మ అంటాడు. దుకాణం తెరవని రోజు అమ్మను చూడని రోజేనంటాడు. అమ్మకు సలాం... వృత్తికి గులాం అంటున్నాడు హైదరాబాద్, హెచ్‌ఎఫ్ నగర్‌కు చెందిన ఈ సీనియర్ టైలర్.

గులాం అలీ తండ్రి కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. ఇంకా రాలేదేంటి అని అమ్మను అడుగుతున్నాడు. మాటల్లోనే వచ్చాడు నాన్న. అమ్మ చాయ్ ఇచ్చే వరకు ఉగ్గబట్టుకున్నాడు. ఆయన చాయ్ కప్పు కింద పెట్టగానే...

''నాన్నా నేను టైలరింగ్ నేర్చుకుంటా'' ఉపోద్ఘాతం ఏమీ లేదు. విషయం చెప్పేశాడు గులాం అలీ.

''మనోళ్లలో ఎవరికీ రాదు బేటా, ఎక్కడ నేర్చుకుంటావ్''

''దర్జీ దుకాన్‌కెళ్లి నేర్చుకుంటా అప్పా''

''..........''

''సరేనంటే రేపే వెళ్తా''

కొడుకు ఆరాటం అర్థమవుతోంది. 'అలాగే' అన్నాడు ముక్తసరిగా.

* * *

గులాం అలీకి మెషీన్ మీద కూర్చున్నట్లే ఉంది. చక్రం గిర్రున తిరగడం, మెషీన్ టకటకలాడడం వింటుంటే తానే మెషీన్ కుడుతున్నట్లు ఉంది. షర్ట్ కుడుతున్న సీనియర్ వైపు తదేకంగా చూస్తున్నాడు. హెమ్మింగ్ చేసే నీడిల్ ఎడమ చేతి చూపుడు వేలిలో గుచ్చుకున్నది. 'అబ్బా...' అంటూ ఈ లోకంలోకి వచ్చాడు.

''ఏంట్రా! ఏ లోకంలో ఉన్నావ్'' గద్దించాడు మాస్టర్.

మాస్టర్ చేతిలోని కత్తెర వంపు తిరుగుతూ క్లాత్‌ను కట్ చేస్తుంటే ఆకాశంలో వంగిన ఇంద్రధనుస్సును చూసినంత సంబరంగా ఉంది గులాంకి. తానెప్పుడు అలా కట్ చేసేది. మెడలో టేప్ వేసుకుని కత్తెరతో సర్రున మెత్తగా కట్ చేసి, చెవిలో ఉన్న పెన్సిల్ తీసి మార్క్ చేసి వాటిని చుట్ట చుట్టి మెషీన్ మీదున్న టైలర్ వైపు విసిరేస్తున్నాడు మాస్టర్. యాక్షన్ సీన్ చూస్తున్నట్లే ఉంది గులాంకి.

* * *

''నాన్నా! పదిహేను రూపాయలు. నెల జీతం. రోజుకు యాభై పైసలు. నే పనికి ఒక్క రోజు కూడా డుమ్మా కొట్టలే. అందుకే మొత్తం జీతం వచ్చింది. అమ్మకిస్తున్నా'' అంటూ తల్లి చేతిలో పెట్టాడు.

గులాం తెచ్చిన డబ్బుకంటే... అతడి కళ్లలోని ఆనందాన్ని చూసి మురిసి పోయారు అతడి తల్లిదండ్రులు.

* * *

''నాన్నా! నేను సొంతంగా దర్జీ దుకాన్ పెడతా'' అన్నాడోరోజు.

''ఎక్కడ పెడతావు, ఆబిడ్స్‌లోనేనా''

''దర్జీలంతా ఆబిడ్స్‌లోనే ఉన్నట్లున్నారు. నేను ఎర్రగడ్డలో పెడతా, అఫ్జల్ కాకా స్టీల్ దుకాణం పక్కనే అద్దెకు గది ఉంది''


''అన్నీ చూసుకున్నావ్. నేను చెప్పేదేంటి కానివ్వు''

అలా... 1969లో మొదలైంది గులాం అలీ ఖాన్ సొంత దర్జీ దుకాణం. నెలకు పాతికరూపాయల అద్దె. ఒక బ్లవుజ్ కుడితే నాలుగు నుంచి ఐదు రూపాయలు నడుస్తున్న రోజులవి. ఐదు లేదా ఆరు బ్లవుజ్‌లు కుడితే రెంట్ వచ్చేస్తుంది. మిగిలిన డబ్బుతో జామ్‌జామ్‌గా బతికేయవచ్చు. ఇక ప్యాంట్ షర్టులకు లెక్కేలేదు. గవర్నమెంట్ ఉద్యోగుల కంటే పెద్ద రాబడి. ఒకరి దగ్గర పని చేయాల్సిన అవసరం లేదు. సొంతంగా ఎవరికీ తల వంచని దర్జీలా దర్జాగా జీవించవచ్చు. గులాం ముందున్న చిత్రం ఇది. కుర్రాడు మంచి పని వాడేననే పేరుతో పాటు పిల్లనిచ్చే వాళ్ల క్యూ రెడీ అయింది.

షహనాజ్‌బేగంను పెళ్లి చేసుకున్నాడు. ఆరుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. తొమ్మిది మందినీ చదివించాడు. ఏడుగురికి పెళ్లిళ్లు చేశాడు గులాం అలీ ఖాన్. ఇక ఇద్దరికి పెళ్లి చేయాలి. ఇప్పుడతడి వయసు 71. 23 ఏళ్ల వయసులో సొంత దుకాణం తెరిచారు. అప్పటి నుంచి ఇప్పటికీ మడత నలగకుండా చక్కగా ఐరన్ చేసిన ఖరీదైన షర్టు, ప్యాంట్‌తో గెజిటెడ్ ఆఫీసర్‌లాగా ఉంటాడు. డ్రస్ అలాగే మెయింటెయిన్ చేస్తాడని చెప్తారు బాగా తెలిసిన వాళ్లు.

పిల్లలు టేప్ పట్టుకోలేదు!

గులాం ఆరుగురు కొడుకులనూ చదివించాడు. ఒక కొడుకు ఓలా క్యాబ్ నడుపుతున్నాడు. మున్సిపాలిటీ ఆఫీస్‌లో ప్రైవేట్ వర్క్, డీఎల్‌ఎఫ్‌లో ఉద్యోగం, టైలరింగ్ మెటీరియల్ షాప్, మొబైల్ షాప్, చిన్న కొడుకు డీజె. కొడుకులలో ఒక్కరినైనా దర్జీని చేయాలనుకున్నాడు గులాం. ''ఈ దుకాణం మీదనే అందరినీ చదివించాను, పెళ్లిళ్లు చేశాను. అప్పట్లో చేతి నిండా పని. ఇప్పుడు నెలలో పదిహేను రోజులు పని ఉంటే చాలా బాగున్నట్లు. మిగిలిన రోజులు షాపు తెరిచి కూర్చోవాల్సిందే. అద్దెలు కట్టుకుంటూ, కరెంట్ బిల్లు కట్టుకుంటూ గిరాకీల కోసం ఎదురు చూస్తున్నాను. 'మేమంతా పని చేస్తున్నాం, ఇంక దుకాణం బంద్ చేయ'మంటారు పిల్లలు. దుకాణం బంద్ చేయాలంటే అమ్మను చూడకుండా ఆమె ముఖాన తలుపేసినట్లే, అట్లా మనసు రాదు. ప్రాణం సుస్తీ చేసినా సరే, సాయంత్రం ఓ గంటయినా వచ్చి కూర్చుంటాను.



నా దగ్గరకు క్లాత్ తెచ్చి కుట్టించుకునే వాళ్లకు నేనెలా కుడతానో చెప్పేది నా డ్రస్సే. నేను రెడీమేడ్ డ్రస్ వేసుకుని టేప్ మెడలో వేసుకుని కొలతలు తీసుకుంటుంటే, కొలతలిచ్చే వాళ్లకు నా పని మీద నమ్మకం కలగదు. ఇతర కంపెనీలను ప్రమోట్ చేయడం కాదు, నాకు నేనే ప్రమోషన్ ఇచ్చుకోవాలి. నేను శుభ్రంగా, నీట్‌గా కనిపిస్తే నా దగ్గర కుట్టించుకోవడానికి వస్తారు. ఇది వృత్తి సూత్రం

అప్పుడు పాతిక... ఇప్పుడు తొమ్మిది వేలు!

అప్పట్లో ఐదారు బ్లవుజ్‌ల డబ్బు అద్దెకెళ్లేది. ఇప్పుడు బ్లవుజ్‌కు 175 రూపాయలు తీసుకుంటున్నాను. షాపు అద్దె తొమ్మిది వేలు, కరెంటు బిల్లు ఆరొందలు. ఎన్ని బ్లవుజ్‌లు కుడితే షాపు రెంటు గడవాలి. నేను లేడీస్, జెంట్స్ ఇద్దరికీ కుడతాను కాబట్టి ఈ మాత్రమైనా బండిని నడిపిస్తున్నాను. మగవాళ్ల దుస్తులు మాత్రమే కుట్టే వాళ్ల దుకాణాలు బంద్ చేసేశారు. మగవాళ్లంతా రెడీమేడ్ ప్యాంట్, షర్ట్ కొనుక్కుంటారు. వాళ్లకు దర్జీతో పనే ఉండటం లేదు. లేడీస్‌కి అలా కాదు. కరెక్ట్ ఫిట్టింగ్ రెడీమేడ్‌లో దొరకక టైలర్‌తో కుట్టించుకునే వాళ్లుంటారు. రెడీమేడ్ కొని ఆల్టరేషన్‌కి వచ్చేవాళ్లుంటారు. ఇప్పుడు టైలర్లను బతికిస్తున్నది ఆడవాళ్లే.

రెడీమేడ్ దుస్తులు కుట్టడం ఈజీ!


మూడు వందలకు రెడీమేడ్ కుర్తా వస్తుంది. మేము కుట్టడానికే 225 తీసుకుంటాం. మరి మా దగ్గరకు ఎందుకు వస్తారు? అలా చార్జ్ చేయకపోతే మేము బతకలేం. రెడీమేడ్‌లో లాగ మేము కుర్తాను బారుగా కుట్టేస్తే సరిపోదు. కరెక్ట్ ఫిట్టింగ్ వచ్చేలా కుట్టాలి. దానికి టైమ్ పడుతుంది. కొత్తగా టైలరింగ్ నేర్చుకునే వాళ్లు కూడా పెద్ద పెద్ద దుస్తుల తయారీ కంపెనీలలో ఉద్యోగానికి వెళ్లిపోతున్నారు. అక్కడ ఐదు వేలిస్తారు. సైజ్‌ల వారీగా కామన్‌గా కుట్టేస్తారు. దాంతో దర్జీ దుకాన్ తెరమరుగు అవ్వాల్సిన పరిస్థితి వచ్చేసింది'' అన్నారు గులాం అలీ ఖాన్ ఆవేదనగా.

దర్జీలు తెరమరుగవడానికి రెడీమేడ్ దుస్తులు మార్కెట్‌ని వెల్లువలా ముంచేయడం ఒక కారణమైతే, ఫ్యాషన్ డిజైనింగ్ మరో కారణం. పెద్దగా నైపుణ్యం లేని వాళ్లు తక్కువ జీతాలతో రెడీమేడ్ దుకాణాల కార్ఖానాల్లో చేరిపోతున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ రంగం వేళ్లూనుకోవడంతో స్కిల్ ఉన్న టైలర్‌లు డిజైనర్‌తో కలిసి పని చేస్తున్నారు. సొంతంగా పనిచేసుకుంటూ నేను దర్జీని అని చెప్పుకునే వాళ్లు కనిపించడం లేదు.

- వాకా మంజులారెడ్డి
ఫొటోలు: **శివ మల్లాల**

పరి పరిశోధన

సూర్యుడిలో మార్పులతోనే వణికించే చలి!



యూరప్‌ను చలి వణికించేస్తోంది. ఆస్ట్రేలియా, అమెరికాలలోనూ అసాధారణ రీతిలో మంచు కురుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదంతా వాతావరణ మార్పుల ప్రభావమని చాలామంది అంచనా వేస్తున్న సంగతి మనకు తెలిసిందే. అయితే ఎక్సెటర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాత్రం ఈ విపరీత ధోరణులకు, వాతావరణ మార్పులకూ సంబంధం లేకపోవచ్చునని.. సూర్యుడిపై జరుగుతున్న కార్యకలాపాల్లో వచ్చిన మార్పులు కారణమని అధ్యయన పూర్వకంగా తేల్చారు. భూమి మీద సకల జీవరాశులకూ వెలుతురునిచ్చే సూర్యుడిపై అప్పుడప్పుడూ పేలుళ్లు జరుగుతూంటాయని.. పదకొండేళ్లకు ఒకసారి ఈ క్రమంలో మార్పులు వస్తాయని మనకు తెలుసు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సూర్యుడిపై కార్యకలాపాలు మందగతికి చేరుకున్నాయని.. ఫలితంగా ఆర్కిటిక్ ధ్రువ ప్రాంతంలో కొంచెం వెచ్చదనం ఏర్పడగా యూరేసియా ప్రాంతంలో మంచు కురుస్తోందని ఎక్సెటర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ ఇంద్రాణి రాయ్ తెలిపారు. భూతాపోన్నతితోపాటు అనేక ఇతర అంశాలు కూడా ఇందుకు కారణమయ్యేందుకు అవకాశం ఉన్నప్పటికీ సూర్యుడి ప్రభావాన్ని మాత్రం వేరుగా స్పష్టంగా గమనించవచ్చునని ఇంద్రాణి తెలిపారు. సూర్యుడిపై పేలుళ్ల కారణంగా ఏర్పడే మచ్చలు సాధారణం కంటే తక్కువైనప్పుడు ఆర్కిటిక్ ప్రాంతంలో వెచ్చదనం దిగువ స్ట్రాటోస్ఫియర్ నుంచి ఎగువకు విస్తరిస్తుందని, మచ్చలు సగటు కంటే ఎక్కువగా ఉంటే ఆర్కిటిక్ ప్రాంతంలో శీతల పరిస్థితులు ఏర్పడతాయని ఇంద్రాణి వివరించారు. ఈ పేలుళ్ల కారణంగా సూర్యుడి నుంచి అందే అతినీలలోహిత కిరణాల సామర్థ్యంలో మార్పులు వస్తాయని, ఇది కాస్తా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుందని చాలాకాలంగా బలమైన అంచనాలు ఉన్నాయి.

ఎప్పుడు తినాలో తెలిస్తేనే.. బరువు తగ్గుతారు!



వేళాపాళా లేని ఆహారంతో ఒళ్లు పెరిగిపోవడమే కాకుండా అనేకానేక చిక్కులు వస్తాయన్న సంగతి తెలిసిందే. ఒళ్లు తగ్గించుకునేందుకు చేసే ప్రయత్నాల్లో ఏ సమయంలో ఆహారం తీసుకుంటామన్నది ముఖ్యమవుతుందని అంటున్నారు కాలిఫోర్నియాలోని సాల్క్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు. మన పూర్వీకులతో పోలిస్తే ఇప్పుడు చాలామంది అర్ధరాత్రి వరకూ మేలుకుని ఉండటం, అదే సమయంలో చిరుతిళ్లను ఎక్కువగా తీసుకోవడం చేస్తూంటారని.. ఈ అలవాట్లు రెండూ ఒళ్లు తగ్గించుకునే విషయంలో ప్రతికూల ప్రభావం చూపుతాయని వీరు హెచ్చరిస్తున్నారు. రెండు గుంపుల ఎలుకలకు వేర్వేరు సమయాల్లో ఆహారం అందించడం ద్వారా వాటిలో వచ్చిన మార్పులను తాము పరిశీలించామని, కొంత కాలం తరువాత పరిశీలించగా.. రోజుకు ఎనిమిది గంటలపాటు మాత్రమే ఆహారం అందుబాటులో ఉన్న ఎలుకలు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిసిందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. రోజంతా ఆహారం అందుబాటులో ఉన్న ఎలుకలు ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం తీసుకోవడం ద్వారా లావెక్కిపోయాయని వివరించారు. దీన్నిబట్టి రోజులో వీలైనంత తక్కువ సమయంలో ఆహారం తీసుకోవాలని తమ అధ్యయనం చెబుతోందంటున్నారు.

సెల్ఫ్ చెక్

గందరగోళానికి గురవుతుంటారా?

ఒక నిర్ణయం తీసుకోవటం, ఆ నిర్ణయాన్ని మార్చుకోవటం... తిరిగి ''అరె మొదట అనుకున్నట్లయితేనే బాగుండేదే!'' అని కన్ఫ్యూజ్ అవ్వటం. ఆలోచనలో పరిణతి, నమ్మకం లేకపోవటం. ఇలాంటి ప్రవర్తననే గందరగోళం అంటాం. దార్శనికత, కోరిక, సామర్థ్యం, అర్థం చేసుకోగలగటం, స్ఫూర్తి ఇవన్నీ కలిస్తేనే మీ ఆలోచనలో స్పష్టత ఏర్పడుతుంది. ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటే లక్ష్యాలను చేరటం కష్టమేమీ కాదు. చదువు, వృత్తి, సాధారణ జీవితం ఇలా ఏ కోణంలోనైనా గందరగోళానికి తావివ్వకూడదు.

1. మీ ఇష్టాలు, సామర్థ్యాలను ఒక పట్టికలో, మీ బలహీనతలను మరొక పట్టికలో రాసుకుంటారు. దీనివల్ల వేటిలో మీరు మెరుగ్గా ఉన్నారో, ఏ విషయాల్లో బలహీనంగా ఉన్నారోనన్న విషయాన్ని గ్రహిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. ఒకే రకంగా కాకుండా, వివిధ రకాలుగా ఆలోచించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. మీలోని క్వాలిటీస్‌ను గుర్తిస్తారు. అవకాశాలను వదులుకోరు. ఉత్సాహాన్ని ఎప్పుడూ ఒకేలా ఉంచుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. ఎప్పుడూ విశ్వాసాన్ని కోల్పోరు. నిజాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు. శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉంటారు. భగవంతునిపై విశ్వాసం ఉంటే, మీ నమ్మకానికి భక్తిని జోడిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. గుడ్డిగా దేనినీ నమ్మరు. మీరు తీసుకున్న నిర్ణయాలు సరైనవో? కాదో? అని భయపడరు. మీపై మీకు నమ్మకం ఉంటుంది.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. ఒక సమయంలో ఒకదానిమీదే దృష్టిసారిస్తారు. దాని మీదే మీ నైపుణ్యాన్ని చూపిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. మీ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు సంస్కరించుకుంటుంటారు. మాటలకే పరిమితం కాకుండా మీరు చేయాల్సిన పనిని చేస్తూనే ఉంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐



8. స్థిరత్వంతో ఉంటారు. ఏ పనికైనా సగం బలం దీని ద్వారానే లభిస్తుందని మీకు తెలుసు. నిలకడ మనస్తత్వం ద్వారానే మానసిక బలాన్ని పొందవచ్చని నమ్ముతారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. మీరు నేర్చుకోవాలనుకుంటున్న అంశాలను ఆయా నిపుణుల దగ్గర ప్రస్తావిస్తారు. మీ సందేహాలను పుస్తకాలు, ఇతర మార్గాల ద్వారా నివృత్తి చేసుకుంటారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. ఏదైనా పని చేసేటప్పుడు గందరగోళానికి గురవుతుంటే ఆ పనికి కాసేపు విరామం ఇస్తారు. ఆలోచనలు కుదుటపడ్డాక ఆ పనిని ప్రారంభిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐

'ఎ' సమాధానాలు ఏడు దాటితే మీలో గందరగోళానికి తావుండదు. ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారు. ఒకసారి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచించే సామర్థ్యం మీలో ఉంటుంది. 'బి' లు 'ఎ' ల కన్నా ఎక్కువగా వస్తే మీ ఆలోచనల్లో స్పష్టత ఉండదు. నిలకడలేని మనస్తత్వం వల్ల తరచుగా ఆందోళనకు గురవుతారు. 'ఎ' లను సూచనలుగా భావించి ఆలోచనల్లో నిలకడను ఎలా సంపాదించవచ్చో తెలుసుకోండి.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం
22-3-2018

మైండ్ యువర్ హెల్త్



కొత్త డౌటు గురూ

వాట్సప్‌లో హెల్త్ అలర్ట్ చూస్తే బెంగ. న్యూస్ పేపర్‌లో హెల్త్ కాలమ్ కనపడితే కంగారు. టీవీలో డాక్టర్ ఇంటర్వ్యూ చూస్తున్నంత సేపు ఆ డాక్టర్ చెబుతున్నది తన గురించేనా అని ఆందోళన. ఆరోగ్యం గురించి చైతన్యవంతం కావడం వేరు. ఆరోగ్యం గురించిన సమాచారంలో మునిగి దానినో పెనుభూతంగా మార్చుకోవడం వేరు. ప్రతిదీ చదవాలనీ, ఆ చదివింది ఉందో లేదో చూసుకోవాలని అనుకోవడం పెద్దజబ్బు. దాని పేరే 'ఆర్థోరెక్సియా నర్వోజా'. సమాచార వ్యవస్థ పెరిగిపోయి హెల్త్ అవేర్‌నెస్ విపరీతమయ్యేసరికి ఆరోగ్యం గురించిన డౌట్లే ఒక జబ్బుగా బాధపడుతున్నవారి అవగాహన కోసమే ఈ ప్రత్యేక కథనం.

'ఆర్థోరెక్సియా నర్వోజా'ను తెలుసుకునే ముందు... అదే కోవకు చెందిన 'అనొరెక్సియా', 'బులీమియా'ల గురించి కొంచెం తెలుసుకోవాలి. తాము బాగా లావెక్కి ఓబేస్‌గా మారితే అందంగా ఉండబోమన్న భావనతో, ఏ పదార్థాన్నీ ఇష్టపడకుండా, అసలు ఒక దశలో ఆహారాన్నే పూర్తిగా అసహ్యించుకునే స్థితికి చేరే రుగ్మతే 'అనొరెక్సియా నర్వోజా'. ఇక 'బులీమియా' కూడా ఇంచుమించూ ఇలాంటిదే. కాకపోతే వీళ్లు రుచి కోసం కొద్దిగా ఆహారాన్ని తిని, వెంటనే వాంతి చేసుకుంటారు.

మరి ఈ ఆర్థోరెక్సియా నర్వోజా అంటే?

'అనొరెక్సియా', 'బులీమియా'లలో అందం ప్రధానం కాగా... 'ఆర్థోరెక్సియా'లో ఆరోగ్యం ప్రధానమవుతుంది. అనొరెక్సియా, బులీమియా కండిషన్లకు మోడలింగ్ చేసేవారు, బాలే డాన్సర్లు, యాక్టింగ్ వంటి వృత్తుల్లో ఉన్నవారు ప్రభావితం అయ్యే అవకాశం ఎక్కువగా ఉండగా, మితిమీరిన ఆరోగ్య స్పృహ ఉన్నవారంతా ఆర్థోరెక్సియాకు లోనయ్యే అవకాశం ఉంది.

ఎలా కనుగొన్నారీ కొత్త జబ్బును...?

కొంతకాలం క్రితం యూనివర్సిటీ ఆఫ్ రోమ్‌కు చెందిన దాదాపు 400కు పైగా విద్యార్థులు ఒక ఆరోగ్య సర్వే నిర్వహించారు. అందంగా కనిపించడానికి ఆస్కారం ఉండే కొన్ని వృత్తుల్లో ఉన్నవారికి మాత్రమే ఉండాల్సిన అనొరెక్సియా, బులీమియా రుగ్మతలు తాము సర్వే జరిపిన శాంపిల్‌లోని సాధారణ వ్యక్తులలో దాదాపు 7 శాతం మందికి ఉన్నట్లు కనుగొన్నారు. ఈ రెండు వ్యాధులూ కలగలసి ఉన్న ఒక కొత్త రుగ్మతను కలిగి ఉన్నవారు కూడా తాము సర్వే నిర్వహించిన జనాభాలో ఉన్నట్లుగా గ్రహించారు. ఈ విషయాన్ని మరింత నిర్దిష్టంగా తెలుసుకునేందుకు యూనివర్సిటీ ఆఫ్ రోమ్ విద్యార్థులు ఒక ప్రశ్నావళి రూపొందించారు. ఆ ప్రశ్నావళి ఆధారంగా నిర్వహించిన సర్వేలో చాలా విచిత్రమైన విషయాలు తెలిసివచ్చాయి. అప్పుడు తెలిసిన రుగ్మతకు 'ఆర్థోరెక్సియా నర్వోజా' అని పేరు పెట్టారు.

లక్షణాలేమిటి?

ఒక మోస్తరు స్థాయిలో జీవనం సాగించే అందరికీ సాధారణంగా కొన్ని ఆరోగ్య సూత్రాలు తెలిసే ఉంటాయి. ఉదాహరణకు ఉప్పు ఎక్కువగా తినకూడదు, నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి, పిజ్జాలు, బర్గర్లు, ఇతర జంక్‌ఫుడ్, బేకరీ ఐటమ్స్ అన్నీ అనారోగ్య కారకాలు, బయటి పదార్థాలు తింటే గ్యాస్ట్రైటిస్, డయేరియా వంటి జబ్బులొస్తాయి... ఇలాంటివి. ఇవన్నీ ప్రాథమిక అవగాహన వల్ల ఇవి మనకు తెలిసిన సంగతులు. అయితే ఇవే సూత్రాలను మితిమీరి పాటిస్తుంటే మాత్రం ఆర్థోరెక్సియా ఉందని అనుమానించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు...

ఉప్పు ఎక్కువగా తినకూడదనే విషయం మనందరికీ తెలిసిందే. కానీ ఎప్పుడో ఒకసారి బాగా రుచిగా అనిపించినప్పుడు ఒక అప్పడం అదనంగా తినేస్తాం. లేదా కొత్త ఆవకాయ పెట్టిన సందర్భంలోనో లేదా అసలు ఆవకాయ పెట్టేలోపు పచ్చిమామిడితో తాత్కాలికంగా చేసుకున్న పచ్చడితో కాస్తంత ఎక్కువగా అన్నం తింటాం. ఇక అలా తిన్నప్పట్నుంచి వారిలో ఒక అపరాధ భావన మొదలవుతుంటుంది. ఆ ఉప్పు వల్ల ఆరోగ్యానికి కీడు కలుగుతుందేమో లేదా అది కిడ్నీలను దెబ్బతీస్తుందేమో అనిపిస్తుంటుంది. మాటిమాటికీ మనలో రక్తపోటు పెరిగిపోయిన భావన కలుగుతుంటుంది. రక్తపోటు ఎక్కువగా ఉన్నప్పుడు కనిపించే సాధారణ లక్షణాలైన తల తిరుగుతున్నట్లు, తలనొప్పిగా అనిపించవచ్చు.

ఒక స్నేహితుడు అమెరికా నుంచి వస్తూ ఇచ్చిన చాక్లెట్ తిన్నారనుకుందాం. అప్పట్నుంచి ఆ చాక్లెట్ వల్ల ఇక తమకు డయాబెటిస్ వస్తుందేమో అనే ఆందోళన పెరిగిపోతుంటుంది. ఇలాంటి ఫీలింగ్స్ పెంపొందించుకున్నవారు తమకు ఎవరు చాక్లెట్, ఐస్‌క్రీమ్ లాంటివి ఆఫర్ చేసినా తిరస్కరిస్తుంటారు. ఈ కండిషన్‌ను 'హైపర్ యాక్యురసీ' అంటారు. ఈ హైపర్ యాక్యురసీ భావనను అధిగమించడానికి రోజూ చేయాల్సిన దాని కంటే మరింత ఎక్కువగా వ్యాయామం చేస్తూ ఉండటం, ఈ వ్యాయామం తాము తిన్న ఆహారాన్ని పూర్తిగా బర్న్ చేసిందో లేదో అంటూ ఆందోళన చెందడం, మరింత సేపు వ్యాయామాన్ని కొనసాగిస్తూ తమను తాము బాధపెట్టుకోవడం లాంటివి చేస్తుంటారు. వ్యాయామంతో ఆనందించే స్థాయి నుంచి క్రమంగా వారు వ్యాయామంతో తమను తాము హింసించుకోవడం స్థాయికి చేరుతారు.

ఆధ్యాత్మిక ఆర్థోరెక్సియా కూడా...

దేవుడి ప్రసాదాన్ని మనమంతా పవిత్రంగా భావిస్తాం. ఎలాంటి ఫీలింగ్స్ లేకుండా భక్తిభావనతో తిన్నవారు కొద్దిసేపట్లోనే దాన్ని మరచిపోతారు. ఆధ్యాత్మిక ఆర్థోరెక్సియా ఉన్నవారు ఆ ప్రసాదంలోని కొన్ని పదార్థాలతో తమ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందేమోనని అనుక్షణం ఆందోళన చెందుతుంటారు. ఉదాహరణకు ప్రసాదంలో అరటిముక్కలు, కొబ్బరిముక్కలు, చక్కెర ఉంటే ఆర్థోరెక్సియా ఉన్నవారి ఆలోచనలు ఇలా సాగుతుంటాయి. 'అరటిపండులో చక్కెరపాళ్లు ఎక్కువ అంటారు. పైగా దాన్ని చక్కెరతో కలిపి తిన్నాం. ఇక మనలో షుగర్‌పాళ్లు పెరుగుతాయేమో. దాంతో నాకు డయాబెటిస్ వస్తుందేమో' అని ఆలోచిస్తూ ఆందోళన పెంచుకుంటారు. ఇక కొన్ని ప్రసాదాల్లో బూందీలడ్డూతో పాటు అక్కడక్కడ జీడిపప్పు వచ్చి, దాన్ని నమిలారనుకుందాం. అప్పుడు 'అయ్యో... ప్రసాదంలోని జీడిపప్పు తిన్నాను. జీడిపప్పులో చెడు కొలెస్ట్రాల్ ఎక్కువట. ఇక ఈ లడ్డూలను నెయ్యితోనే చేసి ఉంటారు.ఇప్పుడెలా? ఒంట్లో కొవ్వు పెరిగి నాకు గుండెజబ్బులు వస్తాయేమో? రక్తనాళాల్లో కొవ్వుపదార్థాలు చేరి, హార్ట్ ఎటాక్ వస్తుందేమో' అంటూ ఆందోళన చెందుతుంటారు. ఈ ఆందోళన భావన ఎంతగా పెరుగుతుందంటే ఒక్కోసారి టీ, కాఫీలలో చక్కెర ఎక్కువైతే అది తమకు హాని చేస్తుందని భయపడుతూ, ఆ హానిని నివారించేందుకు ఆ చక్కరను బర్న్ చేయడానికి అనవసరంగా మెట్లు ఎక్కుతూ దిగుతూ ఉండటం, తాము క్యాజువల్‌గానే ఉన్నామనే భావనను ఎదుటివారిలో కలిగిలా నటిస్తూ... అటూ ఇటూ తిరగడం చేస్తుంటారు. మరోవైపు ఇలాంటి ఆలోచనల వల్ల ప్రసాదం వద్దనుకుంటే తాము భగవంతుడి పట్ల ద్రోహచింతనతో మెలుగుతున్నామనే ఫీలింగ్ వి పెరిగిపోయి క్రమంగా అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఓసీడీ)గా కూడా పరిణమించవచ్చు.

తమకు తామే సామాజిక బహిష్కరణ...

ఆర్థోరెక్సియా నర్వోజా తరహా ఆలోచనలు పెరుగుతున్నవారు ఒంటరిగా ఉండటం మొదలుపెడతారు. క్రమంగా తమను తాము సామాజికంగా బహిష్కరించుకుంటారు. నెలవారీ సరుకుల జాబితా నుంచి కొన్ని ఆహారపదార్థాలను తొలగించుకుంటూ పోతారు. లేదా కొన్నింటి కోసం ఆర్గానిక్ మాల్స్‌లో వెతుకుతుంటారు. అవి కొన్న తర్వాత... అవి ఆర్గానిక్ తరహాలో పండించినవేనా లేదా మామూలు వాటినే ఆ మాల్స్‌లో పెట్టి ఆర్గానిక్ అంటూ అమ్ముతున్నారా అని మళ్లీ ఆందోళన చెందుతుంటారు. అవి మంచివే కదా అంటూ వాటి నాణ్యతను గురించి షాపు యజమానులతో మితిమీరి వాకబు చేస్తుంటారు. ఏది తినమన్నా ఏదో కారణం చెప్పి వాటిని తిరస్కరిస్తుంటారు. ఇక బయట ఎక్కడైనా రెస్టారెంట్‌లో తినాల్సి వస్తే వారు ఎలాంటి ఆహారాలను ఎంపిక చేశారో, అవి మంచివో-కావో, బాగా వండారో-లేదో, ఎలాంటి నూనెలు ఎంపిక చేసుకున్నారో, ఆరోగ్యవంతమైనవి కాకపోవచ్చేమో అని ఆందోళన పెంచుకుంటుంటారు. ఆ తర్వాత ఇంటి వంటలోనూ చాలా పద్ధతులు పాటిస్తూ, ఎన్నో రకాల పరిమితులు విధించుకుంటూ తమను తాము బాధించుకుంటుంటారు. ఇది బాధించుకోవడం స్థాయి దాటి హింసించుకునే స్థాయికి చేరుతుంది.

తమకు చాక్లెట్, ఐస్‌క్రీమ్ లాంటివి ఆఫర్ చేసినా తిరస్కరిస్తుంటారు. ఈ కండిషన్‌ను 'హైపర్ యాక్యురసీ' అంటారు. ఈ హైపర్ యాక్యురసీ భావనను అధిగమించడానికి రోజూ చేయాల్సిన దాని కంటే మరింత ఎక్కువగా వ్యాయామం చేస్తూ ఉండటం, ఈ వ్యాయామం తాము తిన్న ఆహారాన్ని పూర్తిగా బర్న్ చేసిందో లేదో అంటూ ఆందోళన చెందుతుంటారు. మరింత సేపు వ్యాయామాన్ని కొనసాగిస్తూ తమను తాము బాధపెట్టుకోవడం లాంటివి చేస్తుంటారు. వ్యాయామంతో ఆనందించే స్థాయి నుంచి క్రమంగా వారు వ్యాయామంతో తమను తాము హింసించుకోవడం స్థాయికి చేరుతారు.



సొంతంగా కూడా బయటపడవచ్చు...

ఆర్థోరెక్సియా నర్వోజా నుంచి బయటపడటం చాలా తేలిక. ఆరోగ్యంగా ఉండటం మంచిదే... కానీ అది తమ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయకూడదంటూ తమకు తాము కౌన్సెలింగ్ చేసుకుంటూ ఉండాలి. అరుదుగా కొద్దిపాటి తీపిపదార్థాలతో, ప్రసాదం వంటి పరిమిత ఆహారాలతో ప్రమాదం జరగదని సర్దిచెప్పుకోవాలి. అనారోగ్యకరమైన ఆహారాలను కూడా దీర్ఘకాలం తీసుకుంటేనే ప్రమాదంగానీ... ఎప్పుడో ఒకసారి తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతినదని గ్రహించాలి. అయితే ఇలా తమకు తాము సర్దిచెప్పుకున్నా పరిస్థితిని అధిగమించలేకపోతే మాత్రం మానసిక నిపుణుల/ప్రొఫెషనల్స్ సలహా తీసుకోవాలి.

- డా.కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, లూసిడ్ డయాగ్నస్టిక్స్, హైదరాబాద్

క్యాన్సర్లపై అవగాహన అందరికీ అవసరం...

క్యాన్సర్ నుంచి ఏ శరీర భాగమూ మినహాయింపు కాదు. తల నుంచి కాలి వరకు ఏ అవయవానికైనా రావచ్చు. మొదట ఏ భాగంలో క్యాన్సర్ ప్రారంభమవుతుందో దాన్ని 'ప్రైమరీ' అంటారు. ఒక భాగంలో వచ్చిన క్యాన్సర్ మరో భాగానికి వ్యాప్తి చెందితే... అలా ఇతర అవయవానికి వ్యాపించిన దాన్ని 'సెకండరీ' అంటారు. తొలుత ఏదైనా భాగానికి క్యాన్సర్ వచ్చి... అది లింఫ్‌నోడ్ వరకు వ్యాపిస్తే దాన్ని 'లేట్' దశగా పేర్కొంటారు. ఎందుకంటే 'లింఫ్‌నోడ్' అనేది క్యాన్సర్ వ్యాప్తికి ఒక కూడలి లాంటిది. అక్కడి నుంచి అది మనలోని ఏ అవయవానికైనా పాకడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. 'ప్రైమరీ' దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయడం సులభం. దాదాపుగా పూర్తిగా నయమయ్యే అవకాశాలూ ఉంటాయి. కానీ చాలామంది 'సెకండరీ' దశలో హాస్పిటల్‌కు వస్తుంటారు. అలాంటి 'లేట్' క్యాన్సర్‌లను అదుపు చేయడం ఒకింత కష్టం. అందుకే క్యాన్సర్లపై అవగాహన అందరికీ అవసరం.

వయసు పైబడే కొద్దీ క్యాన్సర్లు వచ్చే అవకాశం పెరుగుతుంది. కానీ చిన్న, మధ్యవయసు వారిలో క్యాన్సర్ తీవ్రత ఎక్కువ. అందుకే క్యాన్సర్ చికిత్స విషయంలో గ్రేడ్, స్టేజ్ (దశ)తో పాటు వయసు ప్రాధాన్యం కూడా ఎక్కువ.

క్యాన్సర్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు:

■ క్యాన్సర్ సోకిన అవయవాన్ని బట్టి లక్షణాలు మారుతుంటాయి. చాలాసార్లు తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు ■ పరీక్షలు కూడా క్యాన్సర్ సోకిన అవయవాన్ని బట్టి అనేక రకాలుగా ఉంటాయి. ఏదో ఒక నిర్దిష్టమైన పరీక్షతోనే శరీరంలో ఎక్కడైనా క్యాన్సర్ కణం ఉందా అన్న విషయం తెలుసుకోవడం అసాధ్యం ■ క్యాన్సర్ అంటువ్యాధి కానేకాదు. అయితే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్, లివర్ క్యాన్సర్‌కు దారితీసే హైపటైటిస్ బి, సిలు వైరస్‌లు సురక్షితం కాని శృంగారం, రక్తమార్పిడి ద్వారా వ్యాప్తిచెందే అవకాశం ఉంది. ఇప్పుడు హెచ్‌పీవీ, హెపటైటిస్ బి వైరస్‌లకు గురికాకుండా ఉండేందుకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి ■ క్యాన్సర్లు వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు చాలా తక్కువ. కానీ కొన్ని రకాల క్యాన్సర్లు (అంటే... రొమ్ము, థైరాయిడ్, కోలన్, పాంక్రియాస్ క్యాన్సర్లు) వచ్చిన ఫ్యామిలీ హిస్టరీ ఉంటే ఆ కుటుంబాలలోని వారికి అవి వచ్చే అవకాశం కాస్తంత ఎక్కువ ■ పుట్టుమచ్చలలో మార్పు, నొప్పి లేని గడ్డలు వచ్చి అవి పెరుగుతుండటం, నెలసరి మధ్యలో రక్తస్రావం కావడం, రొమ్ము నుంచి రక్తస్రావం వంటివి క్యాన్సర్‌లను అనుమానించేందుకు కొన్ని సూచనలు ■ రొమ్ముక్యాన్సర్లు పురుషులలోనూ రావచ్చు.

క్యాన్సర్లకు కారణాలు: క్యాన్సర్‌కు నిర్దిష్టంగా ఇదీ కారణం అని చెప్పలేకపోయినా... కొన్ని అంశాలు క్యాన్సర్లకు కారణమవుతాయి. అవి... మద్యం, పొగ తాగడం, ఆహార పదార్థాల్లో రసాయన రంగులు వాడటం, రకరకాల రసాయనాలు, హార్మోన్లను ఎక్కువగా వాడటం, అధిక బరువు, నీరు, వాతావరణ కాలుష్యం, క్రిమిసంహారకాల వాడకం పెరగడం, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తూ రేడియేషన్‌కు ఎక్కువగా గురికావడం, వంటివి క్యాన్సర్లను కలగజేస్తుంటాయి.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421, Kurnool 08518273001

ఈ పొరపాట్లతో క్యాన్సర్ గుర్తింపులో ఆలస్యం: చాలా సందర్భాల్లో క్యాన్సర్‌ను ముదిరాకే గుర్తించడానికి కారణం... ఈ వ్యాధిని వేరే సమస్యగా పొరబడటమే. చాలా సందర్భాల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను టీబీ అనీ, కోలోరెక్టర్ క్యాన్సర్‌ను పైల్స్ అనీ, జీర్ణవ్యవస్థకు సంబంధించిన క్యాన్సర్లను అల్సర్స్‌గానూ, బ్రెయిన్ క్యాన్సర్‌ను మైగ్రేన్ కావచ్చని పొరబాటుపడి, నెలల తరబడి సరైన చికిత్స లేకుండా తాత్సారం చేస్తుంటారు. తీరా ముదిరిన దశలో హాస్పిటల్‌కు వస్తుంటారు. దాంతో తప్పక తగ్గేలా చేసేందుకు అనువైన కాలం గతించిపోతుంది.

లక్షణాలు: క్యాన్సర్ లక్షణాలు అవయవాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కొన్ని సాధారణ లక్షణాలివి... ■ రొమ్ములో కొత్తగా గడ్డలు కనిపించడం ■ విడవకుండా దగ్గు, గొంతు బొంగురుపోవడం ■ ఆకలి, బరువు తగ్గడం ■ ఎంతకూ మానని పుండు ■ కొత్త మచ్చ లేదా ఉన్న మచ్చ/పులిపిరికాయలో మార్పు ■ వాంతులు, అజీర్ణం ■ మహిళల్లో తెలుపు కావడం లేదా అసాధారణ రక్తస్రావం ■ పొత్తికడుపు, నడుము నొప్పులు ■ అజీర్ణంతో పాటు తేన్పులు, కడుపు ఉబ్బరం ■ తగ్గని జ్వరం.

అయితే కొందరిలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. కాబట్టి మందులు వాడుతున్నప్పటికీ సమస్య తగ్గకుండా పై లక్షణాలే రెండు, మూడు వారాలకు పైగా ఉండటం, లేదా లక్షణాల్లో మార్పులు/తీవ్రత పెరగడం, తగ్గినట్టే తగ్గి సమస్య మళ్లీ తిరగబెట్టడం వంటివి కనిపిస్తే తప్పనిసరిగా ఆ కండిషన్లను అనుమానించి, సంబంధిత పరీక్షలు చేయించుకోవడం మంచిది.

చికిత్స: ఏ క్యాన్సర్ అయినా తొలి దశలోనే గుర్తిస్తే సమర్థమైన చికిత్స సాధ్యమే. కానీ ఎవరికి వారు తమకు క్యాన్సర్ ఎందుకు వస్తుందిలే అనుకుంటుంటారు. కొన్ని క్యాన్సర్లలో బాధ లేకపోవడంతో నిర్లక్ష్యం చేస్తుంటారు. మహిళల్లో వచ్చే సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్లను తొలి దశలోనే గుర్తిస్తే మంచి చికిత్స సాధ్యమవుతుంది. అలాగే 50 ఏళ్లు దాటిన పురుషుల్లో ప్రొస్టేట్‌ను ముందుగానే తెలుసుకోడానికి పీఎస్‌ఏ పరీక్ష, హెపటైటిస్ బి, సి ఉన్నట్లయితే లివర్ క్యాన్సర్‌ను తెలిపే పరీక్షలు ముందే చేయించుకోవడం మేలు. ముప్పై ఏళ్లు పైబడ్డాక మహిళలు డాక్టర్ చెప్పిన మేరకు క్రమం తప్పకుండా పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకుంటూ ఉండటం మంచిది.

హెల్దీ వాటర్

వాన నీరే స్వచ్ఛమైన తాగునీరు!

● ఆరేళ్లుగా వాన నీటినే తాగుతున్న మదనపల్లి కుటుంబం ● తాగునీటి బాధలన్నిటికీ ఇదే పరిష్కారం అంటున్న 'ప్రకృతివనం'

నీరు.. మనుగడకు ప్రాణావసరం. మారుమూల గ్రామీణులు సైతం క్యాన్ నీటిని కొనుక్కొని తాగుతున్న పరిస్థితులున్న కాలం ఇది. ఇక ఎండాకాలం వచ్చిందంటే తాగు నీటి కోసం పడని పాట్లుండవు. అయితే, చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఒక కుటుంబం కేవలం తమ ఇంటిపైన కురిసిన వాన నీటినే పట్టుకొని తాగుతున్నది. ఒకటి కాదు, రెండు కాదు.. గత ఆరేళ్లుగా వాన నీటినే పట్టుకొని, శుద్ధి చేసి, భూగర్భ ట్యాంకులో దాచుకొని ఏడాదంతా తాగుతూ పూర్తి ఆరోగ్యంగా ఉంటున్నదో కుటుంబం. అంతేకాదు.. ప్రతి కుటుంబమూ ఇలాగే వాన నీటిని ఒడిసిపట్టుకొని ఏడాదంతా తాగితే నీటి సమస్య తీరడంతోపాటు ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉండడమూ సాధ్యమేనని ప్రచారం చేస్తున్నారు.

వినడానికి ఆశ్చర్యంగానే ఉన్నా.. ఇది నిజం..,

ఎం.సి.వి. ప్రసాద్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. 70 ఎకరాల ఆసామి. ప్రకృతి వ్యవసాయదారుడు. మదనపల్లి సమీపంలోని 'ప్రకృతివనం' వారి వ్యవసాయ క్షేత్రం. బోర్‌వెల్స్‌లో నీటి మట్టం అట్టడుగుకు వెళ్లేకొద్దీ టీడీఎస్ (టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్) పెరిగిపోవడం వల్ల తాగడానికి పనికిరాకుండా పోతూ ఉంటాయి. మదనపల్లి ప్రాంతంలో భూగర్భ జలం లోతు టీడీఎస్ 1,500 నుంచి 3,000 మధ్యలో ఉంటుంది. పోనీ క్యాన్‌లలో అమ్మే ఆర్.ఓ.(రివర్స్ ఆస్మోసిస్ పద్ధతిలో శుద్ధి చేసిన) నీరు కొనుక్కొని తాగుదామా అంటే.. ఆర్.ఓ. నీటిలో టీడీఎస్ మరీ తక్కువగా(20 నుంచి 35) ఉంటున్నాయి. పి.హెచ్. 5–6 వరకు ఉండటం వల్ల ఆమ్ల గుణాన్ని సంతరించుకొని ఉంటూ.. ఆరోగ్యానికి హానికరంగా తయారయ్యాయని ప్రసాద్ భావించారు. అటువంటి పరిస్థితుల్లో నిపుణులను సంప్రదించి.. తగు జాగ్రత్తలు తీసుకుంటూ వాననీటిని దాచుకొని తాగుతున్నారు. రాయలసీమవాసులకే కాదు, ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ ప్రాంత వాసులకే కాదు... ప్రపంచవ్యాప్తంగా ఎవరికైనా ఆరోగ్యదాయకమైన తాగు నీరు వాన నీటి సంరక్షణ ద్వారానే సాధ్యమని ప్రసాద్ చెబుతున్నారు.

వాన నీటిని పట్టుకొనేదిలా...

రాయలసీమలో 500 మి.మీ. వర్షం కురుస్తుంది. డాబా ఇంటి పైకప్పు మీద ప్రతి చదరపు అడుగుకు 50 లీటర్ల చొప్పున వాన నీటిని ఒడిసిపడుతున్నారు. ఇంటిపై నుంచి పైపుల ద్వారా కిందికి వచ్చే నీరు తొలుత రెయిన్ ఫిల్టర్ ద్వారా ప్రవహించి మట్టి, ఆకులు, చెత్త లేకుండా క్లీన్ అవుతాయి. వాన నీరు స్వచ్ఛమైనది. అయితే, అందులో లవణాలు ఉండవు. కానీ, లవణాలతో కూడిన నీరే ఆరోగ్యదాయకమైనది కాబట్టి, ఆ నీటికి లవణాలు కలపాలి. అదీ సులభమే. వాన నీటిని మినరలైజేషన్ ట్యాంకులో నుంచి ప్రవహించేలా ఏర్పాటు చేసుకుంటే సరి. సున్నపురాయి, కుండ పెంకులు, బొగ్గులు, ఇసుక, గులక రాళ్లను పొరలుగా వేసి ఉండడం వల్ల ఈ ట్యాంకులో నుంచి ప్రవహించే నీరు ఆరోగ్యదాయకమైన తాగు నీరుగా మారతాయి. ఆ నీటిని భూమిలో నిర్మించుకున్న ట్యాంకులోకి పంపి నిల్వ చేసుకుంటున్నారు. అలా నిల్వ చేసుకునే నీటిని మోటారు ద్వారా లేదా చేతి పంపు ద్వారా ప్రతి రోజూ పంప్ చేసుకొని తాగునీరుగా ఉపయోగించుకుంటున్నారు. భూగర్భ ట్యాంకులో నిల్వ ఉండే తాగునీటికి గాలి, వెలుతురు తగలకుండా జాగ్రత్తపడితే చాలు... నాచు పట్టదు. నీరు పాడవదు. ఇలా ప్రతి ఏటా 40 వేల లీటర్ల వాన నీటిని పట్టుకొని, శుద్ధి చేసుకొని, జాగ్రత్త చేసుకున్న నీటినే ఏడాది పొడవునా ప్రసాద్ కుటుంబంలోని ఆరుగురు, ప్రకృతివనంలో పనిచేసే 50 మంది పనివారు, అతిథులు పిల్లాపాపలతో సహా నిరభ్యంతరంగా తాగుతూ ఆరేళ్లుగా ఆరోగ్యంగా ఉన్నారు.



నల్లగా ఉన్నది వాన నీటిలోని దుమ్ము, ఆకులను శుద్ధి చేసే రెయిన్ ఫిల్టర్. పక్కన ఉన్న స్టెయిన్ లెస్ స్టీల్ ట్యాంకే మినరలైజేషన్ ట్యాంకు.

తొలుత బెంగళూరులోని కర్ణాటక ప్రభుత్వ మహిళా శిశుసంక్షేమ శాఖ వద్ద, ఇటీవల ఎస్సెన్ అండ్ కో లోనూ పరీక్షలు చేయించి నీటి నాణ్యతను నిర్ధారించుకున్నామని ప్రసాద్ తెలిపారు. తాము తాగే నీటిని పరీక్షిస్తే టీడీఎస్ 208, పి.హెచ్. 7.13 మధ్య ఉందని, ఇది ఆరోగ్యదాయకమైన ఆల్కలైన్ వాటర్ అన్నారు.

ఇంతకీ ఎంత ఖర్చవుతుంది?

వాన నీటిలో నుంచి డస్ట్ క్లీన్ చేసే రెయిన్ ఫిల్టర్ రూ. 7,500, మినరలైజేషన్ ట్యాంకు స్టీల్‌దైతే రూ. 10 వేలు(సిమెంటుదైతే రూ. 4 వేలు) ఖర్చవుతుంది. భూగర్భంలో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణానికి లీటరుకు రూ. 4–5 ఖర్చవుతుంది. 1500 చదరపు అడుగుల ఇంటి కప్పు నుంచి వాన నీటిని సేకరించి నిల్వ చేసుకోవడానికి సుమారు రూ. 50,000 వరకు ఖర్చవుతుంది. ఆ తర్వాత ఏ ఖర్చూ లేకుండానే.. మబ్బుల్లో నుంచి వచ్చే స్వచ్ఛమైన, అమూల్యమైన చెలమ నీటిని తాగొచ్చని ప్రసాద్ అనుభవపూర్వకంగా చెబుతున్నారు.

సొంత ఇల్లు లేక లేదా మరే ఇతర కారణంగానైనా ఆర్.ఓ. నీటిని తాగే వారు కూడా.. ఆరోగ్యదాయకమైన ఆల్కలైన్ వాటర్ స్వంతంగా తయారు చేసుకొని తాగడానికీ మరో మార్గం ఉందని ప్రసాద్ అంటున్నారు. ఆర్.ఓ. వాటర్‌ను మినరలైజేషన్ ట్యాంకులో పోసుకొని.. 4 గంటల తర్వాత.. ఆ నీటిని పట్టుకొని తాగవచ్చని, ఈ నీరు కూడా ఆరోగ్యదాయకమైన అల్కలైన్ వాటరేనని ప్రసాద్ చెబుతున్నారు. మినరలైజేషన్ ట్యాంకును 30–50 లీటర్లు పట్టే స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రతో లేదా మట్టి పాత్రతో ఎవరికి వారు తయారు చేసుకోవచ్చు. ఈ విషయంలో ఎవరికైనా సందేహాలున్నా తీర్చడానికి, వీడియో కాల్ చేస్తే 'ప్రకృతివనం'లో తాము వాడుతున్న ఫిల్టర్లను చూపడానికి కూడా సంసిద్ధంగా ఉంటామని ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల వారు వెంకట్‌రెడ్డి– 89198 96367, ఎం.సి.వి. ప్రసాద్– 94401 68816 నంబర్లలో సంప్రదించవచ్చు.



ఆర్.ఓ. నీటి క్యాన్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్ మినరలైజేషన్ ట్యాంకుపైన ఉంచితే.. 4 గంటల్లో ఆరోగ్యదాయకమైన తాగునీరు సిద్ధమవుతుంది.

సినిమా
విజయవాడ
గురువారం
22-3-2018
సాక్షి ఫ్యామిలీ

కాంబినేషన్ కాదు... కథే ముఖ్యం - కల్యాణ్ రామ్



● కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్, 'అల్లరి' నరేశ్, కిరణ్ రెడ్డి, విశ్వప్రసాద్, భరత్ చౌదరి, ఉపేంద్ర మాధవ్

''కాంబినేషన్ కంటే కథను నమ్మి సినిమాలు తీసే నిర్మాతలంటే ఇష్టం. అలాంటి వారిలో 'ఎంఎల్ఏ' చిత్రనిర్మాతలు ముందుంటారు. తప్పకుండా వీరు పెద్ద నిర్మాతలు అవుతారు'' అన్నారు కల్యాణ్ రామ్. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, కాజల్ జంటగా తెరకెక్కిన చిత్రం 'ఎంఎల్ఏ'. టి.జి. విశ్వప్రసాద్ సమర్పణలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఫంక్షన్‌లో కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''పటాస్' కథ విన్నప్పుడు ఎంత ఎగ్జయిట్ అయ్యానో 'ఎంఎల్ఏ' కథ విన్నప్పుడూ అంతే ఎగ్జయిట్ అయ్యాను. ఈ సినిమాలో ఉపేంద్ర నన్ను కొత్తగా చూపించాడు. 'పటాస్, ఇజం' సినిమాలు చేస్తున్నప్పుడు ఎంత బాగా ఫీలయ్యానో.. ఈ సినిమాకూ అలాగే ఫీలయ్యాను. కొత్త దర్శకుడిని గైడ్ చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌ది భార్య, భర్తల బంధం. నేను పనిచేసిన కెమెరామెన్స్‌లో బెస్ట్ కెమెరామెన్ ప్రసాద్ మూరెళ్లగారు. కాజల్‌తో రెండో చిత్రమిది. ఇప్పటివరకూ నేను పధ్నాలుగు సినిమాలు చేస్తే.. తను 50 సినిమాలు చేసింది. అందుకు కారణం తన డెడికేషన్'' అన్నారు. ''రియల్ లైఫ్‌లో ఎవరి బ్యాగ్రౌండ్ లేకుండా ఎమ్మెల్యే అవడం ఎంత కష్టమో నాకు తెలియదు. కానీ, ఎవరి బ్యాగ్రౌండ్ లేకుండా డైరెక్టర్ అవడం ఎంత కష్టమో తెలుసు. ఉపేంద్ర నా దగ్గర చాలా సంవత్సరాలు పనిచేశాడు. ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడో తెలుసు. తప్పకుండా సినిమా హిట్ అవుతుంది'' అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ''తన బాధ్యతను ఎక్కువగా ప్రేమించే డైరెక్టర్స్‌లో ఉపేంద్ర ఒకరు. సాలూరి రాజేశ్వరరావు తర్వాత ఆ స్థాయిలో సంగీతం అందించగల మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మగారు'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు డి.సురేశ్ బాబు. ''కల్యాణ్ రామ్‌గారికి 'ఎంఎల్ఏ' టైటిల్ చక్కగా యాప్ట్ అవుతుంది'' అన్నారు దర్శకుడు ఎన్.శంకర్. ''నేనే రాజు నేనే మంత్రి' సమయంలోనే ఉపేంద్ర ఈ కథ చెప్పారు. నిర్మాతల గురించి ఆలోచించే హీరో కల్యాణ్ రామ్. చేతికి గాయమైనా కమిట్‌మెంట్‌తో సినిమాను పూర్తి చేశారు'' అని కిరణ్ రెడ్డి అన్నారు. ''కథ వినగానే సినిమా చేస్తున్నాం అన్నారు కల్యాణ్ రామ్‌గారు. ఆయన నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. నేను చెప్పిన బడ్జెట్ కంటే ఎక్కువ అయింది. మణిశర్మగారు పాటలు ఎంత బాగా చేశారో.. రీ-రికార్డింగ్ అంత కంటే బాగా చేశారు'' అన్నారు ఉపేంద్ర మాధవ్. పోసాని, రవికిషన్, కోన వెంకట్, వీఎస్ ఆదిత్య, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ఫుల్ పంతం

'బలుపు, పవర్, జై లవకుశ' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు స్క్రీన్‌ప్లే ఇచ్చిన కె.చక్రవర్తి దర్శకునిగా పరిచయమవుతోన్న చిత్రం 'పంతం'. 'ఫర్ ఎ కాస్' అన్నది ఉప శీర్షిక. గోపీచంద్, మెహరీన్ జంటగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. రాధామోహన్ మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో గోపీచంద్‌గారి 25వ సినిమా చేయడం హ్యాపీగా ఉంది. మంచి మెసేజ్‌తో పాటు కమర్షియల్ హంగులతో చక్రి సినిమాని చక్కగా తెరకెక్కిస్తున్నారు. గోపీచంద్‌గారి క్యారెక్టర్ పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఇప్పటివరకూ కనపడని స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారాయన. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. గోపీ సుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద ఎస్సెట్. ఈ వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: కె.చక్రవర్తి, బాబీ (కె.ఎస్.రవీంద్ర).



● గోపీచంద్

రాజరథం కోసం తెలుగు నేర్చుకున్నా



● అవంతిక, నిరూప్

''రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన మూవీ 'రాజరథం'. అభి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిగా కనపడతా. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకున్నా. అడగ్గానే రానా వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆర్య ముఖ్యమైన పాత్ర చేశారు'' అని నిరూప్ భండారి అన్నారు. నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన చిత్రం 'రాజరథం'. అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి నిర్మాతలు. ఈ సినిమా రేపు విడుదలవుతోంది. నిర్మాతల్లో ఒక్కరైన సతీష్ శాస్త్రి మాట్లాడుతూ– ''అమెరికాలో ఎన్నో విజయవంతమైన సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసిన మా జాలీ హిట్స్ సంస్థ నిర్మాణ రంగంలోకి ప్రవేశించింది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రాజరథం'. అజనీశ్ లోక్‌నాథ్ ఈ సినిమాకు చక్కటి నేపథ్య సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ మంచి సినిమాకు ఉండాల్సిన బెస్ట్ క్వాలిటీస్ అన్నీ మా సినిమాలో ఉన్నాయి. ఈ సినిమా అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు అవంతిక శెట్టి.

కేరాఫ్ కాంట్రవర్సీ



● కంగనా

ఒక్కసారి మనం కాంట్రవర్సీలో కాలు పెడితే చాలు తర్వాత అక్కర్లేని కాంట్రవర్సీలన్నీ వచ్చి చుట్టుకుంటాయి అని చెప్పటానికి కంగనా రనౌత్ ఓ ఉదాహరణ. విషయం ఏంటంటే.. సీడీఆర్ (కాల్ డీటైల్ రికార్డ్) వివాదం. ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ టాపిక్. బాలీవుడ్ సెలబ్రిటీ లాయర్ రిజ్వాన్ సిద్ధికీ చట్ట వ్యతిరేకంగా తన క్లైయింట్స్‌కు సీడీఆర్‌లు అందిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. నటుడు నవాజుద్దీన్ సిద్ధికీ భార్య కాల్ డేటాను అక్రమ మార్గాల్లో సంపాదించారని లాయర్ రిజ్వాన్‌ను అదుపులోకి తీసుకున్నారు థానే పోలీసులు. తీగ లాగితే డొంక కదిలినట్టు ఇప్పుడీ కేసు కంగనా కాలుకి కూడా చుట్టుకుంది. ఈ సీడీఆర్ వివాదంలో కంగనా కూడా ఉన్నారంటూ ఆరోపించారు థానే పోలీసులు. ''కంగనా–హృతిక్ రోషన్ ప్రేమ వ్యవహారం కేసు విషయం ఇంకా నడుస్తున్న విషయం తెలిసిందే. 2016లో లాయర్ రిజ్వాన్‌కు కంగనా హృతిక్ రోషన్ నంబర్‌ను ఇచ్చినట్టు మా ఇన్వెస్టిగేషన్‌లో తెలిసింది. దాని వెనకాల అసలు కారణం ఏంటో తెలియాల్సి ఉంది'' అని పేర్కొన్నారు థానే పోలీసులు. దానికి కంగనా సిస్టర్ రంగోలీ స్పందిస్తూ – ''ఏదైనా కోర్ట్ నోటీసుకి రెస్పాండ్ అయినప్పుడు మా డీటైల్స్ అన్నీ లాయర్‌కు సమర్పిస్తాం. వాటిని ఆధారం చేసుకొని మేము చట్టాన్ని అతిక్రమిస్తున్నాం అని ఊహించేసుకొని వాటి ద్వారా స్టేట్‌మెంట్స్ పాస్ చేయడం ఒక ఆర్టిస్ట్‌ని తక్కువ చేయడమే అవుతుంది. అది తప్పు. పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ జరిపాక ఆరోపణలు చేస్తే బావుంటుంది'' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

వైఎస్ యాత్ర మొదలు



● మమ్ముట్టి

మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితాన్ని సిల్వర్ స్క్రీన్‌పై చూడబోతున్నాం. జనరంజక పాలన, సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత నేత జీవిత విశేషాలను ఆవిష్కరించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీఎంగా ప్రజలకు వైఎస్సార్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివి. అభిమానుల గుండెల్లో 'రాజన్న'గా నిలిచిపోయిన ఆ మహానేత జీవితాన్ని మహీ వి. రాఘవ్ తెరకెక్కించనున్నారు. 'పాఠశాల' వంటి కాలేజ్ లవ్‌స్టోరీ తర్వాత రీసెంట్‌గా 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన మహీ వి. రాఘవ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్నారు. 'యాత్ర' పేరుతో రూపొందనున్న ఈ చిత్రంలో వైఎస్ పాత్రలో మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి నటించనున్నారు. ''భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ' చిత్రాల తర్వాత మా బ్యానర్‌లో వస్తోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'యాత్ర'. వైఎస్ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఎమోషనల్ కంటెంట్‌గా ఈ సినిమాని ఎక్కడా రాజీపడకుండా నిర్మిస్తున్నాం'' అని విజయ్ చిల్లా తెలిపారు.

కాపురాలు కూలిస్తే.. తస్మాత్ జాగ్రత్త!

● రోడ్డుకి ఈడుస్తా



● భర్తతో నేహా

''కొందరు హీరోయిన్స్ కుటుంబాలను నాశనం చేస్తున్నారు. వాళ్లు సెక్స్ వర్కర్స్ కంటే దారుణంగా తయారయ్యారు'' అంటూ తమిళ నిర్మాత జ్ఞానవేల్ రాజా భార్య నేహా సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టార్ బ్రదర్స్ సూర్య, కార్తీలకు బంధువు అవుతారు జ్ఞానవేల్ రాజా. సూర్య హీరోగా జ్ఞానవేల్ నిర్మించిన 'సింగం 3' సినిమాకు నేహా కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేశారు. కొందరి హీరోయిన్ల ధోరణిపై ఆమె ట్విట్టర్‌లో స్పందిస్తూ – ''అందర్నీ జనరలైజ్ చేయటమో లేదా ప్రొఫెషనల్‌గా ఉండేవాళ్లను హర్ట్ చేయటానికో ఈ విషయం ప్రస్తావించట్లేదు. హీరోయిన్లను ఇండస్ట్రీలో అడ్జస్ట్ అవ్వమని అడుగుతారో లేదో తెలీదు కానీ కొందరు మాత్రం 'బెడ్ రెడీ' అన్నట్లు ఉంటారు. పెళ్లయిన వాళ్లను వెంబడిస్తుంటారు. ఒకవేళ అడ్జస్ట్ అవ్వమని ఇండస్ట్రీ అడిగితే 'నో' చెప్పి వెళ్లిపోలేరా? పెద్ద హీరోయిన్ అయిపోదామని, డబ్బులు సంపాదించే ప్రక్రియలో, లైమ్ లైట్‌లో ఉందామని చేసే ప్రయత్నమే ఇదంతా. మనమంతా ఫెమినిజమ్, స్త్రీ సాధికారత గురించి మాట్లాడుకుంటుంటాం. కానీ అసలైన నిజం ఏంటంటే ఆడదానికి ఆడదే శత్రువు. కొన్నిసార్లు ఓ స్త్రీ ఇంకో స్త్రీ జీవితం నాశనానికి కారణమవుతుంది. అవును.. కథకు రెండు వైపులా మాట్లాడాలి. కొందరు మగవాళ్లే వాళ్ల ఆటలు సాగనిచ్చి, వాళ్ల కుటుంబంలోకి వచ్చేదాకా చేస్తున్నారు. మనందరం ఇలా ఇళ్లను కూల్చేవాళ్లందరినీ బయటపెట్టి ఓపెన్ వార్నింగ్ ఇవ్వాలి. అమ్మాయిని మోసం చేసిన మగాడిని ఎలా శిక్షిస్తామో వీళ్లనూ అలానే దండించాలి. అవును... మగాళ్లు ఏమీ పసి పిల్లలు కాదు. కొందరు మగాళ్లు వీళ్లను లిమిట్‌లో ఉంచినా కూడా వీళ్లు హద్దులు దాటుతుంటారు. ఎమోషనల్ డ్రామాతో కట్టేస్తుంటారు. మొగుడిని కంట్రోల్ చేయటం, శిక్షించటమే కాదు.. భార్యల డ్యూటీ. ఇలాంటివాళ్లను హద్దుల్లో పెట్టడం కూడా. పబ్లిక్‌లో కుక్కని కొట్టినట్టు కొట్టాలి. కొందరు హీరోయిన్లను ఇలాంటి చర్యలను ఆపమని బతిమాలా. కానీ మారేలా లేరు. వాళ్లను కచ్చితంగా రోడ్డుకి ఈడుస్తాను. (అలాంటివాళ్లను హీరోయిన్స్ కాదు.. వ్యభిచారులు అనాలేమో).
ఈ రేంజ్‌లో మాటల తూటాలు వదిలిన నేహా ఆ తర్వాత ఆ ట్వీట్ మొత్తాన్ని తీసేశారు. ''నాకు, నా భర్తకు ఎటువంటి ప్రాబ్లమ్స్ లేవు. నా చుట్టూ జరిగిన సంఘటనలు చూసి స్పందించాను. ఏదో డ్రామా క్రియేట్ చేయాలనో, ఇతరుల దృష్టి ఆకర్షించాలనో రాయలేదు. ఇక్కడ స్పందించటం వల్ల ఉపయోగం లేదని అర్థం అయింది. అందుకని తీసేశాను'' అని నేహా పేర్కొన్నారు.



'ఫేస్‌బుక్' వార్!

డేటా దుర్వినియోగం వార్తలపై బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం

కాంగ్రెస్, 'కేంబ్రిడ్జ్ అనలిటికా' కలిసి పనిచేస్తున్నాయి: రవిశంకర్

- ఆ సంస్థతో బీజేపీకే సంబంధాలు..
- బిహార్, గుజరాత్ ఎన్నికల్లో బీజేపీకి ఆ సంస్థ సేవలు: కాంగ్రెస్
- యూఎస్, యూకే, యురోపియన్ దేశాల్లో 'సీఏ' ప్రభావం
- సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం: ఫేస్‌బుక్




ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రవిశంకర్. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత సూర్జేవాలా

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్ డేటా లీకేజ్ వివాదం భారత్‌కూ పాకింది. కోట్లాది ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలను పలు దేశాల్లో రాజకీయ పార్టీల ఎన్నికల వ్యూహాల రూపకల్పనకు అక్రమంగా వినియోగించిన సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా(సీఏ)'తో భారత్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలకు సంబంధం ఉందన్న వార్త తాజాగా వెలుగులోకి వచ్చింది. బీజేపీ, కాంగ్రెస్, జేడీయూ తదితర పార్టీలు తమ క్లయింట్లే నంటూ ఆ సంస్థ భారతీయ భాగస్వామి ఓబీఐ (ఒవలెనో బిజినెస్ ఇంటలిజెన్స్) తన వెబ్‌సైట్లో ప్రకటించడం సంచలనం రేకెత్తించింది. దీంతో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. సీఏతో అంటకాగింది, సంబంధాలు కొనసాగిస్తోంది మీరంటే.. మీరంటూ ఒకరిపై ఒకరు ఆరోపణాస్త్రాలు సంధించారు. సోషల్‌మీడియాలో రాహుల్ విస్తృతి వెనుక ఉన్నది 'సీఏ'నేనని, ఓటర్లను ఆకర్షించేందుకు ఆ సంస్థ సేవలను కాంగ్రెస్ వాడుకుంటోందని బీజేపీ నేత, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మరోవైపు, బిహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల ఎన్నికల్లో ఇప్పటికే బీజేపీ ఈ సంస్థ సేవలను వినియోగించుకుందంటూ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో, యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగేందుకు ఉద్దేశించిన 'బ్రెగ్జిట్' ఉద్యమంలో 'సీఏ' పాత్రపై వివాదం చెలరేగి, పలు దేశాల్లో దర్యాప్తులు కొనసాగుతున్న వేళ.. భారత్‌నూ ఈ అంశం కుదిపేయడం రానున్న రోజుల్లో సోషల్ మీడియా ప్రభావాన్ని కళ్లకు కడుతోంది.

కాంగ్రెస్ జవాబివ్వాలి

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విస్తృతిలో కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థకున్న సంబంధమేంటో రాహుల్ గాంధీ చెప్పాలని రవిశంకర్ డిమాండ్ చేశారు. 'ఈ డేటా విశ్లేషణ సంస్థ సెక్స్, అనైతిక మార్గాలు, అసత్యపు వార్తల ద్వారా ఎన్నికలను ప్రభావితం చేస్తుందని నిరూపితమైంది. ఇలాంటి సంస్థతో కాంగ్రెస్ కలిసి పనిచేస్తోంది' అని ఆయన ఆరోపించారు. '2019 ఎన్నికల ప్రచారంలో మోదీపై కాంగ్రెస్ బ్రహ్మాస్త్రం అంటూ మీడియాలోని ఓ వర్గం ప్రచారం చేస్తుంటే ఏమో అనుకున్నాం. అది ఇదేనా. సీఏ సంస్థ అమ్మాయిలను ఎరగా వేసి, డబ్బులు ఆశజూపి రాజకీయ నాయకులను ఉచ్చులోకి దించుతుంది, ఫేస్‌బుక్ డేటాను చోరీ చేస్తుంది. ఇదేనా కాంగ్రెస్ చేయాలనుకున్నది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఈ సంస్థ డేటా విశ్లేషణ వివరాల ద్వారానే ఓటర్లను ఆకర్షిస్తోందా?' అని ప్రశ్నించారు.

ఫేస్‌బుక్‌కూ వార్నింగ్

ఫేస్‌బుక్ వినియోగిస్తున్న 20 కోట్ల మంది భారతీయ వినియోగదారుల వివరాలను దుర్వినియోగం చేసినట్లు తెలిస్తే.. ఫేస్‌బుక్ సంస్థపై కఠిన చర్యలు తప్పవని రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. ఫేస్‌బుక్ సహా ఇతర సామాజిక మాధ్యమాలు కూడా ఎన్నికల విధానాన్ని అనైతిక పద్ధతుల్లో ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. భారత ప్రభుత్వం మీడియా, భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తుందని, సోషల్ మీడియా ద్వారా అభిప్రాయాలను పంచుకోవటం తప్పుకాదన్న మంత్రి.. దీన్ని దుర్వినియోగం చేస్తే మాత్రం ఊరుకోబోమన్నారు. 'దేశ ప్రయోజనాలు, దేశ భద్రతకు సంబంధించిన విషయమిది. భారత ప్రజాస్వామ్య విధానాన్ని ప్రభావితం చేసే ఏ అంశాన్నైనా సీరియస్‌గా తీసుకుంటాం. అవసరమైతే.. జుకర్‌బర్గ్‌ను భారత్‌కు రప్పించి విచారిస్తాం' అని ఆయన అన్నారు.

బీజేపీతోనే సంబంధాలు

బీజేపీయే ఈ సంస్థతో సంబంధాలు పెట్టుకుందని.. అనవసరంగా తమపై ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ పేర్కొంది. బిహార్, గుజరాత్ ఎన్నికల సమయంలో ఈ సంస్థ సేవలను బీజేపీ వినియోగించుకుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ఆరోపించారు. పార్టీకి గానీ, రాహుల్‌కు గానీ సీఏ సంస్థతో సంబంధాల్లేవన్నారు. ఇతర సమస్యల నుంచి దేశం దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ వ్యూహాన్ని అనుసరిస్తోందన్నారు. 'అవాస్తవాలను ప్రచారం చేయటంలో దిట్ట అయిన బీజేపీ నేడు మరో అసత్యాన్ని తెరపైకి తెచ్చింది. అబద్ధపు ప్రెస్ కాన్ఫరెన్స్, అసత్యాల ఎజెండా, అనైతిక వ్యూహం, అసత్య ప్రకటనలు బీజేపీ, న్యాయంలేని న్యాయశాఖ మంత్రి దినచర్యలో భాగమయ్యాయి' అని సుర్జేవాలా విమర్శించారు. బిహార్ ఎన్డీయే నేత కుమారుడే సీఏ భారతీయ సంస్థ ఓవిలేనో బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఓబీఐ)ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

యూఎస్, యూకేల్లో విచారణలు

ఐదుకోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలను తస్కరించడంపై అమెరికా, బ్రిటన్ సహా పలు యూరోపియన్ దేశాలు విచారణకు ఆదేశించాయి. తమ ముందు విచారణకు హాజరవ్వాలంటూ ఇప్పటికే ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌ను ఆదేశించాయి. అమెరికాలో ఈ కేసును ఆ దేశ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ) విచారిస్తోంది. విచారణకు తమ ముందు హాజరవ్వాలని అమెరికన్ కాంగ్రెస్ జుకర్‌బర్గ్‌కు నోటీసులు పంపింది. బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థ 2016 ఎన్నికల్లో ట్రంప్ తరపున ప్రచార బాధ్యతల్లో కీలకంగా వ్యవహరించింది.

చిత్తశుద్ధితో చేస్తున్నాం: ఫేస్‌బుక్

ఫేస్‌బుక్ కొన్ని నిబంధనలు ఉల్లంఘించిందని.. అందువల్ల ఈ సంస్థపై 40వేల డాలర్ల (దాదాపు రూ. 26 లక్షలు) జరిమానా విధించే అవకాశం ఉందని వాషింగ్టన్ పోస్టు ఓ కథనంలో పేర్కొంది. తాజా వార్తల నేపథ్యంలో ఫేస్‌బుక్ షేర్లు బుధవారం మరో 2.6 శాతం పడిపోయాయి. కాగా, ఓ రాజకీయ కన్సల్టెన్సీ తమ వినియోగదారుల డేటా చోరీ చేయటంపై ఆందోళనలో ఉన్నట్లు ఫేస్‌బుక్ ఓ ప్రకటనలో తెలిపింది. 'మేం మోసపోయామని అర్థమైంది. మా పాలసీలకు అనుగుణంగా వినియోగదారుల భద్రతను కాపాడేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాం. జుకర్‌బర్గ్ సహా మిగిలిన ఉన్నతాధికారులంతా రాత్రింబవళ్లు ఈ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నారు' అని ఫేస్‌బుక్ పేర్కొంది.

'డిలీట్ ఫేస్‌బుక్' ఉద్యమం



వ్యక్తిగత డేటా లీకేజీ ఘటన అనంతరం.. ఫేస్‌బుక్ అకౌంట్‌ను తొలగించాలంటూ వాట్సాప్ సహ వ్యవస్థాపకుడు బ్రయాన్ పేర్కొన్నారు. 'డిలీట్ ఫేస్‌బుక్.. ఇదే సరైన సమయం' అని బ్రయాన్ ఆక్టన్ పేర్కొన్నారు. అటు డిలీట్ ఫేస్‌బుక్ ప్రచారం మిగిలిన సామాజిక మాధ్యమాల్లో ఊపందుకుంది. పలు మీడియా సంస్థలు కూడా ఈ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాలిఫోర్నియాకు చెందిన వాట్సాప్ ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీ 2009లో వాట్సాప్ సేవలను ప్రారంభించింది. 2014లో ఫేస్‌బుక్ సంస్థ 19 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.2 లక్షల కోట్లు)కు ఈ సంస్థను కొనుగోలు చేసింది. కాగా, గతేడాది సెప్టెంబర్‌లోనే బ్రయాన్ ఫేస్‌బుక్‌ను వదిలి కొత్త సంస్థలో చేరారు.

ఫేస్‌బుక్ డేటాతో ఏం చేస్తారు?

స్మార్ట్‌ఫోన్ వాడుతున్నవారిలో దాదాపు ప్రతీ ఒక్కరు ఫేస్‌బుక్ అకౌంట్ ఉన్నవారే. తమ వ్యక్తిగత, వృత్తిగత వివరాలను అందులో పొందుపర్చినవారే. రాజకీయం, సామాజికం, సాహిత్యం సహా దాదాపు అన్ని సమకాలీన అంశాలు, ఘటనలపై తమ అభిప్రాయాలను పంచుకున్నవారే. ఫేస్‌బుక్ వినియోగదారుల వివరాలతో కేంబ్రిడ్జ్ అనలిటికా అనే సంస్థ ఏం చేసింది? ఆ వివరాలను ఎందుకు, ఎలా వినియోగించింది? దాంతో తమకేం నష్టం?.. ఇలాంటి సందేహాలు, ప్రశ్నలు ఎన్నో వినియోగదారులను వేధిస్తున్నాయి.

సీఏ చేసే పనేంటి?

స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ లాబొరేటరీస్ (ఎస్‌సీఎల్) అనే సంస్థ బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తోంది. దీనికి అనుబంధంగా కేంబ్రిడ్జ్ అనలిటికా (సీఏ) అనే సంస్థ ఉంది. ఇది క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా డేటా విశ్లేషణలో సహకరిస్తుంది. ఫేస్‌బుక్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని వినియోగించుకుని తమ క్లయింట్ల ఎన్నికల ప్రచారానికి వ్యూహాలను సీఏ రూపొందిస్తుంది. ఏ పార్టీకి అనుకూలంగా ఓటర్లు ఉన్నారనే అంతర్గత సమాచారం, వ్యక్తిగత అభిప్రాయాలకు అనుగుణంగా క్లయింట్ల వ్యూహాలను సిద్ధం చేస్తుంది. ఎన్నికల్లో గెలిచేందుకు అసత్యవార్తలను ఫేస్‌బుక్‌లో ప్రచారం చేయటం, మాజీ గూఢచారులతో వ్యూహాలు రూపొందించటం కూడా సీఏ పనే. అవసరమైతే ప్రత్యర్థి అభ్యర్థులపై హానీ ట్రాప్ (అమ్మాయిలను ఎరగావేయటం)కూ వెనుకాడరని ఈ సంస్థపై ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని వెల్లడిస్తూ.. సీఏ సీఈఓ అలెగ్జాండర్ నిక్స్ బీబీసీ ఛానెల్ 4 'స్టింగ్ ఆపరేషన్'లో అడ్డంగా దొరికిపోవడం ద్వారానే ఈ డొంకంతా కదిలింది. అమెరికా ఎన్నికలు, బ్రెగ్జిట్‌తోపాటు, బ్రిటన్, ఇజ్రాయిల్‌లలో రాజకీయ నేతల తెర వెనక సమాచార సేకరణ కోసం మాజీ గూఢచారుల సేవలను వినియోగించుకున్నామని కూడా నిక్స్ వెల్లడించాడు.

యాప్‌లతో కొట్టేస్తారు..

ఫేస్‌బుక్‌లో వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని ఈ సంస్థ సేకరించి అధ్యయనం చేస్తుంది. గ్లోబల్ సైన్స్ రీసెర్చ్ అనే కంపెనీ 'పర్సనాలిటీ క్విజ్' అనే యాప్‌ను రూపొందించింది. దీన్ని దాదాపు 3 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్‌ను తెరిచేందుకు ఫేస్‌బుక్‌తో లాగిన్ కావాల్సి ఉంటుంది. అలాంటప్పుడు.. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వినియోగదారులతోపాటు వారి ఫేస్‌బుక్ మిత్రుల (మొత్తం సంఖ్య కోట్లలోనే) వివరాలు, వారి ఇష్టాయిష్టాలను ఈ సంస్థ తెలుసుకోగలిగింది. ఇలా అక్రమంగా సేకరించిన సమాచారంతో సీఏ 'సైకలాజికల్ ప్రొఫైల్స్'ను సృష్టించి విశ్లేషిస్తుంది. ఏం చేస్తే ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చు? వ్యతిరేకతనుంచి గట్టెక్కేందుకు ఎలాంటి వ్యతిరేక ప్రచారం చేయాలి? అనే వివరాలనూ ఈ సంస్థ సూచిస్తుంది.

ట్రంప్ వెనకా, బ్రెగ్జిట్ ముందూ.. సీఏనే!

ఒక్కో అమెరికా ఓటర్ నాడిని, మానసిక స్థితిని తెలుసుకోవటం కోసమే.. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో సీఏ పనిచేసిందని స్పష్టమైంది. తద్వారా ట్రంప్ అనుకూల ఎన్నికల ప్రచార వ్యూహాలు సిద్ధం చేసింది. అటు, బ్రెగ్జిట్ సందర్భంగా బ్రిటన్ ఓటర్లనూ ప్రభావితం చేయడంపై బ్రిటన్ విచారణ జరుపుతోంది.

భారత్‌లో ఇప్పటికే పునాదులు

భారత్‌లోని ఒవిలెనో బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఓబీఐ) గ్రూపు.. సీఏ మాతృ సంస్థ అయిన ఎస్‌సీఎల్‌తో 2010 నుంచి కలిసి పనిచేస్తుంది. 2014 ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు కోసం ఈ సంస్థ బీజేపీ, కాంగ్రెస్‌లను సంప్రదించినా డీల్ కుదరలేదని సమాచారం. 2019 ఎన్నికల కోసం ప్రస్తుతం ఈ రెండు పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు కథనాలు



అలెగ్జాండర్ నిక్స్

వస్తున్నాయి. భారత్‌లోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ తమ క్లయింట్లేనని ఓబీఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. 2016లో ఓ ప్రాంతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మా గ్రూపు ఎలాంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడలేదు' అని ఓబీఐ హెడ్ అమ్రిష్ త్యాగి (జేడీయూ మాజీ రాజ్యసభ సభ్యుడు కేసీ త్యాగి కుమారుడు) పేర్కొన్నారు.

2010 బిహార్ ఎన్నికల్లో..

2010 బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 'లోతైన ఎన్నికల విశ్లేషణ' జరిపినట్టు ఓబీఐ పేర్కొంది. ఈ కాంట్రాక్ట్‌లో భాగంగా వివిధ పార్టీల వైపు ఆసక్తి చూపే ఓటర్లను గుర్తించామని తెలిపింది. తమ సంస్థ పనిచేసిన సీట్లలో 90 శాతానికి పైగా స్థానాల్లో తమ క్లయింట్ విజయం సాధించినట్టు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అత్యధిక యువ ఓటర్లున్న భారత్‌లో యువత వచ్చే ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనుంది. 2019 ఎన్నికల్లో దేశంలోని 13.30 కోట్ల మంది ఓటర్లు తొలిసారి పోలింగ్ బూత్‌లకు రానున్న నేపథ్యంలో వారి నాడిని పసిగట్టేందుకు సామాజిక మాధ్యమాలే కీలకం కానున్నాయి. *–సాక్షి నాలెడ్జ్ సెంటర్*

రాజా, కనిమొళికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు



న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేసుకు సంబంధించి టెలికం మాజీ మంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళికి ఢిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు జారీచేసింది. ఈ కేసులో వారిని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కోరింది. మనీ ల్యాండరింగ్ కేసులోనూ వారిని నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఈడీ వేసిన పిటిషన్‌పై కూడా ఇలాంటి ఆదేశాలే జారీచేసింది. తదుపరి విచారణ జరిగే మే 25 లోగా స్పందనలు తెలపాలని వారికి సూచించింది.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి.. 29 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్ మరోమారు రక్తమోడింది. షియా ముస్లింలు పర్షియన్ నూతన సంవత్సర వేడుకల్లో ఉండగా.. జరిగిన ఆత్మాహతి దాడిలో కనీసం 29 వరకు మృతి చెందారు. ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిలో మరో 52 మంది వరకు గాయపడినట్లు ప్రభుత్వం తెలిపింది. 'కాబూల్ యూనివర్సిటీ, ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో ఈ దాడి జరిగింది. పోలీసు తనిఖీలకు చిక్కకుండా వెళ్లిన ఉగ్రవాది.. అక్కడ తనను తాను పేల్చేసుకున్నాడు' అని వెల్లడించింది.

వ్యక్తిగత సమాచారాన్ని ఎందుకు సేకరించారు?



న్యూఢిల్లీ: పౌరుల్ని గుర్తించడానికి ఆధార్ పథకాన్ని తీసుకొచ్చినప్పుడు వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి క్రోడీకరించాల్సిన అవసరం ఏమొచ్చిందని సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌ల రాజ్యాంగ ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. సింగపూర్‌లో ప్రతి పౌరుడు చిప్ ఆధారిత గుర్తింపు కార్డును కలిగిఉంటాడనీ, ఈ పద్ధతిలో పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వం సేకరించదని సుప్రీం వ్యాఖ్యానించింది. దీంతో ఆధార్‌పై నెలకొన్న భయాందోళనల్ని తొలగించడానికి వీలుగా న్యాయస్థానంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సీఈవో అజయ్ భూషణ్ పాండేను అనుమతించాలని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. గోప్యత హక్కు కంటే పేదప్రజలు గౌరవంగా బతకడమే ముఖ్యమన్నారు. దీంతో రాజ్యాంగ ధర్మాసనం స్పందిస్తూ.. పేదవారు కూడా గోప్యత హక్కును కలిగిఉంటారనీ, వాటిని ప్రభుత్వం ఉల్లంఘించలేదని స్పష్టం చేసింది.

రెండు గంటల్లో బీజింగ్ టు న్యూయార్క్



బీజింగ్: ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, బీజింగ్ నుంచి న్యూయార్క్‌కు రెండు గంటల్లోనే చేరుకోగల విమానాన్ని చైనా అభివృద్ధి చేస్తోంది. దీనిని పరీక్షించేందుకు ధ్వని వాయు సొరంగం (హైపర్‌సోనిక్ విండ్ టన్నెల్)ను చైనా నిర్మిస్తోందని ఆ దేశ అధికారిక మీడియా వెల్లడించింది. వాహనాలు రోడ్డుపైన, విమానాలు ఆకాశంలో వెళ్తున్నప్పుడు గాలి బలంగా వీస్తుండటం తెలిసిందే. కొత్తగా తయారైన వాహనాలు, విమానాలు తదితరాలపై అలా వీచే గాలి ప్రభావం ఎలా ఉంటుందో పరీక్షించడానికి ఏరోడైనమిక్స్ పరిశోధనల్లో వాయు సొరంగాలను ఉపయోగిస్తారు. ఇప్పుడు చైనా అభివృద్ధి చేస్తున్న కొత్త విమానం ధ్వని వేగానికి 25 రెట్ల అధిక వేగం (మ్యాక్ 25)తో ప్రయాణించగలదు. సాధారణ లెక్కల్లో చెప్పాలంటే గంటకు ఏకంగా 30,625 కిలోమీటర్ల వేగంతో ఇది ఆకాశంలో దూసుకుపోగలదు. అంత వేగంతో వెళ్తున్నప్పుడు దీనిపై గాలి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఆ పరిస్థితిని కృత్రిమంగా వాయుసొరంగంలో కల్పించి విమానాన్ని పరీక్షిస్తారు. అందుకోసమే చైనా ఈ 265 మీటర్ల పొడవైన సొరంగాన్ని నిర్మిస్తోందని అధికారిక మీడియా పేర్కొంది.

2 నుంచి హెచ్1బీ దరఖాస్తులు

వీసా ప్రీమియం ప్రాసెసింగ్ తాత్కాలికంగా రద్దు

- మళ్లీ ఎప్పుడు ప్రారంభించేదీ త్వరలో చెబుతాం: యూఎస్‌సీఐఎస్



వాషింగ్టన్: 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్1బీ వీసాల దరఖాస్తులను ఏప్రిల్ 2 నుంచి స్వీకరిస్తామని అమెరికా పౌర, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. అయితే 2019 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్1బీ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్‌ను మాత్రం తాత్కాలికంగా నిలిపివేయనున్నామని తెలిపింది. 2019 ఆర్థిక సంవత్సరం పరిమితి కిందకు రాని హెచ్1బీ వీసాల దరఖాస్తులైతే ప్రీమియం ప్రాసెసింగ్ కోసం కూడా అభ్యర్థించవచ్చని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా హెచ్1బీ వీసాతోపాటు ప్రీమియం ప్రాసెసింగ్‌కూ కలిపి ఒకేసారి దరఖాస్తు చేస్తే (2019 ఆర్థిక సంవత్సరం కింద) ఆ అప్లికేషన్లను తిరస్కరిస్తామంది. ప్రీమియం ప్రాసెసింగ్‌ను సెప్టెంబరు 10న తిరిగి ప్రారంభించే అవకాశం ఉందనీ, కచ్చితంగా ఎప్పుడు ఆరంభించేదీ త్వరలో ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ చెప్పింది. అమెరికాలోని కంపెనీలు కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాల్లో విదేశీయులను నియమించుకునేందుకు వెసులుబాటు కల్పించేవే ఈ హెచ్1బీ వీసాలు. భారత్, చైనా తదితర దేశాల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా హెచ్1బీపైనే అమెరికాకు వెళ్తుంటారు. ఒకసారి వీసా పొందితే మూడేళ్లు అక్కడ ఉద్యోగం చేసుకోవచ్చు. వీసాను మరో మూడేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంటుంది.

ఏమిటీ ప్రీమియం ప్రాసెసింగ్?

దరఖాస్తుదారులు కొంత అధిక రుసుము చెల్లించి తమ హెచ్1బీ వీసా దరఖాస్తును వేగవతంగా పరిశీలించాల్సిందిగా యూఎస్‌సీఐఎస్‌ను కోరడమే ప్రీమియం ప్రాసెసింగ్. సాధారణంగా ప్రీమియం ప్రాసెసింగ్ కింద వచ్చిన దరఖాస్తులను యూఎస్‌సీఐఎస్ 15 రోజుల్లోపే పరిశీలించి ఆమోదించడమో, తిరస్కరించడమో చేస్తుంది. ఈసారి ప్రీమియం ప్రాసెసింగ్ లేకపోయినప్పటికీ.. వీసా దరఖాస్తులను తొందరగా పరిశీలించాల్సిందిగా అభ్యర్థులు విజ్ఞప్తి చేసే అవకాశాన్ని ఇస్తున్నామనీ, అయితే ఇందుకు కొన్ని షరతులు ఉన్నాయని యూఎస్‌సీఐఎస్ చెప్పింది. ప్రీమియం ప్రాసెసింగ్‌ను నిలిపివేయడం వల్ల సాధారణ హెచ్1బీ దరఖాస్తులను వేగంగా పరిశీలించే వెసులుబాటు తమకు లభిస్తుందని తెలిపింది.

పదేళ్లలో భారత్ నుంచి 22 లక్షలు

అమెరికాలో ఆర్థిక సంవత్సరం అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు ఉంటుంది. ఒక్కో ఆర్థిక సంత్సరానికి 65 వేల హెచ్1బీ వీసాలను యూఎస్‌సీఐఎస్ మంజూరు చేస్తుంది. ఇవి కాకుండా మరో 20 వేల వీసాలను అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చదివిన వారి కోసం ప్రత్యేకంగా కేటాయించారు. అలాగే ఉన్నత విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల్లో పని చేసేందుకు వచ్చే వారికి కూడా 65 వేల పరిమితితో సంబంధం లేకుండా హెచ్1బీ వీసాలు ఇస్తారు. 2007 నుంచి 2017 మధ్య హెచ్1బీ కోసం అత్యధికంగా భారత్ నుంచి ఏకంగా 22 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఈసారి కౌగిలింతా? రాద్ధాంతమా?

డోక్లాం వ్యవహారంలో మోదీపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



శృంగేరీ మఠంలో రాహుల్

న్యూఢిల్లీ/సాక్షి,బెంగళూరు: దక్షిణ డోక్లాం చేరుకోవడానికి చైనా కొత్త మార్గం తెరుస్తోందన్న వార్తల నేపథ్యంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పరిణామాన్ని ప్రధాని ఎలా ఎదుర్కొంటారు?కౌగిలింత దౌత్యంతోనా? లేక రక్షణ మంత్రిని బాధ్యురాలిని చేస్తారా? అంటూ ట్వీట్ చేశారు. 'డోక్లాంలో మళ్లీ చైనా జోరు పెరిగింది. ఈసారి మోదీ ఎలా స్పందిస్తారు? 1.కౌగిలింత దౌత్యం 2.రక్షణ మంత్రిని బాధ్యురాల్ని చేయడం 3. బహిరంగ విమర్శలు 4. పైవన్నీ' అని పేర్కొన్నారు.

నానమ్మలాగే ఆదరించండి: గతంలో నానమ్మ ఇందిరా గాంధీని ఆదరించినట్లుగానే తననూ ఆశీర్వదించాలని రాహుల్ గాంధీ ప్రజలను కోరారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన చిక్కమగళూరులో పర్యటించారు. జిల్లా ప్రజలు తన నానమ్మ ఇందిర చారిత్రక గెలుపునకు కారకులయ్యారని గుర్తుచేశారు. సంప్రదాయ పట్టు పంచెను ధరించిన రాహుల్.. ప్రఖ్యాత శృంగేరీ క్షేత్రంలోని శారదాంబ ఆలయం, జగద్గురు శంకరాచార్య మఠాలను సీఎం సిద్ధరామయ్యతో కలిసి సందర్శించి పూజలు చేశారు. బుధవారంతో కర్ణాటకలో రాహుల్ రెండు రోజుల పర్యటన ముగిసింది.

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఐదుగురు భద్రతా సిబ్బంది మృతి
- ఎదురుకాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతం



కుప్వారాలో అప్రమత్తంగా భద్రతాబలగాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బుధవారం ఐదుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూకశ్మీర్ పోలీస్ విభాగంలో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్‌వోజీ)కు చెందిన మొహమ్మద్ యూసుఫ్, దీపక్ పండిట్‌లతో పాటు ఆర్మీలోని 160వ బెటాలియన్‌కు చెందిన మొహమ్మద్ అష్రఫ్, నాయక్ రంజిత్ సింగ్, మరో జవాన్ ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయినట్లు ఆ రాష్ట్ర డీజీపీ ఎస్పీ వైద్ తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడినట్లు వెల్లడించారు. ఉగ్రవాదుల ఏరివేతలో భద్రతా బలగాలతో పాటు పారా కమెండోలు కూడా పాల్గొన్నారన్నారు. బుధవారం రాత్రివరకూ సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదుల్ని హతమార్చామనీ, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మృతులంతా విదేశీయులేనని ఆయన స్పష్టం చేశారు. ఘటనాస్థలం నుంచి ఏకే–47 తుపాకులతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నియంత్రణ రేఖ(ఎల్వోసీ) దాటి కుప్వారాలోని హల్మత్‌పొరా ప్రాంతానికి మంగళవారం చేరుకున్న ఉగ్రవాదులు అక్కడ మద్దతుదారులతో కలసి విందులో పాల్గొన్నారన్నారు. అనంతరం వీరు కుప్వారా పట్టణానికి బయలుదేరుతుండగా పోలీస్ గస్తీ బృందం ఎదురుపడిందన్నారు. దీంతో ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరుపుతూ పరారయ్యేందుకు యత్నించారని వెల్లడించారు. అప్రమత్తమైన పోలీసులు ఎదురుకాల్పులు జరుపుతూ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారన్నారు.

'ఆయుష్మాన్ భారత్'కు ఓకే

పట్టు పరిశ్రమ అభివృద్ధికి రూ.2,161 కోట్లు

- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా భావిస్తున్న 'ఆయుష్మాన్ భారత్'ను ప్రారంభించడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఈ పథకం ద్వారా ఏటా 10 కోట్ల పేద కుటుంబాలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని సంకల్పించిన సంగతి తెలిసిందే. అలాగే, పట్టు పరిశ్రమ అభివృద్ధికి రూ.2,161 కోట్లు కేటాయించడానికి సమ్మతించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర నిధులతో అమలవుతున్న రాష్ట్రీయ స్వస్థ్య బీమా యోజన(ఆర్‌ఎస్‌బీవై), సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం(ఎస్‌సీహెచ్‌ఐఎస్) పథకాలను ఆయుష్మాన్ భారత్‌లో విలీనం చేయనున్నారు.

ఇతర నిర్ణయాలు..

దేశంలో సెరీకల్చర్‌ను ప్రోత్సహించడానికి పట్టు పరిశ్రమ అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ.2,161.68 కోట్లు వెచ్చించాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే ఈ రంగంలో ఉత్పాదక ఉద్యోగుల సంఖ్య 85 లక్షల నుంచి కోటికి పెరిగే అవకాశాలున్నాయి.

➲ఓబీసీల ఉపవర్గీకరణపై ఏర్పాటైన జస్టిస్ జి.రోహిణి కమిటీ పదవీ కాలం జూన్ 20 వరకు పొడిగింపు.

➲వాణిజ్య సరోగసీని నిషేధించి, షరతులకు లోబడి పిల్లలు లేని దంపతులకు నైతిక సరోగసీకి వీలుకల్పించేలా చట్టంలో సవరణ చేయడానికి ఆమోదం.

అమ్మ ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించింది

జైలు శిక్ష కుంగదీసింది ● విచారణ కమిషన్‌కు శశికళ అఫిడవిట్

సాక్షి, చెన్నై: అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత (అమ్మ) ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించిందని ఆమె నెచ్చెలి శశికళ ఓ అఫిడవిట్‌లో తెలిపారు. జయ మరణానికి దారితీసిన పరిస్థితులను విచారిస్తున్న ఆరుముగసామి కమిషన్‌కు శశికళ తరపు లాయర్ సమర్పించిన ఆ అఫిడవిట్ వివరాలు బుధవారం వెలుగులోకి వచ్చాయి. అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్లి, బెయిల్ మీద బయటకు వచ్చాక జయలలిత తీవ్ర మనోవేదనకు గురయ్యారని శశికళ పేర్కొన్నారు. ఆ తర్వాత ఆమె ఆరోగ్యం క్రమంగా క్షీణించిందనీ, 2016 సెప్టెంబరు 22న రాత్రి బాత్‌రూంలో పడిపోవడంతో డాక్టర్ శివకుమార్‌ను పిలిపించానని తెలిపారు. అపోలో ఆస్పత్రికి వెళ్లే దారిలోనే జయ స్పృహలోకి వచ్చి, ఆస్పత్రికి వద్దే వద్దని కోప్పడ్డారన్నారు. జయ ఆరోగ్య పరిస్థితి, చికిత్స జరిపిన వైద్యులు, డిసెంబరు ఐదు వరకు ఆమెను ఎవరెవరు పరామర్శించారు తదితర వివరాలను ప్రమాణ పత్రంలో పొందుపరిచారు.

రాష్ట్రంలో గిరిజన, కేంద్రీయ వర్సిటీలపై ఉపరాష్ట్రపతి సమీక్ష

పాల్గొన్న కేంద్ర మంత్రులు జవదేకర్, అనంతకుమార్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటు అంశంపై ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సమీక్షించారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్, మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి రెడ్డి సుబ్రమణ్యంలను ఉప రాష్ట్రపతి తన కార్యాలయానికి ఆహ్వానించి వీటిపై చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు పాల్గొన్నారు. ఆయా వర్సిటీల స్థాపనకు వీలుగా కేబినెట్ నోట్ తయారైందని, వీటిని పరిశీలన నిమిత్తం కేంద్ర న్యాయశాఖకు పంపారని, అక్కడి నుంచి రాగానే కేబినెట్‌కు నివేదిస్తారని జవదేకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో న్యాయశాఖతో మాట్లాడి త్వరితగతిన పరిశీలన పూర్తిచేయాలని సూచించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తాత్కాలిక వసతి గృహాల్లో ఈ సంస్థలు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచించారు. ఇప్పటికే నెల్లూరు సమీపంలోని చవటపాళెం పరిధిలో శంకుస్థాపన చేసిన ఎన్‌సీఈఆర్టీ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన భూమి గురించి కూడా ఏపీ సీఎం కార్యదర్శి సతీష్ చంద్రతో మాట్లాడారు. మైసూరులో ఉన్న ఓరియంటల్ లాంగ్వేజెస్ కేంద్రానికి డైరెక్టర్ నియామకాన్ని త్వరగా పూర్తిచేయాలని, తెలుగు శాఖను తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే న్యూఢిల్లీలోని జేఎన్‌యూలో తెలుగుశాఖను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చంద్రబాబు డ్రామాలో పావులు కావొద్దు

మంత్రులకు కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం హితవు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కాపుల మధ్య విభేదాలు సృష్టించేందుకు సీఎం చంద్రబాబు ఆడే డ్రామాలో పావులు కావొద్దని కాపు సామాజిక వర్గానికి చెందిన మంత్రులకు కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం హితవు పలికారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై మంత్రులు చేసిన విమర్శలను ఆయన ఖండించారు. స్థానిక కాపునాడు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కాపుసామాజిక వర్గానికి చెందిన మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, నారాయణ, కె కళావెంకట్రావు అధికారపార్టీ సామాజిక కుట్రలో పావులుగా మారారని ఆరోపించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన పవన్‌కళ్యాణ్‌పై ఆ కులానికి చెందిన మంత్రుల చేత విమర్శలు చేయిస్తూ చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న ముద్రగడ విషయంలోనూ ఇదే రీతిలో విమర్శలు చేయించారని గుర్తు చేశారు. పవన్‌కల్యాణ్ టీడీపీకి మిత్రుడుగా ఉన్నంతకాలం నోరెత్తని మంత్రులు బయటకు రాగానే విమర్శలు చేయడం సరికాదన్నారు. పవన్‌కు అవగాహన లేదని మాట్లాడుతున్న మంత్రులు రాని రిజర్వేషన్లు ఇస్తామని కాపులను భ్రమల్లో పెట్టి చంద్రబాబు మోసం చేస్తే ఎందుకు సమర్థించారో చెప్పాలన్నారు. వంగవీటి మోహనరంగాను హత్యచేయించిన పార్టీలో కొనసాగుతున్న కాపు మంత్రులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. టీడీపీ అధినేత సొంత సామాజిక వర్గం రాజధాని ముసుగులో అక్రమ ఆస్తులు కూడగడుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్న విషయాన్ని మంత్రులు గమనించాలని కోరారు. ఇకనైనా అధికార పార్టీలోని కాపునాయకులు మేలుకుని జాతి ప్రయోజనాల కోసం పనిచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కూనపు రెడ్డి రమేష్, అర్బన్ ఉపాధ్యక్షులు అచ్చుకోల శివరంగారావు పాల్గొన్నారు.

బీజేపీవి శిఖండి రాజకీయాలు: టీడీపీ

సాక్షి, అమరావతి: తమిళనాడుకు చెందిన అన్నా డీఎంకే పార్టీని అడ్డం పెట్టుకొని భారతీయ జనతాపార్టీ శిఖండి రాజకీయాలు చేస్తోందంటూ తెలుగుదేశం పార్టీ విమర్శించింది. బుధవారం తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం విషయంలో కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుపట్టారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అన్నా డీఎంకే ఎంపీలను అడ్డం పెట్టుకొని బీజేపీ శిఖండి రాజకీయాలను చేస్తోందంటూ జీవీ ఆంజనేయులు విమర్శించారు. తమిళనాడులో పళనిస్వామి, పన్నీరు సెల్వంలు బీజేపీ తొత్తులుగా మారి సభను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు.

సమాధానం చెప్పుకోలేకపోతున్నాం

- కనీస మందులు కూడా లేవని చెబుతున్నారు..
- ఏపీఎంఎస్ఐడీసీ అధికారి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు
- ఉన్నతాధికారి వద్ద సూపరింటెండెంట్‌ల ఆవేదన

సాక్షి, అమరావతి: మందులు సక్రమంగా అందకపోవడంతో రోగులకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వారు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యను కలిసి పరిస్థితి వివరించినట్టు తెలిసింది. ప్రభుత్వాస్పత్రులకు మందులు సరఫరా చేసే రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) రకరకాల కొర్రీలు పెడుతూ రోగులకు మందులు ఇవ్వడం లేదని వివరించారు. ఏపీఎంఎస్ఐడీసీ జనరల్ మేనేజర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని.. మందులు లేక ప్రజల ప్రాణాలు పోతున్నాయని చెబుతున్నా ఇండెంట్‌లు లేవని, మందులు ఆఫ్‌లైన్‌లో పెట్టామని, కొన్ని మందులు అందుబాటులో లేవంటూ రకరకాల కారణాలు చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్నవారు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో అత్యవసర మందులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రోగుల విషయంలో పట్టువిడుపులు ముఖ్యమని.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే.. తాము రోగులకు ఏమని సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా మందులు సరఫరా చేసే వారికి కూడా బిల్లులు చెల్లించకుండా వేధిస్తుండటంతో వారు ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

మొబైల్ యాప్‌లో 'రైల్వేస్టేషన్'

- స్టేషన్‌లోని అన్ని సదుపాయాలు ఇక సెల్‌ఫోన్‌లో..
- నేడు కాచిగూడలో ప్రారంభించనున్న జీఎం

సాక్షి, హైదరాబాద్: మీరు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారా? అక్కడ లభించే సేవల గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే ఇక మీరు ఏ అధికారిని, సిబ్బందిని సంప్రదించాల్సిన పనిలేదు. మీ స్మార్ట్‌ఫోన్‌లో ఒక మొబైల్ యాప్‌ను ఓపెన్ చేస్తే చాలు. రైల్వేస్టేషన్ సేవలు ప్రత్యక్షమవుతాయి. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టనున్న మొబైల్ యాప్ సేవలను దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌యాదవ్ గురువారం ప్రారంభించనున్నారు. 'రైల్వేస్టేషన్ ఇన్ఫో'అనే మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రయాణికులు కాచిగూడ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే సుమారు 60 ఎంఎంటీఎస్ రైళ్ల టైంటేబుల్, లోకల్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకల వివరాలతో పాటు స్టేషన్‌లో బుకింగ్ సదుపాయం, రిజర్వేషన్ సేవలు తదితర సదుపాయాలు ఎక్కడ లభిస్తాయో తెలుసుకోవచ్చు. ప్రయాణికుల ఫిర్యాదులపై అధికారుల స్పందన కూడా తెలుసుకోవచ్చు.

నవరస్ అనే మరో యాప్..

స్టేషన్ నేవిగేషన్ సదుపాయం 'నవ్‌రస్'అనే మరో మొబైల్ యాప్ ద్వారా లభిస్తుంది. ఈ నావిగేషన్ సూచీ ఆధారంగా ప్రయాణికులు ఎవరి సాయం లేకుండా ఒక చోట నుంచి మరో చోటకు నేరుగా వెళ్లిపోవచ్చు. రైల్వేస్టేషన్‌కు కొత్తగా వచ్చే వారికి, పర్యాటకులకు ఈ యాప్ సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

మోదీ పంపిన స్లిప్ చూసి మాట్లాడుతున్నారు..


బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజుపై మంత్రి సునీత విమర్శ

సాక్షి, అమరావతి: అసెంబ్లీలో బీజేపీ నాయకుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడిన మాటలు ప్రధాన మంత్రి మోదీ రాసిచ్చిన మాటల్లా ఉన్నాయని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. బుధవారం సీఎం నివాసం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. రాయలసీమ జిల్లాలకు నీళ్లొచ్చాయంటే అది పట్టిసీమ వల్లేనని, సీఎం బాగా పనిచేస్తున్నారని గతంలో అన్న విష్ణుకుమార్‌రాజు ఈరోజు అసెంబ్లీలో సీఎం అవినీతి చేస్తున్నారంటూ మాట్లాడటం చూస్తుంటే ఎవరో ఆయన చేత మాట్లాడిస్తున్నట్లు ఉందని అన్నారు. కేంద్రబడ్జెట్‌లో నిధులొస్తాయని ఆశపడ్డ రాష్ట్ర ప్రజలకు మోదీ తెచ్చిన మట్టి, నీళ్లు మాత్రమే మిగిలాయన్నారు.

అసెంబ్లీలో ఆర్థిక మండలి బిల్లు

- ఆర్థిక, న్యాయ శాఖల అభ్యంతరాలను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రయాణ ఖర్చులు, ఇతర వ్యయాలకు లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదు
- ఈ వ్యయానికి ప్రభుత్వ ఆమోదం అక్కర్లేదు
- స్థిర, చరాస్తుల సేకరణ, విక్రయించే అధికారం మండలికి దారాదత్తం
- భూముల పందేరం, రాయితీలపై ప్రభుత్వ పెద్దలకు మరింత వెసులుబాటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక మండలి బిల్లును బుధవారం ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ముఖ్యమంత్రి తరఫున శాసనసభలో ప్రవేశపెట్టారు. సింగపూర్ తరహాలో రాష్ట్ర ఆర్థిక మండలిని ఏర్పాటు చేస్తూ 2016 మార్చి 17న ప్రభుత్వం జీవో 87ను జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆర్థిక మండలి తీసుకునే నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ మండలికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని కేబినెట్ ఆమోదించిన ముసాయిదా బిల్లులో తొలుత ఉన్నప్పటికీ తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులో స్వయంప్రతిపత్తి అనే పదం తొలగించారు. ఆర్థిక మండలి తీసుకునే నిర్ణయాలను కోర్టులు సైతం ప్రశ్నించడానికి వీల్లేదంటూ బిల్లులో స్పష్టం చేశారు. తాను తీసుకునే నిర్ణయాలను కోర్టులు ప్రశ్నించడానికి వీల్లేదంటూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీ ముఖ్యమంత్రి ఏకంగా కొత్త చట్టాన్నే తీసుకొస్తుండడం గమనార్హం.



(Act.No.45 of 1860).

Protection of action taken in good faith. 32. No suit, prosecution or other legal proceeding shall lie against the Board, or any member, officer, employee or consultant of the Board in respect of anything which is done or intended to be done in good faith, or any contract of any kind entered into by the Board in good faith in pursuance of this Act, or the regulations made, or orders or directions issued thereunder.

Bar of jurisdiction. 33. No Court shall have jurisdiction to entertain any suit or proceedings issued by the Board or any Officer, employee or consultant of the Board in pursuance of any power conferred by or in relation to its or his functions under this Act.

Power to make regulations. 34. The Board may make regulations consistent with the provisions of this Act to carry out the purposes of this Act.

Provided that, the Chief Executive Officer may make regulations with the approval of the Board, whenever required.

ఆర్థిక మండలి తీసుకునే నిర్ణయాలను కోర్టులు సైతం ప్రశ్నించడానికి వీల్లేదంటూ బిల్లులో పేర్కొన్న ప్రభుత్వం

అభ్యంతరాలు బేఖాతరు

రాష్ట్ర ఆర్థిక మండలికి చట్టబద్ధత కల్పించే ముసాయిదా బిల్లులో పలు అంశాలు బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నాయని, పలు ప్రభుత్వ శాఖలు చేయాల్సిన పనులపై మండలి గుత్తాధిపత్యం సాధించే అంశాలున్నాయని ఆర్థిక శాఖ, న్యాయ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఆ అభ్యంతరాలను లెక్కచేయకుండా కేవలం స్వయంప్రతిపత్తి అనే పదం లేకుండా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టారు. ఆర్థిక మండలి తీసుకునే నిర్ణయాలను ఏ న్యాయస్థానాల్లోనూ సవాల్ చేయడానికి వీల్లేదని బిల్లులో స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ మండలి పనిచేస్తుందని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులో ఏముందంటే... ''ఈ చట్టం ద్వారా సంక్రమించిన ఏదైనా అధికారం లేదా ఏదైనా దావా లేదా బోర్డు లేదా బోర్డుకు చెందిన ఎవరైనా అధికారి, ఉద్యోగి లేదా కన్సల్టెంట్ జారీ చేసిన ప్రొసీడింగ్‌ను విచారణకు స్వీకరించడానికి ఏ న్యాయస్థానము అధికార పరిధిని కలిగి ఉండదు. ఈ చట్టం కింద ఎవరైనా సభ్యుడు, అధికారి లేదా ఉద్యోగి లేదా కన్సల్టెంట్‌పై ఎట్టి దావా, అభియోగం లేదా ఇతర శాసనిక చర్య తీసుకోరాదు''.

అధికారాలు ఆర్థిక మండలికే..

మండలి తీసుకునే నిర్ణయాలను తప్పుపట్టే పిటీషన్లను ఏ న్యాయస్థానాలు కూడా అనుమతించరాదని బిల్లులో పేర్కొన్నారు. అధికారులు చేసే ప్రయాణాల ఖర్చులు, ఇతర వ్యయాలకు సంబంధించి లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బోర్డు, అధికారుల కార్యకలాపాల నిర్వహణకు బడ్జెట్ నుంచి అయ్యే ఆర్థిక వ్యయానికి ప్రభుత్వం నుంచి ఆమోదం పొందాల్సిన అవసరం లేదని బిల్లులో తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి నేతృత్వంలోని పారిశ్రామిక పెట్టుబడి ప్రోత్సాహక మండలిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నేతృత్వంలోని పారిశ్రామిక పెట్టుబడి ప్రోత్సాహక కమిటీని, సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థిక మండలిలో విలీనం చేస్తున్నారు. స్థిర, చరాస్తులను సేకరించే అధికారం, తన వద్దే వాటిని అట్టిపెట్టుకునే అధికారం, వాటిని విక్రయించే అధికారాన్ని ఆర్థిక మండలికి చట్టం ద్వారా కల్పిస్తున్నారు. ఈ విషయాన్ని బిల్లులో స్పష్టం చేశారు. మండలి ప్రధాన కార్యాలయం అమరావతిలో ఉంటుంది. దేశ, విదేశాల్లోని వివిధ ప్రాంతాల్లో కార్యాలయాలను, ప్రతినిధులను ఏర్పాటు చేస్తారు. ఆర్థిక మండలి ముఖ్య కార్యనిర్వహణ అధికారిని ప్రభుత్వం లేదా ప్రైవేట్ రంగం నుంచి తీసుకోవచ్చని బిల్లులో తెలిపారు. ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం ద్వారా ప్రభుత్వ పెద్దలు తమకు నచ్చిన ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు ఇష్టారాజ్యంగా భూములు కేటాయించేందుకు, రాయితీలు కల్పించేందుకు మార్గం సుగమమైంది. వాటిని కోర్టులు ప్రశ్నించేందుకు అధికారం ఉండదు.

పల్స్ సర్వేతో ప్రభుత్వానికి చెడ్డపేరు

- వలస వెళ్లిన వారికి పథకాలు వర్తించడం లేదు
- అసెంబ్లీలో పలువురు సభ్యులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చేపట్టిన సాధికార సర్వే (పల్స్ సర్వే)తో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని పలువురు శాసన సభ్యులు అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పల్స్ సర్వేపై పలువురు సభ్యులు మాట్లాడారు. సాధికార సర్వే దేని ఆధారంగా చేపట్టారని, దీనివల్ల ప్రయోజనం ఏంటో చెప్పాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. మరో సభ్యుడు జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వలసలు వెళ్లి తిరిగి వచ్చిన వారికి ప్రభుత్వ పథకాలు అందించడంలేదన్నారు. కుటుంబం యూనిట్‌గా తీసుకున్నప్పుడు ఆ కుటుంబంలో పెళ్లిళ్లు చేసుకుని మరో కుటుంబంగా ఏర్పడ్డ వారిపేర్లు పల్స్ సర్వేలో లేవని, దీంతో వారికి పథకాలు అందించడం లేదని చెప్పారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు సమాధానమిస్తూ.. అందరికీ పథకాలు అందిస్తామన్నారు.

మేనిఫెస్టోలో పెట్టి చెయ్యకపోతే ఎలా?

రాష్ట్రవ్యాప్తంగా 500 జనాభా దాటిన గిరిజన తండాలను పంచాయతీలుగా చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాం.. ఇప్పుడు కుదరదంటే ఎలాగని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గిరిజన తండాలను పంచాయతీలుగా గుర్తించకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మరో ఎమ్మెల్యే ఆంజనేయులు మాట్లాడుతూ మేనిఫెస్టోలో పెట్టాక విధిగా చేయాల్సి ఉందనగా, శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఐటీడీఏలు కాకుండా మైదాన ప్రాంతాల్లోని గిరిజన తండాల్లో మౌలిక వసతుల్లేవన్నారు. ఎమ్మెల్యే మాధవనాయుడు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఐదు గిరిజన గ్రామాలు ఐటీడీఏ పరిధిలో లేకపోవడం వల్ల లోన్లు కూడా రావడం లేదన్నారు. గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పలు గిరిజన గ్రామాల్లో గిరిజనేతరులు నకిలీ కులధ్రువీకరణ పత్రాలు తెచ్చుకుని గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. కొన్ని గిరిజన గ్రామాలకు ఇప్పటికీ రోడ్లు, రక్షిత తాగునీరు లేదని వరుపుల సుబ్బారావు చెప్పగా, తన నియోజకవర్గంలో రోడ్లు సరిగా లేకపోవడంతో ఎన్నికలు జరపాలంటే అధికారులు హెలికాప్టర్‌లో రావాల్సి ఉందని పాలపర్తి డేవిడ్‌రాజు తెలిపారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రి నక్కా ఆనందబాబు సమాధానమిస్తూ.. 500 జనాభా దాటిన గిరిజన తండాలను పంచాయతీలుగా గుర్తించడం ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామన్నారని, ఇప్పటివరకూ ఎంతమందికిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు, లోకేశ్ జైలుకెళ్లడం ఖాయం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్
- ఎక్కడ అరెస్ట్ చేస్తారన్న భయంతోనే అనుకూల మీడియాలో సానుభూతి కథనాలు



విజయవాడ సిటీ: 'చంద్రబాబు అవినీతి బండారం బయట పడడం ఖాయం. ఆయనతో పాటు దోపిడీకి పాల్పడిన ఆయన కుమారుడు లోకేశ్, మంత్రులు దోచుకున్న అవినీతి సొమ్మును కక్కించి జైలుకు పంపుతారు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ చెప్పారు. పోలవరం నిర్మాణంలో, పట్టిసీమ ప్రాజెక్టులో, రాజధాని భూముల విషయంలో చంద్రబాబు, ఆయన మంత్రులు విచ్చలవిడి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వీటి సమాచారం కేంద్రం వద్ద ఉండడంతో ఎక్కడ దాడులు, అరెస్టులు చేస్తారోననే భయంతో ముందుగానే చంద్రబాబుపై ప్రజల్లో సానుభూతి కలిగేలా అనుకూలమైన మీడియాలో కథనాలు వండుతున్నారని దుయ్యబట్టారు. ఆ పత్రికలు ఎన్ని కథనాలు వండినా కేంద్రం చూస్తూ ఊరుకోదని, అవినీతికి పాల్పడిన వారు జైలుకెళ్లక తప్పదని స్పష్టం చేశారు. విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టిన చంద్రబాబు.. హోదా కోసం నాలుగేళ్లుగా పోరాడుతున్న వైఎస్ జగన్‌ను బీజేపీ కోవర్టు అనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు కోవర్టువు నువ్వు కాదా చంద్రబాబూ.. అని ప్రశ్నించారు. గత నాలుగేళ్లుగా దేశంలో ఏ జాతీయ పార్టీ అయినా, ప్రాంతీయ పార్టీ అయినా ప్రధాని నరేంద్ర మోదీని చూసి పారిపోతున్న పరిస్థితుల్లో.. ప్రత్యేక హోదా కోసం, రాష్ట్ర భవిష్యత్ కోసం ఏకంగా నరేంద్ర మోదీ ప్రభుత్వంపైనే అవిశ్వాసం ప్రవేశపెట్టిన ధీరుడు, మొనగాడు వైఎస్ జగన్ ఒక్కడేనని, ఈ విషయంలో జగన్ సాహసాన్ని జాతీయ పత్రికలు, మేధావులు కొనియాడుతుంటే చంద్రబాబు మాత్రం విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. 'ప్రత్యేక హోదా వద్దు.. ప్యాకేజీ కావాలని అడిగింది నువ్వు.. విశాఖపట్నంలో ఎయిర్‌పోర్టులో హోదా ఉద్యమంలో పాల్గొనేందుకు వచ్చిన జగన్‌ను అడ్డుకుంది నువ్వు.. హోదా కోసం విద్యార్థుల ఉద్యమాన్ని పోలీసులతో అణిచివేయించింది నువ్వు కాదా..' అని ప్రశ్నించారు.

నీ 40 ఏళ్ల అనుభవం ఏమైంది?

నీకు రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉండి కూడా ఎంపీల రాజీనామాల విషయంలో.. కేంద్రంపై అవిశ్వాసం పెట్టే విషయంలో 40 ఏళ్ల యువకుడి బాటలో నడవాల్సిన పరిస్థితి వచ్చిందని చంద్రబాబును ఎద్దేశా చేశారు. ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్షతో ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డ జగన్ పై నిందలు వేస్తే ప్రజలు చూస్తే ఊరుకోరని హెచ్చరించారు. రాష్ట్రం కోసం, ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్నట్లుగా నువ్వు అసెంబ్లీలో మాట్లాడుతుంటే.. బల్లలు చరచలేక నీ ఎమ్మెల్యేలు నీరసపడిపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంపై గుండెలు బాదుకుంటున్న మంత్రి దేవినేని ఉమాను జైలుకు పంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

'యూనిట్ల' మాయాజాలం

- ప్రభుత్వ వైద్య కళాశాలల్లో తప్పుడు లెక్కలు
- 6 యూనిట్లు ఉంటే 7 యూనిట్లు ఉన్నట్లు ఎంసీఐకి సమాచారం
- ఎంబీబీఎస్ సీట్లను కాపాడుకునేందుకు తిప్పలు

సాక్షి, అమరావతి: సరైన మౌలిక వసతులు లేని ప్రైవేట్ వైద్య కళాశాలు 200 నుంచి 250 దాకా ఎంబీబీఎస్ సీట్లను తెచ్చుకుని విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తుండగా, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్న సీట్లనే కాపాడుకునేందుకు నానా తిప్పలు పడుతుండడం విస్మయ పరుస్తోంది. తాజాగా వివిధ కళాశాలల్లో భారత వైద్య మండలి(ఎంసీఐ) తనిఖీలు నిర్వహించినప్పుడు.. యూనిట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ యూనిట్లను చూపించి సీట్లను కాపాడుకున్న తీరు విస్మయానికి గురిచేసింది. ఇన్నాళ్లూ ప్రైవేట్ కాలేజీలు ఇలాంటి అక్రమాలకు పాల్పడేవి. తిమ్మిని బమ్మిని చేసి ఉన్న సీట్లను కాపాడుకోవడమో, కొత్త సీట్లు తెచ్చుకోవడమో చేసేవి. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలు సైతం అదేదారిలో నడుస్తున్నాయి. ప్రమాణాలను మెరుగుపర్చుకుని కొత్త సీట్లు తెచ్చుకోవాల్సింది పోయి, ఉన్న సీట్లను కాపాడుకునేందుకు ప్రయాస పడుతుండడం గమనార్హం.

యూనిట్ల లెక్కింపులో మాయాజాలం

రాష్ట్రంలో మెజారిటీ వైద్య కళాశాలల్లో 200 సీట్ల దాకా ఉన్నాయి. ఎంసీఐ అధికారులు ఏమాత్రం కఠినంగా వ్యవహరించినా ఒక్కో కాలేజీలో 50 సీట్లు ఎగిరిపోయే అవకాశం ఉంది. రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలు ఉన్నాయి. గుంటూరు, విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, తిరుపతి వైద్య కళాశాలల్లో 200 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున ఉన్నాయి. ఏ కాలేజీలో అయినా 200 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే ఎంసీఐ నిబంధనల ప్రకారం జనరల్ మెడిసిన్‌లో గానీ, జనరల్ సర్జరీలో గానీ 7 యూనిట్లు ఉండాలి. అంటే ప్రతి 30 పడకలకు ఒక యూనిట్ అన్నమాట. కానీ ప్రతి కాలేజీలో 6 యూనిట్లే ఉన్నాయి. ఎంసీఐ తనిఖీల్లో ఈ వాస్తవాలు బయటపడితే 50 సీట్లు తగ్గించే ప్రమాదం ఉంది. ప్రతిసారీ ఎంసీఐ తనిఖీల్లో ఏదో ఒక మాయ చేసి నెట్టుకొస్తున్నారు. కాగా యూనిట్ల సంఖ్యను 8కి పెంచుకోగలిగితే అదనంగా 250 ఎంబీబీఎస్ సీట్లు తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఒక యూనిట్‌కు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. అదనంగా యూనిట్లు పెంచితే ఖర్చు ఎక్కువవుతుందని ప్రభుత్వం పెంచడం లేదు.

సరిపడా సిబ్బంది ఉన్నారు



బోధనా కళాశాలల్లో సరిపడా వైద్యులు ఉన్నారు. రోగులూ ఉన్నారు. కానీ, యూనిట్లు పెంచలేదు. స్టాఫ్ నర్సుల కొరతే ఎక్కువగా ఉంది. 1,050 మంది నర్సుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి ఇస్తే స్టాఫ్ నర్సులను నియమించుకుంటాం. – డా.ఎస్.సుబ్బారావు, వైద్యవిద్యా సంచాలకులు



మాట్లాడుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి. మధుసూదన్

6.3 మిలియన్ టన్నుల ఉత్పత్తే లక్ష్యం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి.మధుసూదన్

పటమట (విజయవాడ తూర్పు): వచ్చే ఆర్థిక ఏడాదిలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ 6.3 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు సంస్థ సీఎండీ పి.మధుసూదన్ తెలిపారు. విజయవాడలోని హోటల్ గేట్‌వేలో బుధవారం వినియోగదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక ఏడాది 5 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. మొదటిసారిగా సంస్థ అత్యధిక ఉత్పత్తిని చేసిందని, అలాగే అమ్మకాల టర్నోవర్‌లో రూ.16 వేల కోట్లు సాధించామని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 35 శాతం అధికంగా వృద్ధి సాధించడంతోపాటు నష్టాలను అధిగమించామని వివరించారు. వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో లాభాల బాటలో ఉంటామని తెలిపారు. విజయవాడ రీజియన్‌ను ప్రధాన మార్కెట్‌గా గుర్తిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు లక్షా 40 వేల టన్నుల వ్యాపార కార్యకలాపాలు నిర్వహించామని చెప్పారు. రానున్న రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతామని పేర్కొన్నారు. ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శాఖ ఏర్పాటుకు ప్రభుత్వం 24 ఎకరాలు స్థలం కేటాయించాలని కోరారు.

భూమాయగాళ్ల అరెస్టు

- విశాఖలో 5.04 ఎకరాల జిరాయితీ భూములను కొల్లగొట్టిన వైనం
- పక్కా ఆధారాలతో అక్రమాలను బహిర్గతం చేసిన 'సాక్షి'
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్..



నిందితులను చూపుతున్న పోలీసులు



బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ జిల్లా ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ, నేలతేరులలో జిరాయితీ భూములను నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లతో అప్పనంగా కొట్టేయడానికి ప్రయత్నించిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం చనిపోయిన వారికి ఇప్పుడు ఆధార్ కార్డులు పుట్టించి మరీ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ బాగోతాన్ని పక్కా ఆధారాలతో 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ సృజన ప్రకటించారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతోపాటు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులపై ఐపీసీ 420, 467, 468, 471, 120(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చనిపోయిన వారి స్థానాల్లోకి నకిలీ వ్యక్తులు : ఆనందపురం మండలంలోని నేలతేరులో సర్వే నంబర్లు 120/3,10, 123/14, 18, 39, 125/16, 130/26, 170/6,7,8,20, 180/34, 137లలో వారసత్వంగా దఖలు పడిన 5.04 ఎకరాల జిరాయితీ పల్లం భూములు రౌతు అచ్చెన్న, రౌతు అచ్చియ్యమ్మ, రౌతు రాము నాయుడుల పేరిట ఉన్నాయి. వీరిలో రాము నాయుడు, అచ్చియ్యమ్మ మృతి చెందగా ప్రస్తుతం రాము నాయుడు కుమారులు అచ్చన్న, అప్పలస్వామి, వారి కుటుంబ సభ్యుల అధీనంలో ఈ భూములు ఉన్నాయి. రికార్డుల ప్రకారం వారికే సర్వ హక్కులు దక్కుతాయి. ఈ భూములపై కన్నేసిన గెల్లు శ్రీనివాసరావు అనే వ్యక్తి కంచరపాలెం, బర్మా క్యాంపునకు చెందిన బగాది అనీల్, పందిరి మోహన్‌దాస్‌ల ద్వారా రౌతు రాము నాయుడు, రౌతు అచ్చియ్యమ్మలు చనిపోయినా వారితో పాటు రౌతు అచ్చన్న పేర్లను ఆన్‌లైన్‌లో చేర్చి, వారి పేరిట నకిలీ ఆధార్ కార్డులు సృష్టించాడు. విశాఖ బర్మా క్యాంపునకు చెందిన బాడి నూకరాజును రౌతు రాము నాయుడు స్థానంలో, అబ్దుల్ బేగంను రౌతు అచ్చియ్యమ్మ స్థానంలో, ముప్పిడి దేముడిని రౌతు అచ్చన్నకు బదులుగా ప్రవేశపెట్టాడు. చోడవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గెల్లు శ్రీనివాసరావు జీపీఏ కమ్ సేల్ అగ్రిమెంట్ చేయించుకున్నాడు. అనంతరం ఆ భూములను ఆనందపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా ఇతరులకు విక్రయించాడు.

నకిలీ స్టాంపులు, సీళ్లు : రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు ఇటీవల భూమి వద్దకు వచ్చి తాము కొనుగోలు చేసినట్టు చెప్పడంతో భూయాజమానులు అవాక్కయ్యారు. ఈ వ్యవహారాన్ని 'సాక్షి' బయటపెట్టడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో గెల్లు శ్రీనివాసరావు, బగాది అనిల్, పందిరి మోహన్‌దాస్‌లతో పాటు వీరికి సహకరించిన మద్దుల సురేష్, పెదిరెడ్ల రమేష్, మేటికోటి వాసు ఉన్నారు. వీరి వద్ద సబ్బవరం, గోపాలపట్నం సబ్‌రిజిస్ట్రార్ల నకిలీ స్టాంపులు, తహసీల్దార్ల రౌండ్ సీళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మిత్రమా.. ఇక సెలవు

మరణానికి మరికొన్ని క్షణాలు..
ఓ జాతి అంతరించడానికి మరికొన్ని క్షణాలు..
సూడాన్ శాశ్వత నిద్రకు మరికొన్ని క్షణాలు..



రిజర్వు పార్కు రేంజర్ ముథాయ్ పరుగుపరుగున వచ్చాడు..
మరికొన్ని క్షణాల్లో ఈ లోకాన్ని విడిచివెళ్తున్న తన మిత్రుడికి తుది వీడ్కోలు పలకడానికి..
సూడాన్‌ను చూడగానే ఎప్పుడూ తన మోముపై వికసించే నవ్వు నేడు నేలరాలింది..
రెప్పచాటు ఉప్పెన కట్టలు తెచ్చుకుంది..
అక్కడే అలా కూలబడ్డాడు.. సూడాన్‌ను ప్రేమగా నిమిరాడు.. చివరిసారిగా...
అల్విదా మేరా దోస్త్..


సూడాన్.. ప్రపంచంలోనే ఏకైక మగ నార్తర్న్ వైట్ రైనో(45).. ఒకప్పుడు ఉగాండా, సూడాన్, కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో ఎక్కువగా ఉండేవి. కొమ్ముల కోసం వేటగాళ్లు ఈ ఖడ్గమృగాలను విచ్చలవిడిగా వధించడంతో అంతరించే దశకు చేరాయి. చివరికి మగ నార్తర్న్ వైట్ రైనోల్లో సూడాన్ ఒక్కటే మిగిలింది. ఆ జాతి అంతరించిపోయే పరిస్థితి ఏర్పడటంతో చెక్ రిపబ్లిక్‌లోని జూలో ఉన్న దీన్ని 2009లో కెన్యా ఫారెస్టు రిజర్వ్ పార్కుకు తెచ్చారు. సూడాన్‌తోపాటు రెండు ఆడ నార్తర్న్ వైట్ రైనోలనూ కూడా తెచ్చి.. వీటి జాతి పరిరక్షణకు ప్రయత్నించారు. ఆ సమయంలో వేటగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు సూడాన్‌కు సాయుధ రక్షణను కూడా ఏర్పాటు చేశారు. దీంతో సూడాన్ ప్రపంచవ్యాప్తంగా సెలబ్రిటీ అయింది. అయితే, వీటి సంతతిని పెంచడానికి శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తర్వాత తర్వాత సూడాన్ ఆరోగ్యం క్షీణించింది. కనీసం లేవలేని పరిస్థితి వచ్చింది. దీని బాధను చూడలేక సూడాన్‌కు కారుణ్య మరణం ప్రసాదించినట్లు మంగళవారం రిజర్వు పార్కు ప్రకటించింది. ఓ వైద్యుడు ఇంజెక్షన్ ద్వారా సూడాన్‌కు విముక్తినిచ్చినట్లు తెలిపింది. అది జరగడానికి కొన్ని క్షణాల ముందు.. సూడాన్ మృత్యువు ముంగిట ఉన్న సమయంలో తీసిన చిత్రమే ఇది. ప్రకృతి పట్ల, సాటి జీవుల పట్ల మానవుడు చూపుతున్న క్రూర స్వభావానికి నిదర్శనంగా సూడాన్ చరిత్రలో నిలిచిపోతుందని రిజర్వు పార్కు సీఈవో రిచర్డ్ అన్నారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం



కంబైన్డ్ జియోసైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ ఎగ్జామినేషన్-2018



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)... జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ), సెంట్రల్ గ్రౌండ్ వాటర్(సీజీడబ్ల్యూ)లోని 70 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ 'కంబైన్డ్ జియోసైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ ఎగ్జామినేషన్(సీజీజీఈ)-2018' నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు-ఖాళీలు:** జియాలజిస్ట్-24, జియోఫిజిసిస్ట్-17, కెమిస్ట్-6, జూనియర్ హైడ్రో జియాలజిస్ట్(సైంటిస్ట్ బి)-23. ఇందులో జూనియర్ హైడ్రోజియాలజిస్ట్ పోస్టులు సెంట్రల్ గ్రౌండ్ వాటర్‌కు, మిగిలినవి జీఎస్ఐకి చెందినవి.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను బట్టి మాస్టర్స్ డిగ్రీ(జియోలాజికల్ సైన్స్/జియాలజీ/అప్లైడ్ జియాలజీ/జియో-ఎక్స్‌ప్లోరేషన్/మినరల్ ఎక్స్‌ప్లోరేషన్/ఇంజనీరింగ్ జియాలజీ/మెరైన్ జియాలజీ/ఎర్త్ సైన్స్ అండ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్/ఓషనోగ్రఫీ/కోస్టల్ ఏరియాస్ స్టడీస్/పెట్రోలియం జియోసైన్సెస్/పెట్రోలియం ఎక్స్‌ప్లోరేషన్/జియోకెమిస్ట్రీ/జియోలాజికల్ టెక్నాలజీ/జియోఫిజికల్ టెక్నాలజీ/హైడ్రో జియాలజీ) / ఎంఎస్సీ(ఫిజిక్స్/అప్లైడ్ ఫిజిక్స్/జియోఫిజిక్స్/అప్లైడ్ జియోఫిజిక్స్/మెరైన్ జియోఫిజిక్స్/కెమిస్ట్రీ/అప్లైడ్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ)/ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ(ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్)/ ఎంఎస్సీ.ఎంటెక్(అప్లైడ్ జియోఫిజిక్స్).
- **వయసు:** 2018, జనవరి 1 నాటికి జూనియర్ హైడ్రోజియాలస్ట్ పోస్టులకు 21-35 ఏళ్ల లోపు; మిగిలిన పోస్టులకు 21-32 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్. **దరఖాస్తు రుసుం:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 16, 2018.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

సుప్రీంకోర్టులో 78 ఖాళీలు



సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా (ఎస్సీఐ)లో 78 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు-ఖాళీలు:** జూనియర్ కోర్ట్ అటెండెంట్-65; చాంబర్ అటెండెంట్ (ఆర్)-13. **వేతనం:** రూ.33,315. **అర్హతలు:** పదోతరగతి/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే జూనియర్ అటెండెంట్ పోస్టులకు అదనంగా డ్రైవింగ్ లైసెన్స్(ఎల్ఎంవీ/హెచ్ఎం వీ)తోపాటు కుకింగ్/ ఎలక్ట్రీషియన్/కార్పెంట రీలో ప్రావీణ్యం, అనుభవం ఉన్నవాళ్లకు ప్రాధా న్యం ఇస్తారు; చాంబర్ అటెండెంట్‌కు అదనంగా హౌస్ కీపింగ్ వర్క్, వాచ్ అండ్ వార్డ్, సెక్యూరిటీ అండ్ కేర్‌టేకింగ్ పనిలో నైపుణ్యం, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 2018 మార్చి 1 నాటికి 18-27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్.
- **రాతపరీక్ష విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమెరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నల చొప్పున మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నర. రెండు పోస్టులకూ వేర్వేరు స్థాయిలోని ప్రశ్నలు ఇస్తారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను మెరిట్ జాబితా ప్రకారం స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో అభ్యర్థుల డ్రైవింగ్/కుకింగ్/ ఎలక్ట్రీషియన్/కార్పెంటరీ/ హౌస్ కీపింగ్/ వాచ్ అండ్ వార్డ్/సెక్యూరిటీ అండ్ కేర్‌టేకింగ్) నైపుణ్యాలను పరిశీలిస్తారు. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు.
- దరఖాస్తు రుసుం: రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీసైనికోద్యోగ/డిపెండెంట్ ఆఫ్ ఫ్రీడమ్ ఫైటర్స్ కేటగిరీలకు ఫీజు లేదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

చివరి తేదీ: ఏప్రిల్ 15, 2018.
వెబ్‌సైట్: www.sci.gov.in

ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్-2018



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)... 'ఇండియన్ ఎకనమిక్ సర్వీస్(ఐఈఎస్)/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్) ఎగ్జామి నేషన్-2018' ప్రకటన విడుదల చేసింది. దీని ద్వారా ఇండియన్ ఎకనమిక్ సర్వీస్, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేస్తారు.

- **మొత్తం పోస్టులు:** 46. ఇందులో ఇండియన్ ఎకనమిక్ సర్వీస్‌లో 14, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 32 ఖాళీలున్నాయి.
- **అర్హతలు:** ఐఈఎస్ పోస్టులకు... ఎకనమిక్స్/అప్లైడ్ ఎకనమిక్స్/బిజినెస్ ఎకనమిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పీజీ; ఐఎస్ఎస్ పోస్టులకు... స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిటిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లో ఏదైనా ఒకటి సబ్జెక్టుగా బ్యాచిలర్ డిగ్రీ (లేదా) ఇవే సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదాంట్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, వైవా ఆధారంగా.
- **దరఖాస్తు రుసుం:** రూ.200; ఎస్సీ/ఎస్టీ/మహిళ/దివ్యాంగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఏప్రిల్ 16, 2018.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

హయ్యర్ ఎడ్యుకేషన్

గేట్ గెలుపు

ఉజ్వల భవితకు దారులెన్నో



దేశవ్యాప్తంగా 8 లక్షల మందికిపైగా రాసిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)- 2018 ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. గేట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఎంటెక్/ ఎంఈ వంటి ఉన్నత విద్యావకాశాలకే పరిమితం కాకుండా.. మరెన్నో దారులు ఎంచుకోవచ్చు. గేట్ ఉత్తీర్ణులు ఉన్నత విద్య, పీఎస్‌యూల్లో ఉద్యోగం, ఎంఎన్‌సీల్లో కొలువు, పలు విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్, జేఆర్ఎఫ్ సొంతం చేసుకునే అవకాశం... ఇలా తమకు నచ్చే, నప్పే మార్గాన్ని ఎంచుకోవాలి. విద్యార్థులు తమ ముందున్న అవకాశాలను జాగ్రత్తగా విశ్లేషించుకొని, భవిష్యత్ కెరీర్‌ను నిర్దేశించే నిర్ణయాన్ని తీసుకోవాలి. గేట్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న వివిధ అవకాశాల గురించి తెలుసుకుందాం..

- గేట్ 2018 ఫలితాలు మార్చి 16న వెలువడ్డాయి. అర్హత సాధించిన అభ్యర్థులు మార్చి 20వ తేదీ నుంచి స్కోర్ కార్డ్‌ను **http://gate.iitg.ac.in/** నుంచి పొందొచ్చు. గేట్ 2018 స్కోర్ ఫలితాలు వెలువడిన తేదీ నుంచి 3 ఏళ్లపాటు పరిగణనలో ఉంటుంది.

ఎంటెక్/ఎంఈ/పీహెచ్‌డీ

- వాస్తవానికి గేట్ అనేది ఐఐటీలు, ఐఐఎస్సీ, నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో ఎంటెక్/ఎంఈ, పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. గేట్ స్కోర్ ద్వారా ఎంటెక్/ ఎంఈ, పీహెచ్‌డీల్లోకి ప్రవేశం కల్పించే ఇన్‌స్టిట్యూట్స్ ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇస్తాయి. ఆయా విద్యా సంస్థల అడ్మిషన్ ప్రక్రియకు అనుగుణంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- గేట్ స్కోరుతో టాప్ ర్యాంకింగ్ విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ), బెంగళూరులో చేరే చక్కటి అవకాశం లభిస్తుంది. పోటీ తీవ్రత దృష్ట్యా ఐఐఎస్సీలో చేరాలంటే టాప్ స్కోర్ తప్పనిసరి. ఐఐఎస్సీ తర్వాత విద్యార్థులు ఐఐటీలు.. ఆ తర్వాత ఎన్ఐటీలను ప్రాధాన్య క్రమంగా ఎంచుకుంటున్నారు. వీటితోపాటు డీమ్డ్ యూనివర్సిటీలూ, ఆయా రాష్ట్రాల్లోని క్యాంపస్ కాలేజీలు విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. గేట్ స్కోర్‌తో ఆయా సంస్థలో ఎంటెక్, ఎంఈ, ఎంఎస్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీల్లో చేరవచ్చు. కొన్ని విద్యాసంస్థలు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు కూడా ఆఫర్ చేస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీని తక్కువ కాలంలోనే పూర్తి చేసుకోవచ్చు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లు నిర్వహిస్తున్న టెక్నికల్ ఎంబీఏ కోర్సుల్లో చేరడానికి కూడా గేట్ స్కోరే ప్రామాణికంగా మారింది. ఉదాహరణకు ఐఐఎం - కోల్‌కతా నిర్వహించే హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సుల్లో ప్రవేశాలకు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐఎంల్లో ఫెలోషిప్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం) కోర్సులకూ గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నారు.
- అలానే, ముంబైలోని ప్రముఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్.. గేట్ స్కోరు ఆధారంగా ప్రవేశాలు చేపడుతుంది. పీజీ డిప్లొమా ఇన్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, పీజీ డిప్లొమా ఇన్ మ్యానుఫాక్చరింగ్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు గేట్ స్కోరే ప్రామాణికం.
- విదేశీ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు కూడా గేట్ స్కోరు ఉపయోగపడుతుంది. సింగపూర్, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోని పలు యూనివర్సిటీలు గేట్‌లో మంచి స్కోరు పొందిన వారికి స్వాగతం పలుకుతున్నాయి.



స్కాలర్‌షిప్స్/అసిస్టెంట్‌షిప్స్

- గేట్‌లో ఉత్తమ ప్రతిభ ద్వారా ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు స్కాలర్‌షిప్/అసిస్టెంట్‌షిప్ అందుకోవచ్చు. ఎంహెచ్ఆర్‌డీ మార్గనిర్దేశకాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్ నిబంధనల మేరకు గేట్‌లో ప్రతిభకు 70శాతం వెయిటేజీ; ఇంటర్వ్యూకు 30శాతం వెయిటేజీ ఉంటుంది. సాధారణంగా పీజీలో చేరే విద్యార్థులకు నెలకు రూ.12400 అందుతుంది.
- గేట్ స్కోర్ ద్వారా సీఎస్ఐఆర్ లేబొరేటరీల్లో జేఆర్ఎఫ్/ ఎస్ఆర్ఎఫ్ కోసం కూడా అభ్యర్థులు ప్రయత్నించొచ్చు.

పీఎస్‌యూ కొలువు

- గేట్‌తో ఉన్నత చదువులు, ఉపకారవేతనాలు, పరిశోధనలు.. వంటి బహుముఖ ప్రయోజనాలెన్నో ఉన్నా.. ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో ఉద్యోగం పొందడం అభ్యర్థుల మొదటి ప్రాధాన్యంగా మారింది. ఎంటెక్ పూర్తి చేసిన తర్వాత కూడా పీఎస్‌యూల్లో జాబ్ సాధనే లక్ష్యంగా గేట్‌కు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.
- బీహెచ్ఈఎల్, గెయిల్, హెచ్ఏఎల్, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, వంటి మహారత్న, నవరత్న, మినీరత్న హోదా ఉన్న పీఎస్‌యూలు గేట్ ర్యాంకు ప్రాతిపదికనే ఎంట్రీ లెవల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ చేస్తున్నాయి. 2012 నుంచి పీఎస్‌యూలు గేట్ స్కోరు ఆధారంగా నియామకాలు చేపట్టడం ప్రారంభించాయి. వీటి సంఖ్య ప్రస్తుతం 30కి పైగానే ఉంది.
- పీఎస్‌యూలు గేట్ పరీక్ష తేదీ కంటే ముందుగానే రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. అభ్యర్థులు వీటికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి.
- ఒక్కో పీఎస్‌యూ.. కేటగిరీల ఆధారంగా కటాఫ్ మార్కులు నిర్ణయించి ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తున్నాయి. ఈ కటాఫ్ మార్కులు పీఎస్‌యూలను బట్టి మారుతూ ఉంటాయి. కనీస కటాఫ్‌ను ప్రకటించే సమయంలో 1:5 లేదా1:7 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఆ మేరకు ప్రకటిస్తున్నాయి. అంటే.. ఒక్కో ఖాళీకి అయిదుగురు లేదా ఏడుగురు అభ్యర్థులను మలి దశ ఎంపిక ప్రక్రియకు పిలుస్తున్నాయి.



- పీఎస్‌యూల్లో గేట్ ర్యాంకుతో నిర్వహించే ఎంపిక ప్రక్రియ ఆయా పీఎస్‌యూల విధానాల మేరకు ఉంటుంది. అధికశాతం పీఎస్‌యూలు జీడీ, మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇంటర్వ్యూలో వ్యక్తిగత వివరాలు మొదలు కంపెనీపై అవగాహన, సమకాలీన అంశాల పరిజ్ఞానం, టెక్నికల్ స్కిల్స్.. ఇలా అన్ని కోణాల్లో ప్రశ్నలు అడుగుతారు.
- ఇంజనీరింగ్ అనంతరం రాసే గేట్ ద్వారా అభ్యర్థులు చిన్నవయసులోనే పీఎస్‌యూలో ఎంట్రీ లెవల్ ఆఫీసర్ ఉద్యోగం దక్కించుకోవచ్చు. అలానే ఆకర్షణీయమైన వేతనాలు అందుకోవచ్చు.

ఎంఎన్‌సీల్లోనూ

- గేట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని నియమించుకునేందుకు బహుళ జాతి సంస్థలు(ఎంఎన్‌సీ)లు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఆయా సంస్థల్లో రీసెర్చ్, డెవలప్‌మెంట్ విభాగంలో వీరిని నియమించుకుంటున్నాయి. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్(ఏఎండీ), ఏడీ(అనలాగ్ డివైసెస్), గూగుల్, నోకియా, ఒరాకిల్, సీమెన్స్, తోషిబా, ఫేస్‌బుక్, అమెజాన్, లాంటి.. సుమారు 28 పెద్దసంస్థలు మెరికల్లాంటి అభ్యర్థుల అన్వేషణకు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

ప్రపంచంలోనే అత్యంత సంతోషకర దేశంగా ఫిన్‌లాండ్

కాంపిటీటివ్ గైడెన్స్

కరెంట్ అఫైర్స్

జాతీయం

ఇంఫాల్‌లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్



105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మార్చి 16 నుంచి 20 వరకు జరిగింది. దీన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన పరిశోధనలను క్షేత్ర స్థాయికి విస్తరించాలని పిలుపునిచ్చారు. పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)లను పునర్నిర్వచించి..దేశాభివృద్ధికి మరిన్ని ప్రయోగాలు చేయాలన్నారు. 105వ సైన్స్ కాంగ్రెస్‌ను 'శాస్త్ర, సాంకేతికత ద్వారా నేటికీ చేరుకోలేని వర్గాలకు దగ్గరవటం'అనే ఇతివృత్తంతో నిర్వహించారు.

ఆయుధాల దిగుమతిలో భారత్‌కు మొదటి స్థానం

దేశ రక్షణకు అవసరమైన ఆయుధాల దిగుమతిలో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2008-12; 2013-17 మధ్యకాలంలో భారత్ ఆయుధాల దిగుమతి 24 శాతం పెరిగినట్లు స్టాక్‌హోమ్‌కు చెందిన ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సిప్రీ) మార్చి 13న వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా గత ఐదేళ్ల దిగుమతులను పరిశీలిస్తే భారత్ వాటా 12 శాతంగా ఉంది. రష్యా, అమెరికా, ఇజ్రాయెల్, దక్షిణ కొరియా నుంచి భారత్ ఎక్కువగా ఆయుధాలను కొనుగోలు చేస్తోంది.

అత్యంత చౌకైన నగరంగా బెంగళూరు

భారత్‌లో జీవించడానికి అత్యంత చౌకైన మెట్రో నగరంగా బెంగళూరు గుర్తింపు పొందింది. ఎకనమిక్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఈఐయూ) మార్చి 15న విడుదల చేసిన గ్లోబల్ కాస్ట్ ఆఫ్ లివింగ్ రిపోర్ట్-2018లో బెంగళూరు ప్రపంచంలోనే ఐదో చౌకైన నగరంగా నిలిచింది. ఈ సర్వేను ప్రపంచంలోని 139 మహానగరాలపై నిర్వహించారు.

ఇంటర్నెట్ వేగంలో చెన్నై టాప్

దేశంలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను వాడుతున్న నగరాల్లో..చెన్నై అత్యంత వేగవంతమైన నెట్ స్పీడ్ లభిస్తున్న నగరంగా నిలిచింది. కాగా, రెండో స్థానంలో బెంగళూరు; మూడో స్థానంలో హైదరాబాద్; నాలుగో స్థానంలో విశాఖపట్నం నిలిచాయి. అమెరికాలోని సీటెల్ కేంద్రంగా పనిచేస్తున్న ఊక్లా సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వేగాన్ని గణించింది. దీనికి సంబంధించిన నివేదికను మార్చి 13న విడుదల చేసింది. ఇందులో ఇంటర్నెట్ వేగం పరంగా భారత్‌కు 67వ స్థానం లభించడం గమనార్హం.

జాతీయ గీతం సవరణకు తీర్మానం

జాతీయ గీతంలోని 'సింధ్' స్థానంలో 'ఈశాన్యం' అని చేర్చాలని ప్రతిపాదిస్తూ కాంగ్రెస్ ఎంపీ రిపున్ బోరా మార్చి 16న రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్‌లో 'ఈశాన్యం' కీలక ప్రాంతమైనా..దానికి జాతీయ గీతంలో చోటు లేకపోవడం సరికాదన్నారు. అదే సమయంలో పాకిస్తాన్ భూభాగంలో ఉన్న సింధ్‌ను జాతీయ గీతంలో ప్రస్తావిస్తున్నామన్నారు.

అంతర్జాతీయం

ప్రపంచ సంతోష నివేదిక-2018



ప్రపంచ సంతోష నివేదిక- 2018 విడుదలైంది. మొత్తం 156 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో ఫిన్‌లాండ్ అత్యంత సంతోషకర దేశంగా నిలిచింది. రెండో స్థానంలో నార్వే, మూడో స్థానంలో డెన్మార్క్ నిలువగా, భారత్ 133వ స్థానంలో నిలిచింది. కాగా, గతేడాదితో పోల్చితే భారత్ 11 స్థానాలు పడిపోవడం గమనార్హం. ఐక్యరాజ్యసమితికి చెందిన ఎస్‌డీఎస్ఎన్(సస్టయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్) ప్రతి ఏడాది ఈ నివేదికను తయారుచేస్తుంది.

కూలిన యునెస్కో వారసత్వ సంపద ఐస్‌బ్రిడ్జి

అర్జెంటీనాలో యునెస్కో వారసత్వ సంపదగా భాసిల్లుతున్న ఐస్ బ్రిడ్జి మార్చి 11న కుప్పకూలింది. పెటగోనియాలోని లాస్ గ్లేసియర్ జాతీయ పార్కులో సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ ఐస్ బ్రిడ్జి.. భారీ తుపాను ధాటికి కూలిపోయింది.

వార్తల్లో వ్యక్తులు

ప్రముఖ భౌతికశాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మృతి



ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్(76) మార్చి 14న కేంబ్రిడ్జ్‌లో మరణించారు. ఆయన 1942, జనవరి 8న ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. భౌతికశాస్త్రంలో ఐన్‌స్టీన్ తర్వాత అంతటి గొప్ప శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన స్టీఫెన్ హాకింగ్..సాపేక్ష సిద్ధాంతం, గురుత్వాకర్షణ ఏకతత్వ సిద్ధాంతాలపై అధ్యయనం చేశారు. కృష్ణబిలాలు సైతం రేడియేషన్‌ను ఉత్పత్తి చేస్తాయని వెల్లడించారు. దీన్నే హాకింగ్ రేడియేషన్ అంటారు. స్టీఫెన్ రచించిన 'బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకం బ్రిటిష్ సండే టైమ్స్‌లో 237 వారాలపాటు బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఆయన రచించిన ఒక పుస్తకం 'కాలం కథ'పేరుతో తెలుగులో వెలువడింది.

జర్మనీ ఛాన్సలర్‌గా మెర్కెల్ ప్రమాణం

ఏంజెలా మెర్కల్ మార్చి 14న జర్మనీ ఛాన్సలర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. కాగా, ఆమె ఈ పదవిని చేపట్టడం ఇది వరుసగా నాలుగోసారి. 709 మంది సభ్యులున్న జర్మన్ పార్లమెంటులో 364 మంది ఆమెకు అనుకూలంగా ఓటేశారు.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ ఘనవిజయం



అమెరికా, బ్రిటన్లతో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో రష్యన్లు మరోసారి వ్లాదిమిర్ పుతిన్‌కే పట్టం కట్టారు. మార్చి 18న ముగిసిన ఎన్నికల్లో పుతిన్‌కు 76.67 శాతం ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి..కమ్యూనిస్ట్ పార్టీ నేత పావెల్ గ్రుడినిన్‌కు 11.79 శాతం ఓట్లు వచ్చాయి. తాజా విజయంతో పుతిన్ 2024 వరకు రష్యా అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కాగా, 2014లో ఉక్రెయిన్ నుంచి రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియాలో పుతిన్‌కు 92 శాతం ఓట్లు రావడం గమనార్హం. పుతిన్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న అలెక్సీ నావెల్నీపై ఆ దేశ ఎన్నికల సంఘం వేటు వేయడంతో ఆయన ఎన్నిక లాంఛనప్రాయమైంది.

నేపాల్ అధ్యక్షురాలిగా విద్యాదేవి తిరిగి ఎన్నిక



విద్యాదేవి భండారీ రెండోసారి నేపాల్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె మార్చి 13న జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. భండారీ 2015లో నేపాల్ తొలి మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

యూఎస్ విదేశాంగ మంత్రిగా మైక్ పాంపీ

అమెరికా విదేశాంగ శాఖ మంత్రిగా మైక్ పాంపీ నియమితులయ్యారు. రెక్స్ టిల్లర్సన్ స్థానంలో పాంపీని నియమిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మార్చి 13న ప్రకటించారు. జాతీయ భద్రతకు సంబంధించి ఉత్తర కొరియాతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మైక్ పాంపీని విదేశాంగ మంత్రిగా నియమించారు.

అత్యంత సంపన్న ఎంపీగా జయాబచ్చన్!



దేశంలోనే అత్యంత సంపన్న ఎంపీగా జయాబచ్చన్ నిలవనున్నారు. ప్రముఖ నటి, సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలైన జయాబచ్చన్ యూపీ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె మార్చి 12న సమర్పించిన ప్రమాణపత్రంలో ఆస్తుల విలువను రూ.1000 కోట్లుగా పేర్కొన్నారు. కాగా, ఇప్పటి వరకు దేశంలోనే అత్యంత సంపన్న ఎంపీగా భాజపాకు చెందిన రవీంద్ర కిశోర్ సిన్హా గుర్తింపు పొందారు. ఆయన 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యే నాటికి ఆస్తుల విలువను రూ.800 కోట్లుగా ప్రకటించారు.


హెచ్.జే.భాభా స్మారక అవార్డు అందుకున్న డా.జైన్



డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ చంద్ జైన్ మార్చి 16న ప్రతిష్ఠాత్మక హోమీ జహంగీర్ భాభా స్మారక అవార్డు అందుకున్నారు. ఇంఫాల్‌లో జరిగిన 105వ భారత సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి హర్షవర్ధన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోలో పనిచేస్తున్న డా.జైన్ ఎయిరోస్పేస్ ఇంజనీరింగ్‌లో విశేష కృషి చేశారు. దానికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.

రాష్ట్రీయం

2018-19 తెలంగాణ బడ్జెట్



ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ 2018-19 సంవత్సరానికి రూ.1,74,453 కోట్ల బడ్జెట్‌ను మార్చి 15న శాసనసభకు సమర్పించారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం బడ్జెట్ అంచనాలు 16.9 శాతం మేర పెరిగాయి.

ముఖ్యాంశాలు:

- రాష్ట్ర సొంత రాబడులు: రూ.73,751 కోట్లు.
- కేంద్ర పన్నుల వాటా: రూ.19,207 కోట్లు.
- ద్రవ్యలోటు: రూ.29,077 కోట్లు.
- రెవెన్యూ మిగులు: రూ.5,520 కోట్లు.
- ద్రవ్యలోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.45 శాతం.

ప్రధాన కేటాయింపులు

- వ్యవసాయ రంగం: రూ.12,601 కోట్లు
- సాగునీటి రంగం: రూ.25,000 కోట్లు.
- విద్యుత్ రంగం: రూ. 4,393 కోట్లు.

క్రీడలు

టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్



శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో జరిగిన నిదహాస్ ముక్కోణపు టీ20 సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. కొలంబోలో మార్చి 18న జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై భారత్ గెలుపొందింది. ఇప్పటి వరకు ఈ సిరీస్ రెండు సార్లు జరగ్గా..రెండిట్లోనూ భారత్ గెలుపొందడం విశేషం.

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్‌లో మార్చి 18న ముగిసిన ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను షి యుకి(చైనా); మహిళల సింగిల్స్ టైటిల్‌ను తై జు యింగ్(తైవాన్-రిపబ్లిక్ ఆఫ్ చైనా) కైవసం చేసుకున్నారు.

ఇరానీ కప్ గెలుచుకున్న విదర్భ

ఇరానీ క్రికెట్ ట్రోఫీని విదర్భ గెలుచుకుంది. నాగ్‌పూర్‌లో మార్చి 18న జరిగిన ఫైనల్లో రెస్టాఫ్ ఇండియాను విదర్భ ఓడించింది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

స్టాక్‌ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 10.30కి)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
139 ▲	31 ▲
33,136	10,155

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్‌	7,382	▲ 18
డోజోన్స్‌	24,831	▲ 104
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,039	▼ 22
డాక్స్‌	12,309	▲ 2
షాంఘై	3,282	▼ 9
నికాయ్‌ (మార్చి 20)	21,381	▼ 99

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	64.45	66.08
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	90.07	93.01
€	యూరో	ఎస్‌బీఐ	78.63	81.28
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	60.27	62.34
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	49.30	51.05
SS	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	48.73	50.35
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	15.77	18.69
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	16.15	18.87
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	7.29	11.82

సెయింట్‌ గోబెయిన్‌ మరో ప్లాంటు

- పరిశీలనలో ఏపీ, తెలంగాణ
- రూ.1,000 కోట్ల పెట్టుబడి
- కంపెనీ ఫ్లాట్‌ గ్లాస్‌ ఎండీ సంతానం



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: గ్లాస్‌ తయారీ దిగ్గజం సెయింట్‌ గోబెయిన్‌ మరో ప్లాంటును ఏర్పాటు చేయనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ లేదా మహారాష్ట్రలో ఇది రానుంది. ఈ మూడు రాష్ట్ర ప్రభుత్వాలతో ప్లాంటు విషయమై చర్చిస్తున్నట్టు సెయింట్‌ గోబెయిన్‌ ఇండియా ఫ్లాట్‌ గ్లాస్‌ ఎండీ బి.సంతానం చెప్పారు. బుధవారమిక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా 'సాక్షి' బిజినెస్‌ బ్యూరోతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ యూనిట్‌కు రూ.1,000 కోట్లు వెచ్చిస్తామన్నారు. 'రెండేళ్లలో తొలి దశ నిర్మాణం పూర్తి చేస్తాం. 600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. దశలవారీగా విస్తరణ చేపడతాం. ప్రభుత్వ సహకారం, ఆగ్నేయ భారత మార్కెట్‌కు అనువైన ప్రాంతం, ముడి సరుకు లభ్యత వంటి అంశాలను బేరీజు వేసుకుని తుది నిర్ణయం తీసుకుంటాం' అని తెలియజేశారు.

రూ.5,200 కోట్ల పెట్టుబడి..: భారత మార్కెట్లో 1996లో ప్రవేశించిన సెయింట్‌ గోబెయిన్‌ ఇప్పటి వరకు రూ.4,200 కోట్లు వెచ్చించింది. మరో రూ.1,000 కోట్లతో చెన్నైలో కొత్త ప్లాంటు నెలకొల్పుతోంది. చెన్నై ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా 3,000 మందికి ఉపాధి లభించనుంది. కంపెనీకి వార్షికంగా 14 కోట్ల చదరపు అడుగుల సెలెక్టివ్‌ హై పెర్ఫార్మెన్స్‌ కోటెడ్‌ గ్లాస్‌ తయారీ సామర్థ్యం ఉంది. 19 తయారీ ప్లాంట్లున్నాయి. రూ.10,000 కోట్ల టర్నోవర్‌తో గ్లాస్‌ ఇండస్ట్రీలో సెయింట్‌ గోబెయిన్‌ అగ్ర స్థానంలో ఉంది. బుల్లెట్‌ ప్రూఫ్, ఫైర్‌ ప్రూఫ్‌ గ్లాస్‌ను భారత ప్లాంట్ల నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తోంది.

బ్యాంకులను ముంచేసిన మరో నగల సంస్థ

నీరవ్‌ మోదీ 2.0



భూపేష్‌ జైన్‌

- రూ.825 కోట్ల మేర మోసం చేసిన కనిష్క్‌ గోల్డ్‌..
- ఎస్‌బీఐ సహా 14 బ్యాంకులకు కుచ్చుటోపీ...
- రుణ ఎగవేతపై సీబీఐకి ఫిర్యాదు చేసిన స్టేట్‌ బ్యాంక్‌

సాక్షి, చెన్నై: పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌(పీఎన్‌బీ)ను నిండా ముంచేసిన నీరవ్‌ మోదీ కుంభకోణం ఘటన మరువకముందే... ఇలాంటివే మరిన్ని స్కామ్‌లు పుట్టగొడుగుల్లా వెలుగుచూస్తున్నాయి. తాజాగా చెన్నైకి చెందిన కనిష్క్‌ గోల్డ్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ అనే బంగారు నగల విక్రయ సంస్థ బ్యాంకులకు వందల కోట్ల రూపాయల మేర కుచ్చుటోపీ పెట్టినట్లు బయటపడింది. స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఎస్‌బీఐ) సహా మొత్తం 14 బ్యాంకులను దాదాపు రూ.825 కోట్ల మేర మోసం చేసినట్లు వెల్లడైంది. కనిష్క్‌ గోల్డ్‌పై సీబీఐకి ఈ ఏడాది జనవరిలో ఎస్‌బీఐ ఫిర్యాదు చేసింది.

సీబీఐ ఎఫ్‌ఐఆర్‌... సోదాలు

బ్యాంకులను మోసం చేసిన కేసులో కనిష్క్‌ గోల్డ్‌పై సీబీఐ ఎట్టకేలకు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా కనిష్క్‌ ప్రమోటర్ల ఆఫీసులు, ఇళ్లలో సోదాలు కూడా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు బుధవారం పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో కనిష్క్‌ ప్రమోటర్లు భూపేష్‌ కుమార్‌ జైన్, నీతా జైన్, ఇతర కంపెనీ ప్రతినిధులు తేజ్‌రాజ్‌ అచా, అజయ్‌ కుమార్‌ జైన్‌ సుమిత్‌ కేడియాలతో పాటు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నట్లు సమాచారం. కాగా, ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బ్యాంకు అధికారులతో సంప్రదింపులు జరిపామని, ఫిర్యాదులో కొన్ని లోపాలను బ్యాంకు సరిదిద్దుకోవాల్సి రావడంతో దర్యాప్తును వెంటనే చేపట్టలేకపోయినట్లు సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రమోటర్లు మారిషస్‌లో...

కనిష్క్‌ గోల్డ్‌కు భూపేష్‌ కుమార్‌ జైన్, ఆయన భార్య నీతా జైన్‌లు ప్రమోటర్, డైరెక్టర్లుగా ఉన్నారు. ఈ సంస్థకు ఎస్‌బీఐ నేతృత్వంలోని 14 ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకుల కన్సార్షియం ఇచ్చిన రుణాలన్నీ మొండిబకాయిలుగా మారిపోయాయి. ప్రమోటర్లు నకిలీ డాక్యుమెంట్లతో మోసపూరితంగా రుణాలను పొందారని.. ఆ తర్వాత వాటిని ఎగవేసినట్లు సీబీఐకి ఈ ఏడాది జనవరి 25న ఇచ్చిన ఫిర్యాదులో ఎస్‌బీఐ పేర్కొంది. రాత్రికిరాత్రే నగల షాపులన్నింటినీ కనిష్క్‌ మూసేసిందని కూడా ఆరోపించింది. కాగా, కనిష్క్‌ గోల్డ్‌ను మూసేసి... భారత్‌ నుంచి మకాం మార్చేసిన భూపేష్, నీతా జైన్‌లు ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సంప్రదించడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ... అందుబాటులోకి రావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు.

నవంబర్లో ఆర్‌బీఐకి సమాచారం...

కనిష్క్‌ గోల్డ్‌ రుణం విషయంలో మోసం జరిగినట్లు గతేడాది నవంబర్‌ 11న తొలిసారిగా రిజర్వ్‌ బ్యాంక్‌(ఆర్‌బీఐ)కు ఎస్‌బీఐ తెలియజేసింది. ఈ ఏడాది జనవరిలో కన్సార్షియంలోని మిగతా బ్యాంకులన్నీ కూడా ఈ రుణాన్ని మోసపూరితమైనదిగా ఆర్‌బీఐకి నివేదికలు పంపాయి. కాగా, ఈ నగల సంస్థ కన్సార్షియంలోని 8 బ్యాంకులకు రుణ బకాయిల చెల్లింపులను నిలిపివేయడంతో గతేడాది మార్చిలో డిఫాల్ట్‌(మొండిబకాయి)గా మారినట్లు ఎస్‌బీఐ పేర్కొంది. ఏప్రిల్‌ నాటికి మొత్తం 14 బ్యాంకులకు కూడా చెల్లింపులను ఆపేసింది. దీంతో తనిఖీ కోసం వెళ్లిన బ్యాంకర్లకు ప్రమోటర్లు ముఖం చాటేశారు. మే నెలలో కనిష్క్‌ గోల్డ్‌ కార్పొరేట్‌ ఆఫీస్, ఫ్యాక్టరీ, షోరూమ్‌లన్నీ ఖాళీ అయిపోయినట్లు బ్యాంకర్లు గుర్తించారు. మొత్తం షోరూమ్‌లన్నింటి నుంచీ నగల స్టాక్‌నంతా అప్పటికే ప్రమోటర్లు సర్దేశారు.

వడ్డీతో కలిపి రూ.1,000 కోట్ల పైమాటే...

కాగా, ఎస్‌బీఐ ఫిర్యాదు ప్రకారం చూస్తే.. కనిష్క్‌ గోల్డ్‌కు 2007 నుంచీ రుణాలు ఇస్తున్నట్లు వెల్లడైంది. 2012లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులతో కూడిన కన్సార్షియం భారీ మొత్తంలో మెటల్‌ గోల్డ్‌ లోన్‌ను మంజూరు చేశాయి. మొత్తంమీద 14 బ్యాంకులకు కలిపి కనిష్క్‌ గోల్డ్‌ ఎగ్గొట్టిన అసలు మొత్తం రూ.825 కోట్లు కాగా, దీనికి వడ్డీని కలిపితే బకాయి మొత్తం రూ.1,000 కోట్లకు పైగానే ఉంటుందని బ్యాంకర్లు లెక్కగడుతున్నారు. కనిష్క్‌ గోల్డ్‌కు ఎస్‌బీఐ అత్యధికంగా రూ.215 కోట్ల రుణాలిచ్చింది. కన్సార్షియంలో పీఎన్‌బీ(రూ.115 కోట్లు), యూనియన్‌ బ్యాంక్‌ (రూ.50 కోట్లు), సిండికేట్‌ బ్యాంక్‌ (రూ.50 కోట్లు), బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(రూ.45 కోట్లు), ఐడీబీఐ బ్యాంక్‌ (రూ.45 కోట్లు), యూకో బ్యాంక్‌(రూ.40 కోట్లు), తమిళనాడు మర్కంటైల్‌ (రూ.37 కోట్లు), ఆంధ్రా బ్యాంక్‌(రూ. 30 కోట్లు), బీఓబీ(రూ.30 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌(రూ.25 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్‌(రూ.25 కోట్లు), సెంట్రల్‌ బ్యాంక్‌(రూ.20 కోట్లు), కార్పొరేషన్‌ బ్యాంక్‌(రూ.20 కోట్లు) ఉన్నాయి.

2006లో ప్రారంభం...

2006లో చెన్నై కేంద్రంగా ఆరంభమైన కనిష్క్‌ గోల్డ్‌ కార్యకలాపాలు ఇతర రాష్ట్రాలకూ విస్తరించాయి. దీనికి అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, విజయవాడ, విశాఖపట్నంలో కూడా షోరూమ్‌లు ఉన్నాయి. 2014 వరకూ 'క్రిజ్‌' బ్రాండ్‌ పేరుతో సొంతంగా తయారు చేసిన ఆభరణాలను కంపెనీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా విక్రయించింది. అయితే, 2015 నుంచి బిజినెస్‌–టు–బిజినెస్‌ విధానానికి కంపెనీ మారిందని ఎస్‌బీఐ తన ఫిర్యాదులో వివరించింది. కేవలం పెద్ద రిటైల్‌ జువెలరీ సంస్థలకు ఆభరణాల సరఫరాను మొదలుపెట్టినట్లు వెల్లడించింది. కాగా, మొత్తం రుణంలో తమ వద్ద తనఖాగా ఉంచిన ఆస్తులు(సెక్యూరిటీ) కేవలం రూ.156.65 కోట్లు మాత్రమేనని ఎస్‌బీఐ చెబుతోంది. రుణ నిధులను ప్రమోటర్లు, డైరెక్టర్లు దారి మళ్లించారని కూడా పేర్కొంది.

◆ **ఇండియన్‌ వుమెన్‌ నెట్‌వర్క్‌ లీడర్‌షిప్‌ కాంక్లేవ్‌..**



సీఐఐ ఇండియన్‌ వుమెన్‌ నెట్‌వర్క్‌ తెలంగాణ లీడర్‌షిప్‌ కాంక్లేవ్‌ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. వివిధ రంగాల్లో ప్రత్యేకత కనబరిచిన మహిళలను ఈ సందర్భంగా అవార్డులతో సత్కరించారు. ఇండియన్‌ వుమెన్‌ నెట్‌వర్క్‌ ప్రతినిధులైన ఎలికో వైస్‌ చైర్‌పర్సన్‌ వనిత దాట్ల, ఆల్ఫా ఇండియా డైరెక్టర్‌ శోభ దీక్షిత్‌ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
– హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో

ఇండియా ఇన్నోవేషన్‌ గ్రోత్‌ ప్రోగ్రామ్‌కు 2 మిలియన్‌ డాలర్లు

DST - Lockheed Martin India Innovation Growth Programme

న్యూఢిల్లీ: దేశీయంగా స్టార్టప్‌ సంస్థలకు ఊతమిచ్చేందుకు ఉద్దేశించిన రెండో విడత ఇండియా ఇన్నోవేషన్‌ గ్రోత్‌ ప్రోగ్రాం (ఐఐజీపీ) 2.0కి టాటా ట్రస్ట్స్, లాక్‌హీడ్‌ మార్టిన్, కేంద్ర సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ) ఈ ఏడాది కూడా 2 మిలియన్‌ డాలర్లు కేటాయించాయి. వ్యవసాయం, వైద్యం, నీరు, ఇంధనం మొదలైన రంగాల్లో సమస్యలకు సంబంధించిన సాంకేతిక పరిష్కారాల కనుగొనే ఔత్సాహిక వ్యాపారవేత్తలను తోడ్పడేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నారు. డీఎస్‌టీ ప్రోగ్రామ్‌ హెడ్‌ (ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ విభాగం) హర్కేష్‌ మిట్టల్‌ ఈ విషయాలు తెలిపారు.

స్టార్టప్‌లను కొంటాం

- వచ్చే ఏడాది కాలంలో 3 నుంచి 5
- భారత్‌లో విస్తరణ కొనసాగుతుంది
- వాల్‌మార్ట్‌ సీటీఓ జెరెమీ కింగ్‌ వెల్లడి
- ఫ్లిప్‌కార్ట్‌తో డీల్‌పై మాత్రం దాటవేత



న్యూఢిల్లీ: భారత మార్కెట్లో తాము ఇక ముందూ దూకుడుగా వెళతామని వాల్‌మార్ట్‌ చీఫ్‌ టెక్నాలజీ ఆఫీసర్‌ జెరెమీ కింగ్‌ చెప్పారు. తమ విస్తరణ కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. భారత్‌లో అతిపెద్ద టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన వాల్‌మార్ట్‌... అమెజాన్‌కు పోటీగా దేశీయంగా అగ్రస్థానంలో ఉన్న ఈ కామర్స్‌ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. కానీ వీటిపై ఆయన నేరుగా స్పందించలేదు. తమ విధానం కొనసాగుతుందంటూనే, ఇప్పటి వరకు 13 కంపెనీలను కొనుగోలు చేశామని, బెంగళూరులోనూ అలా చేయడాన్ని ఇష్టపడతామని చెప్పారు. వచ్చే ఏడాది, ఆపై కాలంలో మూడు నుంచి ఐదు స్టార్టప్‌లను కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. అమెరికాలో తమకు విజయాన్నందించిన ఈ మోడల్‌ ప్రకారం... బెంగళూరులో ఎన్ని స్టార్టప్‌ల కొనుగోలుకు అవకాశం లభిస్తుందో చూడాలని చెప్పారాయన. ఓ వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

కొనుగోళ్ల ద్వారా విస్తరణ

అంతర్జాతీయంగా అతిపెద్ద ఆన్‌లైన్‌ రిటైలర్‌గా ఉన్న అమెజాన్‌తో ఉన్న అంతరాన్ని పూడ్చుకుని అగ్ర స్థానానికి చేరుకునేందుకు గత ఐదేళ్లలో తన ఈ కామర్స్‌ వ్యాపారంపై బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించింది. దీన్లో భాగంగా 2016లో అమెరికాకు చెందిన ఆన్‌లైన్‌ రిటైలర్‌ జెట్‌ డాట్‌ కామ్‌ను 3.3 బిలియన్‌ డాలర్లు వెచ్చించి సొంతం చేసుకుంది. అదే ఏడాది చైనాకు చెందిన రెండో అతిపెద్ద ఈ కామర్స్‌ కంపెనీ జేడీ డాట్‌కామ్‌లో 5 శాతం వాటా కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్ల ద్వారా తమకు మంచి వ్యాపార నైపుణ్యం అందుబాటులోకి వచ్చినట్టు కింగ్‌ వెల్లడించారు. రానున్న సంవత్సరాల్లోనూ ఈ కామర్స్‌ వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళతామని, దీనికి భారత్‌లోని టెక్నాలజీ కేంద్రం కీలకమని చెప్పారు. భారత్‌ను టెక్నాలజీ కేంద్రంగా వినియోగించుకోనున్నట్టు తెలిపారు. అమెరికాలోని ఆర్కాన్సాస్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, బెంగళూరులో తమకు పటిష్ట టెక్నాలజీ కేంద్రాలున్నాయని చెప్పిన కింగ్‌... బెంగళూరు కేంద్రం మరింత వృద్ధి చెందుతున్న ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ఆకాంక్ష అయితే చాలా బలంగా ఉందని, తమ విధానం, ఉత్పత్తులకు సరిపోలే, టాలెంట్‌తో కూడిన స్టార్టప్‌లను గుర్తించడమే కీలకమని వాల్‌మార్ట్‌ టెక్నాలజీ వైస్‌ ప్రెసిడెంట్‌ హరి వాసుదేవ్‌ చెప్పారు. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో అమెజాన్‌ వాటా 43 శాతం కాగా, వాల్‌మార్ట్‌ వాటా 4 శాతంలోపే ఉంది.

అమెరికా ఫెడ్‌ రేటు పావు శాతం పెంపు

1.75 శాతానికి పెరిగిన వడ్డీ రేటు



వాషింగ్టన్: అమెరికన్‌ ఫెడరల్‌ రిజర్వ్‌.. మార్కెట్‌ వర్గాల అంచనాలకు అనుగుణంగానే వడ్డీ రేట్లను పావు శాతం మేర పెంచింది. దీంతో వడ్డీ రేట్ల శ్రేణి 1.5 శాతం– 1.75 శాతానికి చేరింది. ఈ ఏడాది ఇది తొలి విడత పెంపు కాగా.. మరో రెండు దఫాలుగా పెంచే అవకాశాలు ఉన్నాయని సంకేతాలు ఇచ్చింది. వచ్చే ఏడాది రెండు దఫాలు, ఆ పై ఏడాది కూడా మరో రెండు విడతలు పెంచవచ్చని ఫెడరల్‌ రిజర్వ్‌ పేర్కొంది. 2020లో అమెరికా వృద్ధి 2 శాతం ఉండొచ్చని, దీర్ఘకాలికంగా 1.8 శాతం ఉండొచ్చని ఫెడరల్‌ రిజర్వ్‌ అంచనా వేసింది. రెండు రోజుల సమీక్ష అనంతరం అమెరికా ఫెడరల్‌ ఓపెన్‌ మార్కెట్‌ కమిటీ (ఎఫ్‌ఓఎంసీ) బుధవారం రాత్రి ఈ మేరకు నిర్ణయాలు వెలువరించింది. ఫెడరల్‌ రిజర్వ్‌ చైర్మన్‌గా జేనెట్‌ యెలెన్‌ స్థానంలో జెరోమ్‌ పావెల్‌ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఫెడ్‌ రేటు పెంచడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రేటు నిర్ణయంతో అమెరికా మార్కెట్లు గణనీయంగా పెరిగాయి. డౌజోన్స్‌ ఒక దశలో సుమారు 200 పాయింట్లు, నాస్‌డాక్‌ 40 పాయింట్లు లాభంలో ట్రేడయ్యాయి.

భారత్‌కు వోల్వో ఎలక్ట్రిక్‌ బస్‌లు

వోల్వో గ్రూప్‌ ప్రెసిడెంట్‌ కమల్‌ బాలి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: భారత మార్కెట్లోకి వోల్వో ఎలక్ట్రిక్‌ బస్‌లను ప్రవేశపెడుతోంది. దేశీ విపణిలోకి ఇప్పటికే హైబ్రిడ్‌ బస్‌లను తెచ్చింది. పూర్తిస్థాయి ఎలక్ట్రిక్‌ బస్‌లకు అనువైన సమయం కోసం ఎదురు చూస్తున్నామని వోల్వో గ్రూప్‌ ఇండియా ప్రెసిడెంట్‌ కమల్‌ బాలి 'సాక్షి' బిజినెస్‌ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల్లో 3,000కు పైగా ఎలక్ట్రిక్‌ బస్‌లను విక్రయించామన్నారు. 'ప్రభుత్వ రంగ రోడ్డు రవాణా సంస్థలతో మా భాగస్వాములు మాట్లాడుతున్నారు. అద్దెకు ఈ బస్‌లను తిప్పేలా మేం ప్రోత్సహిస్తున్నాం' అని చెప్పారు. భారత్‌లో తమ గ్రూప్‌ ఇప్పటి వరకు రూ.3,000 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. ప్రతి మూడేళ్లకు కొత్త పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు.

బంగారానికి డిజిటల్‌ మెరుపులు!

- స్మార్ట్‌ఫోన్లు, వ్యాలెట్ల చేయూత
- కోరుకున్నప్పుడు కొనుగోలు, అమ్మకం
- డిజిటల్‌ గోల్డ్‌లో పెరుగుతున్న పెట్టుబడులు
- ఒక్క రూపాయితోనూ కొనే అవకాశం



న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్‌ బంగారం ప్లాట్‌ఫామ్‌లు జోరందుకుంటున్నాయి. ఎందుకంటే... డిజిటల్‌ బంగారాన్ని ఇష్టపడుతున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. స్మార్ట్‌ఫోన్ల వినియోగం, వ్యాలెట్ల విస్తరణతో అర చేతి నుంచే క్షణాల్లో క్రయ విక్రయాలు చేయగలగటం... నోట్ల రద్దు తర్వాత, బంగారం కొనుగోళ్లపై నిఘా పెరగడం... ఇవన్నీ జనాన్ని డిజిటల్‌ గోల్డ్‌ వైపు నడిపిస్తున్నాయి. ఫలితం... 34 బిలియన్‌ డాలర్ల దేశీ బంగారం మార్కెట్లో డిజిటల్‌ శకం మొదలైందని చెప్పొచ్చు.

రూపాయి ఉన్నా చాలు...

భౌతికంగా బంగారం కొనాలంటే కనీసం అర గ్రాము (రూ.1,500) కొనాలి. అదే డిజిటల్‌ రూపంలో కొనాలంటే రూపాయితోనూ సాధ్యమే. పేటీఎం ఈ అవకాశం కల్పిస్తోంది. మిగిలిన సంస్థలూ చాలా స్వల్ప పరిమాణం నుంచి బంగారం కొనేందుకు అనుమతిస్తున్నాయి. ప్రభుత్వ రంగ ఎంఎంటీసీ, స్విట్జర్లాండ్‌కు చెందిన బంగారం రిఫైనరీ కంపెనీ పీఏఎంపీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. డిజిటల్‌ రూపంలో కొన్న బంగారానికి సమాన పరిమాణంలో వాల్ట్‌లలో బంగారాన్ని ఉచితంగా నిల్వ చేసుకోవచ్చు కూడా. భౌతికంగా బంగారం కావాలంటే అదనపు చార్జీలు భరించగలిగితే నేరుగా ఇంటికే డెలివరీ చేస్తారు.

భౌతిక బంగారంపై మక్కువ

వాస్తవానికి ఆన్‌లైన్‌లో బంగారం కొనుగోళ్లనేవి మనకు కొత్త గానీ, అంతర్జాతీయంగా ఎప్పటి నుంచో ఈ ధోరణి కొనసాగుతోంది. ఆభరణాలు, బంగారం రూపంలో మన దగ్గర బహుమతులిచ్చే ధోరణి బలంగా ఉండటమే కారణం. అయితే, డిజిటల్‌ రూపంలోనూ బహుమతిగా ఇచ్చే విధానం ఇప్పుడిప్పుడే మన దగ్గర ప్రారంభమైంది. ''భారత్‌లో ఇప్పుడే మార్పు మొదలైంది. ఆర్థిక వ్యవస్థ డిజిటైజేషన్‌తో బంగారంలోనూ డిజిటైజేషన్‌ మొదలైంది'' అని వరల్డ్‌ గోల్డ్‌ కౌన్సిల్‌ దేశీయ ఎండీ సోమసుందరం తెలిపారు. రానున్న 12– 24 నెలల్లో డిజిటల్‌ గోల్డ్‌ భారీగా వృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని చెప్పారాయన. దేశీయంగా బంగారానికి డిమాండ్‌ 2017లో 727 టన్నులుండగా, అది ఈ ఏడాది 800 టన్నులుంటుందని అంచనా. భారతీయ వివాహాలు, వేడుకల్లో ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా భౌతిక బంగారానికి డిమాండ్‌ తగ్గదని, ఇప్పటికీ భారీ మొత్తంలో సంప్రదాయ రూపంలోనే కొనుగోళ్లు జరుగుతున్నాయని థింక్‌ మార్కెట్స్‌ యూకే చీఫ్‌ నయీమ్‌ అస్లామ్‌ తెలిపారు.

భద్రత, నష్టం ఉండదు...


మిగులు నిధులున్నప్పుడు డిజిటల్‌ రూపంలో బంగారం కొంటే అవసరమైనప్పుడు ఫిజికల్‌గా బంగారం డెలివరీ తీసుకోవడం లేదా ఆన్‌లైన్‌లోనే విక్రయించేసి ఆభరణాల దుకాణానికి వెళ్లి కొనుక్కోవటం చేయొచ్చు. డిజిటల్‌ రూపంలో పొదుపునకు కూడా ఇది వీలు కల్పిస్తుంది. పైగా భద్రత సమస్య ఉండదు. ఇవన్నీ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. పేటీఎం 2017 ఏప్రిల్‌లో డిజిటల్‌ గోల్డ్‌ విక్రయాలను ప్రారంభించగా, తొలి ఆరు నెలల్లో 18.4 మిలియన్‌ డాలర్ల విలువైన (సుమారు రూ.120 కోట్లు) అమ్మకాలు జరిపింది. లావాదేవీల్లో ఉన్న సౌకర్యానికి తోడు చిన్న మొత్తం నుంచి సరసమైన ధరకు కొనుగోలు చేసే అంశం వారిని ఆకర్షిస్తోంది. కస్టమర్లను ఆకర్షించేందుకు కొన్ని సంస్థలు డిజిటల్‌ గోల్డ్‌ ఆధారిత పొదుపు పథకాలను కూడా ఆరంభించాయి.

మున్ముందు ఈ ఆసక్తి పెరిగే అవకాశం...

కస్టమర్లలో ఆసక్తి పెరుగుతుందన్న అంచనాతో... పేటీఎం ఇటీవలే బంగారం గిఫ్ట్, సేవింగ్‌ పేరుతో రెండు పథకాలను ప్రారంభించింది. ఈ సంస్థ ఎంఎంటీసీ, పీఏఎంపీ సహకారంతో ఆన్‌లైన్‌లో బంగారం కొనుగోళ్లకు వీలు కల్పిస్తోంది. కావాలంటే డిజిటల్‌ రూపంలో, కోరుకుంటే భౌతిక రూపంలోనూ డెలివరీ తీసుకోవచ్చు. దీనికి ఓ సీజన్‌ అంటూ లేదని, వారంలో అన్ని రోజులు, రోజులో అన్ని గంటల్లో, ఎక్కడున్నా సరే వ్యాలెట్‌ నుంచే క్రయవిక్రయాలు జరపొచ్చని ఎంటీసీ, పీఏఎంపీ మార్కెటింగ్‌ జనరల్‌ మేనేజర్‌ గౌరవ్‌ సింగ్‌ తెలిపారు. తమ కస్టమర్లలో 70 శాతం 35 ఏళ్లలోపు వారేనని, గత డిసెంబర్‌నాటికి 14 లక్షల మంది యూజర్ల ఈ వ్యాలెట్లలో బంగారం నిల్వలున్నాయని పేటీఎం సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ నితిన్‌ మిశ్రా తెలిపారు.

ఈ ఏడాదిలోనే చిత్తూరు ప్లాంటు పూర్తి

కర్లాన్‌ చైర్మన్‌ సుధాకర్‌ పాయ్‌ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: పరుపులు, ఫర్నిచర్‌ తయారీ సంస్థ కర్లాన్‌ ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో ఏర్పాటు చేస్తున్న ప్లాంటు ఈ ఏడాదిలోనే సిద్ధం కానుంది. ఈ ప్లాంటు కోసం కంపెనీ రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. ప్రత్యక్షంగా 1,000 మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయని కర్లాన్‌ ఎంటర్‌ప్రైస్‌ చైర్మన్‌ టి.సుధాకర్‌ పాయ్‌ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. పరోక్షంగా మరో 4,000 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. 'అన్ని కంపెనీలు ఒకచోట ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ఫర్నిచర్‌ పార్క్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ప్రతిపాదిత పార్క్‌లో ప్లాంటు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వం నుంచి మాకు ప్రతిపాదన వచ్చింది. ఈ విషయాన్ని పరిశీలిస్తున్నాం' అని పేర్కొన్నారు. కంపెనీకి దేశవ్యాప్తంగా 800 ఎక్స్‌క్లూజివ్‌ ఔట్‌లెట్లు ఉన్నాయి. 18 నెలల్లో మరో 800 కేంద్రాలను నెలకొల్పుతామని సుధాకర్‌ పాయ్‌ వెల్లడించారు.

33 వేల పైకి సెన్సెక్స్

కలసివచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు

- 139 పాయింట్ల లాభంతో 33,136కు సెన్సెక్స్
- 31 పాయింట్లు పెరిగి 10,155కు నిఫ్టీ



విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు కూడా తోడవడంతో స్టాక్ మార్కెట్ బుధవారం లాభాల్లో ముగిసింది. స్టాక్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో అంతర్జాతీయ సంకేతాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, సెన్సెక్స్ 33 వేల పాయింట్ల పైకి ఎగసింది. అయితే ఆరంభ లాభాలు చివరికంటా మిగలలేదు. బీఎస్ఈ సెన్సెక్స్139 పాయింట్ల లాభంతో 33,136 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 31 పాయింట్లు పెరిగి 10,155 పాయింట్ల వద్ద ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల వల్ల సెన్సెక్స్ మంచి లాభాలు సాధించినప్పటికీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా గ్రూప్ షేర్లు నష్టపోవడం లాభాలను పరిమితం చేసింది. లాభాల్లోనే ఆరంభమైన స్టాక్ సూచీలు కొనుగోళ్ల జోరుతో మరింత లాభపడ్డాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 358 పాయింట్లు, నిఫ్టీ 103 పాయింట్ల చొప్పున లాభాలు సాధించాయి. ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి.

ఫెడ్ రేట్లపై ఆసక్తి..!: అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల నిర్ణయంపై మార్కెట్ ఆసక్తిగా ఎదురు చూస్తోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అంచనాలకు అనుగుణంగానే పావు శాతం మేర రేట్ల పెంపు ఉండి, మరే ఇతర ప్రతికూల వ్యాఖ్యలు లేకపోతే మార్కెట్లో రిలీఫ్ ర్యాలీ చోటు చేసుకుంటుందని ఆయన అంచనా వేస్తున్నారు. రేట్లకు సంబంధించి ఫెడరల్ రిజర్వ్ చీఫ్ జెరోమీ పావెల్ ఏమైనా ప్రతికూల వ్యాఖ్యలు చేస్తే మాత్రం మార్కెట్లో ఒడిదుడుకులు తప్పవని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,277
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	28,411
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	8,14,332
ఎఫ్ఐఐ	98
డీఐఐ	198

మార్కెట్లోకి రెండు ట్రయంఫ్ బైక్‌లు

- టైగర్ 800 ఎక్స్‌సీఎక్స్ @ రూ.13.76 లక్షలు
- టైగర్ 800 ఎక్స్ఆర్ @ 11.76 లక్షలు



న్యూఢిల్లీ: బ్రిటిష్ సూపర్ బైక్ కంపెనీ ట్రయంఫ్..టైగర్ 800 మోడల్‌లో రెండు కొత్త వేరియంట్లను అందుబాటులోకి తెచ్చింది. టైగర్ 800 మోడల్‌లో ఇంజిన్, చాసిస్, ఇతర టెక్నాలజీ అంశాల్లో 200కు పైగా మార్పులు చేర్పులు చేసిన టైగర్ 800 ఎక్స్‌సీఎక్స్(ధర రూ.13.76 లక్షలు), టైగర్ 800 ఎక్స్ఆర్ (ధర రూ.11.76 లక్షలు–ఇవి ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ ధరలు) బైక్‌లను భారత మార్కెట్లోకి తెచ్చామని ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ఇండియా తెలిపింది. అత్యుత్తమమైన బైక్‌ను అందించడమే లక్ష్యంగా ఆధునిక టెక్నాలజీతో ట్రయంఫ్ టైగర్ బైక్‌లను అందిస్తున్నామని కంపెనీ ఎండీ విమల్ సంబ్లి చెప్పారు. భారత్‌లో ట్రయంఫ్ మోడళ్లలో అత్యధికంగా అమ్ముడవుతున్న బైక్‌లు టైగర్ బైక్‌లేనని చెప్పారు.

ఎస్సార్ స్టీల్ కొనుగోలు బిడ్లు తిరస్కరణ

న్యూమెటల్, ఆర్సెలర్‌మిట్టల్‌కు నో

ముంబై: ఉక్కు సంస్థ ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు న్యూమెటల్, ఆర్సెలర్‌మిట్టల్ దాఖలు చేసిన బిడ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సారథ్యంలోని బ్యాంకుల కన్సార్షియం తిరస్కరించింది. సవరించిన దివాలా చట్టం నిబంధనలకు ఇవి విరుద్ధంగా ఉండటమే దీనికి కారణం. సదరు చట్ట సవరణ ప్రకారం దివాలా చర్యలు ఎదుర్కొంటున్న సంస్థలతో సంబంధమున్న కంపెనీలు బిడ్లు వేయడానికి లేదు. ఆర్సెలర్ మిట్టల్‌కి ఉత్తమ్ గాల్వాతో జాయింట్ వెంచర్ ఉంది. మొండిబాకీలకు సంబంధించి దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొనే దిశగా ఉత్తమ్ గాల్వా సంస్థ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందుకు చేరే అవకా శం ఉంది. ఫలితంగా ఆర్సెలర్ మిట్టల్ బిడ్ వేసే అర్హతను కోల్పోయింది. మరోవైపు, న్యూమెటల్ ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్‌లో (ఎస్‌పీవీ) రేవంత్ రుయా ప్రమోటరుగా ఉన్నారు. ఈయన ఎస్సార్ గ్రూప్ ప్రమోటరు రవి రుయా కుమారుడు. సంబంధిత పార్టీలయినందున న్యూమెటల్ బిడ్‌ను బ్యాంకులు తిరస్కరించాయి. ఏప్రిల్ 2లోగా రెండో రౌండు బిడ్డింగ్ నిర్వహిం చాలని బ్యాంకులు నిర్ణయించాయి. ఎస్సార్ స్టీల్ 30 బ్యాంకులకు సుమారు రూ. 45,000 కోట్లు బాకీ పడింది.

మరో ఏడాది 'ప్రభుత్వ బ్యాంకులు' నష్టాల్లోనే

ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: మొండిబాకీల ప్రక్షాళనలో భాగంగా భారీ కేటాయింపుల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) మరో ఏడాది పాటు నష్టాలే నమోదు చేసే అవకాశం ఉందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సంస్థ అంచనా వేసింది. మొత్తం మీద 2019–20 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగం టర్న్ ఎరౌండ్ కాగలదని పేర్కొంది. ప్రధాన వర్ధమాన మార్కెట్ల బ్యాంకులకు అంతర్జాతీయ ఆర్థిక రికవరీ ఎంత మేర తోడ్పడుతుంది అన్న పేరిట రూపొందించిన నివేదికలో ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఈ అంశాలు వెల్లడించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఇటీవలి రూ. 13,000 కోట్ల కుంభకోణం.. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో.. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పారదర్శకత లోపాలు, బలహీన గవర్నెన్స్ ప్రమాణాలను మరోసారి బహిర్గతం చేశాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో బ్యాంకులను సంస్కరించేందుకు, అంతర్గత పర్యవేక్షణ వ్యవస్థలను పటిష్టం చేసేందుకు మరిన్ని నిర్మాణాత్మక చర్యలు అవసరమని తెలిపింది.

గతేడాది సెప్టెంబర్ నాటికి దేశీ ప్రభుత్వ రంగ బ్యాంకులు 10.2 శాతం ఎన్‌పీఏలు మాత్రమే చూపినప్పటికీ.. వాస్తవంగా ఇది 13–15 శాతం మేర ఉండొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ పేర్కొంది. రాబోయే త్రైమాసికాల్లో మరిన్ని మొండిబాకీలను గుర్తించే ప్రక్రియను బ్యాంకులు వేగవంతం చేయొచ్చని తెలిపింది. దీంతో 2018 ఆర్థిక సంవత్సరం తరహాలోనే 2019 ఆర్థిక సంవత్సరంలో కూడా ప్రొవిజనింగ్ పెరగవచ్చని వివరించింది.

అలహాబాద్ బ్యాంక్ అనుబంధ సంస్థ విలీనానికి ఓకే..



న్యూఢిల్లీ: పూర్తి అనుబంధ సంస్థ ఆల్‌బ్యాంక్ ఫైనాన్స్‌ను విలీనం చేసుకునేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు అలహాబాద్ బ్యాంక్ వెల్లడించింది. గతేడాది సెప్టెంబర్‌లో విలీన ప్రతిపాదనను బ్యాంక్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ మొదలైన ఫీజు ఆధారిత సర్వీసులను ఆల్‌బ్యాంక్ ఫైనాన్స్ అందిస్తోంది.

మోసాలను బ్యాంకులు నియంత్రించాలి

స్కోప్ చైర్మన్ వేద్ ప్రకాశ్



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో ఇటీవలి భారీ కుంభకోణం నేపథ్యంలో.. ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) మోసాల నివారణ యంత్రాంగాన్ని, రిస్క్ మేనేజ్‌మెంట్ విధానాలను పటిష్టం చేసుకోవడంపై మరింతగా దృష్టి పెట్టాలని 'స్కోప్' చైర్మన్ వేద్ ప్రకాశ్ సూచించారు. లొసుగులను సరిదిద్దేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుత వ్యవస్థలో కొన్ని సార్లు ఒక వ్యక్తి లేదా బృందం చేసే మోసాలను అడ్డుకోవడం చాలా కష్టసాధ్యం కావొచ్చు. సరిగ్గా ఇలాంటి వాటినే అరికట్టే దిశగా మోసాల నివారణ వ్యవస్థను, రిస్క్ మేనేజ్‌మెంట్ విధానాలను పీఎస్‌యూలు, బ్యాంకులు మరింత పటిష్టం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి' అని బుధవారం స్కోప్ యూట్యూబ్ చానల్ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేద్ ప్రకాశ్ వివరించారు. బ్యాంకింగ్ మోసాలను నివారించే క్రమంలో స్వతంత్ర డైరెక్టర్ల పాత్ర, బాధ్యతలను గణనీయంగా పెంచడం జరిగిందని ఆయన తెలిపారు.

బీఓఐ 'యాంగూన్' కార్యాలయం మూసివేత

న్యూఢిల్లీ: మయన్మార్‌లోని యాంగూన్‌లో తమ రిప్రజెంటేటివ్ ఆఫీసు కార్యకలాపాలను జనవరి మధ్య నుంచి నిలిపివేసినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వెల్లడించింది. జనవరి 19 నుంచి కార్యాలయాన్ని మూసివేసేందుకు మయన్మార్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలియజేసింది. లాభసాటిగా లేని విదేశీ శాఖలు, కార్యాలయాలను మూసివేయడం లేదా క్రమబద్ధీకరించే అంశం పరిశీలించాలని గతేడాది నవంబర్‌లో నిర్వహించిన మంథన్ సమావేశంలో బ్యాంకర్లు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారమే ఇప్పటికే పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు సుమారు 35 విదేశీ శాఖలను మూసివేశాయి. బీఓఐ .. యాంగూన్ ఆఫీసుతో పాటు బోట్స్‌వానాలోని కార్యాలయాన్ని కూడా మూసివేసినట్లు తెలుస్తోంది. అటు బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులు హాంకాంగ్‌లోని తమ తమ శాఖలను మూసివేశాయి.

ఆరు రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబైన 'సంధార్' ఐపీఓ

బుధవారంతో ముగిసిన ఐపీఓ



న్యూఢిల్లీ: వాహన విడిభాగాలు తయారు చేసే సంధార్ టెక్నాలజీస్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) 6.18 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఈ నెల 19న ప్రారంభమైన ఈ ఐపీఓ బుధవారం ముగిసింది. రూ.327–332 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.512 కోట్లు సమీకరించనున్నది. ఈ ఐపీఓలో భాగంగా 1.08 కోట్ల షేర్లను జారీ చేయనుండగా, మొత్తం 6.71 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు(క్విబ్స్)కు కేటాయించిన వాటా 14.5 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన వాటా 6.39 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 1.3 రెట్లు చొప్పున ఓవర్ సబ్‌స్క్రైబయ్యాయి. ఈ ఐపీఓలో భాగంగా రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు 64 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) విధానంలో జారీ చేస్తారు. ఈ ఐపీఓకు లీడ్ మేనేజర్లుగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్ వ్యవహరిస్తున్నాయి. గత శుక్రవారం సంధార్ టెక్నాలజీస్ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.154 కోట్లు సమీకరించింది. వచ్చే నెల మొదటివారంలో ఈ షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి.

ఈ నెల 28న ఎస్ఎస్ ఇన్‌ఫ్రా ఐపీఓ

ప్రైస్‌బాండ్ రూ.37–40

SS Infrastructure Development Consultants Pvt. Ltd

న్యూఢిల్లీ: ఎస్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్స్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెల 28న ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫార్మ్‌పై రానున్నది. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.17 కోట్లు సమీకరించనున్నది. ఈ ఐపీఓలో భాగంగా 42.78 లక్షల షేర్లను ఆఫర్ చేస్తోంది. ప్రైస్ బాండ్ రూ.37–40గా ఉంది. ఈ ఐపీఓ నిధులను కొత్త బ్రాంచ్ ఏర్పాటుకు, ప్రస్తుత కార్యాలయాల నవీకరణకు, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కొనుగోళ్లకు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, ఇతర సాధారణ వ్యాపార అవసరాలకు వినియోగించాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా పంటోమాథ్ క్యాపిటల్ అడ్వైజర్స్, రిజిస్ట్రార్‌గా బిగ్‌షేర్ సర్వీసెస్ వ్యవహరించనున్నాయి.

ఆటోమోటివ్ ఫ్యాబ్రిక్స్‌లోకి అరవింద్ ఎంట్రీ

ఆడియెంట్‌తో కలసి జాయింట్ వెంచర్

Arvind WEAR THE FUTURE

పుణె: టెక్స్‌టైల్ కంపెనీ అరవింద్ లిమిటెడ్, ఆటోమోటివ్ సీటింగ్‌లో అంతర్జాతీయ కంపెనీ ఆడియెంట్‌తో కలసి ఆటోమోటివ్ ఫ్యాబ్రిక్స్‌ను తయారు చేయనుంది. ఇందుకోసం ఆడియెంట్ అరవింద్ ఆటోమోటివ్ ఫ్యాబ్రిక్స్ పేరుతో జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఆటోమోటివ్ ఫ్యాబ్రిక్స్‌ను ఉత్పత్తి చేసి దేశీయంగా విక్రయించనుంది. వాహనాల సీటింగ్‌కు సంబంధించి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వస్త్రాలు తయారు చేయనున్నట్టు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది.

స్టార్టప్‌లకు మంచి భవిష్యత్తు

- 2025 కల్లా భారత్‌లో లక్ష స్టార్టప్‌లు
- ఇన్ఫీ మాజీ డైరెక్టర్ పాయ్ వెల్లడి



జైపూర్: స్టార్టప్‌లన్నింటికీ మంచి భవిష్యత్తు ఉందని ఐటీ రంగ కురువృద్ధుడు, ఇన్ఫోసిస్ మాజీ డైరెక్టర్ టీవీ మోహన్‌దాస్ పాయ్ చెప్పారు. అయితే వీటిల్లో 60 శాతం స్టార్టప్‌లు విఫలమవుతాయని పేర్కొన్నారు. తగిన మార్కెట్ లేకపోవడం, ఇతర అంశాలు దీనికి కారణాలని వివరించారు. తొలిసారి ఎంటర్‌ప్రెన్యూర్లు ప్రారంభించిన కారణంగా చాలా స్టార్టప్‌లు తగిన మార్కెట్‌ను పొందలేవని మణిపాల్ గ్లోబల్ ఎజుకేషన్‌కు చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న పాయ్ తెలిపారు. వ్యాపారం ఎలా నిర్వహించాలో ఈ తొలిసారి ఎంటర్‌ప్రెన్యూర్లకు తెలియకపోవచ్చని, వారు స్టార్టప్ వెంచర్లలో విఫలమైనా ఆ అనుభవం ఆ తర్వాత అక్కరకు వస్తుందని వివరించారు. బాగా పనిచేసే స్టార్టప్‌లు మాత్రమే విజయం సాధిస్తాయని, మిగిలిన వన్నీ విఫలమవుతాయని తెలిపారు. ఈ స్టార్టప్ పరిశ్రమ నైజమే అలాంటిదని వివరించారు. భారత్‌లో ప్రస్తుతం 30,000 స్టార్టప్‌లు ఉన్నాయని, వీటిల్లో మొత్తం 3.5–4 లక్షల మంది పనిచేస్తున్నారని తెలిపారు. 2025 కల్లా భారత్‌లో లక్ష చురుకైన స్టార్టప్‌లు ఉంటాయని, వీటివల్ల 32 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. గత ఏడాది స్టార్టప్‌లకు 1,365 కోట్ల డాలర్ల నిధులు లభించాయని, ఇప్పుడు ఈ స్టార్టప్‌ల విలువ 9,500 కోట్ల డాలర్లకు పెరిగిందని పేర్కొన్నారు.

క్రీడా స్పాన్సర్‌షిప్ జోరు


2017లో రూ.7,300 కోట్ల ఖర్చు



ముంబై: దేశంలో క్రీడల స్పాన్సర్‌షిప్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. 2017లో స్పాన్సర్‌షిప్ రూపంలో రూ.7,300 కోట్ల నిధుల వ్యయం జరిగింది. 2016లో రూ.6,400 కోట్ల కంటే 14 శాతం ఎక్కువ. 55 శాతంతో మీడియా పెట్టుబడులే ఇందులో సింహ బాగంగా ఉన్నాయి. ఆ తర్వాత క్రీడా మైదానాల స్పాన్సర్‌షిప్‌లు, ఈఎస్‌పీ ప్రాపర్టీలు ఉన్నట్టు స్పోర్ట్జ్ పవర్ అనే సంస్థ ఓ నివేదికలో తెలియజేసింది. క్రీడలపై మీడియా ఖర్చు గతేడాదిలో 15.8 శాతం వృద్ధితో 3,511 కోట్ల నుంచి రూ.4,065 కోట్లకు పెరిగాయి. ఇందులో టెలివిజన్ పాత్ర కీలకమని ఈ నివేదిక పేర్కొంది.

రూ.200 కోట్లు డిపాజిట్ చేయండి

జైప్రకాష్ అసోసియేట్స్‌కు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ: తీవ్ర ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్న రియల్టీ సంస్థ జైప్రకాష్ అసోసియేట్స్‌ను రెండు విడతల్లో మొత్తం రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు బుధవారం ఆదేశించింది. ఏప్రిల్ 6లోపు రూ.100 కోట్లు, మే 10లోపు మరో రూ.100 కోట్లను జమ చేయాలని కోరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ నిర్వహించింది. రిఫండ్ (తాము చెల్లించిన డబ్బుల్ని వెనక్కి తీసుకోవడం) ఎంచుకున్న కస్టమర్లకు ఈఎంఐ బకాయి ఉంటే నోటీసులు పంపొద్దని ఆదేశించింది. ప్రాజెక్టుల వారీగా రిఫండ్ ఎంచుకున్న వారి వివరాలను సమర్పించాలని కోరింది. ప్రస్తుతానికి డబ్బులు తిరిగి చెల్లింపులపైనే తమ ఆందోళన అని, కొనుగోలుదారులకు ఫ్లాట్ల అందజేత అన్నది తర్వాత దృష్టి సారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. 31,000 మంది గృహ కొనుగోలుదారుల్లో కేవలం 8 శాతం మంది రిఫండ్ ఎంచుకున్నట్టు, మిగిలిన వారు ఫ్లాట్ల కోసం ఎదురు చూస్తున్నట్టు జై ప్రకాష్ అసోసియేట్స్ కోర్టుకు తెలియజేసింది. 13,500 ఫ్లాట్లకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్లను అందుకున్నట్టు తెలిపింది. గృహ కొనుగోలుదారుల ప్రయోజనాల రీత్యా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ సంస్థ జనవరిలో రూ.125 కోట్లను జమ చేసిన విషయం గమనార్హం.

కేజీ బేసిన్‌లో చమురు ఉత్పత్తి తగ్గింది!

రోజుకు 65 ఎంఎంసీఎఫ్ సామర్థ్యం ఉంది

- కానీ వెలికి తీస్తున్నది 43–45 ఎంఎంసీఎఫ్ మాత్రమే
- 2021–23 నాటికి రూ.91 వేల కోట్ల పెట్టుబడులొచ్చే చాన్స్
- కొత్తగా ఓఏఎల్‌పీలో 55 బ్లాక్స్ వేలం; ఇందులో 5 బ్లాక్స్ కేజీ బేసిన్‌లోనే
- హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ ఆంతనూ చక్రవర్తి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలోని మొత్తం గ్యాస్ ఉత్పత్తిలో 50 శాతానికి పైగా ఏపీలోని కృష్ణా – గోదావరి (కేజీ) బేసిన్ నుంచే ఉత్పత్తవుతున్నట్లు హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ ఆంతనూ చక్రవర్తి తెలియజేశారు. ''దేశంలో రోజుకు 80 మిలియన్ ఘనపుటడుగుల (ఎంఎంసీఎం) గ్యాస్ ఉత్పత్తవుతోంది. దీన్లో కేజీ బేసిన్‌లోనే రెండు కంపెనీల నుంచి 43–45 ఎంఎంసీఎం ఉత్పత్తవుతోంది. దీన్లో ఓఎన్‌జీసీ వాటా 15–18 ఎంసీఎం కాగా ప్రైవేట్ సంస్థది 25–30 ఎంఎంసీఎం ఉంటుంది. గతంలో ఈ రెండు కంపెనీలూ కేజీ బేసిన్ నుంచి రోజుకు 65 ఎంఎంసీఎం గ్యాస్ ఉత్పత్తి చేసేవి. కానీ, ఇప్పుడది తగ్గింది'' అని ఆయన వివరించారు. ఉత్పత్తి తగ్గటానికి ఆయన పలు కారణాలను వెల్లడించారు. కేజీ బేసిన్‌లో ఒక్కోచోట 1,200–2,600 మీటర్ల లోతు నీళ్లుంటాయని అందుకే చమురు ఉత్పత్తి సవాల్‌గా మారుతోందని వ్యాఖ్యానించారు. హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ (హెచ్ఈఎల్‌పీ) కింద ఓపెన్ ఆర్కేజ్ లైసెన్సింగ్ ప్రోగ్రామ్ (ఓఏఎల్‌పీ) వేలం జరిగింది. దేశంలోని 11 రాష్ట్రాల్లో 55 బ్లాక్స్‌కు వేలం నిర్వహించిన సందర్భంగా జాయింట్ సెక్రటరీ (ఎక్స్‌ప్లోరేషన్) దివాకర్ నాథ్ మిశ్రాతో కలిసి బుధవారమిక్కడ మీడియాతో ఆయన ఈ విషయాలు చెప్పారు.

రూ.91 వేల కోట్ల పెట్టుబడులు..
2021–2023 నాటికి కేజీ బేసిన్‌లో రెండు ప్రధాన చమురు, గ్యాస్ అన్వేషణ– ఉత్పత్తి కంపెనీల నుంచి సుమారు రూ.91 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముందని ఆంతనూ అంచనా వేశారు. ప్రస్తుతం ఓఏఎల్‌పీ వేలం నిర్వహిస్తున్న 55 బ్లాక్స్‌లో 5 బ్లాక్స్ (3 ఆన్ ల్యాండ్, 2 ఆఫ్‌షోర్) కేజీ బేసిన్‌లోనే ఉన్నాయి. కాగా కేజీ బేసిన్ ఆన్‌ల్యాండ్ 28 వేల చ.కి.మీ., ఆఫ్‌షోర్ 2.02 లక్షల చ.కి.మీ. విస్తరించి ఉంటుంది. ఏప్రిల్ 3తో వేలం ముగుస్తుంది. మరో 15 రోజులు పొడిగించే అవకాశముంది.

2020 నాటికి తొలి చమురు ఉత్పత్తి..
''ప్రస్తుతం దేశంలో 70 శాతం క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నదే. 2040 నాటికి దీన్ని 11 శాతానికి తగ్గించాలన్నది కేంద్రం లక్ష్యం. అందుకే 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ పాలసీని తీసుకొచ్చాం'' అని ఆంతనూ తెలిపారు. ఇందులో భాగంగా గతేడాది మార్చిలో డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్స్ (డీఎస్ఎఫ్)–1 వేలం నిర్వహించామంటూ... ''23 కంపెనీలతో 30 ఒప్పందాలు చేసుకున్నాం. ఇందులో 13 కంపెనీలు కొత్తవే. వీటి నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూ.9,300 కోట్లు, రాయల్టీగా రూ.5 వేల కోట్ల వాటా వస్తుంది. రాయల్టీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాన వాటా ఉంటుంది'' అని ఆయన వివరించారు. వచ్చే నెలలో డీఎస్ఎఫ్–2లో 60 బ్లాక్స్ వేలం ప్రారంభమవుతుందన్నారు.

ఏటా చమురు డిమాండ్ 4.5–5 శాతం వృద్ధి..
ప్రస్తుతం దేశంలో 37 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు ఉత్పత్తి అవుతుండగా.. డిమాండ్ మాత్రం 100–120 మిలియన్ మెట్రిక్ టన్నులుందని, అలాగే రోజుకు 80 ఎంఎంసీఎఫ్ గ్యాస్ ఉత్పత్తి ఉండగా.. 140 ఎంఎంసీఎఫ్ డిమాండ్ ఉందని చెప్పారాయన. ఏటా 4.5–5 శాతం డిమాండ్ పెరుగుతోందని.. అదే విదేశాల్లో అయితే 1–1.5 శాతం వరకే పెరుగుదల పరిమితమవుతోందని ఆయన వివరించారు.

గత నెలలో 130 కోట్ల డాలర్ల పీఈ పెట్టుబడులు

- పీఈ లావాదేవీల్లో స్టార్టప్‌ల హవా
- గ్రాంట్ థార్న్‌టన్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ(పీఈ) ఇన్వెస్ట్‌మెంట్స్ ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండు రెట్లు పెరిగాయని అష్యూరెన్స్, ట్యాక్స్ అడ్వైజరీ సంస్థ, గ్రాంట్ థార్న్‌టన్ తెలిపింది. ఈ ఏడాది మొదటి రెండు నెలల్లోనే పీఈ పెట్టుబడులు 67 శాతం వృద్ధితో 230 కోట్ల డాలర్లకు పెరిగాయని పేర్కొంది. స్టార్టప్, ఈ కామర్స్ కంపెనీల్లో పెట్టుబడులు జోరుగా వస్తుండటంతో పీఈ ఇన్వెస్ట్‌మెంట్స్ లావాదేవీలు కూడా జోరుగానే కొనసాగే అవకాశాలున్నాయంటున్న ఈ సంస్థ పీఈ పెట్టుబడులపై వెల్లడించిన కొన్ని ముఖ్యాంశాలు...

- గత ఏడాది ఫిబ్రవరిలో 58.8 కోట్ల డాలర్ల విలువైన మొత్తం 45 పీఈ ఇన్వెస్ట్‌మెంట్ లావాదేవీలు జరిగాయి.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో 130 కోట్ల డాలర్ల విలువైన 62 పీఈ ఇన్వెస్ట్‌మెంట్ లావాదేవీలు జరిగాయి.
- ఈ ఫిబ్రవరి పీఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో స్టార్టప్ డీల్స్ అధికంగా ఉన్నాయి. 47 శాతం వాటా స్టార్టప్ డీల్స్‌దే.
- ఫిన్‌టెక్, డిస్కవరీ ప్లాట్‌ఫామ్స్ చెరో ఐదు డీల్స్‌ను ఆకర్షించగా, హెల్త్ టెక్నాలజీ రంగంలో నాలుగు పీఈ ఇన్వెస్ట్‌మెంట్స్ డీల్స్ జరిగాయి.
- బిగ్‌బాస్కెట్ తన సిరీస్ ఈ రౌండ్‌లో 30 కోట్ల డాలర్ల పెట్టుబడులు సాధించింది. గత నెల్లో జరిగిన అతి పెద్ద పీఈ డీల్ ఇదే. ఆ తర్వాతి స్థానం ఫుడ్ డెలివరీ స్టార్టప్ స్విగ్గీ 10 కోట్ల డాలర్ల డీల్‌కు దక్కింది.
- ఇండియా గ్రిడ్ ట్రస్ట్ కంపెనీ స్టెరిలైట్ పవర్ గ్రిడ్ వెంచర్స్ నుంచి రూ.1,410 కోట్ల విలువైన మూడు ట్రాన్స్‌మిషన్ అసెట్స్‌ను కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చెప్పుకోదగ్గ డీల్స్‌లో ఇది కూడా ఒకటి.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,450	▲	50
బంగారం (99.5, 10గ్రా)	30,300	▲	50
వెండి (కిలో)	38,000	▼	20
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		–
బంగారం (22 క్యారెట్లు)	28,990	▲	10
వెండి (కిలో)	– –		–
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,390	▼	70
బంగారం (22 క్యారెట్లు)	28,940	▼	70
వెండి (కిలో)	41,000	▼	200
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,250		0
బంగారం (22 క్యారెట్లు)	28,940	▼	40
వెండి (కిలో)	39,100	▼	100
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	30,950	▼	80
బంగారం (22 క్యారెట్లు)	28,940	▼	70
వెండి (కిలో)	41,100		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,400		0
బంగారం (22 క్యారెట్లు)	29,000		0
వెండి(కిలో)	39,300	▲	300
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,340	▲	10
బంగారం (22 క్యారెట్లు)	28,990	▲	10
వెండి (కిలో)	39,100	▼	100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.00 (రాత్రి 11.00కు)	$63.54 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	69.00 (రాత్రి 11.00కు)	$67.42 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ –నెక్ /100కు రూ.లలో) 22-3-2018

విశాఖ	325-00
చిత్తూరు	363-00
వరంగల్	332-00
ముంబై	370-00
చెన్నై	370-00
విజయవాడ	317-00
గోదావరి	317-00
నమక్కల్	360-00
21-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365-00
కోల్‌కతా	360-00
ఢిల్లీ	310-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	363.7	370
AMBUJA CEME	229.85	230.4
ASIAN PAINT	1103.55	1106.5
AXIS BANK L	526.3	521.1
BAJAJ AUTO	2851.8	2873
BAJAJ FINAN	1704.55	1657.3
BHARTI AIRT	418.2	400.4
BOSCH LIMIT	17585.65	17876.75
BHARAT PETR	430.65	424.9
CIPLA LTD	551.05	552.9
COAL INDIA	270.9	270.25
EICHER MOTO	27980.85	28360.45
GAIL (INDIA	435.05	438.5
HCL TECHNOL	937.35	937.2
HDFC LTD	1817.85	1800.05
HDFC BANK L	1858.9	1839.5
HERO MOTOCO	3463.6	3513.8
HINDALCO I	214.7	217.3
HINDUSTAN Pet	353.3	354.85
HINDUSTAN Uni.	1315.6	1313.25
INDIABULLS	1216.4	1198.3
ICICI BANK	289.2	292
INDUSIND BA	1731.45	1716.65
BHARTI INFR	337.15	341.9
INFOSYS LIM	1167.5	1164.55
INDIAN OIL	172.45	173.85
ITC LTD	259.05	259.2
KOTAK MAHIN	1051.1	1045.3
LARSEN & TO	1309.35	1293.5
LUPIN LIMIT	767.85	771.75
MAHINDRA &	745.35	740.95
MARUTI SUZU	8874.65	8802.4
NTPC LTD	170.35	166.4
OIL AND NAT	175.55	174.1
POWER GRID	194.2	194.9
RELIANCE IN	896.9	889.8
STATE BANK	248	249.1
SUN PHARMAC	504.5	508.75
TATA MOTORS	333.85	338.8
TATA STEEL	582.25	593
TATA CONSUL	2856.75	2864.85
TECH MAHIND	625.85	633.4
ULTRATECH C	3999.2	3936.8
UPL LIMITED	714.9	712.3
VEDANTA LIM	285.75	287.1
WIPRO LTD	295.25	293.6
YES BANK LI	300.75	302.4
ZEE ENTERTA	566.85	575.1

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1297	1304.7
ACC LIMITED	1558.4	1554.8
ASHOK LEYLA	147.5	146
BAJAJ FINSE	5131.5	5080.85
BANK OF BAR	135.6	135.85
BHARAT ELEC	148.35	149.5
BHEL	83.05	84.1
BRITANNIA I	4834.45	4825.05
CADILA HEAL	379.75	385.45
COLGATE PAL	1042.9	1040.65
CONTAINER C	1184.65	1185.15
CUMMINS IND	742.8	744.7
DABUR INDIA	322.45	319.35
DLF LIMITED	216.05	215.4
AVENUE SUPE	1339.6	1346.5
EMAMI LIMIT	1056.1	1031.65
GLAXOSMITHK	2224.5	2226.05
GLENMARK PH	545.1	546.4
GODREJ CONS	1076.55	1068.45
GLAXOSMITHK	6492.8	6612.9
HAVELLS IND	498.8	499
HINDUSTAN Zinc	311.4	313
ICICI PRU L	381.75	371.2
IDEA CELLUL	79.15	77.15
INTERGLOBE	1267.05	1242.95
JSW STEEL L	288.4	285.5
LIC HOUSING	521.55	518.05
MARICO LIMI	325.8	318.95
UNITED SPIR	3072.85	3043.9
MOTHERSON S	308.85	304.9
MRF LTD	69966.45	69593.05
NHPC LTD	26.4	26.35
NMDC LTD.	120.95	118.4
ORACLE FIN	3828.75	3797.85
OIL INDIA L	332.25	327.1
PIRAMAL ENT	2477.75	2469.8
PETRONET LN	235.5	235.65
POWER FIN C	89	88.95
P&G HYGIENE	9200.9	9237.15
PIDILITE IN	902.35	902.7
PUNJAB NATI	97.6	96.85
RURAL ELEC	130.1	127.1
STEEL AUTHO	72.15	72.25
SHREE CEMEN	16117.55	16423.75
SIEMENS LTD	1104.55	1108.5
SHRIRAM TRA	1396.95	1377.85
SUN TV NETW	872.85	892.2
TATA POWER	79.95	80.35
TITAN COMPA	872.25	871.75
TORRENT PHA	1238.7	1254.8

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	8.7	8.6
Alphageo	742	747.05
Alu Flouride	106.6	106.4
Amar Raja Bat	789	783.05
And Bank	42.85	42.85
And Cemen	10	9.9
And Paper	295	291.65
And Petro	56.8	54.15
Anjani Portl	182.45	175.4
Aries Agro Ltd	188.5	189.45
Aurobindo Ph	562.65	571.05
Avantel Soft	539.95	517.65
Avanti Feeds	2269.05	2290.8
AvonOrg	11.39	10.85
BN Rathi Sec	39.5	39
Balaji Amin	584.45	583.85
Bambino Agro	227.9	224.95
Bartronics	10.95	11.16
Bhagira Chem	286.4	284
Bhagya Nag	45.6	44.85
Bhagya Wood	24.7	26
Brilliant Sec	10.12	9.64
CIL Securi	27.85	28.05
Color Chip	33.85	35
Cont Coffee	289.5	287.8
CoroFert	523.25	518.65
Cosboard Ind	29	30
Country Club	12.15	12.78
Cubex Tub	21	22.1
Cybermate	2.88	2.91
DR Reddy	2149.95	2157.4
Danlaw Tec	71.55	70.35
DecCement	532	524.65
Divi's Lab	1081.05	1092.2
Divya Granit	100	98.2
Dolphin Medi	1.25	1.31
Dredgin Corp	643.55	645.3
Empee Sugars	2.9	2.85
Everest Org	121.7	123.6
Fortune Info	78	79.35
Four Soft	71.35	70.05
GMR Ferro	2.91	3
GMR Infra	17.9	17.85
GVK Power	14.7	14.05
Gati Corpn	101.1	100.2
Gayatri Bio	6.32	6.65
Gayatri Proj	190.5	186.8
Gayatri Sugrs	10.08	9.83
Gennex Lab	3.8	3.9
GodavDru	33.85	31.95
Goldstn Tele	183	189.85
Goldstone Tech	13.15	13.84
Granules (I)	107.3	108.45
HBL Nife Pow	47.75	47.95
HYDIndus	1564.05	1519.4
Heritage Food	727.45	719.55
HindFlurocarb	9.16	9.61
ICSA Ltd	3.1	3.1
IDL Industrs	525.5	517.75
IKF Soft	0.58	0.59
IQMS Soft	15.2	15.15
IVRCL Infras	3.59	3.62
Incap	87.15	83
IndoNationl	839.5	834.9
Infotech En	659	642.75
Innaredy Com	3.1	3.1
Invinex Lab	106.5	101.6
JSTL	40.5	41.95
KCP LTD	114.3	115.7
KNR Constructio	297.95	290.1
Kabsons Indu	6.65	7
KakatiCem	249.55	257.2
Kallam Spg	31.5	30.9
Kernex Micro	42	40.15
Krebs Bio	168	170.1
LGS Global	4.8	4.93
LancoIndus	322	323.45
Lokesh Mach	55.55	54.15
Lotus Choc	49.5	50.95
MIC Elec	5.25	5.52
Madhucon Proje	22.25	23
Maytas Infra	33.45	34.5
Mold-tek	52.05	53.15
Moldtek Plastic	310.1	315.2
Moschip Semi	34	35.25
NCLInd	222.1	224.05
NETTLINX	73	72.8
NMDC Ltd	121	118.6
NagarAgrich	41.8	40.1
NagarConst	121.05	121
Natco Pharma	781.4	778.25
Nava Bh Ventur	135.6	138.85
Neha Inter	6.5	6.25
Neuland Lab	717.3	715.3
Nihar Info Glo	14.1	14.8
Nile	710.85	700.35
Oil Country	36.3	34.25
Online Media	0.36	0.37
Padmalaya Tele	3.27	3.18
Panyam Cemen	41.65	41.95
PennInd	53.85	52.9
Phytochem I	63.55	64.15
Pitti Lamin	84.85	85
Pokarna	195	192
Prajay Engs	12.25	12.21
PremiExpl	339	346.05
Prism Cement	117	114.6
Raasi Refrac	3.9	4.09
Ragsan Petro	62	61.5
Rain Industries	387.95	383.45
Raj Packagin	37.25	38.75
Ram Informat	41.4	40.05
Reg.Ceramic	5.05	4.83
Restile Cer	7.15	6.76
Roopa Indus	14.32	15.9
SS Organics	7.6	8
Sagar Cem	896	896.15
Samkrg Pist	282	283.4
Sampre Nutri	48.6	51
SangInd	113.9	115.3
Satvah. Ispat	19.6	19.9
South Bio Tech	2.36	2.4
South Magnes	21.75	21.7
SrRayAlk	51.9	52.7
Srinivasa Ship	56.45	56.5
Starchik Sp	20.25	21.3
Sujana Metal	1.1	1.15
Sujana Towers	3.56	3.63
Sujana Univers	0.77	0.74
Surana Strip	2.38	2.5
Surana Tele	4.85	4.9
Suryachakra Pow	0.89	0.9
Suryalata Sp	143	144
Suryava Spin	6.58	6.92
SuvarCem	123	124.45
Suven Pharma	169.2	167.65
TCI Finance	25.6	25.5
Taj Gvk Hotel	160.7	155.6
Tanla Solutions	33.15	33.35
Trans Biotek	2.28	2.2
Transport Co	262	258.85
Trendy Knit	0.22	0.23
Usher Agro	4.53	4.76
VST Indus	2906.1	2900.5
Vamshi Rubb	46.9	47.5
Viceroy Hotels	15.05	14.95
VijayTextil	42	42.7
Vimta Labs	194.5	195.6
Virat Crane	57	55.9
Virinchi Con	105.9	105.6
VisakaInd	670	671.6
Vision Tech	1.45	1.45
Vista Pharma	39.95	39.6
Vivimed Labs	76.4	75.8
ZenoTech Lab	40.5	41.95

గుంటూరు-డోన్-గుంతకల్ వైపు ఎలక్ట్రిక్ రైళ్లు

నేటి నుంచి ప్రారంభం

లక్ష్మీపురం (గుంటూరు)/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): గుంటూరు-డోన్-గుంతకల్ రైలు మార్గంలో ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తయిన నేపథ్యంలో నేటి నుంచి ఎలక్ట్రిక్ ఇంజన్‌లతో రైళ్లు ప్రయాణిస్తాయని గుంటూరు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ మర్గంలో డిజిల్ ఇంజన్లతో రైళ్లు నడిచేవని చెప్పారు. మచిలీపట్నం-యశ్వంతపూర్ (కొండవీడు ఎక్స్‌ప్రెస్, రైలు నంబర్ 17211/17212), సత్యసాయి ప్రశాంతినిలయం (హౌరా ఎక్స్‌ప్రెస్, 228321), పూరి-యశ్వంత్‌పూర్ (గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 22883/22884) రైళ్లు ఈ ఎలక్ట్రిక్ మార్గంలో ప్రయాణిస్తాయని ఉమామహేశ్వరరావు తెలిపారు.

సికింద్రాబాద్-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ ఇన్‌చార్జి పీఆర్వో జేవీ ఆర్కే రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (07075) మార్చి 23వ తేదీ రాత్రి 7.20 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.45కు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. కాకినాడ టౌన్-సికింద్రాబాద్ రైలు (07076) మార్చి 26న రాత్రి 8.05కు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.25కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు విజయవాడ, గుంటూరు మీదుగా రాక, పోకలు సాగిస్తాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ప్రైవేట్' వ్యవసాయం

- శాసనసభలో సీఎం చంద్రబాబు ప్రకటన
- ప్రైవేట్ భాగస్వామ్యంలోకి పది లక్షల మంది రైతులు
- రెయిన్‌గన్స్, పట్టిసీమతో కరువును జయించా
- డ్రోన్ల ద్వారా పంట తెగుళ్లు కనిపెడతాం
- నాలుగేళ్లలో 248 మంది రైతులు ఆత్మహత్యలు
- కేంద్ర ప్రభుత్వ విధానాలు మారాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బహుళజాతి కంపెనీలతో అనుసంధానం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున ప్రైవేట్ భాగస్వామ్యం తీసుకొస్తామన్నారు. కనీసం పది లక్షలమంది రైతులను ప్రైవేట్ భాగస్వామ్యంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం అసెంబ్లీలో వ్యవసాయ అనుబంధ రంగాలపై జరిగిన స్వల్ప వ్యవధి చర్చకు సంబంధిత మంత్రులు సమాధానం చెప్పిన తరువాత సీఎం మాట్లాడారు. ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్స్‌ను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులను బహుళజాతి కంపెనీలతో అనుసంధానం చేయడం ద్వారా వారు పండించిన పంటల్ని ఎగుమతి చేసే అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రెయిన్‌గన్స్, పట్టిసీమ ద్వారా కరువును జయించేశానని, ఇక భవిష్యత్‌లో కరువు అనేదే ఉండదని అన్నారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం, చింతలపూడి ద్వారా 200 టీఎంసీలను తరలించడంద్వారా భవిష్యత్‌లో కరువు రాకుండా చేస్తున్నామన్నారు. జూన్ నెలలోనే కృష్ణా, గోదావరి డెల్టాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. డ్రోన్ల ద్వారా పంట తెగుళ్లను కనిపెట్టి, వాటి ద్వారానే అవసరమైన పురుగు మందును కొట్టించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు.

పంటల బీమాతో ప్రయోజనం సున్నా..

రాష్ట్రంలో గత నాలుగేళ్లలో 248 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఏ రైతు ఆత్మహత్య చేసుకున్నా రూ.5 లక్షల పరిహారం ఇస్తున్నామని సీఎం వెల్లడించారు. అగ్రివాచ్ అనే ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నామని, ఏ పంటకు డిమాండ్ ఉంటుందనే సమాచారాన్ని ముందుగానే సేకరించవచ్చన్నారు. ఎకరానికి రూ.2,500 వ్యయంతో జీవా టెక్నాలజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ పరిజ్ఞానంతో భూమిలో తేమ త్వరగా ఆరిపోకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని, రైతుల చెల్లిస్తున్న బీమా అంత సొమ్ము కూడా రావడం లేదని విమర్శించారు. కేంద్ర విధానాలు మారాలన్నారు.

బీజేపీ నన్ను నమ్మడం లేదు: చంద్రబాబు

బీజేపీ తనను నమ్మట్లేదని సీఎం చెప్పారు. కొంతకాలంగా టీడీపీపై బీజేపీ అనుమానం పెంచుకుందన్నారు. జాతీయ రాజకీయాలపై తనకు ఆసక్తి లేదని చెప్పినా వాళ్లు(బీజేపీ) నమ్మట్లేదన్నారు. బుధవారం ఉదయం తిరుపతి నుంచి టీడీపీ ఎంపీలు, ముఖ్య నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బీజేపీ తనను నమ్మకే రాష్ట్రపతి ఎన్నికల్లో అవసరం లేకపోయినా వైఎస్సార్‌సీపీ మద్దతు తీసుకుందన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతున్నామని గుర్తుచేశారు. కేంద్రం ఎందుకు మొండిగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం నోటీసును ఆమోదించేలా ఎంపీలు ఢిల్లీలో పోరాటం చేయాలని సూచించారు. అహర్నిశలూ కష్టపడి వృద్ధిరేటులో తెలంగాణ కంటే రెండు శాతం ముందున్నామని, కానీ తలసరి ఆదాయంలో వెనుకంజలో ఉన్నామని, దీనికి బీజేపీయే కారణమని విమర్శించారు. కాగా, ఉండవల్లిలోని తన నివాసం వద్ద బుధవారం సాధికార మిత్ర సదస్సులో సీఎం మాట్లాడారు.

శ్రీవారిని దర్శించుకున్న సీఎం



అన్నప్రసాదానికి రూ.26 లక్షల డీడీని టీటీడీ ఈవోకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులు

సాక్షి, తిరుమల: సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రంపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధించుకునే, తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టే శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించానన్నారు. కాగా, సీఎం, లోకేష్, బాలకృష్ణ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం క్యూకాంప్లెక్స్ మార్గం నుంచి శ్రీవారి ఆలయానికి వచ్చారు. మహాద్వారం వద్ద అధికారులు ఇస్తికఫాల్ ఆలయ మర్యాదలతో శ్రీవారి దర్శనం కల్పించారు. దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా సీఎం కుటుంబం అన్నప్రసాద కేంద్రంలో ఒకరోజు వితరణకయ్యే ఖర్చు.. రూ.26 లక్షల డీడీని టీటీడీ ఈవో, జేఈవోలకు అందజేసింది. అనంతరం శ్రీవారి సేవా స్కార్ఫ్‌లు ధరించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

'షార్' పాఠశాలను కేవీగా మార్చండి

కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు ఎంపీ వరప్రసాదరావు విజ్ఞప్తి



ప్రకాశ్ జవదేకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ వరప్రసాదరావు

సాక్షి, న్యూఢిల్లీ: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో నడుస్తున్న.. సూళ్లూరుపేట సమీపంలోని పాఠశాలను కేంద్రీయ విద్యాలయంగా మార్చాలని తిరుపతి ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. బుధవారం ఢిల్లీలో ఆయన కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌ను కలసి ఈ మేరకు వినతి పత్రం ఇచ్చారు. ఇదే విషయంపై షార్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన వనతి పత్రాన్ని కూడా వరప్రసాదరావు కేంద్ర మంత్రికి అందజేశారు.

'వాస్తవాలు అబద్ధాలు చెప్పవు'

- చంద్రబాబు తీరును ఎండగట్టేందుకు బీజేపీ నినాదం ఇది
- బాబు అక్రమంగా సొమ్ము మళ్లించిన 32 కంపెనీల జాబితా సిద్ధం
- లెక్కాపత్రాలు లేకుండా నిధుల ప్రవాహం.. నివ్వెరపోయిన బీజేపీ అగ్రనేతలు
- ఒక్కొక్క కుంభకోణాన్ని వెలికితీసేందుకు సన్నద్ధం

న్యూఢిల్లీ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: చంద్రబాబు సర్కారు తీరును ఎండగట్టేందుకు బీజేపీ సరికొత్త నినాదం అందుకుంది. 'వాస్తవాలు అబద్ధాలు చెప్పవు' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు. సోషల్ మీడియా వేదికగా తొలుత ఈ నినాదంతో ప్రచారం ప్రారంభించి తర్వాత నేరుగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ కేంద్ర నాయకత్వం భావిస్తోంది. పోలవరం మొదలుకుని రాజధాని వరకు రాష్ట్రానికి ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసిన వైనాన్ని ప్రజలకు వివరించేందుకు బీజేపీ సమాయత్తమవుతోంది. చంద్రబాబును ఎండగట్టడానికి తమ వద్ద చాలా అంశాలున్నాయని, సమగ్ర సమాచారం సేకరించి ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ వర్గాలు చెప్పాయి. కాగా, సీఎం చంద్రబాబు అక్రమంగా సంపాదించిన సొమ్మును మళ్లించిన 32 కంపెనీల జాబితాను బీజేపీ సిద్ధం చేసింది. ఆయా కంపెనీల్లో సొమ్ము ప్రవాహం జరిగిన విధానం, లెక్కాపత్రం లేకుండా వచ్చి పడిన తీరు చూసి ఉన్నతస్థాయి నేతలే ఆశ్చర్యపోయారని, కనీవినీ ఎరగని స్థాయిలో అవినీతి జరిగిందనే నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. తారాస్థాయిలో జరిగిన కుంభకోణాలను ఒక్కొక్కటిగా వెలికి తీసి ప్రజల ముందు ఉంచాలనే వ్యూహంలో బీజేపీ ఉన్నట్లు సమాచారం.

రాష్ట్రంలో అవినీతిని బయటకు తీస్తాం..

బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్

సాక్షి, అమరావతి: నాలుగేళ్లు ప్రభుత్వంతో కలిసి ఉన్న వాళ్లు బయటకొచ్చిన 10 రోజుల్లోనే ప్రధాని మోదీపై యుద్ధం అంటూ చేస్తున్నదాడిని తిప్పి కొడతామని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ స్పష్టం చేశారు. బుధవారం మీడియా పాయింట్‌లో జర్నలిస్టులతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ కేంద్రంతో తెగదెంపులు చేసుకున్న వెంటనే దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతుండటమే కాకుండా, ఉద్యోగ, విద్యార్థి సంఘాలను ఉద్యమాల పేరుతో రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా రాజకీయ లబ్ధికోసం ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. బీజేపీతో కలిసి పోటీ చేసినప్పుడు మాత్రమే తెలుగుదేశం అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దని హెచ్చరించారు.

మండలిలో సోము వీర్రాజు క్షమాపణలు

సాక్షి, అమరావతి: శాసనమండలిలో గతంలో తాను చేసిన కొన్ని వ్యాఖ్యలకు గాండ్ల కులస్తులకు క్షమాపణలు చెబుతున్నట్టు ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలిలో తాను చేసిన వ్యాఖ్యలను అప్పుడే సభలో విరమించుకున్నానని.. అయినప్పటికీ, అప్పటి తన వ్యాఖ్యలతో గాండ్ల కులస్తుల హృదయాలు గాయపరిచినందుకు అన్యదా భావించవద్దని కోరుకుంటున్నానన్నారు. మీ మనస్సుకు బాధకలిగించిన యెడల క్షమించమని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు.

చంద్రబాబుకు 'వంద ప్రశ్నలు'

- మాటలు మార్చటం, హామీల అమలులో వైఫల్యంపై ప్రశ్నావళిని సిద్ధం చేసిన బీజేపీ
- రాష్ట్ర పర్యటనలో మీడియాకు విడుదల చేయనున్న రాంమాధవ్



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు సర్కారుకు పలు ప్రశ్నలు సంధించి ప్రజాక్షేత్రంలో నిలదీసేందుకు బీజేపీ సిద్ధమైంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ ఆధ్వర్యంలో వంద ప్రశ్నలతో ప్రశ్నావళి ఇప్పటికే సిద్ధమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు బీజేపీని దోషిగా చూపే ప్రయత్నాలు చేయటంపై ప్రశ్నల పరంపర మొదలవుతుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. నాలుగేళ్ల చంద్రబాబు ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యాలు, ఎన్నికల హామీలను విస్మరించటం, అభివృద్ధిని కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయడం లాంటి అంశాలతో బీజేపీ సంధించే ప్రశ్నావళి ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా రాజకీయ ప్రయోజనాల కోసం ఇటీవల చంద్రబాబు చేస్తున్న విమర్శలపై బీజేపీ కొన్ని ప్రశ్నలను రూపొందించిందని చెబుతున్నారు. చంద్రబాబుపై వంద ప్రశ్నల ప్రశ్నావళిని రాష్ట్ర పర్యటన సందర్భంగా రాంమాధవ్ స్వయంగా మీడియాకు విడుదల చేస్తారని తెలిసింది.

రాష్ట్ర బీజేపీ సారథి మార్పు?: ఎన్డీఏ నుంచి టీడీపీ వైదొలగిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ నాయకత్వంలో కూడా మార్పులు చేయాలని అగ్ర నాయకత్వం భావిస్తోంది. రాష్ట్ర పార్టీలో కీలక నేతల మధ్య జరుగుతున్న చర్చల సారాంశం మేరకు వారం పది రోజుల్లోనే కె.హరిబాబు స్థానంలో పార్టీ ఏపీ శాఖ కొత్త అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులతో పార్టీ నాయకత్వ మార్పుపై వేగంగా చర్చలు జరుగుతున్నాయని సమాచారం. రాంమాధవ్ సూచించిన వ్యక్తినే నూతన సారథిగా నియమించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రాష్ట్ర పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల నియామకాలు

గిరిజన గురుకుల కార్యదర్శిపై మంత్రికి ఫిర్యాదు

సాక్షి, అమరావతి: గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల నియామకాలు చేపట్టడంపై సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబుకు ఏపీ యానాది సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరు చిన్న పెంచలయ్య బుధవారం ఫిర్యాదు చేశారు. సచివాలయంలో మంత్రిని కలిసి, ఇలాంటి ఏకపక్ష నియామకాల వల్ల ప్రతిభ ఉన్నవారికి అన్యాయం జరుగుతోందని తెలిపారు. నెల్లూరు జిల్లా సోమశిల గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఎలాంటి డెమో లేకుండా ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లను నియమించారని చెప్పారు. అలాగే కొడవలూరు మండలం చంద్రశేఖరపురం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఒకరిని ఇలాగే నియమించారన్నారు. దీనిపై అక్కడి ప్రిన్సిపాల్ నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు అప్పటిలో ఫిర్యాదు చేసినా, పట్టించుకోలేదని తెలిపారు.

విద్యా వ్యవస్థ ఘోర వైఫల్యం...

- సమ్మేటివ్ పరీక్షలను సైతం సకాలంలో నిర్వహించని దుస్థితి
- శాసన మండలిలో గంటాపై ధ్వజమెత్తిన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: విద్యా వ్యవస్థ ఘోర వైఫల్యం చెందిందంటూ పలువురు ఎమ్మెల్సీలు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు విటపు బాల సుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, రాము సూర్యారావు, ఏ.ఎస్.రామకృష్ణ, కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమ్మేటివ్ పరీక్షలను కూడా సకాలంలో నిర్వహించని దుస్థితి ఏర్పడిందని, విద్యారంగ చరిత్రలోనే ఇది దారుణమైన ఘటన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మేటివ్ విధానానికి స్వస్తి పలికి పాత విధానం మాదిరి తిరిగి యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఏడాది అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నప్పటికీ నాసిరకం పనులు చేస్తుండటంతో ఐదారేళ్లు తిరగక ముందే పైకప్పు పెచ్చులూడే పరిస్థితి నెలకొందన్నారు. కొత్తగా నిర్మించిన పాఠశాలల భవనాల్లో దాదాపు 90 శాతం నాణ్యత లోపించిందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు.

అర్హులైన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ అర్హత ఉండి వివిధ కారణాలతో తమకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని 50 వేల మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు.

ఫ్రెంచ్ ఓపెన్ విజేతకు రూ. 17 కోట్లు

టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్ ఓవరాల్ ప్రైజ్‌మనీ 4 కోట్ల యూరోలకు చేరింది. గతేడాదితో పోలిస్తే ఈసారి 30 లక్షల యూరోలు పెంచారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 22 లక్షల యూరోల (రూ. 17 కోట్ల 62 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభిస్తుందని టోర్నీ డైరెక్టర్ గయ్ ఫోర్జె తెలిపారు. ఫ్రెంచ్ ఓపెన్ మే 27 నుంచి జూన్ 10 వరకు జరుగుతుంది.

క్రికెట్

దక్షిణాఫ్రికా X ఆస్ట్రేలియా

మూడో టెస్టు ; వేదిక: కేప్‌టౌన్

మధ్యాహ్నం గం. 2 నుంచి

సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



'పంచ్' పవర్...

బాక్సింగ్‌లో దూసుకుపోతున్న హుసాముద్దీన్

అంతర్జాతీయ స్థాయిలో వరుస విజయాలు • కామన్వెల్త్ పతకంపై గురి

నాన్న బాక్సింగ్ గ్లవ్స్‌ను చూశాడు. ఆటపై ఆసక్తిని పెంచుకున్నాడు. అన్నయ్యలు విసిరిన పంచ్‌లను చూశాడు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆట నేర్చుకునేందుకు కనీస స్థాయి సౌకర్యాలు లేకపోయినా... సరైన రీతిలో రింగ్ కూడా ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి ఉన్నా... అతని పట్టుదల ముందు అవన్నీ చిన్నవిగా మారిపోయాయి. తన ఆటపై నమ్మకంతో కఠోరంగా శ్రమించిన ఆ యువ బాక్సర్ ఇప్పుడు భారత జట్టులో భాగంగా మారాడు. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌కు చెందిన మొహమ్మద్ హుసాముద్దీన్ విజయగాథ ఇది. ఇప్పుడు అతని లక్ష్యం ఒకటే... నాన్న, అన్నల కోరిక నెరవేర్చడం... ఒక మెగా ఈవెంట్‌లో భారత్ తరపున పతకం సాధించి గర్వంగా నిలవడం. ప్రస్తుతం అదే లక్ష్యంతో అతను ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల్లో పతకంపై దృష్టి పెట్టాడు.

సాక్షి, హైదరాబాద్

గత కొంత కాలంగా అంతర్జాతీయ స్థాయిలో మొహమ్మద్ హుసాముద్దీన్ నిలకడగా సాధించిన విజయాలు ఇప్పుడు భారత జట్టులో అవకాశం దక్కేలా చేశాయి. 2017లో బల్గేరియా టోర్నీలో రజతం, మంగోలియా ఉలన్‌బాటర్ కప్‌లో కాంస్యంతో పాటు 2018లో ప్రతిష్టాత్మక స్ట్రాన్జా కప్‌లో కాంస్యం సాధించి హుసామ్ అందరి దృష్టిని ఆకర్షించాడు. కామన్వెల్త్ క్రీడల కోసం నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో కూడా సత్తా చాటిన అతను తొలిసారి ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. కామన్వెల్త్‌లో పాల్గొంటున్న ఎనిమిది మంది భారత బాక్సర్లలో 24 ఏళ్ల హుసామ్ ఒకడు. 56 కేజీల విభాగంలో అతను పోటీ పడనున్నాడు.

ఐదేళ్లుగా భారత క్యాంప్‌లో...

హుసామ్ కెరీర్‌లో 2012 కీలక మలుపు. సీనియర్ నేషనల్స్‌లో రజత పతకం సాధించిన తర్వాత అతను జాతీయ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. అంతకు ముందు ఏడాది 2011లో క్యూబాలో జరిగిన అంతర్జాతీయ టోర్నీలో పాల్గొన్నా ఫలితం రాలేదు. 2012లో ఆర్మేనియాలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కూడా ఓటమి ఎదురైంది. ఆర్మీలో ప్రస్తుతం నాయక్ సుబేదార్ హోదాలో ఉన్న హుసామ్ 2015లో జరిగిన ప్రపంచ మిలిటరీ క్రీడల్లో కూడా పాల్గొన్నాడు. అయితే తన తప్పులు సరిదిద్దుకొని హుసామ్ మరింతగా శ్రమించాడు. ముఖ్యంగా పాటియాలాలోని ఎన్‌ఐఎస్‌లో ప్రత్యేక శిక్షణతో ఆట రాటుదేలింది. భారత కోచ్‌లు హుసామ్‌ను తీర్చిదిద్దారు. 2016లో గువాహటిలో జరిగిన సీనియర్ నేషనల్స్‌లో స్వర్ణం సాధించడంతో అతనిపై అంచనాలు పెరిగాయి. దానికి తగినట్లుగా వేర్వేరు అంతర్జాతీయ పోటీల్లో కూడా విజయాలు సాధించి అతను తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. 'ఇప్పటి వరకు నేను సాధించిన విజయాలు ఒక ఎత్తు. ఇప్పుడు కామన్వెల్త్ క్రీడలు మరొక ఎత్తు. ఇలాంటి ప్రతిష్టాత్మక పోటీల్లో గెలిస్తేనే ఇన్నేళ్ల శ్రమకు గుర్తింపు లభిస్తుంది. పతకం కోసం చాలా కష్టపడుతున్నా. గెలుస్తాననే నమ్మకం ఉంది' అని హుసాముద్దీన్ ఆత్మవిశ్వాసంతో చెప్పాడు.

బాక్సింగ్ ఫ్యామిలీ...

హుసామ్ తండ్రి షమ్‌షముద్దీన్ ఒకప్పుడు జాతీయ స్థాయి బాక్సర్. ఆ తర్వాత కోచ్‌గా మారిన ఆయన స్వస్థలం నిజామాబాద్‌లోనే కొద్ది మందికి శిక్షణ ఇస్తూ వచ్చారు. చెప్పుకోదగ్గ వసతులు లేకపోయినా పరిమిత వనరులతోనే ఆయన బాక్సర్లను తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. అనేక మందితో పాటు ఆయన కుమారులు కూడా అక్కడే శిక్షణ పొందారు. హుసామ్ పెద్ద సోదరులు ఇద్దరు ఎహ్‌తెషామ్, ఎహ్‌తెసామ్ కూడా అంతర్జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. వీరిద్దరు స్పోర్ట్స్ కోటాలోనే రైల్వే, ఆర్మీలో ఉద్యోగాలు పొందడం విశేషం. హుసామ్ తమ్ముడు ఖయాముద్దీన్ కూడా బాక్సర్‌గా మారి ప్రస్తుతం జాతీయ స్థాయికి ఎదిగాడు. ఈ నేపథ్యం నుంచి వచ్చిన హుసామ్‌కు ఆటలో ఓనమాలు నేర్చుకోవడం కష్టం కాలేదు. మరింత పట్టుదలతో తన పంచ్ పవర్‌ను పెంచుకున్న అతను వేగంగా దూసుకుపోయాడు. 2007 స్కూల్ నేషనల్స్‌లో తొలిసారి పోటీ పడిన తర్వాత హుసామ్ ఆగలేదు. 'నాకు ఆ సమయంలో తెలిసిందల్లా నాన్న ఏం చెబితే అది చేయడం. రింగ్ గురించి కానీ, ఇతర సౌకర్యాల గురించి గానీ ఎప్పుడూ ఆలోచించలేదు. నాన్నే అన్నీ చూసుకున్నారు. ఖర్చులు, డైట్‌లాంటివి కనీసం నాకు తెలియనివ్వలేదు కూడా. బాక్సింగ్ మొదలు పెట్టినప్పుడు లక్ష్యాన్ని నిర్దేశించుకోలేదు. పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టి నాన్న, అన్నయ్యలు సాధించలేని విజయాలు అందుకోవాలని మరింత పట్టుదలతో సాధన చేశాను' అని హుసామ్ చెప్పాడు.

> నాకు బాక్సింగ్‌పై ఉన్న అమితాభిమానమే నా నలుగురు కొడుకులను అదే ఆట వైపు మళ్లించింది. ఇద్దరు పెద్ద కొడుకుల ఫలితాల పట్ల సంతృప్తిగా ఉన్నా... దేశం తరపున పెద్ద ఈవెంట్‌లో పతకం సాధించలేకపోయారనే వెలితి ఉంది. దానిని హుసాముద్దీన్ తీరుస్తాడని నమ్ముతున్నా. అతడిది కష్టపడే స్వభావం. చాలా పట్టుదలగా ప్రాక్టీస్ చేస్తాడు. అందుకే మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాం. హుసామ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనాలనేది నా కోరిక. ఇప్పుడే పతకం గురించి చెప్పను గానీ నిజంగా అతను అక్కడ గెలవగలిగితే తండ్రిగా అంతకు మించి గర్వకారణం ఏముంటుంది. 73 ఏళ్ల వయసులో కూడా కోచింగ్ ఇస్తున్నా. సౌకర్యాల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. సౌకర్యాలకంటే బాక్సర్ల కఠోర శ్రమనే వారిని ముందుకు తీసుకువెళుతుందనేది నా నమ్మకం. ఉన్నవాటితోనే సర్దుకొని శిక్షణ ఇచ్చాను. సాధారణ స్థాయి రింగ్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా సొంతడబ్బు చాలా వెచ్చించాల్సి వచ్చింది. ఆరంభంలో ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా గానీ ఇప్పుడు దాని గురించి ఎలాంటి ఫిర్యాదు లేదు. సాయం కావాలంటూ ఎప్పుడూ ప్రభుత్వంతో సహా ఎవరినీ కోరలేదు. జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదిగే వరకు నిజామాబాద్‌లో శిక్షణ ఇవ్వగలను. ఆ తర్వాత వారి సత్తానే వారిని ముందుకు తీసుకెళుతుంది.
>
> – షమ్‌షముద్దీన్, హుసాముద్దీన్ తండ్రి, కోచ్



నలుగురు కుమారులతో షమ్‌షముద్దీన్



మెయిన్ 'డ్రా'కు యూకీ బాంబ్రీ

ఫ్లోరిడా (అమెరికా): భారత నంబర్‌వన్ యూకీ బాంబ్రీ వరుసగా రెండో మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. గతవారం ఇండియన్ వెల్స్ టోర్నీలో క్వాలిఫయర్‌గా పాల్గొని మూడో రౌండ్‌కు చేరిన ఈ ఢిల్లీ ప్లేయర్... తాజాగా మయామి మాస్టర్స్ సిరీస్ టోర్నీలో క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా' బెర్త్ దక్కించుకున్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో ప్రపంచ 107వ ర్యాంకర్ యూకీ 7–5, 6–2తో ప్రపంచ 133వ ర్యాంకర్ ఇలియాస్ వైమెర్ (స్వీడన్)పై గెలుపొందాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో బేసిక్ మీర్జా (బోస్నియా)తో యూకీ ఆడతాడు. ఈ మ్యాచ్‌లో అతను నెగ్గితే రెండో రౌండ్‌లో ప్రపంచ 11వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ జాక్ సోక్ (అమెరికా) ప్రత్యర్థిగా ఉంటాడు.

రబడపై నిషేధం ఎత్తివేత సరికాదు



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేసర్ రబడపై విధించిన రెండు టెస్టుల నిషేధాన్ని ఎత్తివేయడం పట్ల ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. రెండో టెస్టు సందర్భంగా స్మిత్‌ను భుజంతో ఢీకొట్టడంతో రబడ క్రమశిక్షణ చర్యకు గురయ్యాడు. దీనిని అతడు సవాల్ చేస్తూ ఐసీసీ అప్పీల్ కమిషనర్ ఎదుట వాదన వినిపించాడు. వాటితో సంతృప్తి చెందిన కమిషనర్ నిషేధం రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. అయితే... ఈ ఉదంతంలో తన అభిప్రాయం తెలుసుకోకపోవడం సరికాదని స్మిత్ పేర్కొన్నాడు. ఐసీసీ నిర్దేశించిన ప్రమాణాలను పక్కన పెడుతున్నారని విమర్శించాడు. తమ బౌలర్లు ఇలా చేయకుండా తాను నియంత్రిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడో టెస్టు నేటి నుంచి కేప్‌టౌన్‌లో జరుగుతుంది.



హమ్మయ్య! విండీస్ గట్టెక్కింది

- స్కాట్లాండ్‌పై 5 పరుగులతో గెలుపు
- 2019 వన్డే ప్రపంచకప్‌కు అర్హత

హరారే: ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసించి... రెండు సార్లు వన్డే వరల్డ్‌కప్ చేజిక్కించుకున్న విండీస్ ఎట్టకేలకు వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరుగనున్న మెగా టోర్నీకి అర్హత సాధించింది. చిన్న జట్లతో కలిసి క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొన్న విండీస్ బుధవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో 5 పరుగుల తేడాతో గెలుపొందింది. తక్కువ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్‌లో వరణుడు విండీస్ వైపు నిలవడంతో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం గెలిచి ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కరీబియన్లు 48.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటయ్యారు. గేల్ (0) 'గోల్డెన్' డక్‌గా వెనుదిరగగా... ఎవిన్ లెవీస్ (66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్లోన్ శామ్యూల్స్ (51; 4 ఫోర్లు) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో షరీఫ్, బ్రాడ్ వీల్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో స్కాట్లాండ్ 35.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 125 పరుగులతో ఉన్న సమయంలో వర్షం పడింది. మ్యాచ్ నిలిచే సమయానికి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం స్కాట్లాండ్ స్కోరు 130 పరుగులుగా ఉంటే ఆ జట్టు గెలిచేది. అయితే ఆ స్కోరుకు ఐదు పరుగుల దూరంలో స్కాట్లాండ్ ఉండటంతో విండీస్ విజయం ఖాయమైంది.

ఆరంభానికి ఇద్దరే!

- ఐపీఎల్ ప్రారంభోత్సవానికి ఆరుగురు కెప్టెన్లు దూరం
- బీసీసీఐ ప్రణాళిక లోపం



న్యూఢిల్లీ: ఐపీఎల్ అంటే ఓ క్రికెట్ పండగ. ఏటా దీని ఆరంభమే ఓ సంబరం. పదేళ్లుగా ఐపీఎల్ ప్రారంభోత్సవాలు అట్టహాసంగా జరుగుతూ వచ్చాయి. 'స్పిరిట్ ఆఫ్ క్రికెట్' స్ఫూహ కల్పించేందుకు ఎనిమిది జట్ల కెప్టెన్లు హాజరయ్యేవారు. కానీ... ఈ సారి బీసీసీఐ, లీగ్ పాలక మండలి ప్రణాళిక లోపంతో కేవలం రెండు జట్ల కెప్టెన్లే ఆరంభోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. మిగతా ఆరుగురు సారథులు గైర్హాజరు కానున్నారు. దీనికి ప్రధాన కారణం సరైన రవాణా ఏర్పాట్లు లేకపోవడం ఒకటైతే... మ్యాచ్ రోజే ప్రారంభ వేడుకలు జరగడం రెండో కారణం. గత పదేళ్లుగా ఒక రోజు ముందు ఈ వేడుక జరిగేది. అందరు కెప్టెన్లు పాల్గొనేవారు. తిరిగి తమ తొలి మ్యాచ్ జరిగే వేదికలకు పయనమయ్యేవారు. కానీ ఈసారి ఒక రోజు ముందు కేవలం వీడియో షూటింగ్‌లో సారథులు పాల్గొంటారు. అనంతరం తమ మ్యాచ్ వేదికలకు బయల్దేరతారు. వచ్చే నెల 7న ఐపీఎల్ ప్రారంభం రోజే ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. దీంతో ముంబై, చెన్నై కెప్టెన్లే ఈ వేడుకలో పాల్గొంటారు. మరుసటి రోజు (ఏప్రిల్ 8 ఆదివారం) రెండు మ్యాచ్‌లున్నాయి. మొహాలీలో పంజాబ్‌తో ఢిల్లీ, కోల్‌కతాలో నైట్‌రైడర్స్‌తో బెంగళూరు తలపడతాయి. దీంతో గంభీర్ (ఢిల్లీ), అశ్విన్ (పంజాబ్), కోహ్లి (బెంగళూరు), దినేశ్ కార్తీక్ (కోల్‌కతా)లు ఏడో తేదీన ముంబైకి వచ్చి అదే రోజు రాత్రి ఆయా వేదికలకు వెళ్లే రవాణా (సరైన టైమ్‌కు ఫ్లైట్‌లు) సదుపాయాలు లేవు. మరుసటి రోజు ఉదయం చేరితే ప్రయాణ బడలిక వల్ల అలసిపోతారు. అందువల్ల ఈసారి ఆరుగురు కెప్టెన్లు గైర్హాజరు అవుతున్నారు. తీరిగ్గా ఇప్పుడు నాలుక కర్చుకున్న లీగ్ పెద్దలు దీనిపై ముందే కసరత్తు చేయాల్సిందని తమ పొరపాటును అంగీకరించారు.

'హీరో' అయ్యే అవకాశం చేజార్చుకున్నా: విజయ్ శంకర్



న్యూఢిల్లీ: శ్రీలంకలో జరిగిన నిదహస్ ట్రోఫీ ముక్కోణపు టి20 టోర్నీ ఫైనల్ మ్యాచ్‌తో 'హీరో' అయ్యే అవకాశాన్ని చేజార్చుకున్నానని ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ అన్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తుదిపోరులో కీలకమైన సమయంలో వరుసగా డాట్ బాల్స్ ఆడటంతో భారత్ కప్ కోల్పోయే పరిస్థితి వచ్చింది. దినేశ్ కార్తీక్ వీరోచిత మెరుపులతో చేజారిందనుకున్న కప్ చేతికందిన సంగతి తెలిసిందే. 'ఆ రోజు నాకు దుర్దినం. దీన్ని మర్చిపోవడం కూడా కష్టంగానే ఉంది. మళ్లీ అలాంటి ఫైనల్లో నేను రాణిస్తే తప్ప ఆ చేదు జ్ఞాపకాన్ని మర్చిపోలేనేమో' అని శంకర్ అన్నాడు. సోషల్ మీడియాలో క్రికెట్ అభిమానులు అతనిపై లెక్కకు మిక్కిలి విమర్శలు, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. దీనిపై అతను స్పందిస్తూ 'టీమిండియాకు ఆడుతున్న నేను అవన్నీ స్వీకరించాల్సిందే. నా క్రికెట్ కెరీర్ ఎదుగుదలకు అవి కూడా దోహదం చేస్తాయి. నిజానికి నేను డకౌటైనా బాగుండేది. ఎవరూ పెద్దగా స్పందించేవారు కాదు. కానీ క్లిష్టమైన సమయంలో అత్యంత పేలవంగా ఆడటం విమర్శలకు తావిచ్చింది. ఆటైన, కెరీరైనా ఎప్పుడు సాఫీగా సాగదు. సవాళ్లనేవి ఎదురవుతూనే ఉంటాయి. తప్పదు... వాటిని ఎదుర్కోవాలి' అని చెప్పుకొచ్చాడు. ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీల్లో ఎప్పుడు ఇలా డాట్ బాల్స్ ఆడలేదని స్ట్రయిక్‌ను పదేపదే రొటేట్ చేసేవాడినని తెలిపాడు. దినేశ్ కార్తీక్ మ్యాచ్ గెలిపించకపోయివుంటే తన పరిస్థితి మరింత దారుణంగా ఉండేదన్నాడు. వచ్చే నెల మొదలయ్యే ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరపున మెరుగైన ప్రదర్శన కనబరిచేందుకు కష్టపడతానని విజయ్ శంకర్ చెప్పాడు.



విలియమ్సన్

మళ్లీ ఫలితం వచ్చేనా?

నేటి నుంచి న్యూజిలాండ్, ఇంగ్లండ్ డే-నైట్ టెస్టు

ఉదయం గం. 6:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్-1లో ప్రత్యక్ష ప్రసారం



రూట్

ఆక్లాండ్: సంప్రదాయ క్రికెట్ అభిమానులకు మరో కనువిందు. గులాబీ బంతితో జరిగే డే–నైట్ టెస్టుల రికార్డుల్లోకి ఇంకో మ్యాచ్. ఈసారి వేదిక న్యూజిలాండ్‌లోని ఈడెన్ పార్క్ మైదానం. తలపడనున్న జట్లు న్యూజిలాండ్, ఇంగ్లండ్. 2015 చివర్లో అడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో చరిత్రాత్మక తొలి డే–నైట్ టెస్టులో ఆడిన న్యూజిలాండ్... ఇప్పుడు మొదటిసారి తమ దేశంలో ఆతిథ్యమిస్తోంది. ఇంగ్లండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా గురువారం ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. బలాబలాలరీత్యా ప్రస్తుతం రెండు జట్లు సమ ఉజ్జీగా కనిపిస్తున్నా... గత ఐదు ముఖాముఖి టెస్టుల్లో ఇంగ్లండ్ మూడు గెలిచి, ఒకదాంట్లో ఓడింది. మరోటి 'డ్రా' అయింది. ఇటీవల వన్డే సిరీస్‌నూ ఇంగ్లండ్ 3–2తో నెగ్గింది. అయితే సొంతగడ్డపై ఆడుతుండటం, ఫామ్‌లో ఉన్న రాస్ టేలర్ ఫిట్‌నెస్ సాధించి అందుబాటులోకి రావడం విలియమ్సన్ జట్టుకు సానుకూలాంశం కానుంది. స్పిన్నర్ సాన్‌ట్నర్ స్థానంలో టాడ్ ఆస్టిల్‌ను ఆడించనుంది. వాట్లింగ్ కీపింగ్ బాధ్యతలు అందుకోనున్నాడు. మరో వైపు ఇంగ్లండ్ కీలక ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌తో టెస్టుల్లో పునరాగమనం చేయనున్నాడు. అతడు తుది జట్టులో ఉంటాడని కెప్టెన్ జో రూట్ తెలిపాడు. బ్రిస్టల్ నైట్ క్లబ్ ఉదంతంతో కొంతకాలం అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన స్టోక్స్ ఇటీవలే కివీస్‌పై వన్డే సిరీస్ ఆడిన సంగతి తెలిసిందే. పేసర్ బ్రాడ్ మరో వికెట్ తీస్తే అండర్సన్ (523 వికెట్లు) తర్వాత టెస్టుల్లో ఇంగ్లండ్ తరపున 400 వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్ అవుతాడు.

8 ఇప్పటివరకు మొత్తం ఎనిమిది డే-నైట్ టెస్టులు జరిగాయి. ఎనిమిదింటిలోనూ ఫలితాలు వచ్చాయి. అత్యధికంగా అడిలైడ్ మైదానంలో మూడు డే-నైట్ టెస్టులు జరిగాయి.

నివేదిక వచ్చాకే షమీపై నిర్ణయం: శుక్లా

ముంబై: అవినీతి నిరోధక విభాగం నుంచి నివేదిక వచ్చాక పేసర్ షమీపై తుది నిర్ణయం తీసుకుంటామని ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా వెల్లడించారు. పాకిస్తానీ స్నేహితురాలికి, భారత పేసర్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అతని భార్య హసీన్ జహాన్ ఆరోపించింది. దీంతో బీసీసీఐ మ్యాచ్ ఫిక్సింగ్ కోణంలో దర్యాప్తుకు ఆదేశించింది. ఏసీయూ చీఫ్ నీరజ్ కుమార్‌కు విచారణ బాధ్యతను అప్పగించింది. అతని నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, వచ్చిన వెంటనే షమీ ఐపీఎల్ ఆడటంపై, సెంట్రల్ కాంట్రాక్టు ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామని శుక్లా తెలిపారు. లీగ్‌కు సంబంధించిన స్పాన్సర్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ సీజన్‌లో అంపైర్ నిర్ణయ సమీక్షా పద్ధతిని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇన్నింగ్స్‌కు ఒకసారి ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.



భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య ముక్కోణపు టి20 టోర్నీ గురువారం ముంబైలో ప్రారంభమవుతుంది. తొలిమ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌ను ఉదయం 10 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

15 రోజుల నుంచే హోదా గుర్తొచ్చిందా?

టీడీపీపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ధ్వజం



సాక్షి, అమరావతి: నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా కోసం పోరాడడానికి తెలుగుదేశం పార్టీకి చేవ చచ్చిందా? 15 రోజుల క్రితం నుంచే వారికి హోదా ఉద్యమం గుర్తుకు వచ్చిందా? అని ప్రముఖ సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ చేసిన విమర్శలపై భరద్వాజ బుధవారం స్పందించారు. గతంలో ప్రత్యేక హోదా ఉద్యమంలో పాల్గొంటే తనను, సంపూర్ణేష్ బాబు, మహేష్ కత్తి, శివాజీలను అరెస్ట్ చేసింది టీడీపీ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా అక్కర్లేదు అని చెప్పి, ఇప్పుడు హోదా ఉద్యమం క్రెడిట్ మొత్తం ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి వెళ్లిపోతోందన్న భయంతోనే మాట మార్చారని దుయ్యబట్టారు.

మీ రాజకీయాల్లోకి మమ్మల్ని లాగొద్దు

ఇప్పటికే సినిమా రంగానికి చెందిన పవన్ కళ్యాణ్, మోహన్‌బాబు, కొరటాల శివ వంటి వారు ప్రత్యేక ఉద్యమానికి మద్దతు తెలిపారని, కానీ టీడీపీలో ఉన్నవారు, పుష్కరాలు వంటి వేడుకలు నిర్వహించిన వారు, ప్రభుత్వంతో కలిసి నంది అవార్డులు పంచుకున్న సినీ నటులు, జ్యూరీ సభ్యులే హోదా గురించి మాట్లాడటం లేదని తమ్మారెడ్డి భరద్వాజ ఆరోపించారు. అధికారం ఉంది కదా అని తెలుగుదేశం నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. మీ రాజకీయాల్లోకి సినిమా వాళ్లని లాగొద్దని సుతిమెత్తగా హెచ్చరించారు. బానిసలుగా బతుకుతున్నారని తమను అంటున్నారని, కానీ వాస్తవంగా పదవుల కోసం నాలుగేళ్లుగా బీజేపీకి బానిసలుగా, తొత్తులుగా జీవిస్తున్నది తెలుగుదేశం నాయకులు కాదా? అని ప్రశ్నించారు. తమను విమర్శిస్తున్న టీడీపీ నాయకులు ఈ నాలుగేళ్ల ప్రత్యేక హోదాను పక్కన పెట్టి లంచాల మత్తులో మునిగితేలారా? అంటూ ఘాటుగా విమర్శించారు. సీఎం చంద్రబాబులో ప్రత్యేక హోదా సాధించాలన్న తపన కంటే వైఎస్ జగన్ బీజేపీ, పవన్ కళ్యాణ్‌లతో కలుస్తాడన్న భయమే ఎక్కువగా కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని రాజకీయ నాయకులంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేపడితే సినీ పరిశ్రమ కూడా తప్పకుండా పాల్గొని మద్దతు ఇస్తుందని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 76 వేల దరఖాస్తులు

25 నుంచి హాల్‌టిక్కెట్ల జారీ

సాక్షి, అమరావతి: 14 యూనివర్సిటీల్లో 1109 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 76,356 దరఖాస్తులు వచ్చాయన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొదటి దశలో 846 పోస్టులు, రెండో దశలో 263 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఒక్కో పోస్టుకు సరాసరిన 69 దరఖాస్తులు అందాయన్నారు. స్క్రీనింగ్ పరీక్ష అనంతపురం, గుంటూరు, హైదరాబాద్, కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. పేపర్ 1 టీచింగ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్టు అందరికీ ఉమ్మడిగా ఉంటుందన్నారు. హాల్‌టిక్కెట్లను ఈనెల 25వ తేదీనుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. పరీక్షలన్నీ ఆన్‌లైన్లో జరుగుతాయని తెలిపారు.

‘104’ నిర్వాహకులపై ఉద్యోగుల ఫిర్యాదు

శ్రీశైలం ప్రాజెక్ట్: చంద్రన్న సంచార చికిత్స(104) వాహనాలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పత్రాలు లేవంటూ ఉద్యోగులు బుధవారం శ్రీశైలం టూటౌన్ అవుట్‌పోస్ట్‌లో ఏఎస్‌ఐ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివల్ల ప్రమాదం జరిగితే వాహనంలో ఉన్న సిబ్బందితో పాటు ప్రజలు కూడా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పత్రాలు లేని 104 వాహనాలకు తక్షణమే పత్రాలు సమకూర్చే విధంగా పీఎస్ఎంఆర్‌ఐ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలవరం ప్రాజెక్టును సందర్శించండి

గడ్కరీకి బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అక్కడ పర్యటించాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరానికి తాజాగా రూ.1,400 కోట్లు విడుదల చేసినందుకు బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి ధన్యవాదాలు తెలిపినట్టు విష్ణువర్ధన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, రాజకీయ అవసరాల కోసం టీడీపీ ఊసరవెల్లి లాగా రంగులు మారుస్తోందని, ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

నేటి నుంచి ఆసెట్ దరఖాస్తుల స్వీకరణ

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆసెట్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సమీకృత కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఆఈట్ నోటిఫికేషన్లు విడుదల చేసినట్లు సంచాలకుడు రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఆసెట్‌కు రూ.1,000 అపరాధ రుసుంతో, ఆఈట్‌కు రూ.1,500 అపరాధ రుసుంతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం www.audoa.in, www.andhrauniversity.edu.in/doa వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

మాటలు మార్చేవారి వెంట నడవాలా?

ముఖ్యమంత్రి చంద్రబాబుపై సినీ నటుడు పోసాని కృష్ణమురళి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: స్వార్థమే పరమావధిగా పూటకో మాట మారుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యభిచారి అని, ఇలాంటి వ్యక్తిని సినీ పరిశ్రమ ఎందుకు అనుసరించాలని సినీ నటుడు పోసాని కృష్ణమురళి ప్రశ్నించారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు స్వార్థం కోసం రోజుకో మాట మార్చడం, రాజకీయ బ్రోకరిజం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తికి చెందిన పార్టీ నాయకులు తెలుగు సినీ పరిశ్రమలోని వారిని తప్పుపట్టడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పోసాని తాజాగా ‘సాక్షి’కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. సీఎం చంద్రబాబు తీరును ఎండగట్టారు. పలు ప్రశ్నలను సంధించారు. పోసాని ఇంకా ఏం చెప్పారంటే...

బాబు వెనుక ఎందుకు నడవాలి?

‘‘ప్రత్యేక హోదా మాటెత్తితే జైళ్లలో పెట్టాలంటూ చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. హోదా కోసం ఉద్యమించిన వారిని లాఠీలతో కొట్టించారు. అరెస్టు చేసి జైల్లో పెట్టించారు. ఇలా చేసిన చంద్రబాబే ఇప్పుడు మళ్లీ ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయాలనడాన్ని ఏమనాలి? రాజకీయ బ్రోకరిజం అనాలా? వెధవాతి వెధవలు అనాలా? ఉద్యమంలోకి రాని మమ్మల్ని (సినీ పరిశ్రమ) తిడతారేమిటి? ఈ విషయంలో చంద్రబాబు వ్యూహంఏమిటి? చంద్రబాబు, టీడీపీ నేత రాజేంద్రప్రసాద్ లాంటి రాజకీయ బ్రోకర్లను నమ్మి సినీ పరిశ్రమ వాళ్లు వెర్రివాళ్లలాగా ప్రత్యేక హోదా ఉద్యమంలోకి దూకాలా? ఏ విషయంలో మాటమీద నిలబడ్డారని చంద్రబాబు వెనుక నడవాలి?

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పెట్టుకుని రాష్ట్రమంతా తిరిగి కష్టపడి ఎమ్మెల్యేలను గెలిపించుకుంటే, వారిలో 23 మందిని డబ్బులిచ్చి చంద్రబాబు కొనుగోలు చేశారు. వారిని ఇంటికి తీసుకెళ్లి కండువాలు మార్చారు. పార్టీ జెండా మార్పించిన చంద్రబాబును ఏమనాలి? వేరే పార్టీ టికెట్‌పై గెలిచిన వారిని పదవులకు రాజీనామా చేయించకుండా తన పార్టీలో చేర్చుకున్న చంద్రబాబు రాజకీయ బ్రోకర్ కాక మరేమవుతారు? సినిమా వాళ్లు కూడా ఆయనను ఆదర్శంగా తీసుకుని ఇలాంటి బ్రోకరిజం చేయాలా?

ప్రత్యేక విమానాలు ఎందుకు?

బస్సుల్లో పడుకున్నానని చెప్పుకునే చంద్రబాబుకు విదేశాలకు వెళ్లడానికి ప్రత్యేక విమానాలు ఎందుకు? అందరూ వెళ్లే విమానాల్లో వెళ్లొచ్చు కదా? ప్రత్యేక విమానాల కోసం రూ.కోట్లు ఎందుకు వృథా చేయాలి? బస్సుల్లో తిరుగుతున్నట్లు చెప్పడం నాటకాలు కాదా?

బెంజి సర్కిల్ దాకా చాలు

ప్రత్యేక హోదా కోసం ఎందాకైనా పోరాడుతామని చంద్రబాబు అంటున్నారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఎందాకో అక్కర్లేదు, విజయవాడ బెంజ్ సర్కిల్‌లో రాష్ట్రంలోని మొత్తం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ఆమరణ నిరాహార దీక్షకు కూర్చోమనండి. ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసం పాటించినట్లు 30 రోజులు ఆమరణ దీక్ష చేసేందుకు బాబు సిద్ధమైతే తేదీ ప్రకటించమనండి నేను నా కుటుంబంతో కలిసి దీక్షలో కూర్చుంటా? సినీ పరిశ్రమ వాళ్లను కూడా అదే వేదికపై దీక్షలో కూర్చోబెడతా. 30 రోజుల్లో ప్రధానమంత్రి మోదీ దిగివచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించకపోతే 31వ రోజు కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటా’’ పోసాని కృష్ణమురళి తేల్చిచెప్పారు.

- ఏపీ సమస్యలపై కేంద్రానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, అవిశ్వాసంపై చర్చ జరపకుండా అగౌరవపరుస్తోందని బుధవారం లోక్‌సభ వాయిదా పడిన తర్వాత టీడీపీ ఎంపీ తోట నరసింహం అన్నారు.

‘పోలవరం’పై ప్రజలను మభ్యపెట్టొద్దు

పునరావాసం, భూ సేకరణ వ్యయం రాష్ట్రమే భరిస్తుందని అధికారులే ఒప్పుకున్నారు: ఉండవల్లి



సాక్షి, రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్టుపై సందర్భానుసారంగా మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టొద్దని సీఎం చంద్రబాబుపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ధ్వజమెత్తారు. బుధవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. పునరావాసం, భూసేకరణకయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ప్రాజెక్టు రాష్ట్ర అధికారులే పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఆ వివరాలను రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం మేరకు అధికారులు చెప్పారా? లేక సొంతంగా చెప్పారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం, పీపీఏతో ఎంవోయూ చేసుకోలేదని.. మినిట్స్‌లోని వివరాలతో ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వకపోతే కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తానని ఉండవల్లి స్పష్టం చేశారు.

చంద్రబాబు ఎక్కడ కాలిపోతాడోనని భయంగా ఉంది..!

‘నష్టం వస్తున్నా పాత రేట్లకే పోలవరం పనులు చేస్తామని ముందుకు వచ్చినందుకే నవయుగ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చామని చంద్రబాబు గతంలో చెప్పారు. ఇప్పుడేమో కేంద్ర మంత్రి గడ్కరీనే నవయుగకు పనులిచ్చారని చంద్రబాబు అంటున్నారు. ప్రజలను ఇలా ఎందుకు మభ్యపెడుతున్నారు. పోలవరం గురించి మాట్లాడితే కాలిపోతారంటున్నారు. చంద్రబాబు ఎక్కడ కాలిపోతాడోనన్న భయం నాకు పట్టుకుంది. ప్రత్యేక హోదాపై అనేకసార్లు మాట మార్చిన చంద్రబాబు.. ఇప్పుడు పోరాటం చేస్తానంటే ప్రజలు నమ్మరు..’ అని ఉండవల్లి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని విలీన మండలాల్లో భూ సేకరణ పరిహారం, పునరావాసంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆ ప్రాంతానికి చెందిన ఓ రాజకీయ నేతతో కలసి త్వరలో వివరాలు వెల్లడిస్తానని ప్రకటించారు. సమావేశంలో ఉండవల్లి అనుచరులు దేశాయ్, బాబి, ఎన్వీ, అశోక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

- ఢిల్లీ నుంచి చెన్నైకి వచ్చిన జీటీ ఎక్స్‌ప్రెస్‌లో తుపాకీ, 8 బుల్లెట్లు ఉండటం కలకలం రేపింది. మధ్య ప్రదేశ్‌కు చెందిన మంత్రి రైలులో ప్రయాణించగా, ఆయను లక్ష్యంగా చేసుకుని ఎవరైనా తుపాకీ తీసుకొచ్చారా? అని విచారిస్తున్నారు.

గ్రూప్–2 పోస్టుల జాబితా విడుదల

- 540 పోస్టుల్లో 17 పోస్టులకు అభ్యర్థుల కొరత
- కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నా ఫలితాల విడుదల
- వేలాది మంది అభ్యర్థుల ధ్వజం




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2016 గ్రూప్–2 నోటిఫికేషన్‌కు సంబంధించి నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. 540 పోస్టులకుగాను 17 పోస్టులకు మినహాయించి తక్కినవారి జాబితాను ప్రకటించింది. ప్రత్యేక కేటగిరీలకు చెందిన ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో వాటిని ఖాళీగా పేర్కొంది. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి ప్రకటన విడుదల చేశారు. ఫలితాల వివరాలను www.psc.ap.gov.inలో పొందుపరిచారు. కంప్యూటర్ నైపుణ్యానికి సంబంధించిన కేటగిరీ పోస్టులకు ఎంపికైనవారికి ఏప్రిల్ 2 నుంచి సంబంధిత పరీక్షలను విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ నైపుణ్య పరీక్షలో వారు ఉత్తీర్ణులు అయితేనే ఆయా పోస్టులకు ఎంపికైనట్లు ప్రకటిస్తారు. లేకపోతే మెరిట్ జాబితాలోని తదుపరి అభ్యర్థికి అవకాశం కల్పించనున్నారు. కాగా, ఆయా పోస్టులకు ఎంపికైనవారి ధ్రువపత్రాల పరిశీలన, ఇతర సమాచారం పూర్తిగా నిర్ధారణ అయ్యాకే పోస్టుల్లో నియమిస్తారు. అలాగే గ్రూప్–2పై న్యాయస్థానాల్లో ఉన్న వివిధ కేసుల తుది తీర్పులకు లోబడి మార్పులుచేర్పులు ఉంటాయని కమిషన్ వర్గాలు వివరించాయి. అయితే వివిధ కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నా ఫలితాలు విడుదల చేయడాన్ని వేలాది మంది అభ్యర్థులు విమర్శిస్తున్నారు. గ్రూప్–2 నిర్వహణలో అనేక సమస్యలు ఎదురయ్యాయని వాటిపై కమిషన్‌కు వేలాది మంది ఫిర్యాదు చేసినా వాటిని పరిష్కరించకుండా ఫలితాలను ప్రకటించడం అన్యాయమని అంటున్నారు. కాగా, గ్రూప్–2 ప్రిలిమ్స్ నిర్వహణలో సమస్యలు తలెత్తగా ఆ తర్వాత మెయిన్స్‌లోనూ తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. విశాఖ, చీరాల తదితర ప్రాంతాల్లో కంప్యూటర్లు మొరాయించడంతో ఆన్‌లైన్ పరీక్ష అస్తవ్యస్తంగా మారింది. దీనిపై ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలయ్యాయి. ఈ పరీక్షల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ పలువురు అభ్యర్థులపైనా కమిషన్ చర్యలు తీసుకుంది. అయితే ఆయా అభ్యంతరాలు, కేసులపై తుది నిర్ణయం రాకముందే ఫలితాలను ప్రకటించడంపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

జోన్లు, హెచ్‌వోడీల వారీగా ఎంపిక జాబితా

జోన్లు వారీగా, హెచ్‌వోడీల వారీగా, జిల్లాల వారీగా ఎంపిక జాబితాను కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచింది. పోస్టు కోడ్ 9, 10, 11, 12, 17, 18, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32లకు ఏప్రిల్ 2 నుంచి నైపుణ్య పరీక్ష నిర్వహించనున్నారు. కాగా, పోస్టు కోడ్ నెంబర్లు 14, 15, 16లకు ఆప్షన్ ఇచ్చిన పలువురు అభ్యర్థులను పోస్టులకు అర్హతలేనివారిగా గుర్తించి కమిషన్ తిరస్కరించింది. పరీక్షల్లో ఉత్తీర్ణులైనప్పటికీ 81 మంది ఇలా అర్హతను కోల్పోయారు.

కర్నూలులో కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ ప్రతిపాదన లేదు

ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



సాక్షి, హైదరాబాద్: కర్నూలు జిల్లాలో కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ (సీఈజెడ్) ఏర్పాటు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సీఆర్ చౌదరి ప్రకటించారు. కర్నూలులో 30 వేల ఎకరాల్లో సీఈజెడ్ ఏర్పాటు ప్రతిపాదన ఉందా? అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి బుధవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. కర్నూలులో సీఈజెడ్ ఏర్పాటు చేసే ఆలోచన లేదని రాష్ట్ర ప్రభుత్వం తమకు తెలియజేసిందని, అందువల్ల అక్కడ ఏర్పాటుచేసే పరిశ్రమలకు రాయితీలు ప్రకటించే ప్రసక్తే లేదని మంత్రి చెప్పారు.

విశాఖ ఎస్ఈజెడ్‌లో ఐటీ టవర్‌కు ఆమోదం

విశాఖపట్నంలోని దువ్వాడ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో ఐటీ టవర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని మంత్రి సీఆర్ చౌదరి వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తవుతుందన్న ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పకుండా దాటవేశారు.

లోకేశ్ అవినీతి తెలుసని ఒప్పుకుంటున్నారా?

జనసేన పార్టీ అధికారి ప్రతినిధి అద్దేపల్లి శ్రీధర్

సాక్షి, అమరావతి: మంత్రి నారా లోకేశ్ అవినీతి గురించి తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడితే ఆ ఆరోపణలకు ఆధారాలున్నాయా? ఢిల్లీ వాళ్లు ఇచ్చారా? అని మంత్రులు అడుగుతున్నారని, అంటే.. ఢిల్లీ పెద్దలకు లోకేశ్ వ్యవహారాలు తెలుసని టీడీపీ నేతలు ఒప్పుకుంటున్నారా అని జనసేన పార్టీ ప్రశ్నించింది. పార్టీ అధికార ప్రతినిధి అద్దేపల్లి శ్రీధర్ బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ అవినీతిపై ఢిల్లీ స్థాయిలోనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.